ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
ఒంగోలు
fb.com/vaartha Digital
Published from Ongole, Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
20-7-2026 సోమవారం సంపుటి: 32 సంచిక: 170 పేజీలు: 12 వెల: 6.50

జమ్ము-కాశ్మీర్‌లో వరద విలయం
పార్లమెంటు ర్యాలీని విజయవంతం చేయండి: వాంగ్‌చుక్
9లో


# ఆగస్టు 15లోగా 2.50 లక్షల ఇళ్లు

**డిసెంబరునాటికి మరో 2.38 లక్షల ఇళ్లు పూర్తి**

**నిర్దేశిత గడువులోగా సామూహిక గృహప్రవేశాలు**

**2027 చివరికి రీ సర్వే పూర్తి**

**బస్‌స్టేషన్ల ఆధునీకరణకు చర్యలు: సిఎం చంద్రబాబు**



**విజయవాడ,జులై 19,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో అర్హులైన లబ్దిదారులకు గృహాలను నిర్మించి ఇచ్చే విషయంలో ఎంత మాత్రం అలసత్వం ఉండకూడదని సిఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేసారు.ఆగస్టు 15లోగా 2.50 లక్షల ఇళ్లకు సామూహిక గృహ ప్రవేశాలు జరగాలని సిఎం ఆదేశించారు. ఈ యేడాది డిసెంబర్ నాటికల్లా మరో 2.38 లక్షల ఇళ్లకు గృహ ప్రవేశాలు జరిగేలా చర్యలు తీసుకోవాలి. సంతృప్త స్థాయిలో అందరికీ ఇళ్లు ఇవ్వాలని... అవసరమైన వారికి ఇళ్ల స్థలాలు, ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న వారికి క్రమబద్ధీకరించడం వంటి అంశాలపై ప్రభుత్వ యంత్రాంగం ఫోకస్ పెట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. 2027 చివరి నాటికి రీసర్వే పూర్తి చేయడంతో పాటు... 22ఏ భూముల సమస్యలను పరిష్కరించాలని స్పష్టం చేశారు. పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సిఎం చంద్రబాబు నాయుడు అధికారులతో వర్చువల్‌గాను, మౌఖికంగా చర్చించారు.

2027 డిసెంబర్ నాటికి మరో 10 లక్షల ఇళ్ల నిర్మాణం లక్ష్యం. 2లక్షల మందికి ఇంటి జాగాలు అవసరం అవుతాయని అంచనా. 3 సెంట్లు గ్రామాల్లో, 2 సెంట్లు అర్బన్ ప్రాంతాల్లో ఇళ్లస్థలాలు ఇవ్వాల్సి ఉంది. లబ్ధిదారులుఅంగీకరిస్తే... ప్రస్తుతం ఉన్న వారికి అదే లే అవుట్లల్లో ఇళ్ల స్థలాలు ఇవ్వండి. ఇబ్బందులు లేనిచోట భూసేకరణ, సమీకరణతో ఇళ్ల స్థలాలు ఇవ్వండి. ప్రభుత్వ భూములు, కొండ ప్రాంతాల్లో నిర్మించుకున్న ఇళ్లను క్రమబద్ధీకరించాలి. ఇళ్ల క్రమబద్ధీకరణలో ఏమైనా ఇబ్బందులు వస్తే కెబినెట్‌కు పంపాలన్నారు మేం ఆమోదిస్తాం. ఇళ్ల క్రమబద్ధీకరణ పూర్తి చేయగలిగితే..విజయవాడలో 60 వేల మందికి, విశాఖలో 30 వేల మందికి లబ్ది చేకూరుతుంది. గుంటూరులో 22ఎ భూముల సమస్యలను పరిష్కరించాలి. భూవివాదాల్లో అతిపెద్ద లిటిగెంట్ రెవెన్యూ విభాగమే. 4 లక్షలకు పైగా భూవివాదాల కేసులు పెండింగులో ఉన్నాయి. ఖాళీగాఉన్న డిఆర్వోలు, ఆర్డీవోల స్థానాలకు త్వరలో పోస్టింగ్స్ ఇస్తాం. జిల్లా కార్యాలయాల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలుచేపడదాం. రీసర్వే ప్రక్రియను 2027 మార్చి లోగా పూర్తి చేయాలి... పట్టాదారు పాస్ పుస్తకాలు కూడా జారీ కావాలని సిఎం ఆదేశించారు. యేడాదికి రూ. 1940 కోట్లను స్త్రీ శక్తికి ఖర్చు పెడుతున్నాం. తల్లికి వందనం ద్వారా 67 లక్షల మందికి రూ.10 వేల కోట్ల ఇస్తున్నాం. మే 19వ తేదీన మత్స్యకారుల సేవలో కార్యక్రమం రూ.286 కోట్ల మేర లబ్దిదారులకు పంపిణీ చేస్తున్నాం. హాస్టళ్లల్లో ఏదీ వృధా కాకుండా చూడాలి. నెట్ జీరో విధానాన్ని హాస్టళ్లకు వర్తింప చేయాలి. హాస్టళ్ల కిచెన్ల నుంచి వ్యర్థాలను సర్క్యులర్ ఎకానమీకి అనుసంధానం చేయాలి.. నెట్ జీరో హెల్తీ క్యాంపస్‌లు ఏర్పాటు చేయాలి. కిచెన్, ఫ్రూట్ గార్డెన్లు వచ్చేలా చూడాలి. గిరిజన, ఎస్సీ సంక్షేమశాఖలో చదువుతున్న విద్యార్థులు ఐఐటీ ర్యాంకులు సాధించేలా శిక్షణ ఇవ్వాలి. పావలా వడ్డీకే జాతీయ, అంతర్జాతీయ సంస్థల్లో చదువుకునేలా విద్యారుణం ఇప్పించేలా కార్యాచరణ చేపట్టాలి. విదేశాల్లో ఉద్యో >>2

# అఖిలపక్షం రసాభాస



అఖిల పక్ష సమావేశానికి హాజరైన కేంద్రమంత్రులు రాజ్‌నాథ్, రిజిజు, నడ్డా తదితరులు

**టిఎంసి రెబల్ ఎంపిలకు ఆహ్వానంపై ప్రతిపక్షాలు మండిపాటు.. వాకౌట్**

**అనంతరం సమావేశానికి విపక్షాలు హాజరు.. సభలో చర్చకు అవకాశమివ్వాలని వినతి**

**పార్లమెంట్ సమావేశాలు సజావుగా జరిగేలా అన్ని పార్టీలు సహకరించాలి: కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్, జెపి నడ్డా, కిరణ్ రిజిజు**

**న్యూఢిల్లీ, జులై 19:** పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు ముందు ఆదివారం నిర్వహించిన అఖిలపక్ష సమావేశం రసాభాసగా సాగింది. అఖిలపక్ష భేటికి టిఎంసి రెబల్ ఎంపిలను ఆహ్వానించడానికి కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి పక్షాలు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తూ, సమావేశం నుంచి వాకౌట్ చేశాయి. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా తీసుకున్న నిర్ణయాలకు నిరసనగా ఈ చర్య చేపట్టినట్లు ప్రతిపక్ష నేతలు తెలిపారు. కొద్దిసేపు అనంతరం ప్రతిపక్ష పార్టీల నేతలు అఖిలపక్ష సమావేశానికి హాజరయ్యారు. తమ వాదనను వినిపించారు. కేంద్రమంత్రులు రాజ్‌నాథ్ సింగ్, జెపి నడ్డా, కిరణ్ రిజిజు నేతృత్వంలో ఆదివారం అన్ని పార్టీల ఫ్లోర్ లీడర్లతో సమావేశాన్ని నిర్వహించారు. సమావేశాలు సజావుగాజరిగేందుకు అన్ని రాజకీయ పార్టీలు >>2

## నేటి నుంచి పార్లమెంట్



**ఆగస్టు 13 దాకా సమావేశాలు**

**కీలక బిల్లులు ప్రవేశపెట్టనున్న ప్రభుత్వం**

**నేడు రాజ్యసభకు 'వందే మాతరం' బిల్లు**

**న్యూఢిల్లీ, జులై 19:** పార్లమెంటు వర్షాకాల సమావేశాలు నేటి (సోమవారం) నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ సమావేశాలు ఆగస్టు 13 వరకు కొనసాగనున్నాయి. ఈ సమావేశాల్లో కీలక బిల్లులు, ప్రజా ప్రాధాన్య అంశాలపై చర్చలు జరగనున్నాయి. నీట్ యుజి పేపర్ లీక్, అయోధ్య విరాళాల చోరీ తదితర అంశాలపై ప్రభుత్వాన్ని నిలదీయడానికి కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి సిద్ధమైంది.
కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, జెపి నడ్డా, కిరణ్ రిజిజు ఆధ్వర్యంలో ఆదివారం అఖిల పక్ష >>2

# రాష్ట్రంలో 16కు పెరిగిన కొవిడ్ కేసులు

**నలుగురు మృతి**

**కడప జిల్లాలో అధికంగా నమోదు**

**విజయవాడ, జులై 19,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో కొవిడ్ కేసుల సంఖ్య క్రమంగా పెరుగుతుంది.తాజా నివేదికను అనుసరించి 16కి చేరినట్లు వైద్యఆరోగ్య శాఖ వెల్లడించింది. ఈ క్రమంలోనే బోధనాసుపత్రుల్లో ప్రత్యేక వార్డులు సిద్ధం చేశామని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ప్రస్తుత పరిస్థితులకు తగ్గట్లు ఆసుపత్రులను సన్నద్ధం చేసినట్లు పేర్కొన్నారు. కొవిడ్ కేసులు గుర్తించడానికి అవసరమైన కిట్లు, ఇతర సదుపాయాలు సమకూరుస్తున్నామని ఆయన వెల్లడించారు. ఎపిలో గుర్తించిన కొవిడ్ పాజిటివ్ కేసులకు ఒమిక్రాన్ ఆర్ఎఫ్.5 వేరియంట్ కారణమని పరీక్షలో తేలింది. కొవిడ్2 వైరస్ కాలక్రమంలో తన జన్యువుల్లో మార్పులు చేసుకుని ఒమిక్రాన్ వేరియంట్‌గా ఏర్పడిందని వైద్యారోగ్య శాఖ పేర్కొంది. ఆ వంశానికి చెందిన ఉప వేరియంట్ ఆర్ఎఫ్.5 అని తెలిపింది. వైఎస్సార్ కడప జిల్లాలో నమోదైన కొవిడ్ పాజిటివ్ కేసుల్లో నాలుగు నమూనాలను పుణెలోని జాతీయ వైరాలజీ ల్యాబ్‌కు పంపారు. ఈ క్రమంలోనే జీనోమ్ సీక్వెన్సింగ్ పరీక్షల్లో ఒమిక్రాన్ ఆర్ఎఫ్.5గా తేలిందని వైద్యారోగ్యశాఖ అధికారులకు పరీక్షల ఫలితాల నివేదిక అందింది. పుణె నుంచి అందిన ఫలితాలు, వేరియంట్ ప్రభావం, ఎపిలో తాజా పరిస్థితులపై వైద్య ఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్ ఉన్నతాధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తున్నారు.. ఆర్ఎఫ్.5ను డబ్ల్యూహెచ్‌వో సాధారణ వేరియంట్‌గానే పరిగణనలోకి తీసుకుందని డిఎంఇ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్, సత్యకుమార్‌యాదవ్‌కు వివరించారు. ఈ వైరస్ తీవ్ర ఇబ్బంది కలిగిస్తుందనడానికి ఎలాంటి ఆధారాలూ లేవని చెప్పారు. సింగపూర్‌తోపాటు ఆగ్నేయాసియాలోని కొన్ని దేశాల్లో ఆర్ఎఫ్.5 కేసులు ఎక్కువగా నమోదయ్యాయని డిఎంఇ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్, సత్యకుమార్ యాదవ్‌కు వివరించారు ఇతర ఒమిక్రాన్ వేరియంట్లతో పోలిస్తే ఇది ప్రమాదకరం అనడానికి ఆధారాలు లేవన్నారు. ఈ వైరస్ సోకితే దగ్గు, జ్వరం, గొంతు నొప్పి, తల >>2



# చరిత్ర సృష్టించిన భారత్ స్టార్ షట్లర్ సింధు

**జపాన్ ఓపెన్ మహిళల సింగిల్స్‌లో విజయం**

**ఫైనల్లో యమగుచిని ఓడించి టైటిల్ కైవసం**

**టోక్యో, జులై 19:** భారత్ స్టార్ షట్లర్ పివి సింధు... జపాన్‌లో చరిత్ర సృష్టించింది. రెండేళ్ల టైటిల్స్ కొరతకు ముగింపు పలికింది. అద్భుత ఆటతీరుతో ఫైనల్‌కు దూసుకొచ్చిన సింధు... జపాన్ ఓపెన్ మహిళల సింగిల్స్ తుదిపోరులోనూ అటాకింగ్ గేమ్‌తో విరుచుకు పడింది. ప్రపంచ నెంబర్3 ర్యాంకర్‌ను వరుస గేమ్‌ల్లో 21-17,21-17తో చిత్తుచేస్తూ టైటిల్ ఎగరేసుకుపోయింది. >>2

# గ్లోబల్ 'వెడ్డింగ్ డెస్టినేషన్'గా ఎపి

**పర్యాటక మంత్రి కందుల దుర్గేష్**

**రాజస్థాన్ పర్యటనలో భాగంగా జైపూర్‌లో జరిగిన ఇంటర్నేషనల్ వెడ్డింగ్ అండ్ టూరిజం కాన్ క్లేవ్‌లో పాల్గొన్న మంత్రి దుర్గేష్**

**విజయవాడ, జులై19,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అంతర్జాతీయ స్థాయి 'వెడ్డింగ్ డెస్టినేషన్'గా ప్రమోట్ చేయడంపై రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ప్రత్యేక దృష్టి సారించారు. దేశంలోనే రాయల్ వెడ్డింగ్స్‌కు కేరాఫ్ అడ్రస్‌గా, రోల్ మోడల్‌గా నిలిచిన రాజస్థాన్‌లోని జైపూర్‌లో మంత్రి దుర్గేష్ పర్యటించారు. ఈ సందర్భంగా జైపూర్ కుకాస్ లోని విరాసత్ హెరిటేజ్ రెస్టారెంట్ లో జరిగిన ఇంటర్నేషనల్ వెడ్డింగ్ అండ్ టూరిజం కాన్ క్లేవ్‌లో ప్రముఖ వెడ్డింగ్ డెస్టినేషన్ ప్లానర్లు, ఈవెంట్ నిర్వాహకులతో మంత్రి దుర్గేష్ కీలక సమావేశాన్ని నిర్వహించారు. ఈ భేటీలో ఆంధ్రప్రదేశ్‌లో వెడ్డింగ్ టూరిజం విస్తరణకు ఉన్న అనుకూలతలు, సహజసిద్ధమైన వనరులు మరియు ప్రభుత్వ రాయితీలపై మంత్రి దుర్గేష్ సుదీర్ఘంగా చర్చించారు. కేంద్రం సహకారంతో సిఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్‌లు పర్యాటక రంగానికి కల్పిస్తున్న ప్రాముఖ్యతను తెలిపారు. అంతకు ముందు గుజరాత్ ఉప ముఖ్యమంత్రి, పర్యాటక మంత్రి దియా కుమారితో కలిసి ఆంధ్రప్రదేశ్ టూరిజం స్టాల్‌ను మంత్రి దుర్గేష్ ప్రారంభించి పలువురికి ఎపి ప్రత్యేకతలను స్వయంగా తెలిపారు.ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అద్భుతమైన ప్రకృతి అందాలు, చారిత్రాత్మక కోటలు, సుదీర్ఘమైన సముద్ర తీరాలతో వెడ్డింగ్ డెస్టినేషన్లకు అత్యంత అనువైన ప్రాంతంగా నిలుస్తోందని పేర్కొన్నారు. ప్రపంచ స్థాయి బీచ్ వెడ్డింగ్స్ నిర్వహించుకోవడానికి హిల్ రిసార్ట్స్ కలయికతో ఉన్న వైజాగ్ తీరం ఎంతో రమణీయంగా ఉంటుందని వివరించారు. సూర్య లంక బీచ్‌లో స్టార్ హోటళ్ల ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. >>2

# ఆరోగ్యానికి 'డిజిటల్' కవచం

DiNC DIGITAL NERVE CENTRE

**కుప్పం నియోజకవర్గంలో 'సంజీవని' పైలట్ ప్రాజెక్టు అమలు**

**1.15 లక్షల మందికి వైద్య సేవలు**

**పేద ప్రజలకు ఆరోగ్యవరం 'సంజీవని'**

**కుప్పం, జులై 19 ప్రభాతవార్త:** ప్రజల ఆరోగ్య వివరాలు డిజిటలైజ్ చేయడంతో పాటు వారికి అత్యవసర వేళల్లో నిష్ణాతులైన వైద్యుల ద్వారా వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో సిఎం చంద్రబాబునాయుడు రాష్ట్రంలోనే తొలిసారిగా చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గంలో పైలట్ ప్రాజెక్టుగా చేపట్టిన టాటా సంజీవని ప్రాజెక్ట్ (డిజిటల్ నెర్వ్) సెంటర్ సక్సెస్ సాధించింది. దీంతోఈ ప్రాజెక్టును రాష్ట్ర వ్యాప్తంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆస్పత్రుల్లో అమలు చేయాలని సిఎం చంద్రబాబునాయుడు నిర్ణయించారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న ఆస్పత్రులతో ఈ ప్రాజెక్టును అనుసంధానం చేస్తారు. సంజీవని ప్రాజెక్టు పేద ప్రజల ఆరోగ్యంకు వరంలా మారింది. కుప్పం పట్టణంలో ఉన్న ఏరియా ఆస్పత్రితో పాటు నియోజకవర్గంలోని 13 ప్రాథమిక ఆరోగ్య కేం ద్రాల పరిధిలో ఈ సంజీవని ప్రాజెక్టు అమలవుతోంది. ఈ ప్రాజెక్టు కోసం ప్రత్యేక బృందాలు ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తాయి. ప్రతి వైద్య కేంద్రం అనుసంధానించబడుతుంది. సంజీవని ప్రాజెక్టుకు గేట్స్ ఫౌండేషన్ సైతం సహకరిస్తోంది. గతేడాది జూలై 3న సిఎం చంద్రబాబు కుప్పంలో ఈ ప్రాజెక్ట్‌ను లాంఛనంగా ప్రారంభించారు.

**1.15లక్షలమందికిపైగా వైద్య సేవలు :**
సంజీవని ప్రాజెక్టు కింద కుప్పం నియోజకవర్గంలో ఇప్పటివరకు 1,15,510మందికి వైద్య సేవలను అందించారు. ఈ ప్రాజెక్టులో భాగంగా ప్రజలు ఓ దఫా ఆస్పత్రికి వెళ్తే వారి వివరాలు నమోదు చేసుకుని >>2



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

# విశాఖలో ఘోర ప్రమాదం: లారీని ఢీకొట్టిన కారు

**నలుగురు దుర్మరణం**

**విశాఖపట్నం, జులై 19, ప్రభాతవార్త:** జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున ఘోర రోడ్డుప్రమాదం సంభవించింది. ఆనందపురం- అనకాపల్లి నేషనల్ హైవేపై గండిగుండం సమీపంలో వేగంగా వెళ్తున్న కారు అదుపుతప్పి, ముందున్న లారీని బలంగా ఢీకొట్టింది ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న నలుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో కారు డ్రైవర్ కూడా ఉన్నారు.

**శుభకార్యానికి వెళ్తుండగా విషాదం**
పల్నాడు జిల్లా వినుకొండనుంచి శ్రీకాకుళం జిల్లా టెక్కలిలో జరగబోయే ఒక శుభకార్యానికి హాజర య్యేందుకు వీరంతా కారులో బయలుదేరారు. ప్రమాద సమయంలో కారులో మొత్తం ఐదుగురు ప్రయాణిస్తున్నారు. ప్రమాదంధాటికి కారు పూర్తిగా నుజ్జునుజ్జయింది

**ఎమ్మెల్యే పిఎ పరిస్థితి విషమం, కుమారుడు మృతి**
పల్నాడు జిల్లా నరసరావుపేట ఎమ్మెల్యే పిఎ (పర్సనల్ అసిస్టెంట్) చంద్రశేఖర్ ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉండటంతో చికిత్స నిమిత్తం విశాఖపట్నంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో మరణించిన వారిలో చంద్రశేఖర్ కుమారుడుకూడా ఉన్నట్లు ప్రాథమిక సమాచారం అందుతోంది. ప్రమాదంపై సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. కారులో ఇరుక్కు పోయిన మృతదేహాలను ఎంతో శ్రమించి బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# భారీ వర్ష సూచన

**11 జిల్లాల్లో పిడుగుల వానలు!**

**విజయవాడ.జూలై 19,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో మరో అయిదు రోజులు కురుస్తాయని వాతావరణ శాఖ స్పష్టం చేసింది. ఎల్‌నినో ప్రభావంతో ఎపిలో జూన్, జులై మాసంలో ఆశించిన స్థాయిలో వర్షాలు నమోదు కాలేదు. దీంతో రైతులు సాగు పనుల్లో ముందుకెళ్లలేక భారీ వర్షాల కోసం ఎదురు చూస్తున్నారు. వాతావరణ శాఖ వర్షాలపై కీలక సమాచారం ఇచ్చింది. ఎపిలో ఆదివారం నుంచి ఐదు రోజుల పాటు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని, పలు జిల్లాల్లో అతిభారీ వర్షాలు కూడా నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు. ఎపి విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపిన వివరాల ప్రకారం.. రాష్ట్రంలో ఐదు రోజులుపాటు మోస్తరు నుంచి భారీ వర్షాలు నమోదవుతాయని తెలిపింది. దాదాపు అన్ని జిల్లాల్లో మేఘావృతమైన వాతావరణం ఉంటుందని అంచనా వేసింది. ముఖ్యంగా 11 జిల్లాల్లో పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని, కోస్తాంధ్ర తీరం వెంబడి గంటకు 40 నుంచి 50 కిలో మీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ సూచించింది. ఆదివారం శ్రీకాకుళం, విజయనగరం, పోలవరం, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, నంద్యాల, వైఎస్ఆర్ కడప జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని, రాష్ట్రంలోని మిగిలిన జిల్లాల్లో కొన్నిచోట్ల తేలికపాటి వర్షాలు పడే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ అంచనా వేసింది. ఇక సోమవారం విజయనగరం, పార్వతీపురం మన్యం, పోలవరం, విశాఖ, తూర్పుగోదావరి, ఏలూరు జిల్లాల్లో కొన్నిచోట్ల పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపింది.

# 1న పిఎంచే 'భోగాపురం' ప్రారంభం



ఆదివారం పనుల పురోగతిని పరిశీలించిన మంత్రి కొండపల్లి తదితరులు

**విజయనగరం, జులై 19, ప్రభాతవార్త:** ఉత్తరాంధ్ర ప్రజల ఎమోషన్ అయిన అధునాతన హంగులతో నిర్మించబడిన భోగాపురం విమానాశ్రయం ఎయిర్‌పోర్ట్ ఆగస్టు 1వ తేదీన దేశ ప్రధాని మోడీచే ప్రారంభించడం జరుగుతుందని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం ఉదయం భోగాపురం ఎయిర్‌పోర్ట్ పరిసర ప్రాంతాలను నెల్లిమర్ల ఎమ్మెల్యే, మార్కెట్ చైర్మన్ బంగారు రాజు, కలెక్టర్ ఎస్ రామ్ సుందర్‌రెడ్డి, ఎస్పీ ఏఆర్ దామోదర్, ఎయిర్‌పోర్ట్ అథారిటీ అధికారులతో కలిసి పనుల పురోగతిని పరిశీలించి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రధానమంత్రి మోడీ, ముఖ్య

**అల్లూరి పేరుతో ఎయిర్‌పోర్టు జాతికి అంకితం**

మంత్రి చంద్రబాబు సారథ్యంలో ప్రపంచంలోనే అత్యంత అద్భుత విమానాశ్రయాలలో ఒకటిగా ఖ్యాతి గడించ బోయే భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ఆగస్టు 1 న ప్రారంభించి జాతికి అంకితం చేస్తారని తెలిపారు. నాటి కేంద్ర పౌర విమాన శాఖా మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు ఈ ప్రాంతంలో విమానాశ్రయం ఏర్పాటు చేయాలనే సంకల్పంతో శంకుస్థాపన చేశారని, ఆ కల నేడు సాకారం కావడం ఈ ప్రాంత అభివృద్ధికి చిహ్నంగా మారనుందని మంత్రి పేర్కొన్నారు. కేంద్ర పౌరవిమాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు నేతృత్వంలో మంత్రులు, ఈ ప్రాంత ప్రజా ప్రతినిధుల సమక్షంలో ఉత్తరాంధ్ర ప్రజల హర్షధ్వానాల మధ్య పతాక స్థాయిలో చిరస్థాయిగా గుర్తుండే విధంగా బోగాపురం ఎయిర్పోర్ట్ ప్రారంభం చేయటం జరుగుతుందన్నారు.
తెలంగాణకు హైదరాబాద్ భాగ్యనగరంగా పేరుపొందినట్లే రానున్న రోజులలో భోగాపురం ఎయిర్‌పోర్ట్‌తో ఆంధ్రప్రదేశ్ భాగ్యనగరంగా ఉత్తరాంధ్ర విరాజిల్లుతుందన్నారు. ఇప్పటికే విశాఖ, శ్రీకాకుళం, విజయనగరంజిల్లాలకు జాతీయ రహదారులు అందుబాటు లోకి రావడంతో పాటు బోగాపురం ఎయిర్పోర్ట్ రావడంతో ఉత్తరాంధ్ర రూపురేఖలు మారనున్నాయన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి అన్ని విధాలా సహకరిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ , యువ నాయకులు లోకేష్ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు. భోగాపురం ఎయిర్పోర్ట్ ప్రారంభా నికి ప్రతిఒక్కరు సిద్ధం కావాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. కాకినాడ నుండి మూలపేట >>2

20-7pg2exHMNWJQE_20-7pg2exHMNWJQE.qxd 20/Jul/26 12:20 AM Page 1





ఆదివారం సిలిగురిలో ఉన్న జుమాగాచ్ బిఒపి వద్ద సరిహద్దు భద్రతను పరిశీలిస్తున్న హోంమంత్రి అమిత్‌షా

# 16కు పెరిగిన కొవిడ్ కేసులు

>>నొప్పి, ముక్కు కారడం, మూసుకుపోవడం, ఒళ్లు నొప్పులు లాంటి లక్షణాలు ఉంటాయని వివరించారు. ఆందోళన చెందొద్దని అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు. ఈ క్రమంలో కొత్త కేసులు వెలుగులోకి రావడం కొంత ఆందోళన కలిగిస్తోంది. ఇప్పటికే ఇతర ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న ఇద్దరు చిన్నారులకు కొవిడ్ పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలం నిడిగుంటపాలెంకు చెందిన మూడేళ్ల బాలుడు క్యాన్సర్ చికిత్స నిమిత్తం పుదుచ్చేరిలో ఉండగా, అతనికి కరోనా సోకినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కాగా, బాలుడి కుటుంబ సభ్యులకు, సమీప బంధువులకు నిర్వహించిన పరీక్షల్లో నెగటివ్ అని తేలింది.

ఎన్టీఆర్ జిల్లా తిరువూరు మండలం రోలపాడుకు చెందిన 13 ఏళ్ల బాలిక కిడ్నీ సంబంధిత సమస్యలతో విజయవాడ ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో డయాలసిస్ చేయించుకుంటోంది. జ్వరం, ఇతర లక్షణాలు కనిపించడంతో వైద్యులు పరీక్షలు నిర్వహించగా, ఆమెకు కొవిడ్ పాజిటివ్‌గా తేలింది. దీంతో బాలికను వెంటనే ఐసోలేషన్ వార్డుకు తరలించారు. ఆమె కుటుంబ సభ్యులకు నిర్వహించిన పరీక్షల్లో కూడా నెగటివ్ అని నిర్ధారణ అయ్యింది. రాష్ట్రవ్యాప్తంగా జూన్ 26 నుంచి జులై 16 మధ్య కాలంలో మొత్తం 12 కోవిడ్ కేసులు, నాలుగు మరణాలు నమోదయ్యాయి.

కడప జిల్లాలో అత్యధికంగా 8 కేసులు నమోదు కాగా, గుంటూరులో రెండు, విశాఖపట్నం, కాకినాడ జిల్లాల్లో ఒక్కొక్కటి చొప్పున కేసులు వెలుగు చూశాయి. మరణించిన వారంతా రక్తపోటు, మధుమేహం, కిడ్నీ వ్యాధుల వంటి ఇతర ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నవారేనని అధికారులు వెల్లడించారు. ప్రస్తుతానికి కేసుల వ్యాప్తి తీవ్రంగా లేనందున ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అయితే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆరోగ్య శాఖ సూచించింది.

**రాజమండ్రిలో మొదటి కేసు**

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జులై19,ప్రభాతవార్త:** రాజమండ్రిలో మొదటి కరోనా కేసు నమోదు అయ్యింది. కొన్ని ఇబ్బందులు పడుతున్న ఆ యువకుడు స్వచ్ఛందంగా ఆసుపత్రికి రాగానే పరీక్షలు నిర్వహించారు. 21 యేళ్ల యువకుడికి కరోనా పాజిటివ్‌గా బావిస్తూ రాజమండ్రి జిల్లా ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. అయితే ఇంతవరకు అదికార యంత్రాంగం ధృవీకరించలేదు. కాగా ఎపిలో ఇప్పటివరకు 16 కరోనా కేసులు నమోదు కాగా కాకినాడ జిల్లా గొల్లప్రోలులో మరణించిన ఓ యువతికి కూడ కరోనా గా చెన్నై లో జరిగిన వైద్య పరీక్షలలో తేలిన విషయం తెలిసిందే. ఇప్పుడు దీంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఇది రెండో కరోనా కేసుగా నిలచింది.

**విశాఖలో మరో కేసు నమోదు**

**విశాఖపట్నం, జూలై 19, ప్రభాతవార్త :** విశాఖ జిల్లాలో మరో కరోనా కేసు నమోదైంది. పెందుర్తి ప్రాంతంలో నివసిస్తున్న 28 యేళ్ల యువకుడికి జ్వరం, కరోనా లక్షణాలు కనిపించడంతో కెజిహెచ్ వైరాలజీ ల్యాబ్‌లో పరీక్షలు నిర్వహించగా కొవిడ్ పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. బాధితుడు ప్రస్తుతం కెజిహెచ్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఐసోలేషన్ వార్డులో చికిత్స పొందుతున్నట్లు డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం. చంద్రశేఖర్ నాయుడు తెలిపారు. బాధితుడి స్వస్థలం పార్వతీపురం మన్యం జిల్లా కాగా, ప్రస్తుతం పెందుర్తి సమీపంలో నివసిస్తున్నట్లు వెల్లడించారు. అతడికి మలేరియా, ఇతర జ్వర లక్షణాలు కూడా ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. రోగి ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉందని, అవసరమైన వైద్య చికిత్స అందిస్తున్నామని వైద్యులు తెలిపారు.

# ‘భోగాపురం’ ప్రారంభం

>> వరకు ప్రత్యేక ప్రణాళికతో అభివృద్ధి పరచడానికి ముఖ్యమంత్రి గారు సిద్ధంగా ఉన్నారన్నారు. ఎర్ర బస్సు కూడా రాదన్న జగన్ రెడ్డితో పాటు భోగాపురం ఎయిర్పోర్ట్ ప్రారంభించిన వెంటనే క్రెడిట్ చోరీతో ఎయిర్పోర్ట్ మేమే కట్టామని అబద్ధాలు చెప్పటానికి వైకాపా నాయకులు సిద్ధంగా ఉంటారన్నారు. విశాఖ శ్రీకాకుళం నుంచి వచ్చే వాహనాలను పార్కింగ్ చేసే స్థలాలను, నిర్మాణ స్థాయిలో ఉన్న అప్రోచ్ రోడ్లను, వాహనాల పార్కింగ్ స్థలాన్ని, సభా స్థలాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న రోడ్లను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు, కాంట్రాక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. అలాగే సభా ప్రాంగణంలో ప్రాంతానికి పేరు తెచ్చి పెట్టిన తప్పెటగుళ్ళు, కోలాటం, గిరిజన సాంప్రదాయ నృత్యాల కళాకారులతో అబ్బురపరిచే విధంగా ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని సూచించారు. మార్క్ ఫెడ్ చైర్మన్ బంగారు రాజు మాట్లాడుతూ బోగాపురం ఎయిర్‌పోర్ట్ కోసం స్థలాలు ఇచ్చిన రైతులందరికీ కూడా ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేస్తూ, ప్రధాని మోడీ సమావేశానికి వచ్చే ప్రజలకు ఎటువంటి ఆటంకాలు కలగకుండా ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు.

సుమారు 60 ఎకరాల విస్తీర్ణంలో ప్రధానమంత్రి బహిరంగ సభ కోసం ఏర్పాట్లు చేస్తున్నామని, ప్రధానమంత్రి పర్యటనలో వాహనాల పార్కింగ్ స్థలాలను పరిశీలించడం జరిగిందనీ, సుమారు 3000 వాహనాలు వస్తాయని అంచనా తో పార్కింగ్ ఏర్పాట్లు పరిశీలించినట్లు జిల్లా కలెక్టర్ ఎస్ రాంసుందర్ రెడ్డి తెలిపారు. ప్రధాని విమానాశ్రయ ప్రారంభ పర్యటనకు బందోబస్తు నాలుగు సెక్టార్లుగా విభజించడం జరిగిందనీ, బహిరంగ సభకు సభ వేదిక గుర్తించి అందుకు తగిన విధంగా ఏర్పాట్లు చేస్తున్నామని, సభకు హాజరయ్యే ప్రజలకు ఎటువంటి సమస్యలు లేకుండా తగు చర్యలు తీసుకుంటామని ఎస్పీ ఎ ఆర్ దామోదర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఆగస్టు 15లోగా 2.50 లక్షల ఇళ్లు

>> గాలు దక్కించుకునేలా ఎస్సీ,ఎస్టీ యువతకు జర్మన్ భాష నేర్పిస్తున్నాం. గిరిజన ప్రాంతాల్లో కాఫీ, పసుపు, కుంకుమపువ్వు సాగును చేపడుతున్నాం. వ్యాల్యూ అడిషన్ వచ్చేలా ప్రాసెసింగ్ ప్రక్రియ చేపట్టాలి. నేచురల్ ఫార్మింగ్, ట్రేసబిలిటీ, సర్టిఫికేషన్ లాంటి ప్రక్రియలు కూడా చేపట్టాలి. అరకు కాఫీ గ్లోబల్ బ్రాండ్‌గా మారేందుకు ఉన్న అవకాశాలను వినియోగించుకోవాలి. వీటికి పర్యాటక ప్రాజెక్టులను లింక్ చేయాలి."అని ముఖ్యమంత్రి చెప్పారు. పిఎం ఇబస్ కింద ఇవిలను ప్రవేశపెట్టేలా కార్యాచరణ చేపట్టాలి... ఫాస్ట్ ఛార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయాలి... బస్ స్టేషన్ల ఆధునీకరణ కార్యక్రమం కూడా చేపట్టాలి.అమరావతి, విశాఖపట్నం, తిరుపతిలలో ఎలక్ట్రికల్ వెహికల్స్ బస్సులు నడపాలి. విజయవాడ-గుంటూరు-అమరావతి, విశాఖ-అనకాపల్లి-విజయనగరం, తిరుపతి పరిధిలోని ప్రాంతాలను కలుపుతూ ఇవి బస్సులు తిప్పేలా చర్యలు చేపట్టాలన్నారు.

భోగాపురం ఇంటర్ నేషనల్ ఎయిర్ పోర్ట్ ఉత్తరాంధ్రకు మణిహారంగా మారుతుందని సిఎం చంద్రబాబు నాయుడు అన్నారు. కొత్త ఎయిర్ పోర్టు ఆ ప్రాంత స్థితిగతులను మార్చేస్తుందని సీఎం వ్యాఖ్యానించారు. భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టును ప్రధాని నరేంద్ర మోదీ చేతుల ఉత్తరాంధ్ర అభివృద్ధిలో భోగాపురం ఎయిర్ పోర్టు కీలకం కానుంది. సామాన్యుల జీవితాలను మార్చే విధంగా ఎయిర్ పోర్టు ఉత్తరాంధ్రలో కొత్త అవకాశాలను తీసుకువస్తుంది. ఎకనమిక్ యాక్టివిటీ ఉరుకులు పెడుతుంది. రాకపోకలు మొదలయ్యాక ఆ ప్రాంత ప్రజల జీవన ప్రమాణాలు మారుతాయి. సామాన్యులు కూడా అనేక రకాలుగా లబ్ది పొందుతారు. రవాణా మాత్రమే కాకుండా...టూరిజం, పారిశ్రామికపరంగా కూడా ఈ ప్రాంత అభివృద్ధికి ఈ ఎయిర్ పోర్టు ఉపయోగపడుతుంది. విశాఖ ఎకనమిక్ రీజియన్‌లో ఈ ఎయిర్ పోర్టు కీలక పాత్ర పోషిస్తుంది. హైదరాబాద్‌లో వచ్చిన శంషాబాద్ ఇంటర్ నేషనల్ ఎయిర్‌పోర్టు ఆ ప్రాంతంలో ఎటువంటి మార్పులు తెచ్చిందో నేడు భోగాపురంతో ఆ ప్రాంతంలోనూ అటువంటి మార్పులే తెస్తుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

# భారత్ స్టార్ షట్లర్ సింధు

>> జపాన్ ఓపెన్ సూపర్ 750 టోర్నీ నెగ్గిన తొలి భారత షట్లర్‌గా సింధు నిలిచింది. 2019 ప్రపంచ ఛాంపియన్ షిప్ తర్వాత ఇదే అతిపెద్ద టైటిల్. చివరిసారి సింధూ సొంతగడ్డపై 2024లో సయ్యద్ మోదీ ఇంటర్నేషనల్ టైటిల్ గెలుపొందింది. ఈ టైటిల్‌తో తన ఆటతీరుపై నెలకొన్ని అన్ని సందేహాలను పటాపంచలు చేసింది. మ్యాచ్ అనంతరం సింధు భావోద్వేగానికి గురైంది. తనలో ఆడే సత్తా తగ్గలేదని నిరూపించింది. కష్టకాలంలోనూ తనపై నమ్మకం కోల్పోలేదని, ఆ నమ్మకమే ఈ గెలుపని పేర్కొంది. కష్టకాలంలో తన వెంట నిలిచిన కోచ్‌లకు, తల్లిదండ్రులకు, భర్తకు కృతజ్ఞతలు తెలిపింది. వచ్చే నెలలో జరగనున్న ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో ఇదే జోరును కొనసాగించి రికార్డు స్థాయిలో ఆరో పతకాన్ని సాధించడమే తన లక్ష్యమని భారత స్టార్ షట్లర్ స్పష్టం చేసింది.

# కాశీబుగ్గ సిఐ, ఎస్ఐ సస్పెన్షన్

## మాజీమంత్రి సిదిరి కుమారుని వాహనం కేసు

## సాక్ష్యాధారాల సేకరణలో పోలీసుల వైఫల్యంపై ప్రభుత్వం ఆగ్రహం

**శ్రీకాకుళం, జులై 19 ప్రభాతవార్త :** పలాస కాశీబుగ్గలో మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు కుమారుడు నడిపిన వాహనం ఢీకొనడంతో ఒక వ్యక్తి మృతి చెందిన ఘటనకు సంబంధించి కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసు దర్యాప్తు, చట్టపరమైన చర్యల విషయంలో విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించారనే ఆరోపణల నేపథ్యంలో కాశీబుగ్గ సిఐ రామకృష్ణ, ఎస్సై సునీల్‌లను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఈ మేరకు విశాఖ రేంజ్ ఐజీ గోపీనాథ్ జెట్టి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ప్రమాద ఘటన జరిగిన నాటి నుంచి కేసు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. బాధిత కుటుంబ సభ్యులు న్యాయం చేయాలని డిమాండ్ చేయగా, ప్రజా సంఘాలు, వివిధ రాజకీయ పార్టీలు కూడా ప్రమాద ఘటనపై పారదర్శకంగా, నిష్పక్షికంగా దర్యాప్తు జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరాయి. ఘటన అనంతరం కేసు నమోదు, సాక్ష్యాధారాల సేకరణ, దర్యాప్తు ప్రక్రియలో పోలీసులు తగిన జాగ్రత్తలు తీసుకోలేదని, కొన్ని విధి విధానాలు సక్రమంగా పాటించలేదని ఆరోపణలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు కేసును సమగ్రంగా పరిశీలించి శాఖాపరమైన విచారణ చేపట్టారు. విచారణలో ప్రాథమికంగా విధి నిర్వహణలో లోపాలు ఉన్నట్లు గుర్తించిన అనంతరం ఇద్దరు అధికారులపై సస్పెన్షన్ చర్యలు తీసుకున్నట్లు తెలిసింది. పోలీసు అధికారుల సస్పెన్షన్‌తో ఈ కేసు మరోసారి ప్రాధాన్యం సంతరించుకుంది. బాధిత కుటుంబ సభ్యులు ఈ చర్యను స్వాగతిస్తూ, ప్రమాద ఘటనకు సంబంధించిన పూర్తి నిజాలు వెలుగులోకి వచ్చి బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. మరోవైపు, ఈ కేసులో దర్యాప్తు కొనసాగుతోందని, అన్ని కోణాల్లో విచారణ జరుగుతోందని పోలీసు వర్గాలు పేర్కొంటున్నాయి. దర్యాప్తు నివేదిక ఆధారంగా అవసరమైతే మరిన్ని శాఖాపరమైన లేదా చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉందని సమాచారం. రాజకీయంగా కూడా ఈ ఘటన ప్రాధాన్యం సంతరించుకుంది. మాజీ మంత్రి కుటుంబానికి సంబంధించిన అంశం కావడంతో అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య విమర్శలు, ప్రతివిమర్శలు కొనసాగుతున్నాయి. అయితే, దర్యాప్తు పూర్తయ్యే వరకు ఎలాంటి ఊహాగానాలకు తావివ్వకుండా నిజానిజాలను వెలికితీయాలని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ ఘటనలో పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించారనే అభియోగాలపై ప్రభుత్వం తీసుకున్న చర్య రాష్ట్ర పోలీసు శాఖలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. విధి నిర్వహణలో నిర్లక్ష్యాన్ని సహించబోమనే సందేశాన్ని ఈచర్య ద్వారా ప్రభుత్వం ఇచ్చిందని పలువురు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

**వారం - వర్జ్యం**

20-07-2026, సోమవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
ఆషాఢమాసం, దక్షిణాయణం
గ్రీష్మ ఋతువు, శుక్లపక్షం, పుష్యమి కార్తె
సప్తమి తె.4.04, హస్త రా.7.14
వర్జ్యం : రా.3.47 - తె.5.29
దు.ము.12.40-మ.1.32
(2) మ.3.15-సా.4.07
శుభసమయం : ఉ.7.00-8.00
రాహుకాలం - ఉ.7.30-9.00

**వార్తాఫలం**

**మేషం :** ఆశలు వదులుకున్న కార్యక్రమాలను సానుకూలము చేసుకోవటానికి కృషిచేసి కొంత పురోభివృద్ధి సాధిస్తారు.

**వృషభం:** ఉద్యోగాలలో ఎదురైన ఆటంకాలు అధిగమిస్తారు. అరుదైన ఆహ్వానాలు అందుకుంటారు. వాహనసౌఖ్యం పొందుతారు.

**మిథునం:** ప్రముఖులతో పరిచయాలు ఏర్పడతాయి. స్త్రీలతో వివాదాలు ఏర్పడకుండా జాగ్రత్తలు పాటించండి.

**కర్కాటకం:** ఏకాగ్రత లోపించడంవల్ల కొన్ని కార్యక్రమాలు వాయిదా వేస్తారు. క్రయ విక్రయాలలో తొందరపాటు వద్దు.

**సింహం:** ఇతరులు ఇచ్చే సలహాలు మీకు ఉపకరించవు. ఆరోగ్య సూత్రాలను పాటించవలసిన కాలం, ఓర్పు మేలు చేస్తుంది.

**కన్య :** సాంకేతిక, పరిశోధన విషయాలపై ఆసక్తి చూపుతారు. వ్యాపారాలలో క్రమ విక్రయాలలో అనుకున్నంతగా లాభాలు పొందలేకపోవచ్చు.

**తుల :** కొన్ని వ్యవహారాలలో ఊహించని విజయం సాధిస్తారు. సోదరులతో ఏర్పడిన వివాదాలు తీరుతాయి. వాహన సౌఖ్యం.

**వృశ్చికం:** కుటుంబంలో శుభకార్యాలు జరుగుతాయి. చాకచక్యంగా వ్యవహరించి పనులు పూర్తి చేస్తారు. కాంటాక్టులు లభిస్తాయి.

**ధనుస్సు:** వ్యాపార విస్తరణకు నిపుణులతో చర్చించి కార్యాచరణలో కొంత అభివృద్ధిని సాధిస్తారు. స్వల్ప ధనలాభం పొందుతారు.

**మకరం:** అన్ని పనులు మీరే స్వయంగా చూసుకోవలసి వస్తుంది. సహచర వర్గం కరువవుతారు. నూతనవస్త్రాలు కొనుగోలు చేస్తారు.

**కుంభం:** బంధువులను కలిసి ఆనందంగా గడుపుతారు. బాధ్యతలు సమర్థవంతంగా పూర్తి చేస్తారు. పెట్టుబడులకు అనుకూలం.

**మీనం :** మీ మేధస్సు నలుగురిలో ప్రశంసించబడుతుంది. ఆరోగ్య విషయంలో మెలుకువ అవసరం. చర్చాగోష్ఠులలో పాల్గొంటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# నేటి నుంచి పార్లమెంట్

>> సమావేశం వాడివేడిగా సాగింది. ప్రజా సమస్యలపై తొలుత చర్చకు అవకాశం కల్పించాలని కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. అందరూ సహకరిస్తే, ఖచ్చితంగా అన్ని అంశాలపై చర్చించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని కేంద్ర మంత్రులు ప్రతిపక్షాలకు స్పష్టంగా తెలియజేశారు.

ఇదిలా ఉండగా, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, పార్లమెంట్ వర్షాకాల సమావేశాల సందర్భంగా సోమవారం రాజ్యసభలో ‘జాతీయ గౌరవానికి అవమానాల నివారణ (సవరణ) బిల్లు, 2026’ను ప్రవేశపెట్టనున్నారు. ప్రస్తుతం జాతీయ గీతం ‘జన గణ మన’కు కల్పిస్తున్న చట్టపరమైన, శాసనపరమైన రక్షణనే జాతీయ గీతం ‘వందేమాతరానికి’ కూడా కల్పించాలని ఈ ప్రతిపాదిత చట్టం కోరుతోంది. ఈ బిల్లు చట్టంగా మారితే, ‘జాతీయ గౌరవానికి అవమానాల నివారణ చట్టం’ సవరించబడుతుంది. దీని ప్రకారం వందేమాతరాన్ని అవమానించడం శిక్షార్హమైన నేరంగా పరిగణించబడుతుంది. తద్వారా చట్టపరమైన రక్షణల విషయంలో ఇది జాతీయ గీతంతో సమాన స్థాయికి వస్తుంది. ఈ ప్రతిపాదిత చట్టం ప్రకారం, జాతీయ గీతాన్ని ఉద్దేశపూర్వకంగా అవమానించినా లేదా దాని గానానికి ఆటంకం కలిగించినా, ఆ వ్యక్తికి మూడేళ్ల వరకు జైలు శిక్ష, జరిమానా లేదా రెండూ విధించవచ్చు. అధికారిక ప్రభుత్వ కార్యక్రమాలలో ‘జన గణ మన’తో పాటు ‘వందేమాతరం’ను కూడా ఆలపించేటప్పుడు, ముందుగా ‘వందేమాతరం’ను ఆలపించాలన్న ఆదేశాలను కచ్చితంగా పాటించాలని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ జులై 9న అన్ని రాష్ట్రాలకు జారీ చేసిన ఆదేశాల నేపథ్యంలోనే ఈ శాసనపరమైన చర్య చేపట్టబడింది. ప్రతిపాదిత సవరణను పార్లమెంటు జరుగుతున్న వర్షాకాల సమావేశాల్లో చర్చకు తీసుకువచ్చే అవకాశం ఉంది.

# అఖిలపక్షం రసాభాస

>> సహకరించాలని ఆయన కోరారు. పార్లమెంట్ ఎంత బాగా పనిచేస్తే దేశానికి అంత ఎక్కువ ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఉభయ సభల్లో ప్రతిపక్షాల అభిప్రాయాలను వింటామని రిజిజు స్పష్టం చేశారు. అదే సమయంలో వారు కూడా తమ వైపు వాదనలను వింటారని ఆశిస్తున్నామని కిరణ్ రిజిజు ఆశాభావం వ్యక్తం చేశారు. ముందుగా ప్రజా సమస్యలపై చర్చకు అవకాశమివ్వాలని ప్రతిపక్ష పార్టీల నేతలు కోరుతూ, కొన్ని సూచనలు, సలహాలు చేశారు. అదే సమయంలో తిరుగుబాటు చేసిన 20 మంది టిఎంసి ఎంపిలకు లోక్‌సభలో ప్రత్యేక సీట్లు కేటాయించడం, అలాగే శివసేన (యుబిటి)కు చెందిన ఆరుగురు ఎంపిలను ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేనలో విలీనం చేయడంపై ప్రతిపక్షాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాయి. అఖిలపక్ష సమావేశం అనంతరం కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు మీడియాతో మాట్లాడుతూ, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన 40 మంది ఫ్లోర్ లీడర్లు అఖిలపక్ష సమావేశానికి హాజరయ్యారని, వర్షాకాల సమావేశాల్లో చర్చించబోయే అంశాలపై తమ అభిప్రాయాలను వెల్లడించారని వివరించారు.

పశ్చిమాసియాలో నెలకొన్న సంఘర్షణ కారణంగా ప్రపంచ వ్యాప్తంగా అనిశ్చితి నెలకొన్న నేపథ్యంలో, జాతీయ ప్రయోజనాల దృష్ట్యా అన్ని రాజకీయ పార్టీలు కలిసి పనిచేయాలని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ విజ్ఞప్తి చేశారని రిజిజు పేర్కొన్నారు. “అనేక రాజకీయ పార్టీలు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశాయి. తాము వాటిని విని నమోదు చేసుకున్నాము. అనేక సూచనలు వచ్చాయి, వాటిని కూడా నమోదు చేసుకున్నాము... ఏదైనా రాజకీయ పార్టీ చర్చలో పాల్గొనకుండా కేవలం నినాదాలకే పరిమితమైతే, దానివల్ల రాజకీయంగా నష్టం వాటిల్లుతుందని మీరు గమనించే ఉంటారు. ఇది అందరికీ తెలిసిన విషయమే... చర్చకు దూరంగా ఉండి గందరగోళం సృష్టిస్తే ఏ రాజకీయ పార్టీకీ రాజకీయ ప్రయోజనం చేకూరదు. ఇది రుజువైన విషయం. కాబట్టి, అందరూ చర్చలో పాల్గొనాలి. చిన్న పార్టీల సభ్యులు తమకు మాట్లాడేందుకు ఎక్కువ సమయం కేటాయించాలని కోరారు” అని ఆయన అన్నారు. సమావేశాలు సజావుగా సాగితే అందరూ తమ అభిప్రాయాలను వ్యక్తం చేసే అవకాశం ఉంటుందని, అయితే “గందరగోళం సృష్టిస్తే మాత్రం మాట్లాడే అవకాశం లభించదు” అని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి స్పష్టం చేశారు. “తర్వాత, తగినంత చర్చ లేకుండానే బిల్లు ఆమోదించబడిందని లేదా గందరగోళం మధ్య ఆమోదించబడిందని ప్రభుత్వంపై నిందలు వేయకూడదు... పార్లమెంటు పని చేయాలని దేశ ప్రజలు కోరుకుంటున్నారు, పార్లమెంటు పని చేయకపోతే అది ప్రజాస్వామ్యానికి మంచిది కాదు” అని ఆయన పేర్కొన్నారు. ఇక అఖిపక్ష సమావేశానికి ‘నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా’ (ఎన్‌సిపిఐ) సభ్యులను ఆహ్వానించడాన్ని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు సమర్థించారు.

విపక్షాలకు వాకౌట్ చేసే హక్కు ఉన్నప్పటికీ, ఎన్నికైన 20 మంది ఎంపిలను చర్చల నుంచి మినహాయించడం సముచితం కాదని ఆయనపేర్కొన్నారు. ‘ప్రస్తుతం ఈవిషయం స్పీకర్ పరిశీలనలో ఉన్న ప్పుడు, వారిని మనం ఎలా పక్కనపెట్టగలం’ అని ప్రశ్నించారు. లోక్‌సభ, రాజ్యసభ సచివాలయాలు జారీ చేసిన అధికారిక బులెటిన్ ద్వారా వర్షాకాల సమావేశాల్లో ప్రవేశపెట్టనున్న ఎనిమిది బిల్లుల వివరాలను ప్రభుత్వం ఇప్పటికే పంచుకుందని రిజిజు తెలిపారు. సమావేశాల సమయంలో ప్రభుత్వం ఏదైనా అదనపు చట్టాన్ని ప్రవేశపెట్టాలని నిర్ణయిస్తే, ఆ విషయంపై ముందుగా బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బిఎసి)లో చర్చిస్తామని, ప్రతిపక్ష పార్టీలన్నింటికీ ముందస్తు సమాచారం అందిస్తామని కేంద్ర మంత్రి పేర్కొన్నారు.



జమ్ము కాశ్మీర్‌లోని రజౌరిలో ఆదివారం కురిన భారీ వర్షాలతో సంభవించిన వరదల కారణంగా కొట్టుకు వచ్చిన బురద, శిథిలాలు మరియు గృహోపకరణాలు చెల్లాచెదరుగా పడి ఉన్న దృశ్యం

# పివి సింధు దేశానికి గర్వకారణం

## - గవర్నర్ అబ్దుల్ నజీర్

**విజయవాడ.జులై19,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రఖ్యాత బాడ్మింటన్ క్రీడాకారిణి పివి సింధుకు గవర్నర్ అబ్దుల్ నజీర్ అభినందనలు తెలిపారు. సింధు దేశానికి గర్వకారణంగా నిలిచిందని గవర్నర్ ప్రశంసించారు. భవిష్యత్తులో మరిన్ని పతకాలు తేవాలని గవర్నర్ ఆకాంక్షించారు.టైటిల్ గెలిచిన తొలి భారతీయురాలిగా సింధు చరిత్ర సృష్టించారు. సింధు రాష్ట్రానికి, దేశానికి మరోసారి గర్వకారణంగా నిలిచారు. భవిష్యత్‌లో ఆమె మరిన్ని టైటిళ్లు సాధించాలని అన్నారు.ఈ మేరకు లోక్‌భవన్ నుంచి ప్రకటన విడుదలయింది.

# దేశం గర్వించేలా జపాన్ ఓపెన్‌లో సింధు విజయం

## - సిఎం చంద్రబాబు నాయుడు

**విజయవాడ, జులై 19,ప్రభాతవార్తప్రతినిధి:** దేశం గర్వించేలా జపాన్ ఓపెన్‌లో సింధు సంచలన విజయం సాధించడంపై సిఎం చంద్రబాబు హర్షం ప్రకటించారు.ఉత్కంఠ పోరులో విజయంతో సింధు సరికొత్త మైలురాయి లిఖించారు. భారత బ్యాడ్మింటన్ చరిత్రలో చరిత్రాత్మక ఘట్టం. అద్భుత విజయం అందుకున్న సింధుకు అభినందనలు. దేశం గర్వించేలా జపాన్ ఓపెన్‌లో సింధు సంచలన విజయం సాధించిందని సిఎం చంద్రబాబు ప్రశంసించారు. ఉత్కంఠభరితంగా సాగిన ఈ పోరులో ప్రత్యర్థి యామగూచిపై 21-17, 21-17 తేడాతో ఘన విజయం సాధించి సరికొత్త మైలురాయిని లిఖించారని సిఎం చంద్రబాబు కొనియడారు. భారత బ్యాడ్మింటన్ చరిత్రలోనే ఇది ఒక చారిత్రాత్మక ఘట్టమన్నారు. రాబోయే ఒలింపిక్స్ బరిలో కూడా ఇదే జోరును కొనసాగించి పసిడి పతకాన్ని తీసుకురావాలని సిఎం చంద్రబాబు ఆల్ ది బెస్ట్ చెప్పారు.

# ఆరోగ్యానికి ‘డిజిటల్’ కవచం

>> ప్రజలకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. వీరి ఆరోగ్య వివరాలను ఎప్పటికప్పుడు డిజిటలైజేషన్ చేయడంతో పాటు కోడ్ ఇస్తారు. ప్రజల ఆరోగ్య వివరాలను కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభా కార్యక్రమంలో సైతం నమోదు చేస్తారు. మరోమారు ఆస్పత్రికి ప్రజలు వెళ్తే వైద్యులు సులువుగా వారి ఆరోగ్య వివరాలు, వారి సమస్యను గుర్తించి చికిత్సను అందిస్తారు. అత్యవసర వేళల్లో ప్రజలకు నిపుణులైన వైద్యుల సలహాలతో స్థానికంగానే అత్యవసర చికిత్సలు సైతం అందించే వెసులుబాటు కలుగుతుంది. ఏది ఏమైనా సిఎం చంద్రబాబునాయుడు కుప్పం ప్రాంతంలో తలపెట్టిన ఈ ప్రాజెక్టు కుప్పం ప్రాంత ప్రజలకు నిజంగా ‘సంజీవని’గానే మారిందనడంలో ఎలాంటి సందేహం లేదు.

# చెస్ ఛాంపియన్‌షిప్‌లో తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ రిత్విక్‌కు రజతం

**హైదరాబాద్, జులై 19, ప్రభాతవార్త:** ఫ్రాన్స్ మెనూయిర్స్ ఇంటర్నేషనల్ చెస్ ఛాంపియన్‌షిప్‌లో తెలంగాణకు చెందిన గ్రాండ్‌మాస్టర్ రాజా రిత్విక్ రజతం సాధించాడు. 7.0/9 పాయింట్లతో ఓటమి లేకుండా రన్నరప్ ట్రోఫీ కైవసం చేసుకున్నాడు. ఉత్కంఠభరితమైన చివరి రౌండ్‌లో టాప్ సీడ్ ఫ్రాన్స్ జీఎం లగార్డే మాక్సిమ్‌పై ఘన విజయం సాధించాడు. టోర్నమెంట్‌లో ఒక్క మ్యాచ్‌లో కూడా ఓడిపోకుండా రన్నరప్ ట్రోఫీని (రజత పతకం) కైవసం చేసుకున్నాడు. ఈ టోర్నమెంట్‌లో 4వ సీడ్‌గా బరిలోకి దిగిన హైదరాబాద్‌కు చెందిన రిత్విక్ మొత్తం 9 రౌండ్లలో 7.0 పాయింట్లు సాధించాడు. ఫ్రాన్స్, ఇండియా, చైనా, జర్మనీ, పోలాండ్, నెదర్లాండ్స్, ఇటలీ వంటి దేశాల నుండి 86 మంది అత్యుత్తమ ఆటగాళ్లు పాల్గొన్న ఈ పోటీలో, రిత్విక్ అసాధారణమైన వ్యూహాత్మక చతురతను ప్రదర్శించాడు. 5 విజయాలు, 4 డ్రాలతో టోర్నమెంట్ అంతటా అజేయంగా నిలిచాడు.ఈ ఛాంపియన్‌షిప్‌లో అగ్రస్థానం కోసం ఇద్దరు భారతీయ క్రీడాకారుల మధ్య హోరాహోరీ పోరు సాగింది. గ్రాండ్ మాస్టర్ రోహిత్ కృష్ణ, జీఎం రాజా రిత్విక్ ఇద్దరూ తలా 7.0 పాయింట్లతో సంయుక్తంగా మొదటి స్థానంలో నిలిచారు. అయితే, టైబ్రేక్ లెక్కింపు ఆధారంగా జీఎం రోహిత్ కృష్ణ (టైబ్రేక్ స్కోరు 43) స్వర్ణ పతకాన్ని గెలుచుకోగా, రిత్విక్ (టైబ్రేక్ స్కోరు 41.5) రజత పతకాన్ని సొంతం చేసుకున్నాడు. ఫ్రాన్స్‌కు చెందిన ఒమేల్జా ఆర్టెమ్ 6.5 పాయింట్లతో కాంస్య పతకాన్ని సాధించాడు.

# గ్లోబల్ ‘వెడ్డింగ్ డెస్టినేషన్’గా ఎపి

>> పచ్చని ప్రకృతి, గిరిజన సంస్కృతి, ఎకోటూరిజం వైభవం మరియు అంతర్జాతీయ గుర్తింపు పొందిన ‘అరకుకాఫీ’ విశిష్టతలతో అరకు పర్యాటకులను కట్టిపడేస్తుందని తెలిపారు. పచ్చని కొండలు, చల్లని వాతావరణం, పొగమంచు మధ్య ప్రశాంతంగా వేడుక జరుపుకోవాలనుకునే వారికి అరకు ఉత్తమమైన ప్రాంతం అని పేర్కొన్నారు. అదే గాక కోనసీమ ప్రాంతం పచ్చని కొబ్బరిచెట్లతో, మారేడుమిల్లి దట్టమైన అటవీ ప్రాంతంతో సుందరంగా ఉంటుందన్నారు.

సాంప్రదాయ పద్ధతిలో, వైభవంగా వివాహం చేసుకోవాలనుకునే వారికి తిరుపతి మొదటి ప్రాధాన్యతగా మారుతోందని, ప్రస్తుతం అక్కడ అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ‘వరల్డ్ క్లాస్ హోటల్స్’ అందుబాటులోకి వస్తున్నాయని మంత్రి తెలిపారు. రామ్ దేవ్ బాబా ఎపిలో వెల్ నెస్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నారని పేర్కొన్నారు.మంత్రి దుర్గేష్ ప్రసంగంతో ఎపికి వచ్చి వెడ్డింగ్ డెస్టినేషన్ ప్రాజెక్టులపై పెట్టుబడులు పెట్టేం దుకు పలువురు వెడ్డింగ్ ప్లానర్లు సుముఖత వ్యక్తం చేశారు. ఎపిలో ఈవెంట్స్, టూరిజం ప్రాజెక్టులు చేపట్టే వారికి కూటమి ప్రభుత్వం తరపున సింగిల్ విండో విధానంలో అనుమతులు, అవసరమైన మౌలిక సదుపాయాలు,పూర్తిస్థాయి సహాయ సహకా రాలు అందిస్తామని మంత్రి దుర్గేష్ హామీ ఇచ్చారు.

# ప్రభుత్వాసుపత్రిలో అనుమానాస్పద మృతి

**కర్నూలు హాస్పిటల్ జులై 19 ప్రభాతవార్త :** కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో రిటైర్డ్ ఎస్సై రంగస్వామి (68) అనుమానాస్పదంగా మృతి చెందాడు. రంగస్వామి ఈనెల 13వ తేదీన హెర్నియా ఆపరేషన్ కొరకు ఆసుపత్రిలో చేరారు. ఈనెల 14న వైద్యులు రంగస్వామికి హెర్నియా ఆపరేషన్ చేసి హాస్పిటల్లో అడ్మిట్ చేసుకున్నారు. ఈ క్రమంలో శనివారం అర్ధరాత్రి రెండు గంటల సమయంలో ఆసుపత్రిలోని సర్జికల్ వార్డు భవనం నుంచి రిటైర్డ్ ఎస్సై కిందికి దూకి ఆత్మహత్య చేసుకున్నారు. అయితే ఈ మృతిపై కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. నడవలేని వ్యక్తి ఎలా భవనం పైకెక్కి ఆత్మహత్య చేసుకుంటారని.. ఆసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యమే మృతికి కారణమని వారు తెలిపారు. తన తండ్రి మృతికి కారణం చెప్పాలని మృతుడి కొడుకు వెంకటరమణ కోరుతున్నారు. ఈ ఘటనపై మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# టెన్త్ విద్యార్థినిపై ఇంటర్ విద్యార్థి అత్యాచారం

## పొక్సో కేసు నమోదు

**విజయనగరం,గరివిడి, జూలై 19, ప్రభాతవార్త :** విజయనగరం జిల్లా గరివిడి మండలంలోని కోడూరు గ్రామానికి చెందిన ఒక టెన్త్ విద్యార్థిని పై అదే గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థి అత్యాచారానికి పాల్పడటం సంచలనం రేకెత్తించింది.ఆ బాలిక గర్భం దాల్చడం తో విషయం బయట పడింది. అత్యాచారానికి పాల్పడ్డ ఇంటర్ విద్యార్థి పై పొక్సో కేసు ని పోలీసులు నమోదు చేశారు.పోలీసులు కథనం ప్రకారం గరివిడి లో ఒక ప్రభుత్వ పాఠశాలలో టెన్త్ చదువుతున్న కోడూరు కి చెందిన విద్యార్థినిని, అదే కోడూరుకి చెందిన విద్యార్థి గరివిడిలో ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు.రెండు సార్లు శారీరకంగా బాలికను యువకుడు కలిసాడు. దీంతో బాలిక గర్భం దాల్చింది. అయితే బాలిక కు కడుపు నొప్పి వచ్చిందని కుటుంబీకులు ఆసుపత్రికి తీసుకు వెళ్లడంతో బాలిక గర్భం దాల్చినట్లు తేటతెల్లమైంది. దీంతో బాలిక తల్లిదండ్రులు పోలీసులని ఆశ్రయించారు. పోలీసులు దర్యాప్తు చేయగా యువకుడు బాలిక పై అత్యాచారానికి పాల్పడినట్లు వెల్లడైంది.బాలిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు అత్యాచారం చేసి బాలిక గర్భం దాల్చేందుకు కారకుడైన ఇంటర్ విద్యార్థిపై పొక్సో కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ బి.లోకేశ్వర రావు తెలిపారు.

20-7Pg3exHMNWJQEAKTCL_20-7Pg3exHMNWJQEAKTCL.qxd 19/Jul/26 11:42 PM Page 1



# పొగాకు వేలం కేంద్రాల్లో కొనుగోళ్లలో కనిపించని స్థిరత్వం




**ఒంగోలు(కలెక్టరేట్), జులై 19 ప్రభాతవార్త:** దక్షిణాది ఎఫ్‌సీవీ పొగాకు వేలం మార్కెట్లో అనిశ్చిత పరిస్థితులు కొనసాగుతుండటంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. వేలానికి వస్తున్న పొగాకు బేళ్ల సంఖ్య రోజురోజుకు పెరుగుతున్నప్పటికీ కొనుగోళ్లలో స్థిరత్వం కనిపించకపోవడం, నోబిడ్ బేళ్ల శాతం ఒక్కో రోజు ఒక్కోలా మారుతుండడం రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. శుక్రవారం మార్కెట్‌లో ఆశాజనకంగా కనిపించిన పరిస్థితి శనివారం ఒక్కసారిగా మారిపోవడంతో మార్కెట్ ధోరణిపై రైతులు, వ్యాపారుల్లో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొనుగోలు సంస్థల అధికారులు సూచించిన ధరలకు ముందుకు రాకపోవడంతో వేలాది బేళ్లు అమ్ముడుపోకుండా తిరిగి రైతుల వద్దకే వెళ్తున్నాయి. శనివారం దక్షిణాదిలోని 11 వేలం కేంద్రాలకు మొత్తం 7,612 పొగాకు బేళ్లు అమ్మకానికి రాగా, అందులో 5,214 బేళ్లను మాత్రమే కొనుగోలు చేశారు. మిగిలిన 2,398 బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరణకు గురయ్యాయి. వాటిలో 1,932 బేళ్లు అధికారులు నిర్ణయించిన ధరలకు కొనుగోలు సంస్థలు ఆసక్తి చూపకపోవడంతో నోబిడ్‌గా నమోదయ్యాయి. దీంతో మొత్తం వేలానికి వచ్చిన బేళ్లలో 25.38 శాతం నోబిడ్‌గా మిగిలాయి. శుక్రవారం 18.40శాతం ఉండగా, ఒక్క రోజులోనే దాదాపు ఏడు శాతం పెరగడం మార్కెట్‌లో ఉన్న అస్థిరతను స్పష్టంగా చూపిస్తోంది. ఇదే సమయంలో శుక్రవారం కిలోకు సగటున రూ.195.20 ధర లభించగా, శనివారం ధరల్లో కూడా హెచ్చుతగ్గులు కనిపించడం రైతులను మరింత నిరాశకు గురిచేసింది. జిల్లాలోని పలు వేలం కేంద్రాల్లో నోబిడ్ బేళ్ల శాతం ఆందోళనకర స్థాయికి చేరుకుంది. కనిగిరి వేలం కేంద్రంలో అత్యధికంగా 55.37 శాతం బేళ్లు నోబిడ్ కావడం రైతులను తీవ్రంగా కలవరపెడుతోంది. అంటే వేలానికి తీసుకొచ్చిన ప్రతి రెండు బేళ్లలో ఒకటి కూడా అమ్ముడుకాకపోవడం అక్కడి పరిస్థితిని ప్రతిబింబిస్తోంది. వెల్లంపల్లి కేంద్రంలో 36.50 శాతం, ఒంగోలు 2 కేంద్రంలో 32.26 శాతం, కందుకూరు2లో 31.68 శాతం, కలిగిరిలో 31.11 శాతం బేళ్లు నోబిడ్‌గా నమోదయ్యాయి. ఈ గణాంకాలు మార్కెట్‌లో కొనుగోళ్లపై ఉన్న అనిశ్చితిని స్పష్టంగా తెలియజేస్తున్నాయి. అయితే అన్ని కేంద్రాల్లో ఒకే పరిస్థితి లేకపోవడం మార్కెట్‌లో అసమాన ధోరణిని బయటపెడుతోంది. కందుకూరు1 వేలం కేంద్రంలో 671 బేళ్లు అమ్మకానికి రాగా కేవలం ఏడు శాతం మాత్రమే నోబిడ్ కావడం విశేషం. అలాగే డీసీపల్లిలో 528 బేళ్లలో 9.43 శాతం, కొండపి కేంద్రంలో 943 బేళ్లలో 10.60 శాతం మాత్రమే నోబిడ్ కావడం అక్కడ కొనుగోళ్లు కొంత మెరుగ్గా సాగినట్లు సూచిస్తోంది. ఒకే రోజు, ఒకే ప్రాంతంలో ఉన్న వేలం కేంద్రాల మధ్య ఇంతటి వ్యత్యాసం ఉండడం రైతులను అయోమయానికి గురిచేస్తోంది. కొనుగోలు సంస్థల మధ్య పోటీ తగ్గడం, నాణ్యత ఆధారంగా ఎంపిక మరింత కఠినతరం కావడం, ఎగుమతి పరిస్థితులు, అంతర్జాతీయ మార్కెట్ ప్రభావం వంటి అంశాలు కూడా నోబిడ్‌ల పెరుగుదలకు కారణమవుతున్నాయని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. రైతులు ఎంతో శ్రమించి పండించిన పొగాకు సరైన ధరకు అమ్ముడుపోకపోతే తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితి నెలకొంది. ఇప్పటికే సాగు ఖర్చులు, కూలీల వ్యయం, ఎరువులు, పురుగుమందుల ధరలు పెరగడంతో రైతులపై భారం అధికమైందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేలం కేంద్రాల్లో నోబిడ్ బేళ్లు పెరగడం వల్ల రైతులు వాటిని తిరిగి నిల్వ చేసుకోవాల్సి వస్తోంది. దీంతో రవాణా, గిడ్డంగి, కార్మిక వ్యయాలు అదనంగా భరించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. మరోసారి వేలానికి తీసుకురావాలంటే అదనపు ఖర్చుతో పాటు నాణ్యత దెబ్బతినే ప్రమాదం కూడా ఉందని రైతులు పేర్కొంటున్నారు. అధికారులు, పొగాకు బోర్డు కొనుగోలు సంస్థలతో చర్చించి మార్కెట్‌లో స్థిరత్వం తీసుకురావాలని, రైతులకు గిట్టుబాటు ధరలు లభించేలా చర్యలు చేపట్టాలని రైతు సంఘాలు కోరుతున్నాయి. కొనుగోలు ప్రక్రియలో పారదర్శకత పెంచి, నోబిడ్ బేళ్ల సమస్యను తగ్గించేలా తక్షణ చర్యలు తీసుకుంటేనే పొగాకు రైతులకు ఊరట లభిస్తుందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

## సంస్కృతం భారతీయ సంస్కృతికి ప్రతిరూపం

- ప్రాచీన జ్ఞానాన్ని ఆధునికతతో అనుసంధానించాలి
- అసోం గవర్నర్ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్య



**తిరుపతి (విద్య), జులై 19 ప్రభాతవార్త:** తిరుపతి జాతీయ సంస్కృత వర్సిటీని అసోం గవర్నర్ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్య ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా నిర్వహించిన శ్రీ పట్టాభిరామ శాస్త్రీ వ్యాఖ్యానమాలను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ప్రొ. జి.ఎస్.ఆర్. కృష్ణమూర్తి, రిజిస్ట్రార్ కడియం వెంకట నారాయణరావు, అకడమిక్ డీన్ ప్రొ. రజనీకాంత్ శుక్ల పూర్ణకుంభంతో గవర్నర్‌కు ఘన స్వాగతం పలికారు. చెలికాని అన్నారావు సభాభవనంలో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ మాట్లాడుతూ సంస్కృతం కేవలం భాష మాత్రమే కాదని, భారతీయ సంస్కృతి, సనాతన జ్ఞాన సంపదకు ప్రతిరూపమని పేర్కొన్నారు. సంస్కృత అధ్యయనం ద్వారా భారతీయ వైజ్ఞానిక, సాంకేతిక, నైతిక విలువలను యువత అందిపుచ్చుకోవాలని సూచించారు. ప్రాచీన జ్ఞానాన్ని ఆధునిక అవసరాలకు అనుగుణంగా అనుసంధానించే దిశగా జాతీయ విద్యా విధానం-2020 కీలక పాత్ర పోషిస్తోందన్నారు. పట్టాభిరామ శాస్త్రీ పేరుతో ప్రారంభమైన వ్యాఖ్యానమాల దేశవ్యాప్తంగా శాస్త్ర చర్చలకు వేదికగా నిలవాలని ఆకాంక్షించారు. పరిశోధనలు, ఆవిష్కరణలు, భారతీయ జ్ఞాన పరిరక్షణలో విద్యార్థులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. భాష ప్రజలను ఏకం చేసే శక్తి అని, సంస్కృత భాష ఆ పాత్రను శతాబ్దాలుగా నిర్వర్తిస్తోందని పేర్కొన్నారు. అంతకుముందు వైస్‌ఛాన్సలర్ ప్రొ. జి.ఎస్.ఆర్. కృష్ణమూర్తి విశ్వవిద్యాలయ సాధిస్తున్న ప్రగతి, సంస్కృతాభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. రిజిస్ట్రార్ కడియం వెంకట నారాయణరావు విద్యా కార్యక్రమాలు, విభాగాలు, పరిశోధన కార్యకలాపాలను పరిచయం చేశారు. అకడమిక్ డీన్ ప్రొ. రజనీకాంత్ శుక్ల అకడమిక్ విశేషాలను వెల్లడించారు. వ్యాఖ్యానమాల కోఆర్డినేటర్ ప్రొ. సతీష్ కె.ఎస్. ఈ కార్యక్రమ లక్ష్యాలను వివరించగా, అదనపు కోఆర్డినేటర్ డా. ఓ.పి.జీ. కళ్యాణ శాస్త్రీ సభా నిర్వహణ చేపట్టారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఆర్థిక అధికారి ప్రొ. రాధాగోవింద త్రిపాఠి, స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ డీన్ ప్రొ. పి. వెంకట్రావు, సాహిత్యసంస్కృతి విభాగం డీన్ ప్రొ. సి. రంగనాథన్, ప్రజాసంబంధాల అధికారి డా. కనపాల కుమార్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గిరి పుత్రులకు పవన్ మాటిచ్చారు... వసతులు కల్పించారు

- ఉపాధి నిధులతో అంగన్వాడీ కేంద్రాలతోపాటు పలు అభివృద్ధి కార్యక్రమాలు




**విజయవాడ, జులై 19 ప్రభాతవార్త ప్రతినిధి:** గిరిజన ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేసారు. గిరిజన గ్రామాల అభివృద్ధి పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు పవన్ కళ్యాణ్ తెలిపారు. ఆయన అల్లూరి సీతారామరాజు జిల్లా, అనంతగిరి మండలం, బల్లగరువు గ్రామ పర్యటన సందర్భంగా గిరిపుత్రులకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. రూ.కోటి విలువైన పలు అభివృద్ధి పనులు పూర్తి చేశారు. అంగన్వాడీ కేంద్రాలు, తాగునీటి సదుపాయం, సీసీ రోడ్లు తదితర వసతులు కల్పించారు. ఇప్పటికే ఉపముఖ్యమంత్రి కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో స్పష్టం చేసారు. గిరిజన గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టేందుకు అనంతగిరి మండలం, బల్లగరువుకు వెళ్లారు. పర్యటనలో భాగంగా వెంగాపాడు, కొరవర్రి తదితర గ్రామాల్లో గిరిజనులతో మమేకం అయ్యారు. సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్న ఆయన, అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పనకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాటకు కార్యరూపం ఇస్తూ, నేడు పనులు పూర్తి చేశారు. గిరిజన ప్రాంతాల్లో నివసించే మహిళలు, చిన్నారుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని బల్లగరువు, వెంగాపాడు, కొరవర్రి గ్రామాల్లో అంగన్వాడీ కేంద్రాలను నిర్మించారు. పవన్ కళ్యాణ్ ఆయా గ్రామాలను సందర్శించిన సమయంలో అంగన్వాడీ కేంద్రాల నిర్వహణకు సరైన భవనం లేక చిన్నారులు పడుతున్న ఇబ్బందులు గుర్తించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో సమస్యలు తీర్చేందుకు ప్రణాళికలు రూపొందించారు. చిన్నారులు, మహిళల కోసం మేరకు మూడు అంగన్వాడీ భవనాలను రూ. 55 లక్షలు వెచ్చించి నిర్మించారు. అందులో బల్లగరువు, వెంగాపాడులో పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగంతో నూతన భవనాల నిర్మాణం చేపట్టారు. గిరిజనాభివృద్ధి శాఖ ఇంజినీరింగ్ విభాగం సహకారంతో కొరవర్రిలో అంగన్వాడీ భవనానికి ప్రహరీ గోడ, ఎంపీపీ స్కూలు భవనం పునరుద్ధరణ, తాగునీటి కోసం బోర్, నీటి సరఫరా నిమిత్తం పైపు లైన్లు, గ్రామంలో సీసీ రోడ్డు నిర్మించారు. గిరిజన ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు.

# రాష్ట్రాభివృద్ధి అంశాలను బలంగా ప్రస్తావించాలి

- జాతీయ ప్రయోజనాలకు ప్రాధాన్యతనివ్వాలి
- జనసేన ఎంపిలతో డి.సిం పవన్ కళ్యాణ్

**విజయవాడ, జులై 19 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన అంశాలపై పార్లమెంట్‌లో సమర్థంగా జనసేన ఆలోచనా విధానాన్ని స్పష్టం చేయాలని జనసేన ఎంపిలకు సూచించారు. జాతీయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుంటూ 'నేషన్ ఫస్ట్' అనే భావన ప్రతి చర్చలో ప్రతిఫలించాలన్నారు. దాంతో పాటు రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన అంశాలను బలంగా ప్రస్తావించాలని ఎంపిలకు ఆయన స్పష్టం చేశారు. పార్లమెంట్ సమావేశాల నేపథ్యంలో జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పార్టీ ఎంపీలతో శనివారం రాత్రి సమావేశమై పలు అంశాలపై ఎంపిలు వ్యవహరించాల్సిన వైఖరిని తెలిపారు. ఈ సమావేశంలో జనసేన లోక్‌సభ ఎంపిలు వల్లభనేని బాలశౌరి, తంగెళ్ల ఉదయ శ్రీనివాస్, రాజ్యసభ సభ్యుడు లింగమనేని రమేశ్ పాల్గొన్నారు. 'రాష్ట్రానికి ప్రయోజనం కలిగించే ప్రతి అంశంపైనా పార్టీ తరఫున గళం వినిపించాలి' అని పవన్ అన్నారు. రాష్ట్రానికి మేలు చేసే ప్రతి అంశంపై నిర్మాణాత్మక చర్చలు జరపడంతో పాటు కేంద్ర కేంద్రం నుంచి ఎపికి రావాల్సిన నిధులు, పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టుల పురోగతి, అభివృద్ధి కార్యక్రమాల అమలుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పవన్ సూచించారు. ఇప్పటికే అమల్లో ఉన్న ప్రాజెక్టులకు అదనపు నిధులు సాధించేందుకు కేంద్రాన్ని సమర్థవంతంగా ఒప్పించే ప్రయత్నాలు చేయాలని ఎంపిలకు సూచించారు. ప్రతి అంశంపై నిర్మాణాత్మకంగా చర్చించాలని ఆయన సూచించారు. సమావేశంలో రాష్ట్ర రైల్వే అభివృద్ధికి సంబంధించిన అంశాలపై కూడా విస్తృతంగా చర్చ జరిగింది. పెండింగ్‌లో ఉన్న రైల్వే ప్రాజెక్టులకు త్వరితగతిన ఆమోదాలు పొందడం, అవసరమైన నిధుల కేటాయింపును సాధించడం, కొత్త రైల్వే లైన్ల నిర్మాణం, రైల్వే ఓవర్ బ్రిడ్జిలు (ఆర్‌ఓబిలు) ఏర్పాటు, దక్షిణ కోస్తా రైల్వే జోన్ అభివృద్ధి వంటి అంశాలను పార్లమెంట్‌లో ప్రాధాన్యంగా ప్రస్తావించాలని పార్టీ ఎంపిలకు పవన్ కల్యాణ్ సూచించారు.



అలాగే కేంద్ర ప్రభుత్వం ఈ సమావేశాల్లో లోక్‌సభ నియోజక వర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ అమలుకు సంబంధించిన కీలక బిల్లులు ప్రవేశపెట్టే అవకాశం ఉన్న నేపథ్యంలో, వాటిపై పార్టీ అనుసరించాల్సిన వ్యూహాన్ని ఎంపిలకు వివరించారు. ప్రతి అంశాన్ని రాజకీయ కోణంలో కాకుండా ప్రజా ప్రయోజనాలు, రాష్ట్రాభివృద్ధి, జాతీయ ప్రయోజనాల దృష్టితో పరిశీలించి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పవన్ కల్యాణ్ ఎంపిలకు సూచించారు. రాజ్యసభలో మనం అడుగుపెడుతున్నామని, మన ఆస్థిత్వాన్ని బలీయంగా చాటాలన్నారు.

# ముళ్లపొదల్లో పసికందులు.. మానవత్వాన్ని కలిచివేస్తున్న ఘటనలు

**ఒంగోలు(క్రైమ్), జులై 19 ప్రభాతవార్త:** ఉమ్మడి ప్రకాశం జిల్లాలో పసికందులను నిర్జన ప్రాంతాలు, ముళ్లపొదలు, కాలువలు, రోడ్ల పక్కన వదిలివెళ్లే ఘటనలు వరుసగా చోటుచేసుకుంటూ సమాజాన్ని కలవరపెడుతున్నాయి. నవమాసాలు మోసి కన్న బిడ్డలను కొందరు తల్లిదండ్రులు వివిధ కారణాలతో నిర్దాక్షిణ్యంగా వదిలేయడం వల్ల అమ్మ ఒడిలో పెరగాల్సిన చిన్నారులు అనాథలుగా ప్రభుత్వ శిశుగృహాల్లో ఆశ్రయం పొందుతున్నారు. పాల కోసం విలవిలలాడే వయస్సులోనే కొందరు శిశువులు ప్రాణాలు కోల్పోతుండగా, మరికొందరు స్థానికుల అప్రమత్తత, పోలీసులు, బాలల సంరక్షణ శాఖ అధికారులు, చైల్డ్‌లైన్ సిబ్బంది సకాలంలో స్పందించడంతో ప్రాణాలతో బయటపడుతున్నారు. ఇటీవలి కాలంలో ఇలాంటి ఘటనలు పెరుగుతుండటంతో బాలల భద్రత, తల్లిదండ్రుల బాధ్యతపై మరోసారి చర్చ మొదలైంది. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో గత ఏడాది మే నుంచి ఇప్పటి వరకు 11కు పైగా చిన్నారులను తల్లిదండ్రులు లేదా సంరక్షకులు వదిలివెళ్లిన ఘటనలు నమోదయ్యాయి. కొత్తపట్నంలో నాలుగేళ్ల బాలుడిని ఆసుపత్రిలో వదిలేయడం, మైనర్ బాలిక ప్రసవించిన శిశువును రోడ్డు పక్కన పడేయడం, ఒంగోలు జీజీహెచ్‌లో ఐదు రోజుల పాపను విక్రయించేందుకు ప్రయత్నించడం, మద్దిపాడులో మూడేళ్ల బాలికను రోడ్డు పక్కన వదిలివేయడం, మర్రిపూడిలో తల్లిదండ్రులు మృతి చెందడంతో ముగ్గురు చిన్నారులు అనాథలుగా మారడం, ఒంగోలు రైల్వే స్టేషన్‌లో నాలుగేళ్ల బాలుడిని వదిలివేయడం, సంతమాగులూరులో రెండేళ్ల బాలికను నిర్లక్ష్యంగా వదిలేయడం, ముండ్లమూరు శివారులో నెల రోజుల పాపను ముళ్లపొదల్లో పడేయడం వంటి ఘటనలు వరుసగా వెలుగులోకి వచ్చాయి. వీటిలో ముండ్లమూరు ఘటనలో శిశువు చికిత్స పొందుతూ మృతి చెందడం జిల్లావాసులను తీవ్రంగా కలచివేసింది. ప్రస్తుతం బాలసదన్, శిశుగృహాల్లో ఆశ్రయం పొందుతున్న చిన్నారులు తల్లిదండ్రుల ప్రేమకు దూరంగా అధికారుల సంరక్షణలో జీవనం సాగిస్తున్నారు. వారికి ఆహారం, వైద్యం, విద్య, రక్షణ కల్పిస్తున్నప్పటికీ, తల్లిదండ్రుల ప్రేమను భర్తీ చేయడం సాధ్యం కాదని అధికారులు చెబుతున్నారు.



చిన్నారులను పలకరిస్తే అమాయక చూపులు, కన్నీటి కళ్లే కనిపిస్తున్నాయని శిశుగృహ సిబ్బంది పేర్కొంటున్నారు. మరోవైపు సంతానం లేని దంపతులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం దత్తత కోసం సంవత్సరాల తరబడి ఎదురు చూస్తున్నారు. అలాంటి పరిస్థితుల్లో పిల్లలను రోడ్లపై వదిలేయకుండా అధికారులకు అప్పగిస్తే వారికి సురక్షిత మైన, ప్రేమతో కూడిన భవిష్యత్తు లభించే అవకాశం ఉందని బాలల సంక్షేమ నిపుణులు సూచిస్తున్నారు. చైల్డ్‌లైన్ ప్రతినిధి బీవీ సాగర్ తెలిపిన వివరాల ప్రకారం, అనారోగ్యంతో పుట్టిన పిల్లలకు చికిత్స చేయించే ఆర్థిక స్థోమత లేకపోవడం, వివాహేతర గర్భధారణ, కుటుంబ కలహాలు, తీవ్రమైన పేదరికం, సామాజిక ఒత్తిళ్ల వంటి కారణాలతో కొందరు తల్లిదండ్రులు పిల్లలను వదిలేస్తున్నారు. అయితే పరిస్థితులు ఎంత క్లిష్టంగా ఉన్నా పసికందులను ముళ్లపొదల్లో, కాలువల్లో, రోడ్ల పక్కన వదిలేయడం మానవత్వానికి విరుద్ధమని ఆయన స్పష్టం చేశారు. ఇలాంటి కుటుంబాలను గుర్తించి కౌన్సెలింగ్, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ సమాజం కూడా బాధ్యత తీసుకుని ఇలాంటి ఘటనలను అరికట్టేందుకు సహకరించాలని కోరారు. జిల్లా బాలల సంరక్షణ అధికారి పి. దినేష్‌కుమార్ మాట్లాడుతూ, ఏ కారణంతోనైనా పిల్లలను పెంచే పరిస్థితి లేకపోతే నిర్జన ప్రాంతాల్లో వదిలేయకుండా నేరుగా ఒంగోలులోని ప్రభుత్వ శిశుగృహానికి సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అధికారులు స్వయంగా వెళ్లి చిన్నారులను సురక్షితంగా తీసుకువచ్చి వైద్యం, సంరక్షణ, పునరావాసం కల్పిస్తారని తెలిపారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచుతామని చెప్పారు. రైల్వే స్టేషన్లు, బస్టాండ్లలో బాలల రక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దత్తత తీసుకోవాలనుకునే దంపతులకు నిబంధనల ప్రకారం అన్ని అర్హతలు పరిశీలించి చట్టబద్ధంగా పిల్లలను అప్పగించే విధానం అమల్లో ఉందన్నారు. ఇలాంటి ఘటనలను అరికట్టాలంటే అవగాహన కార్యక్రమాలతో పాటు గర్భిణులకు మానసిక, వైద్య, ఆర్థిక సహాయం అందించాల్సిన అవసరం ఉంది. ప్రతి పసికందుకి జీవించే హక్కు ఉందని, వారిని కాపాడడం కుటుంబాలకే కాకుండా సమాజం మొత్తం బాధ్యత అని అధికారులు, బాలల హక్కుల కార్యకర్తలు స్పష్టం చేస్తున్నారు.

# కోట్ల విలువైన భూమి కాజేయాలన్న కుట్ర భగ్నం

- భూకబ్జా ముఠా గుట్టురట్టు.. 8 మంది అరెస్టు
- మిగిలిన నిందితులను త్వరలో అరెస్టు చేస్తాం
- శ్రీకాకుళం జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి



**శ్రీకాకుళం, జులై 19 ప్రభాతవార్త:** శ్రీకాకుళం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో సుమారు రూ.3 నుంచి రూ.4 కోట్ల విలువైన ఖాళీ స్థలాన్ని నకిలీ పత్రాలు, తప్పుడు మరణ ధ్రువీకరణ పత్రాలు, నకిలీ వారసత్వ ధ్రువీకరణ పత్రాల ఆధారంగా అక్రమంగా స్వాధీనం చేసుకునేందుకు కుట్ర పన్నిన భూకబ్జా ముఠా గుట్టును శ్రీకాకుళం రూరల్ పోలీసులు ఛేదించారు. ఈ కేసులో ఇప్పటివరకు 8 మంది నిందితులను అరెస్టు చేసి న్యాయస్థానం ముందు హాజరు పరిచినట్లు జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి ఆదివారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఎ1 అడబాల రజని, ఎ2 తెలుగు సతీష్ కుమార్, ఎ3 సలిపిల్లి లక్ష్మణరావు, ఎ4 త్రినాథ్, ఎ5 తమ్మినేని వెంకటశ్రీరామ చిరంజీవి నాగనాని, ఎ6 తమ్మినేని సీతారాం (మాజీ స్పీకర్), ఎ7 తమ్మినేని వాణి, ఎ8 ముదాడ్ల ఉపేంద్ర కుమార్, ఎ9 జెగురిపాటి ఉపేంద్ర రావు, ఎ10 మామిడి గోపాలకృష్ణ, ఎ11 సాంబాన సాంబశివరావు, ఎ12 కూన పెద్దిరాజు, ఎ13 బొడ్డేపల్లి అరుణ (ప్రస్తుత సబ్ రిజిస్ట్రార్, హిరమండలం) ఈ కేసులో మొత్తం ఈ 13 మంది నిందితుల ప్రమేయం ఉన్నట్లు దర్యాప్తులో గుర్తించినట్లు తెలిపారు.

**అరెస్టు చేసిన నిందితులు:** అడబాల అండవరపు రజని, తెలుగు సతీష్ కుమార్, సాలిపిల్లి లక్ష్మణరావు, ముదాడ్ల ఉపేంద్ర కుమార్, జెగురిపాటి ఉపేంద్రరావు, మామిడి గోపాలకృష్ణ, సాంబాన సాంబశివరావు, కూన పెద్దిరాజు (డాక్యుమెంట్ రైటర్). ఇతర నిందితులపై దర్యాప్తు కొనసాగుతోందని, మిగిలిన నిందితులను త్వరలోనే అరెస్టు చేస్తామని ఎస్పీ తెలిపారు.

**కేసు వివరాలు:** 1988, 1992 సంవత్సరాల్లో చాపురం గ్రామ పంచాయతీ, బలగ పరిధిలోని సర్వే నంబర్ 35/13లో ఉన్న (84,85,86) ప్లాట్లను ఫిర్యాదుదారుడి తండ్రి తండ్రీకట్ట కనక లింగేశ్వరరావు చట్టబద్ధంగా కొనుగోలు చేశారు. ఉద్యోగరీత్యా హైదరాబాద్‌లో నివసిస్తున్న కారణంగా స్థలం చాలా కాలంగా ఖాళీగా ఉండటాన్ని ఆసరాగా చేసుకుని కొందరు వ్యక్తులు ముందస్తు పథకం ప్రకారం దానిని కబ్జా చేసేందుకు కుట్ర పన్నారు. ఆ కుట్రలో భాగంగా అసలు యజమాని జీవించి ఉన్నప్పటికీ మరణించినట్లు నకిలీ మరణ ధ్రువీకరణ పత్రాన్ని సృష్టించి, దాని ఆధారంగా నకిలీ కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రం తయారు చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. అనంతరం తప్పుడు రిజిస్ట్రేషన్ పత్రాలను రూపొందించి కోట్ల రూపాయల విలువైన భూమిపై యాజమాన్య హక్కు చెలాయించేందుకు ప్రయత్నించినట్లు పోలీసులు తెలిపారు. స్థలానికి ప్రహరీ నిర్మించే ప్రయత్నాన్ని అసలు యజమాని కుటుంబ సభ్యులు అడ్డుకోవడంతో వారు పోలీసులను ఆశ్రయించారు.

దర్యాప్తులో నకిలీ పత్రాల తయారీ, తప్పుడు వారసత్వం సృష్టించడం, తప్పుడు రిజిస్ట్రేషన్ తదితర అంశాలు వెలుగులోకి వచ్చినట్లు ఎస్పీ తెలిపారు. ఫిర్యాదులో పేర్కొన్న ఆరోపణల ప్రకారం, ఎ1 నుండి ఎ4 వరకు ఉన్న నిందితులు ఎ5, ఎ6, ఎ7 సహకారంతో ఎ12 ద్వారా తప్పుడు పత్రాలను తయారు చేయించారని ఆరోపించబడింది. అనంతరం ఎ1కు ఎ8 నుండి ఎ11 వరకు ఉన్న వ్యక్తులతో పరిచయం ఉన్నట్లు చూపించి, వారి పేర్లతో పత్రాలను సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. అలాగే ఎ13 పై నిందితులందరికీ సహకరిస్తూ, సంబంధిత ఆస్తికి తప్పుడు రిజిస్ట్రేషన్ జరిగేలా సహకరించినట్లు ఫిర్యాదులో ఆరోపించారు. నేర కుట్ర దర్యాప్తులో ఎ5 తమ్మినేని వెంకట శ్రీరాములు చిరంజీవి నాగనాని, ఎ6 తమ్మినేని సీతారాం (మాజీ స్పీకర్), ఎ7 తమ్మినేని వాణిలు ఇతర నిందితులతో కుమ్మక్కై, దురుద్దేశపూర్వకంగా తప్పుడు, నకిలీ పత్రాలను సృష్టించి సుమారు రూ.3 కోట్ల విలువైన ఖాళీ స్థలాలను అక్రమంగా కబ్జా చేసేందుకు ప్రయత్నించినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలిందని వెల్లడించారు. నకిలీ రబ్బరు స్టాంపులు, ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

**ప్రజలకు సూచన:** భూములు కొనుగోలు చేసే ముందు భూ రికార్డులు, యాజమాన్య పత్రాలు, వారసత్వ ధ్రువీకరణ పత్రాలు, రిజిస్ట్రేషన్ వివరాలను సంబంధిత ప్రభుత్వ శాఖల ద్వారా తప్పనిసరిగా పరిశీలించుకోవాలని సూచించారు. రూ.5 లక్షలకు మించిన భూ లావాదేవీలను పాన్ కార్డు వివరాలతోనే నిర్వహించాలని తెలిపారు. నకిలీ పత్రాల సృష్టి, ప్రభుత్వ రికార్డుల తారుమారు, భూ కబ్జా వంటి నేరాలకు పాల్పడే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**ప్రతిభకు ప్రశంస:** ఈ కేసును ఛేదించడంలో కీలకంగా పనిచేసిన శ్రీకాకుళం టౌన్ డిఎస్పీ సి హెచ్ వివేకానంద పర్యవేక్షణలో శ్రీకాకుళం రూరల్ సిఐ పైడపు నాయుడు, ఎస్ఐ సురేష్, ఆమదాలవలస ఎస్ఐ బాలరాజు, శ్రీకాకుళం వన్‌టౌన్ ఎస్ఐ హరికృష్ణతో పాటు దర్యాప్తులో పాల్గొన్న పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వర రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

# అదే జరిగితే.. మరి కోలుకోలేం

- యుటిలిటీ స్థలాన్ని సేకరించాలని కలెక్టర్ ఆదేశాలు
- రణస్థలం జాతీయ రహదారిపై 'సేకరణ' ముప్పు
- రోడ్డున పడతామని బాధితుల తీవ్ర ఆందోళన
- భూమి సేకరించేందుకు హైవే అధికారులు సన్నాహాలు





**రణస్థలం (శ్రీకాకుళం జిల్లా), జులై 19 ప్రభాతవార్త:** శ్రీకాకుళం జిల్లాలో రణస్థలం మండల కేంద్రం జెఆర్‌పురం 16వ జాతీయ రహదారిపై జరుగుతున్న ఫ్లైఓవర్ పనులు స్థానిక వ్యాపారులు, నివాసితులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఏడాదిన్నర క్రితం వంతెన నిర్మాణం కోసం హైవే అధికారులు రహదారికి అడ్డంగా ఉన్న పలు నిర్మాణాలను తొలగించిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో సర్వం కోల్పోయిన బాధితులు ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న తరుణంలో తాజాగా శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ స్వప్నల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కెవి మహేశ్వరరెడ్డి ఫ్లై ఓవర్ పనులను పరిశీలించారు. కలెక్టర్ స్వప్నల్ దినకర్ పుండ్కర్ హైవే అధికారులకు ఇచ్చిన ఆదేశాలతో మండల కేంద్రంలోని స్థానిక వ్యాపారులు, నివాసితులను తీవ్ర భయాందోళనలకు గురిచేస్తున్నాయి. తొలుత జాతీయ రహదారికి ఇరువైపులా విద్యుత్ స్తంభాలు, పైప్‌లైన్లు వంటి వసతుల కోసం హైవే అధికారులు కొంత స్థలాన్ని 'యుటిలిటీ కారిడార్' నిమిత్తం కేటాయించారు. దీనివల్ల తమకు కొంతైనా ఊరట లభిస్తుందని, చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునే వీలుంటుందని స్థానికులు భావించారు. అయితే ఇటీవల ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ యుటిలిటీ కారిడార్ స్థలాన్ని కూడా సేకరించాలని హైవే అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. యుటిలిటీ కారిడార్ స్థలాన్ని కూడా సేకరించేందుకు హైవే అధికారులు సిద్ధమైపోతున్నారు. దీంతో మరి కోలుకోలేమని ఇటు నివాసితులు అటు వ్యాపారులు నైరాశ్యం చెందుతున్నారు.

**రోడ్డున పడే స్థితిలో చిరు వ్యాపారులు:** కలెక్టర్ ఆదేశాలతో చిరు దుకాణదారుల పరిస్థితి ఆందోళనకరంగా మారింది. గత ఏడాదిన్నర నుంచి జరుగుతున్న ఫ్లై ఓవర్ నిర్మాణ పనుల కారణంగా చాలా నష్టపోయామని, మళ్లీ స్థల సేకరణ చేస్తే ఉపాధి కూడా ఉండదని రోడ్డుపై బతుకుతున్న వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఉపాధి కోల్పోతున్న ఫుట్‌పాత్ వ్యాపారులు:** రహదారి పక్కన చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న సుమారు ఆరు రకాల ఫుట్‌పాత్ వ్యాపార వర్గాలు ఈ నిర్ణయంతో పూర్తిగా ఉపాధి కోల్పోయే పరిస్థితి వచ్చింది. తమ పొట్ట కొట్టవద్దంటూ వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**బాధితుల డిమాండ్:** అభివృద్ధి పేరుతో మమ్మల్ని పూర్తిగా రోడ్డున పడేయడం న్యాయం కాదు. అధికారులు పునరాలోచించి, మాకు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు చూపించాలి లేదా జీవనోపాధి దెబ్బతినకుండా చర్యలు తీసుకోవాలి. అభివృద్ధి పనులు జరగాల్సిందే అయినా, దానికి పేద, మధ్యతరగతి ప్రజల జీవితాలు బలి కాకూడదని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై జిల్లా యంత్రాంగం, హైవే అధికారులు మానవీయ కోణంలో స్పందించి, తమకు న్యాయం చేయాలని రణస్థలం నివాసితులు, వ్యాపారులు వేడుకుంటున్నారు.

20-7pg4_20-7pg4.qxd 19/Jul/26 10:44 PM Page 1




సజ్జనుడి జీవితం ఎలా ఉత్తమమవుతుంది అంటే ప్రేమతో, దయాగుణంతో అతను చేసే చిన్న చిన్న పనుల వల్లనే.

న- గ్లిబ్బర్

# బ్రెయిన్‌డ్రెయిన్ తప్పదా!

ఎన్నో అంతరిక్ష ప్రయోగాలను ఎంతో అవలీలగా ప్రయోగించి విజయవంతమైన చరిత్ర సృష్టించిన 'ఇస్రో' అంతరిక్షా ప్రయోగ కేంద్రం ఈ మధ్యకాలంలో ఎందుకో చతికిలపడిపోయింది. చేసిన అన్ని ప్రయత్నాలూ ఫలించాలని లేదు. కానీ సమిష్టి కృషిగా శాస్త్రవేత్తలు ప్రయోగాలన్నీ సఫలత చెందితే దేశప్రతిష్ట పెరుగుతంది. కానీ ఇప్పుడు 'ఇస్రో'లో జరుగుతున్న కలవర పాటు సంఘటనలపై ప్రభుత్వాలు సైతం ఆందోళన చెందుతున్నట్లుగానే ఉంది. కానీ 'ఇస్రో' నుంచి శాస్త్రజ్ఞుల వలస గురించి ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్ నిజమేనని చెబుతూనే 'చాలా మంది శాస్త్రజ్ఞులు వెళ్తుంటారు, కొత్త వారు వస్తుంటారు' దాని గూర్చి ఎలాంటి ఆందోళన లేదని సమర్థించుకున్నారు. ఇస్రోలో దాదాపు 14,600 మంది ఉద్యోగులుండగా అందులో 100-120 మంది నిష్క్రమించడాన్ని అతి తక్కువే కదా! అని అనుకోలేం. ఇస్రో చేపట్టిన ప్రతిష్టాత్మక ప్రాజెక్టుల్లో భాగమైన వారు తాజాగా ఆప్రయోగాల నుంచి తప్పించుకుంటున్నారు. రాజీనామాలు చేసి బయటకు వెళ్లిపోతున్నాడు. మంచి అవకాశం ఎక్కడుంటే అక్కడికి వెళ్లి పోవడాన్ని ఎవరూ కాదనలేరు. కానీ తమ ఉపాధిని పెంచుకునే అవకాశమున్నప్పుడు వాటిని త్రోసిరాజని ఎందుకు వెళ్లిపోతున్నారో తెలుసుకుని వాటికి అడ్డుకట్ట వేయలేకపోతే ఇలాంటి సంస్థల మనుగడకే కష్టం. శాస్త్రజ్ఞుల వరుస రాజీనామాలు, స్వచ్ఛంద పదవీ విరమణలనగానే సంస్థ పట్ల వారిలో ఏదో అసంతృప్తి ఉందనే అనుకోవాలి. మరో ప్రైవేట్ సంస్థల్లో హెచ్చు జీతానికే మంచి హోదాలో వెళ్లడమంటే ఒక విధంగా వారికి మంచిదే కావచ్చు. కానీ అంతర్జాతీయంగా అంతరిక్ష పరిశోధనలకు పేరుగాంచిన 'ఇస్రో' నుంచి 'బ్రెయిన్ డ్రెయిన్' మంచిది కాదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇదొక ఆందోళనకర విషయం. గగన్‌యాన్, చంద్రయాన్-4, లాంటి చారిత్రక ప్రాజెక్టులు అత్యున్నత కీలక దశలో ఉండగా నూరు మందికి పైగా శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, రాజీనామా చేశారని లేదా స్వచ్ఛంద పదవీ విరమణ తీసుకున్నారన్న వార్తలు రావడంతో కేంద్రం తక్షణ చర్యలు తీసుకొంది. శాస్త్రజ్ఞుల రాజీనామాలను ఆమోదించే ప్రక్రియను కఠినతరం చేసింది. ఈ విషయమై జూలై 14న అంతరిక్ష పరిశోధనా విభాగం రాజీనామాలపై ప్రత్యేక మెమొరాండం జారీ చేసింది. జాతీయ ప్రాధాన్యత ప్రాజెక్టుల్లో పనిచేసే గ్రూప్‌ఎ సైంటిఫిక్, టెక్నికల్ సిబ్బంది రాజీనామా, స్వచ్ఛంద పదవీ విరమణ దరఖాస్తులను నేరుగా కేంద్రానికి పంపేపద్ధతి ఇకపై నివారించబడినట్లు దాని సారాంశం. ప్రతి దరఖాస్తును నేరుగా అతరిక్ష పరిశోధనా శాఖకే చేరాలి. 'ఇస్రో'కు సంబంధించిన అత్యధిక రాజీనామాలు బెంగళూరులోని యు.ఆర్.ఆరావు శాటిలైట్ కేంద్రం నుంచి 80 మంది తిరువనంతపురం స్పేస్ సెంటర్ నుంచి 20మంది ఉన్నారు. అలా వెళ్లిన వారిలో భారత అంతరిక్ష పరిశోధనల్లో కీలకమైన ఎల్‌విఎం 3 ప్రాజెక్టు డైరెక్టర్, స్పాడెక్స్ ప్రాజెక్టు డైరక్టర్, చంద్రయాన్-3 సిమ్యూలేషన్ మేనేజరు ఒకేసారి రాజీనామా చేసి వెళ్లిపోతే అంతరిక్ష పరిశోధనా సాంకేతిక బదిలీ విషయాలలో 'ఇస్రో' మిషన్‌ల కొనసాగింపుపై ప్రభావంపడుతుంది. కారణాలు విశ్లేషించుకుంటే ప్రైవేట్ రంగం లో అంతరిక్ష కేంద్రాలకు అనుమతులివ్వడంతో స్కైరూట్ అగ్నికుల్, పిక్సెల్, ధ్రువస్పేస్ లాంటి 400 స్టార్టప్‌లు వచ్చి చేరాయి. అక్కడ ఉద్యోగులకు ఇస్రో శాస్త్రజ్ఞుల కన్నా 2,3 రెట్లు వేతనం లభిస్తుంది. అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ (నాసా)లో శాస్త్రవేత్తల సగటు వేతనం 80వేల డాలర్ల నుంచి1.5లక్షల డాలర్ల దాకా ఉంటుంది. అంటే ఇండియన్ కరెన్సీలో రూ.77 లక్షల నుంచి 1.4 కోట్ల దాకా ఉంటుంది. ఇస్రోల సీనియర్ సైంటిస్టుల జీతాలు సైతం సగటు సీనియర్ సాఫ్ట్‌వేర్ ఇంజినర్ల వేతనాల కన్నా తక్కువే. ఈ కారణం చేతనే ఐఐటియన్లు 'ఇస్రో'లో చేరడానికి ఇష్టపడడం లేదు. 2023లో ఇండియన్ స్పేస్ పాలసీ తెచ్చాక వేతనాల విషయంలో వ్యత్యాసాల వలన శాస్త్రజ్ఞులకు కొత్తఆధారం దొరకడంతో వారు'ఇస్రో'ను వదిలి వెళ్తున్నట్లు భావించవచ్చు. స్టాక్ ఆప్షన్, పెక్సిబిలిటీకి అవకాశం ఉంది. 2025లోనే ప్రైవేట్ స్పేస్ స్టార్టప్‌లలో 15కోట్ల డాలర్ల పెట్టుబడి వచ్చింది. ప్రభుత్వ వ్యవస్థలో ప్రమోషన్లు నెమ్మదిగా వస్తాయి. ప్రైవేట్ వేగంగా నిర్ణయాలే కాకుండా ఆధునిక టెక్నాలజీపై పనిచేసే అవకాశాలుంటాయి. ఇస్రో 'బ్రెయిన్ డ్రెయిన్' ఇవాళ్టిది కాదు. 2004-2005లో 392 మంది శాస్త్రవేత్తలు బయటికి వెళ్లిపోయారు. అప్పట్లో ఈ అంశం పరిశీలనలోకి వచ్చినా కేవలం ఐటిరంగం విస్తృతి, ప్రైవేట్ రంగ జీతాలేనని ప్రభుత్వం పార్లమెంటులోనే విశ్లేషించి చెప్పింది. నిజానికి శాస్త్రజ్ఞులు వెళ్లకుండా తాత్కాలికంగా ఆపవచ్చేమో కానీవిజ్ఞాన విస్తృతిని ఆపేపరిస్థితి ఉండదు. అందుచే వారికి మెరుగైన అవకాశాలను కేంద్రప్రభుత్వమే కల్పించాలి. అలాంటప్పు డు మాత్రమే శాస్త్రజ్ఞులు, ఇంజినీర్లు ప్రభుత్వ సంస్థలను వదిలివెళ్లే అవకాశం తక్కువగా ఉంటుంది. భారీ జీతాల మాటెలా ఉన్నా, రిసెర్చ్ గ్రాంట్లు, ఫాస్ట్‌ట్రాక్ ప్రమోషన్లు, ప్రాజెక్టు లీడర్‌షిప్ అవకాశాలు కల్పించడం అవసరం. ఇస్రోలో శిక్షణ పొందిన వారు ప్రయివేట్ రంగానికి వెళ్లడం ద్వారా మొత్తం భారత అంతరిక్ష ఎకో సిస్టమ్ బలపడుతుంది.'ఇస్రో'లో అంతరిక్ష నౌకల ప్రయోగాల అనంతరం ప్రపంచం భారత్‌వైపు చూస్తోంది. ఇలాంటి సమయంలో ప్రతిష్టాత్మక సంస్థల నుంచి బ్రెయిన్ డ్రెయిన్ సమర్థనీయం కాదు. వాళ్లుప్రైవేట్ అంతరిక్ష సంస్థలకు వెళ్లిపోకుండా తగు నిర్ణయాలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంమీద ఉంది. శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు ఆకాంక్షలను ప్రభుత్వం గౌరవించాలి.

మాటకు మాట ప్రతీకారం కాదు, మౌనమే దానికి సమాధానం.



ప్లేటో

జ్ఞానం వంశపారంపర్య హక్కు కాదు. ఎవరికి వారు కష్టపడి ఆర్జించుకోవాల్సిందే.



వివేకానంద

# ప్రజావాక్కు



### దేవుళ్ళకు కూడా జబ్బులు వస్తాయా?

ప్రపంచవ్యాప్తంగా శాస్త్రీయవిజ్ఞానంవికస్తుంది. మన దేశంలో మాత్రం ఆవుపేడలో మహిమలు, ఆవు మూత్రంలో రోగ నిరోధకశక్తి ఎంతశాతం ఉందో చూడమని యూనివర్శిటీలకు ప్రభుత్వాలు ఆదేశాలు ఇస్తున్నాయి. పూరి జగన్నాథ స్వామికి ప్రతిసంవత్సరం రథోత్సవం జరుగుతుంది. పదిలక్షల భక్తులువస్తారని ప్రచారం. రథం తాడు పట్టుకొని లాగితే పుణ్యమం అని ఎగబడతారు భక్తులు. తొక్కిసలాటలో ప్రతి సంవత్సరం కొంతమంది చనిపోవటం జరుగుతుంది. నిన్న ఇద్దరు భక్తులు చనిపోయారని అధికారిక వార్త. వాస్తవంగా ఎంత మంది చనిపోయింది తెలియదు. రథోత్సవం సమయంలో డాక్టర్లు పూరిజగన్నాధుని విగ్రహాలకు జ్వరం అన్నట్లుగా, విగ్రహాలకు డాక్టర్లు సెటాస్కోప్ పెట్టి పరీక్షలు జరపడం ప్రపంచంలో ఒక వింతగా చెప్పుకోవచ్చు. దేవుళ్ళకు కూడా మనుషులుగా గుండె కొట్టు కోవటం, నాడీచూడటం ,జరం రావటం దగ్గ జలుబు చేస్తాయా? ఒకవేళ వస్తే మనుషులు తయారు చేసిన మందులు పనిచేస్తాయా?

- నార్నె వెంకట సుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### పరుగులు తీస్తున్న ఏఐ

కృత్రిమ మేధస్సువేగంగా అభివృద్ధి చెందుతున్న ఈ యుగంలో అసలు ప్రశ్నయంత్రాలు మనుషుల్లా ఆలోచించగలవా అనేదికాదు. భూమి, నీరు,పర్యావరణ వ్యవస్థల పరిరక్షణలో మెరుగైన నిర్ణయాలు తీసుకునేందుకు అవి ఎంతవరకు తోడ్పడగలవన్నదే ప్రధాన అంశం. సాంకేతికత లక్ష్యం కేవలం పనులను సులభతరం చేయడం మాత్రమే కాకుండా,ప్రజల జీవనప్రమాణాలను మెరుగుపరచడం, ప్రకృతి సంపదను కాపాడడం కూడా కావాలి. పెరుగుతున్న నగరీకరణ నేపథ్యంలో హైదరాబాద్ వంటి మహానగరాలకు కృత్రిమమేధస్సు ఎంతో ఉపయోగపడుతుంది. ఏఐను నిర్ణయాధికారిగా కాకుండా, మానవ మేధస్సుకు సహాయక సాధనంగా ఉపయోగించాలి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### రైళ్ల రంగు మార్చాలి

మనుషులకు హెచ్చరికలు తెలిపే బోర్డులు పెట్టగలం కానీ మరి పశువులకు ఎట్లా తెలిసేది? వందే భారత్ రైళ్ల వెలుపలి భాగాలు ముఖ్యంగా తెలుపు లేతనీలం, తెలుపు కాషాయ రంగుల్లో ఉంటున్నాయి. రైలు దూరం నుంచే ప్రస్ఫుటంగా కనపడేటట్లు ఉండాలి. ఎరుపు, ఆకుపచ్చ, నీలం, గోధుమరంగుఛాయతో,ఎరుపు రంగులు వాడాలి.

### మత్స్యకారుల బలవన్మరణాలను నిరోధించాలి

ఈ మధ్య విశాఖ తీరంలో పడవబోల్తాపడి ఏడుగురు మత్స్యకారులు గల్లంతవ్వటం ఎంతో బాధాకరం. నేడు ఎల్‌నినో వంటి కారణాలతో వాతావరణ శాఖ కూడా పసికట్టలేనంతగా పర్యావరణం ఆకస్మిక మార్పులకు లోనవుతుంది. అల్ప పీడనం వల్ల భారీ వర్షాలు అని ప్రకటించిన చోట కూడా కొన్ని సార్లు చిన్నజల్లు పడకపోవటం తెలిసిందే. కనుక నేటి వింత వాతావరణ స్థితిని దృష్టిలో పెట్టుకొని, యుద్ధ క్షేత్రంలో సైనికులు సదా సాయుధులై అనుక్షణం సర్వసన్నద్ధంగా వుంటున్న విధంగా, వేటకి వెళ్ళే ప్రతి మత్స్యకారుడు లైఫ్ జాకెట్ ధరించి జాగరూకులై వుండాలి. ఈ ప్రమాదం నుండి బయటపడినమరోమత్స్యకారుడు,తనకు వేరేనౌకలోని చైనా సిబ్బంది విసిరిన లైఫ్‌జాకెట్ వల్ల ప్రాణాపాయం తప్పిందని చెప్పాడు. కనుక లైఫ్ జాకెట్ వుంటే ఆపదలో, ప్రాణాలు దక్కుతాయి. ఈ లైఫ్ జాకెట్ ధర కేవలం మూడు వేలరూపాయల లోపేనట. ప్రాణం కన్నా విలువైనది ఏమీ లేదు. కేవలం నష్ట పరిహారంతో పోయిన ప్రాణాలు తిరిగిరావు. కనుక చేతులు కాలాక ఆకులు పట్టుకునే కంటే ముందు జాగ్రత్త వుండాలి.

- తిరుమలశెట్టి సాంబశివరావు, గుంటూరు

### చర్యలు చేబట్టాలి

దేశవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల సంఖ్య తగ్గుతుంది. ప్రైవేటు విద్యా సంస్థల్లో విద్యార్థుల సంఖ్య ఏటా పెరుగుతుంది. దేశవ్యాప్తంగా ఎక్కువ ప్రాంతాల్లో తల్లిదండ్రులు తమ పిల్లల్ని ప్రైవేటు విద్యా సంస్థల్లో చేర్పించేందుకే మొగ్గు చూపుతున్నట్లు కేంద్ర విద్యా శాఖ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ప్రభుత్వ విద్యా సంస్థల్లో పిల్లల సంఖ్య తగ్గుతుండటంపై కారణాలను లోతుగా విశ్లేషించి, అధికారులు తగిన చర్యలు చేబట్టాలి.

- మా. శ్రీ. రాజు, పాల్వంచ

### మంచి నిర్ణయమే..

తమిళనాడు ప్రభుత్వం ప్రార్థనాలయాలు, విద్యాసంస్థలు, బస్టాండ్ల సమీపంలో ఉన్న మద్యందుకాణాలను తొలగించేందుకు తీసుకున్న నిర్ణయం ప్రశంసనీయమైనది. ఇటువంటి చర్యలు విద్యార్థులకు,ప్రజలకు ప్రశాంతమైన వాతావరణాన్ని కల్పించడంలో దోహదపడతాయి. ఆధ్యాత్మిక కేంద్రాల పవిత్రతను, విద్యాలయాల గౌరవాన్ని కాపాడే ఈ విధానాన్ని ఇతర రాష్ట్రాలు కూడా పరిశీలించి అమలు చేస్తే సమాజ శ్రేయస్సుకు మరింత తోడ్పాటు అందుతుంది. సమాజంలో సానుకూల ఆలోచనలు, మంచివిలువలను ప్రోత్సహించేంచాలి.

-ఎన్. కృష్ణ, హైదరాబాద్

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి | ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

# రైల్వేలో తెలుగు రాష్ట్రాలకు అన్యాయమే!

**ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలో పేర్కొన్నట్టుగా ఎట్టకేలకు విశాఖపట్నంలో సౌత్ కోస్ట్ రైల్వేజోన్ పేరు కొత్త రైల్వేజోనల్ కార్యాలయం ఏర్పాటు చేసిన నేపథ్యంలో ఆంధ్రరాష్ట్రానికి చెందిన అనేక రైల్వే స్టేషన్లు, అనేక రైలు మార్గాలు ఇతర రైల్వే జోన్లలో కలపడం వల్ల తీవ్ర అన్యాయం జరిగింది. కొత్తగా ఏర్పాటు చేసిన జోనల్ కార్యాలయం సంగతి ఎలావున్నప్పటికీ తెలుగురాష్ట్రాలలో చేపట్టిన కొత్త రైలు మార్గాల నిర్మాణం దశాబ్దాలు గడుస్తున్నప్పటికీ పూర్తి కావడం లేదు. ఇదే సమయంలో నిన్నటి వరకు రెండు తెలుగు రాష్ట్రాలకు కలిపి సికింద్రాబాద్ కేంద్ర స్థానంగా వున్న సౌత్ సెంట్రల్ రైల్వే జోన్ ఆదాయంలో దేశం మొత్తంగా మూడవ స్థానంలో, దక్షి ణాది రాష్ట్రాలలో ప్రథమ స్థానంలో వుంది. అయినా నిధుల కేటాయింపులో తీవ్ర నిర్లక్ష్యానికి గురైంది. తెలుగు రాష్ట్రాలలో చేపట్టిన కొత్త రైల్వేలైన్ల నిర్మాణ పనులు వేగం గమనిస్తే నత్తలు నయమనిస్తున్నాయి.**



అన్నవరపు బ్రహ్మయ్య

రైల్వేశాఖలో తెలుగురాష్ట్రాలకు అడుగడుగునా అన్యాయమే జరుగుతోంది. ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలో పేర్కొన్నట్టుగా ఎట్టకేలకు విశాఖపట్నంలో సౌత్ కోస్ట్ రైల్వే జోన్ పేరు కొత్త రైల్వే జోనల్ కార్యాలయం ఏర్పాటు చేసిన నేపథ్యంలో ఆంధ్రరాష్ట్రానికి చెందిన అనేక రైల్వే స్టేషన్లు, అనేక రైలు మార్గాలు ఇతర రైల్వే జోన్లలో కలపడం వల్ల తీవ్ర అన్యాయం జరిగింది. కొత్తగా ఏర్పాటు చేసిన జోనల్ కార్యాలయం సంగతి ఎలావున్నప్పటికీ తెలుగురాష్ట్రాలలో చేపట్టిన కొత్త రైలు మార్గాల నిర్మాణం దశాబ్దాలు గడుస్తున్నప్పటికీ పూర్తి కావడం లేదు. ఇదే సమయంలో నిన్నటి వరకు రెండు తెలుగు రాష్ట్రాలకు కలిపి సికింద్రాబాద్ కేంద్ర స్థానంగా వున్న సౌత్ సెంట్రల్ రైల్వే జోన్ ఆదాయంలో దేశం మొత్తంగా మూడవ స్థానంలో, దక్షి ణాది రాష్ట్రాలలో ప్రథమ స్థానంలో వుంది. అయినా నిధుల కేటాయింపులో తీవ్ర నిర్లక్ష్యానికి గురైంది. తెలుగు రాష్ట్రాలలో చేపట్టిన కొత్త రైల్వేలైన్ల నిర్మాణ పనులు వేగం గమనిస్తే నత్తలు నయ మనిస్తున్నాయి. మాచర్ల నల్లగొండల మధ్య 92 కి.మీ.రైల్వే లైను నిర్మాణ పనులు 1997-98వ సంవత్సరంలో ప్రారం భం కాగా, కోటిపల్లినర్సాపూర్ మధ్య 57 కి.మీ.పిఠాపురం కాకినాడ మధ్య 22 కి.మీ. నూతన రైల్వే లైన్ నిర్మాణ పనులు 2001-02లో, కడప బెంగుళూరు మధ్య 255 కి.మీ. పనులు 2008-09 సంవత్సరంలో, నడికుడిశ్రీకాళాహస్తి మధ్య 308 కి.మీ., గూడురుదుర్గరాజపట్నం మధ్య 46 కి.మీ.ల పనులు 2011-12లో ప్రారంభమ య్యాయి. ఇక 2012-13లో భద్రాచలం రోడ్ కొవ్వూరు మధ్య 152 కి.మీ., కంభం ప్రొద్దుటూరు మధ్య 110 కి.మీ., కొండపల్లి కొత్తగూడెం మధ్య 120 కి.మీ. మేరకు కొత్త లైన్ల పనులు ప్రారంభించారు. అంటే ఈ పనులు చేపట్టి ఇప్పటికి 15 నుంచి 26 సంవత్సరాలు దాటుతున్నా నేటికి పూర్తి కాలేదు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వున్న సుందర ప్రాంతాలలో ఒకటైన కొనసీమ ప్రాంత ప్రజలకు ఎటువంటి రైలు ప్రయాణ సదుపాయం లేదు. కోటిపల్లి, నర్సాపూర్ల మధ్య 57కి.మీ. రైలు మార్గం నిర్మాణం పూర్తయితే కోనసీమ ప్రాంత ప్రజలకు రైలు ప్రయాణ సదుపాయం ఏర్పడుతుంది. నిర్మాణానికి సర్వేపూర్తి చేసిన సమయానికి అంటే 498కోట్ల రూపాయల ఖర్చు అవుతుందని అంచనావేశారు. నేడు అదే మార్గం నిర్మాణానికి కనీసం 1200 కోట్ల రూపాయలు అవుతుందని అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో అసలు 7 నూతన రైలు మార్గాలు పూర్తవుతాయా? లేదా అనే అనుమానం కలుగుతుంది. రైల్వేబోర్డు నిబంధనల ప్రకారం ప్రతిపాదిత కొత్తరైల్వే మార్గాల ఏర్పాటుకు అయ్యే వ్యయంలో కనీసం ఆరు శాతం ఆదాయం వచ్చే అవకాశం వుంటే చాలు, కానీ తెలుగురాష్ట్రాలలో ప్రతిపాదించిన ప్రతి కొత్త రైల్వే మార్గంలో 6 నుంచి 10శాతం ఆదాయం వస్తుందని అంచనా వేశారు. అయినప్పటికీ నిర్మాణ పనులకు అవసరమైన నిధులు కేటాయించడంలో నిర్లక్ష్యం ఎందుకువహి స్తున్నారో అర్థంకావడం లేదు. ఆంధ్రప్రదేశ్ పైన తెలిపిన నిర్మాణ పనులు కాకుండా కొత్తగా మరో 22మార్గాలలో నూతన రైల్వేలైన్ల ఏర్పాటుకు సంబంధించి



రెండు దశాబ్దాల కిందటే సర్వేలు పూర్తయ్యాయి. ఇక మార్కాపురం, శ్రీశైలం హైదరాబాద్‌ల మధ్య 290కి.మీ., మాచర్ల,గద్వాల్ మధ్య 184 కి.మీ. నెల్లూరు, రాజంపేట మధ్య 120కి. మీ., సామర్లకోట చింతూరుల మధ్య 150 కి.మీ., కళ్యాణదుర్గం అనంతపూర్ల మధ్య 58కి.మీ., భద్రాచలం,సత్తుపల్లి మధ్య 54.1 కి.మీ. మేరకు నూతనంగా రైల్వే లైన్లు వేయాలనే ప్రతిపాదనలు వచ్చాయి. కొత్త రైల్వేలైన్ల సర్వేలు, ప్రతిపాద నలు సిద్ధం చేసి పుష్కరకాలం దాటిపోయింది. ఈ ప్రతి పాదనలు కార్యరూపం దాల్చుతాయో లేదో ఎవరూచెప్పలేని స్థితి. కానీ కేవలం ఆరేళ్ల క్రితం తమిళనాడు రాష్ట్రంలో కొత్తగా ప్రారంభించిన 14 రైల్వే లైన్ల పనులు, కర్ణాటక రాష్ట్రంలో ప్రారంభించిన 18 పనులు పూర్తయ్యే దశకు చేరుకున్నాయి. మనకు స్వాతంత్ర్యం లభించిన 75 ఏళ్ల ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కొత్తగా నంద్యాల ఎర్రగుంట మధ్య 126 కి.మీ., కాకినాడ కోటిపల్లి మధ్య 45 కి.మీ., కృష్ణపట్నం ఓబులవారిపల్లి మధ్య 113 కి.మీ. మేరకు మాత్రమే వేశారు. (నిజానికి కాకినాడ కోటిపల్లి మధ్య వేసినది కొత్తలైను కాదు, రెండవ ప్రపంచ యుద్ధం సమయంలో దెబ్బతిన్న ఈ మార్గాన్ని పునరుద్ధరించారు.) కానీ ఇదే సమయంలో తమిళనాడులో కొత్తగా ఏడు లైన్లు, కర్ణాటకలో ఏడు లైన్లు పూర్తయ్యాయి. దీనిని బట్టి తెలుగు రాష్ట్రాలకు చెందిన పార్లమెంటు సభ్యుల పనితీరు ఏపాటిదో అర్థం అవుతోంది. ఇక ఆదాయం విషయానికి వస్తే రైల్వేలో అత్యధిక ఆదాయం సంపాదిస్తున్న రైల్వేజోన్లలో ఉభయ తెలుగు రాష్ట్రాలకు సంబంధించిన దక్షి ణ మధ్య రైల్వేమూడో స్థానం లో వుంది. దేశవ్యాప్తం వున్న (కొత్తగా ఏర్పడిన విశాఖ రైల్వే జోన్ కాకుండా)17 రైల్వే జోన్ల నుంచి 2024-25వ సంవత్సరంలో 2,65,0024 కోట్ల రూపాయలు ఆదాయం లభించగా ఇందులో 3,93288 కోట్ల రూపాయలఆదాయం తో ప్రయాగ కేంద్రస్థానంగా వున్న నార్త్ సెంట్రల్ రైలేజోన్ మొదటి స్థానంలో, 23,775,70 కోట్ల రూపాయల ఆదా యంతో భువనేశ్వర్లోని ఈస్టెక్స్ట్ జోన్ రెండో స్థానంలో, 23,344.20 కోట్ల రూపాయల ఆదాయంతో సికింద్రాబాద్ కేంద్రస్థానంగా వున్న సౌత్ సెంట్రల్ రైల్వే మూడో స్థానంలో వుంది. దక్షి ణాది రాష్ట్రాలలో అయితే ప్రథమ స్థానంలో వుంది. సౌత్ సెంట్రల్ జోన్ నుంచి ఇంత పెద్దమొత్తంలో ఆదాయం లభిస్తున్నప్పటికీ అభివృద్ధి పరంగా ఈ జోను నామమాత్రంగా కూడా నిధులు కేటాయించడం లేదు. కొత్త రైల్వే జోన్ ఏర్పాటు సందర్భంగా వివిధ కీలకమైన రైల్వే స్టేషన్లను విశాఖజోన్ పరిధిలోకి రాకుండా చేశారు. కొత్త జోన్ ఏర్పాటుకు ముందు విశాఖపట్నం డివిజన్ పరిధిలో వున్న కొత్తవలస అరకు వరకు వున్న రైలుమార్గం ప్రస్తుతం విశాఖ డివిజన్ నుంచి తప్పించి రాయఘడ్ డివిజన్ పరిధి లోకి చేర్చారు. ఈ కారణంగా పర్యటక కేంద్రాలైన అరకు, బొర్ర గుహల ద్వారా లభించే ఆదాయం కోల్పోవాల్సి వచ్చింది. తాజా విశాఖపట్నం జోన్ ఏర్పాటు సందర్భంగా ఆంధ్రప్రాంతంలో వున్న రాయచూర్ దాడి మధ్యంలో వున్న 108 కి.మీ. రైలు మార్గం, పగిడిపల్లి విష్ణుపురం జాన్ప హాడ్ మధ్య వున్న 142 కి.మీ.ల రైల్వేలైనులను గుంటకల్ నుంచి విడదీసి సికింద్రాబాద్ డివిజన్లో కలిపారు. అదేవిధం గా జగ్గయ్యపేట ప్రాంతంలోని సిమెంట్ ఫ్యాక్టరీల ద్వారా అధిక ఆదాయం లభించే మోటమర్రి జగ్గయ్యపేట మార్గాన్ని దగ్గరలో వున్న విజయవాడ డివిజన్కు బదులుగా సికింద్రాబాద్ డివిజన్లో వుంచారు. అంతేకాకుండా మన రాష్ట్ర పరిధిలోని దాదాపు 500 కి.మీ.ల రైల్వే లైన్లు ఇతర రాష్ట్రాలలో రైల్వే జోన్ల పరిధిలో కొనసాగుతున్నాయి. ఉదాహరణకి తడగూడూరు మధ్య వున్న 68 కి.మీ. రైల్వేలైను చెన్నయి కేంద్రంగా వున్న దక్షి ణ రైల్వేజోన్లో, ధర్మవరం హింతూపూర్ మధ్యవున్న 107 కి.మీ. రైల్వే లైను సౌత్ వెస్ట్రన్ రైల్వే జోన్లోని బెంగుళూరు డివిజన్లో వున్నాయి. అలాగే ఆంధ్ర ప్రాంతానికి చెందిన సూళ్లూరుపేట, నగరి ప్రాంతాలుసదరన్ రైల్వేలో, హిందూపూర్, పెనుగొండ, పుట్టపర్తి, హిందూ పూరు సౌత్ వెస్ట్రన్ రైల్వే జోన్లలో వున్నాయి. తాజా విశాఖ పట్నంకు అత్యంత చేరువలో వుండే శృంగవరపుకోట, అరకు అసెంబ్లీ నియోజకవర్గాలు రాయఘడ్ డివిజన్ పరిధిలో వున్నాయి. తెలుగు రాష్ట్రాలలో ప్రతిపాదించిన కొత్త రైలు మార్గాల పరిస్థితి దయనీయంగా వుంది. తెలుగురాష్ట్రాలలో నూతన రైలు

# దేశాభివృద్ధికి యువత నైపుణ్యమే పునాది

బి.మధుపాళి

ప్రపంచంలోని 8.2 బిలియన్ల జనాభాలో 15 నుంచి 24 ఏండ్ల వయస్సు కలిగిన యువత జనాభా1.22 బిలియన్లు (దాదాపు 15.4 శాతం) ఉన్నారు. అదే విధంగా ప్రపంచవ్యాప్తంగా 15 నుంచి 64 ఏండ్ల వయస్సు కలిగిన పని చేసే లేదా వర్కింగ్ క్లాస్ జనాభా 78 శాతం అనగా 6.4 బిలియన్లు ఉన్నారు. నేడు భారత జనాభా 1.46 బిలియన్లు ఉన్నది. ఇందులో 15 నుంచి 29 ఏండ్ల యువత జనాభా 40శాతం వరకు ఉన్నది. మన దేశంలో 15 నుంచి 64 ఏండ్ల వయస్సు కలిగిన పని చేసే లేదా వర్కింగ్ క్లాస్ జనాభా 96.1కోట్లు (లేదా 0.961 బిలియన్లు), అనగా 68 శాతం వరకు ఉన్నది. ఇండియాలో 15 ఏండ్లలోపు జనాభా 24 శాతం, 64 ఏండ్లు దాటిన వారి జనాభా 7శాతం వరకు ఉన్నది. ఇతర దేశాలతో పోల్చితే భారత జనాభా సగటు వయస్సు చాలా తక్కువగా 28.8 ఏండ్లు మాత్రమే ఉన్నది. జపాన్ ప్రజల సగటు వయస్సు 49.9 ఏండ్లు ఉన్నది. అందువల్లనే 'ఇండియాను యువ భారత్' అని, జపాన్‌ను 'ఓల్డ్ జపాన్' అని పిలుస్తున్నాం. యువ జనాభా అధికంగా ఉండడం వల్ల రాబోయే రోజుల్లో విశ్వదేశాల్లో భారత్ ముందుండి తన సత్తాను గట్టిగా చాటుకోనున్నది. యువత అధికంగా ఉండడంతో పాటు ఆ యువత నైపుణ్య విద్యను పొందితే భారత భవిత ఉజ్వలంగా ఉండనుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. అధిక యువ జనాభా కలిగిన యువ భారతాన్ని పలు సవాళ్లు కూడా వెంటాడుతున్నాయి. నేడు పరిశ్రమ ఆశిస్తున్న నైపుణ్యాలకు, నేటి మన యువత కలిగి ఉన్న నైపుణ్యాలకు మధ్య వ్యత్యాసం లేదా గ్యాప్ అధికంగా ఉండడంతో మన యువశక్తి దేశాభివృద్ధికి అంతగా వినియోగపడడం లేదు. యువతలో అవసర నైపుణ్యాలు కొరవడితే



నిరుద్యోగం పెరగడం, తక్కువస్థాయి ఉద్యోగాలు చేయడం లాంటి ప్రతికూల ఫలితాలు వెక్కిరిస్తున్నాయి. తగిన నైపుణ్యాలు లేని యువతతో నిరుద్యోగసమస్యలు పెరిగి సమ్మిళిత ఆర్థిక అభివృద్ధి, సమానత్వ భావనలు పలుచబడతాయి. పౌర సమాజ సుస్థిరాభివృద్ధికి, ఆరోగ్యకర సమాజ స్థాపనకు నైపుణ్య యువత మాత్రమే పునాది అవుతారు. బహుళ జాతి కంపెనీలు (ఎంఎన్‌సిలు) లేదా పరిశ్రమలు కోరుతున్న నైపుణ్యాలను నేటి విద్యాలయాలు బోధిస్తూ, తగు శిక్షణలు ఇవ్వాలి. నేడు ప్రపంచం 4వ పారిశ్రామిక విప్లవం సాకారం కావడానికి 'ఏఐ, సాంకేతిక, వృత్తి విద్య శిక్షణ' రంగాలు నడుం బిగిస్తే నేటి యువత రేపటి పరిశ్రమలో పనిచేయడానికి సిద్ధం అవుతారు. నేడు ఏఐరంగం ప్రపంచాన్ని శాసిస్తున్నది. మన జీవితాలు, లెర్నింగ్, చేసే పనులను ఏఐ నిర్ణయించనున్నది. పరిశ్రమ కోరుకున్న నైపుణ్యాల్లోమాత్రమే మన యువతను సదాసిద్ధంచేయాలి. నైపుణ్య యువతతో సమాజ శాంతి,సమ్మిళిత సుస్థిరాభివృద్ధి సుసాధ్యం అవుతాయని నేటి విద్యాలయాలు, ప్రభుత్వాలు, యువత, పౌర సమాజం, పాలసీ తయారు చేసే వారు గట్టిగా నమ్మాల్సిన అగత్యంఏర్పడింది. ఉత్తమవృత్తి శిక్షణ, ఏఐ నైపుణ్యాల్లో వృద్ధి, డిజిటల్ సాధికారత వంటి అంశాల్లో యువత దృష్టి పెట్టాలి. మార్కెట్ అవసరాలకు అనుగుణంగా మన చదువులు కొనసాగాలి. ఉత్తమ శ్రేణి బోధనలు, అవసర మౌలిక వసతులు, నైపుణ్యాల వృద్ధికి తగిన నిధులను వెచ్చించడం, నాణ్యమైన విద్యా బోధనలు నేటి తక్షణ కర్తవ్యం అని మరువరాదు. నేటి యువతనాణ్యమైన నైపుణ్య విద్యను పొందితే మన యువశక్తి దేశానికి వరంగా మారుతుంది. యువతలో నైపుణ్యాలు కొరవడితే యువశక్తి శాపంగా మారి, అశాంతికి ఆజ్యం పోస్తుంది. మన యువతను నైపుణ్య శక్తిగా మార్చుదాం. ●

# వ్యవస్థల తీరుతో కొండలు, గుట్టలు పదిలమేనా?

డాక్టర్ ఎ. భాగ్యరాజ్

అడవులను, కొండను, గుట్టలను సృష్టించడానికి ప్రకృతికి లక్షల సంవత్సరాలు పడుతుంది. దానిని నాశనం చేయడానికి మనిషికి కొన్ని నెలలే చాలు. ఇది కేవలం ఒక భావోద్వేగ వాక్యం కాదు. నేటి భారతదేశంలో అనేక ప్రాంతాల్లో కనిపిస్తున్న వాస్తవం రూపం. ఒకప్పుడు పచ్చదనంతో, అడవులతో, జీవవైవిధ్యంతో కళకళలాడిన కొండలు నేడు క్వారీలుగా,గ్రావెల్ గుంతలుగా,రాతి గనులుగా మారుతున్నాయి. ఇది కేవలం పర్యావరణ సమస్య మాత్రమే కాదు. ఇది రాజ్యాంగ పరిరక్షణ, చట్టాల అమలు, పరిపాలనా పారదర్శకత, అవినీతి నియంత్రణ, ప్రజాస్వామ్య జవాబుదారీతనానికి సంబంధించిన ముఖ్యమైన సమస్య. అసలు ప్రకృతి సంపద ఎవరిది? అని ప్రశ్నించుకుంటే! కొండలు, గుట్టలు, అడవులు, నదులు, చెరువులు ఏ ప్రభుత్వానివి కావు, అవి ప్రజల ఉమ్మడి ఆస్తి. ప్రభుత్వంఏదైనా వాటికి కేవలం సంరక్షలు మాత్రమే. ఈ సూత్రాన్ని భారత న్యాయవ్యవస్థ అనేక సందర్భాల్లో వక్కాణించింది. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 48ఎ ప్రకారం పర్యావరణం, అడవులు, వన్యప్రాణులను రక్షి ంచడం రాష్ట్రాల బాధ్యత. ఆర్టికల్ 51ఎ (జి) ప్రకారం ప్రతి పౌరుడు ప్రకృతిని పరిరక్షి ంచడం తన ప్రాథమిక విధిగా భావించాలి. ఆర్టికల్ 21కిందజీవించే హక్కులో పరిశుభ్రమైన పర్యావరణం కూడా భాగమని భారత న్యాయస్థానాలు వివిధ తీర్పులలో వివరణ ఇచ్చా యి. పర్యావరణ రక్షణలో ప్రధానంగా చూస్తే పర్యావరణ పరిరక్షణ చట్టం1986, అటవీ సంరక్షణ చట్టం,గనులు ఖనిజాల అభివృద్ధి చట్టం, జీవవైవిధ్య చట్టం,నీటి,గాలికాలుష్య నియంత్రణ చట్టాలున్నాయి. ఈ చట్టాలన్నీ అక్రమ తవ్వకాలను నియంత్రించడానికి బలమైన నిబంధనలు కలిగి ఉన్నాయి. అయినా ఎందుకు ఆగడం లేదు?అని ఆలోచిస్తే, లోపం చట్టాలలో కాదు, అమలులో లోపం అని తెలుస్తోంది. దానిలో ప్రధానమైనది ప్రభుత్వాధికారుల నిర్లక్ష్యం. అక్రమతవ్వ కాలు ఒక్కరోజులో జరగవు. భారీ యంత్రాలు, వందలాది లారీలు, పేలుడు పదార్థాలు ఉపయోగిస్తారు. ఇన్ని జరుగు తున్నా సంబంధిత శాఖలకు తెలియకపోవడం నమ్మశక్యం గా లేదు, అదీ కాకుండా ఇప్పుడు ప్రతిగ్రామంలో సచివాల యాలున్నాయి. ఇక అవినీతి అనేది ప్రజల్లో వినిపించే ప్రధాన ఆరోపణ, కొంతమంది అక్రమ వ్యాపారులు,అవినీతి పరులైన అధికారులు కలిసి సహజ వనరులను దోచుకుంటున్నారనేది జగమెరిగిన సత్యం. ఇలాంటి ఆరోప ణలు వచ్చినప్పుడు వాటిపై పారదర్శక విచారణ జరగడం ప్రజావిశ్వాసానికి చాలా అవసరం. అదీ కాకుండా ప్రజలలో అవగాహన లేకపోవడం దౌర్భాగ్యం. తెలియనిది ఏమిటంటే అక్రమ మైనింగ్ కనిపిస్తే ఎక్కడ ఫిర్యాదు చేయాలి?ఏ అనుమతులు తప్పనిసరి? పర్యావరణ అనుమతి అంటే ఏమిటి? గ్రామసభకు ఉన్న అధికారాలు ఏమిటి?ఈ అవగాహన లేకపోవడమే అక్రమార్కులకు అనుకూల వాతావరణాన్ని కల్పి



స్తుంది. ఉదాహరణకు ఒక గ్రామం పక్కన ఉన్న కొండను గ్రావెల్ కోసం తవ్వడం ప్రారంభించారు, మొదట ప్రజలు పట్టించుకోలేదు. కొన్ని నెలల తరువాత కొండ సగం కనుమరుగైంది. వర్షాకాలంలోవర్షపు నీరు వేగంగా గ్రామంలోకి వచ్చింది. చెరువు పూడిపోయింది, భూగర్భజలాలుతగ్గాయి, రైతుల బావులు ఎండిపోయాయి. అప్పుడు అందరికీప్రకృతి విలువ తెలిసింది. కొండపోతే ఏమిపోతుంది? అనుకుంటే వర్షపు నీటి నిల్వ, భూగర్భ జలాల రీఛార్జ్, జీవ వైవిధ్యం, ఔషధ మొక్కలు, పక్షుల నివాసం,స్థానిక వాతావరణ సమతుల్యత, భవిష్యత్ తరాల హక్కు మొదలైనవి పోతుంది. మరోపక్క ప్రపంచ దేశాలు ఏం చేస్తున్నాయి? అని చూస్తే అభివృద్ధి చెందిన అనేక దేశాలు పెద్దఎత్తున తవ్వకాలపై కఠిన పర్యావరణ పరిశీలనలు,ప్రజాభిప్రాయ సేకరణ, పునరుద్ధరణ బాధ్యతలను అమలు చేస్తున్నాయి. అనుమతుల ఉల్లంఘనపై భారీ జరిమానాలు, లైసెన్స్‌రద్దు వంటిచర్యలు తీసుకుంటాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగాతీసుకున్న స్పందన కార్యక్రమం ఈ అక్రమ తవ్వకాలు, రవాణా విషయంలో హాస్యాస్పదంగా మారింది. అంటే ప్రభుత్వంలోని పెద్దలు, అధికారుల తీరు ఏవిధంగా ఉందో తెలుస్తోంది. దోపిడీదారులకు సహజవనరులు ఆర్థిక వనరుగా మారిపోయింది. ఇక ప్రజలమైన మనం ఏమి చేయాలి? అని చూస్తే అక్రమ తవ్వకాలను వీడియోలు, ఫోటోలతోనమోదు చేయాలి. రెవెన్యూ, గనుల, అటవీ శాఖలకు ఫిర్యాదు చేయాలి. సమాచార హక్కు చట్టం ద్వారా అనుమతుల వివరాలు కోరాలి. గ్రామసభల్లో ఈ అంశాన్ని చర్చించాలి. అధికారులు చర్యలు తీసుకోకుంటే ప్రజలే నిరసనలు, పోరాటాల ద్వారా నిరసనలు తెలియజేయాలి. ఇక్కడ ప్రముఖంగా అధికారుల మధ్య, విభాగాల మధ్య సమన్వయం లేదు, మాకు సంబంధంలేదు అని వెకిలిగా, బాధ్యతారాహిత్యంగా బదులుంటుంది. దానికి ప్రధాన కారణం అధికారంలో ఉన్న బాధ్యతారాహిత్య రాజకీయ నాయకుల అండదండలు, సహకారం ప్రధానమైనది. ఇక ప్రభుత్వాలు డ్రోన్లతో పర్యవేక్షణ, భౌగోళిక సమాచారవ్యవస్థ మ్యాపింగ్, ఆన్లైన్ మైనింగ్ అనుమతులు, గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్తో ఖనిజ రవాణా పర్యవేక్షణ, అక్రమతవ్వకాలపై వేగవంతమైన ప్రత్యేకన్యాయస్థానాలు, అవినీతిపరులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలి. వివిధ విభాగాల్లో ఉన్నప్రభుత్వ అధికారులు సమన్వయంతో, కలసిపనిచేస్తే నిర్ణయాలు త్వరగా తీసుకునే అవకాశముంది. ప్రకృతి నాశనం నెమ్మదిగా జరుగుతుంది, కానీ దాని ప్రభావం కొన్నితరాలపాటు ఉంటుంది. కొండలు కూలిపోతే తిరిగి నిర్మించలేం, అడవులు నరికితే వెంటనే తిరిగి పెంచలేం, భూగర్భజలాలు తగ్గితే ఒకే ఏడాదిలో నింపలేం, ప్రకృతి సంపదను కాపాడటం అంటే దేశ భక్తిని ఆచరణలో చూపించడమే. చట్టాలను అమలుచేయడం ప్రభుత్వబాధ్యత, వాటిని పర్యవేక్షి ంచడం ప్రజల బాధ్యత. ఈ రెండూ కలిసి నప్పుడే కొండలు, గుట్టలు, అడవులు భవిష్యత్ తరాలకు పదిలంగా ఉంటాయి, లేదంటే భవిష్యత్తులో మ్యూజియం లలో, ఫోటోలలో చూసుకోవలసిందే. ప్రధానంగాచూస్తే ఇక అవినీతి కుడితినీళ్లు తాగేఅక్రమార్కు లకు, అధికారులకు తెలియనిది

ong-5_ong-5.qxd 7/19/2026 10:47 PM Page 1



## ప్రజావేదికలో 35 అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే దామచర్ల

**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**



ఒంగోలు నగరంలోని శాసనసభ్యుల పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ప్రజావేదిక కార్యక్రమంలో ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు పాల్గొని ప్రజల నుంచి వచ్చిన వినతిపత్రాలను స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు రెవెన్యూ, మున్సిపల్, తాగునీరు, రహదారులు, విద్యుత్, గృహ నిర్మాణం, సంక్షేమ పథకాల అమలు, పెన్షన్లు, ఉపాధి, ఆరోగ్యం తదితర అంశాలకు సంబంధించిన సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. మొత్తం 35 అర్జీలు అందగా, ప్రతి వినతిని స్వయంగా పరిశీలించిన ఎమ్మెల్యే సమస్యల స్వరూపాన్ని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు తెలిపిన ప్రతి సమస్యను అత్యంత ప్రాధాన్యంతో పరిగణించి, సంబంధిత శాఖల అధికారులతో వెంటనే సమన్వయం చేసి సాధ్యమైనంత త్వరగా పరిష్కార చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి రాకుండా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ప్రతి అర్జీపై ఎప్పటికప్పుడు పురోగతిని సమీక్షించి అర్జీదారులకు సమాచారం అందించాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రాధాన్యమని, ప్రజలకు నాణ్యమైన పరిపాలన అందించేందుకు ప్రజావేదిక కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజలు నేరుగా తమ సమస్యలను తెలియజేయడానికి ఈ వేదిక ఉపయోగపడుతోందని, అందిన ప్రతి అర్జీపై న్యాయబద్ధంగా, పారదర్శకంగా చర్యలు తీసుకునేలా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, పెద్దసంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## ఆశావర్కర్ల డిమాండ్ల సాధనకు 31న కలెక్టరేట్ వద్ద ధర్నా

**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**




ఆశావర్కర్లకు కనీస వేతనం అమలు చేయడం, ఉద్యోగాలను రెగ్యులర్ చేయడం, పనిభారం తగ్గించడం, పెండింగ్‌లో ఉన్న సంక్షేమ పథకాలను అమలు చేయడం తదితర డిమాండ్ల సాధన కోసం జూలై 31న ఒంగోలు కలెక్టరేట్ వద్ద నిర్వహించనున్న జిల్లా ధర్నాను విజయవంతం చేయాలని ఆదివారం నిర్వహించిన ఆశా వర్కర్స్ జిల్లా సమావేశంలో పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షురాలు ఎం. పరిశుద్ధం అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీఐటీయూ జిల్లా నాయకులు సీహెచ్ మజుందార్ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం ఆశా వర్కర్లకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, కనీస వేతనాన్ని పెంచడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించి రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, ప్రజలకు ఆరోగ్య సేవలు అందించడంలో ఆశా వర్కర్లు కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ వారికి తగిన గుర్తింపు, వేతనం, సంక్షేమ సదుపాయాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రోజురోజుకూ పెరుగుతున్న అదనపు పనిభారంతో ఆశా వర్కర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం అప్పగిస్తున్న అదనపు బాధ్యతలకు తగిన పారితోషికం చెల్లించాలని కోరారు. ఈ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు మరింత ఉధృతం చేసే పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు. జూలై 31న జరిగే జిల్లా ధర్నాలో జిల్లాలోని అన్ని మండలాల ఆశా వర్కర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశం సందర్భంగా ఆశా వర్కర్స్ డిమాండ్లతో కూడిన గోడపత్రికను ఆవిష్కరించి విస్తృత ప్రచారం నిర్వహించాలని నిర్ణయించారు. ఆశా వర్కర్ల సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉందని నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు అరుణ, తిరుపతమ్మ, కోటేశ్వరమ్మ, జ్యోతి తదితరులు పాల్గొని ధర్నా విజయవంతానికి మండలాల వారీగా కార్యాచరణ చేపట్టాలని నిర్ణయించారు.

## 58వ బ్యాంకుల జాతీయ కరణ దినోత్సవం

**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**




కెనరా బ్యాంక్ సిండికేట్ పెన్షనర్లు మరియు పదవీ విరమణ ఉద్యోగుల సంఘం (సీబీఎస్‌పీఆర్ఏ) ఆధ్వర్యంలో 58వ బ్యాంకుల జాతీయీకరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం ఒంగోలులో పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. రూట్ సెట్ సంస్థ ఆవరణతో పాటు భాగ్యనగర్ నాలుగో లైన్‌లోని డాక్టర్ చలమయ్య గుప్తాస్ ఎలిగెన్స్ ప్రాంగణంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మొత్తం 50 మొక్కలను నాటారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కెనరా బ్యాంక్ రీజనల్ మేనేజర్ బి. రాఘవేందర్ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. మొక్కలను నాటడమే కాకుండా వాటిని సంరక్షిస్తేనే పచ్చదనం పెంపొందడంతో పాటు భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించవచ్చన్నారు. బ్యాంకుల జాతీయీకరణతో గ్రామీణ ప్రాంతాలతో పాటు సామాన్య ప్రజలకు బ్యాంకింగ్ సేవలు మరింత విస్తరించాయని, దేశ ఆర్థికాభివృద్ధిలో ప్రభుత్వ రంగ బ్యాంకులు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో బ్యాంకు ఉద్యోగులు, పెన్షనర్లు భాగస్వామ్యం కావడం అభినందనీయమని అన్నారు. ప్రతి వ్యక్తి తన జీవితంలో కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించాలని, పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ డి. రమేష్, రూట్ సెట్ సంస్థ డైరెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి, సీబీఎస్‌పీఆర్ఏ ఒంగోలు శాఖ ప్రతినిధి వై. ప్రసాద్‌తో పాటు సంఘ సభ్యులు, బ్యాంకు అధికారులు, పదవీ విరమణ ఉద్యోగులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం మొక్కల సంరక్షణపై అవగాహన కల్పిస్తూ పర్యావరణ పరిరక్షణకు అందరూ భాగస్వాములు కావాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

## రోడ్ల ప్రమాదాల నివారణకు సమగ్ర కార్యాచరణ: ఎస్పీ

**ఒంగోలు క్రైమ్, ప్రభాతవార్త**



జాతీయ రహదారులపై జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు ప్రకాశం జిల్లా పోలీసులు బహుముఖ కార్యాచరణ చేపట్టినట్లు జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తెలిపారు. ఇటీవల జిల్లా సమీక్ష మండలి సమావేశంలో ప్రజాప్రతినిధులు రహదారి ప్రమాదాలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిన నేపథ్యంలో, ప్రమాదాలకు దారితీసే కారణాలపై పోలీసు శాఖ ప్రత్యేకంగా అధ్యయనం నిర్వహించిందన్నారు. ముఖ్యంగా గ్రామాల నుంచి జాతీయ రహదారులకు కలిసే అప్రోచ్ రోడ్ల వద్ద వాహనదారులు వేగ నియంత్రణ పాటించకపోవడం వల్లే అధిక శాతం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని గుర్తించినట్లు చెప్పారు. ఈ ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్లు, హెచ్చరిక బోర్డులు, డ్రమ్స్ ఏర్పాటు చేయడంతో పాటు సీసీ కెమెరాల ఏర్పాటు పనులు కొనసాగుతున్నాయని వివరించారు. మలుపులు స్పష్టంగా కనిపించని ప్రాంతాల్లో ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 230 కుంభాకార దర్పణాలు ఏర్పాటు చేయగా, శ్రీశైలం ఘాట్ రోడ్డులోని 18 ప్రమాదకర మలుపుల్లో కూడా వీటిని అమర్చినట్లు తెలిపారు. గత నాలుగు నెలల్లో నమోదైన ప్రమాదాలపై సమగ్ర విశ్లేషణ చేసి బ్లాక్‌స్పాట్లను గుర్తించినట్లు ఎస్పీ తెలిపారు. రోడ్ల రూపకల్పనలో లోపాలు, సరిపడా లైటింగ్ లేకపోవడం, ట్రాఫిక్ నియంత్రణలో సమస్యలు, నిర్లక్ష్య డ్రైవింగ్ వంటి అంశాలను పరిశీలించి సంబంధిత శాఖలతో కలిసి పరిష్కార చర్యలు చేపడుతున్నామని చెప్పారు. జాతీయ రహదారులపై రద్దీ సమయాల్లో గ్రానైట్ లారీల రాకపోకలను పూర్తిగా నిలిపివేయడంతో ప్రమాదాలు గణనీయంగా తగ్గాయని, గ్రావెల్ టిప్పర్లకు కూడా పరిమిత సమయాల్లోనే అనుమతి ఇస్తున్నట్లు పేర్కొన్నారు. టోల్‌ప్లాజాలు, బస్సు బేలు, అత్యవసర స్పందన బృందాల పనితీరుపై కూడా పోలీసు శాఖ ప్రత్యేక ఆడిట్ నిర్వహించిందని తెలిపారు. ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాల్లో హెచ్చరిక సూచికలు, రిఫ్లెక్టివ్ సైన్‌బోర్డులు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు సూచించినట్లు వెల్లడించారు. ప్రజల్లో రహదారి భద్రతపై అవగాహన పెంపొందించేందుకు ఒంగోలు, మార్కాపురం, దర్శి, అద్దంకి సహా ప్రధాన పట్టణాలు, మండల కేంద్రాల్లో మైక్ సిస్టమ్ ద్వారా నిరంతరం ప్రచారం నిర్వహిస్తున్నామని తెలిపారు. పాఠశాలలు, కళాశాలలు, ఆటో డ్రైవర్లు, లారీ యజమానులు, ప్రజా రవాణా వాహనాల డ్రైవర్లకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇదే సమయంలో మహిళల భద్రత, సైబర్ నేరాలు, దొంగతనాల నివారణపై కూడా ప్రజలకు సూచనలు అందిస్తున్నామని పేర్కొన్నారు. హెల్మెట్ ధరించకపోవడం, మద్యం సేవించి వాహనాలు నడపడం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం, అతివేగం, ఓవర్‌టేకింగ్ వంటి నిర్లక్ష్యాలే ఎక్కువ ప్రమాదాలకు కారణమవుతున్నాయని వివరించారు. రోడ్డు ప్రమాదంలో కోల్పోయే ప్రాణాన్ని తిరిగి తీసుకురాలేమని, ఒక్కరి నిర్లక్ష్యం మొత్తం కుటుంబాలను విషాదంలోకి నెడుతుందని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు అన్నారు. ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు. వాహనాల సాంకేతిక పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలించుకోవడం, అలసటగా ఉన్నప్పుడు డ్రైవింగ్ చేయకపోవడం, రాత్రి ప్రయాణాల్లో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవడం కూడా ప్రమాదాల నివారణలో కీలకమని చెప్పారు. పోలీసు శాఖ చేపడుతున్న చర్యలకు ప్రజలు సహకరిస్తేనే రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించగలమని, రహదారులపై ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు పిలుపునిచ్చారు.

ప్రకాశం

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## ఒంగోలులో మూడో ట్రెండ్స్ షోరూమ్ ప్రారంభం

**ఒంగోలు, ప్రభాతవార్త**




ఒంగోలు నగరంలో టెండ్స్ మూడో షోరూంను ఆదివారం ప్రారంభించారు. నగరంలోని ట్రంక్ రోడ్డులో ఈ స్టోర్ను నెలకొల్పారు. ఈ ట్రెండ్స్ స్టోర్ ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కలిగి ఉంది. మహిళలు, పురుషులు, పిల్లల కోసం ట్రెండీ వస్త్రాలు, ఫ్యాషన్ యాక్సెసరీలను ఆకర్షణీయమైన ధరలకు కొనుగోలు చేస్తూ ఒక ప్రత్యేకమైన, అద్భుతమైన షాపింగ్ అనుభవాన్ని పొందవచ్చని స్టోర్ నిర్వహకులు తెలిపారు. దాదాపు 11500 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న ఈ స్టోర్, గొప్ప ఫ్యాషన్, అద్భుతమైన ధరలతో పాటు వినియోగదారుల కోసం ఒక ప్రత్యేక ప్రారంభ ఆఫర్ను కూడా అందిస్తోంది. రూ.3,499 విలువైన కొనుగోలుపై ఒక ఆకర్షణీయమైన బహుమతిని పూర్తిగా ఉచితంగా పొందవచ్చునని తెలిపారు.

## ప్రభుత్వ నిబంధనలకు తిలోదకాలు..

- *ప్రైవేట్ విద్యాసంస్థల అధిక ఫీజుల దందా*
- *బండెడు పుస్తకాల భారీ మోత, యూనిఫాములపై అధిక ధరలు అదనం*
- *పలుచోట్ల ప్రభుత్వ బడుల్లో నో వేకెన్సీ బోర్డులు*
- *ప్రైవేట్ స్కూల్లో యాజమాన్యాలతో అధికారులు కుమ్మకైనట్లు ఆరోపణలు*

**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**

జిల్లాలో ప్రైవేట్ పాఠశాలలు, కార్పొరేట్ కళాశాలలు ప్రభుత్వ నిబంధనలను పట్టించుకోకుండా అధిక ఫీజులు, పుస్తకాలు, యూనిఫాంల పేరిట విద్యార్థుల తల్లిదండ్రులపై భారీ ఆర్థిక భారం మోపుతున్నాయనే విమర్శలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. విద్యను సేవగా కాకుండా వ్యాపారంగా మార్చి వేల రూపాయల నుంచి లక్షల రూపాయల వరకు ఫీజులు వసూలు చేస్తున్నారని, అదనంగా పాఠశాల యాజమాన్యాలే నిర్దేశించిన పుస్తకాలు, యూనిఫాంలు, ప్రత్యేక నోట్‌బుక్స్, ఇతర సామగ్రిని కొనుగోలు చేయాలని ఒత్తిడి తెస్తున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఇష్టంలేకపోయినా అధిక ఫీజులు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడిందని పలువురు పేర్కొంటున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రైవేట్ విద్యా సంస్థలకు స్పష్టమైన నిబంధనలు రూపొందించినప్పటికీ వాటి అమలులో తీవ్ర నిర్లక్ష్యం కనిపిస్తోందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లా, మండల స్థాయి విద్యాశాఖ అధికారులు తరచూ తనిఖీలు నిర్వహించి అక్రమ ఫీజు వసూళ్లను అరికట్టాల్సి ఉండగా, అనేక ప్రాంతాల్లో అలాంటి చర్యలు కనిపించడం లేదని ప్రజలు చెబుతున్నారు. కొందరు అధికారులు ప్రైవేట్ యాజమాన్యాలతో కుమ్మక్కై వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. దీంతో నిబంధనలు ఉల్లంఘించే యాజమాన్యాలు ఎలాంటి భయం లేకుండా తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాయని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కలెక్టర్ ప్రకటించిన జర్నలిస్టుల కుటుంబాలకు ఫీజు రాయితీ వంటి ప్రభుత్వ నిర్ణయాలను కూడా అనేక ప్రైవేట్ విద్యాసంస్థలు అమలు చేయడం లేదని విమర్శలు ఉన్నాయి. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను అమలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. ప్రభుత్వం రూపొందించిన ఫీజు నియంత్రణ విధానాన్ని కచ్చితంగా అమలు చేయించి, తల్లిదండ్రుల నుంచి వచ్చే ఫిర్యాదులను వేగంగా పరిష్కరించే వ్యవస్థను మరింత



బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని సూచిస్తున్నారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, ఆధునిక సౌకర్యాలు, డిజిటల్ తరగతులు, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, మధ్యాహ్న భోజనం, ఇతర విద్యా వసతులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోంది. ప్రభుత్వ విద్యను బలోపేతం చేస్తూ ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో పలు సంస్కరణలు అమలు చేస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలు పెంచేందుకు చేపట్టిన కార్యక్రమాలకు అనేక ప్రాంతాల్లో మంచి స్పందన లభిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. అయితే ప్రభుత్వం విద్యారంగంలో సంస్కరణలు చేపడుతున్నప్పటికీ ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల వైఖరిలో ఆశించిన మార్పు కనిపించడం లేదని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. పిల్లల భవిష్యత్తుపై ఉన్న తల్లిదండ్రుల ఆందోళనను ఆసరాగా చేసుకుని ఫీజులు, అడ్మిషన్ చార్జీలు, రవాణా, యూనిఫాం, పుస్తకాలు, ప్రత్యేక కోచింగ్, వివిధ పేర్లతో అదనపు చార్జీలు వసూలు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఈ పరిస్థితుల వల్ల మధ్యతరగతి, పేద, సామాన్య కుటుంబాలు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. కొంతమంది తల్లిదండ్రులు అప్పులు చేసి పిల్లల చదువులు కొనసాగించాల్సిన పరిస్థితి ఏర్పడిందని చెబుతున్నారు. ప్రభుత్వ నిబంధనలను కచ్చితంగా అమలు చేయించి అక్రమ ఫీజు వసూళ్లను అరికట్టాల్సిన బాధ్యత విద్యాశాఖ అధికారులపై ఉందని పలువురు సూచిస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘించే విద్యాసంస్థలపై జరిమానాలు, గుర్తింపు రద్దు వంటి చర్యలు తీసుకుంటేనే పరిస్థితిలో మార్పు వస్తుందని అభిప్రాయపడుతున్నారు.



ప్రతి విద్యాసంస్థ ఫీజుల వివరాలను బహిరంగంగా ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలని, తల్లిదండ్రుల ఫిర్యాదులకు ప్రత్యేక హెల్ప్‌లైన్ ఏర్పాటు చేయాలని కూడా కోరుతున్నారు. ఫీజుల విషయంలో పూర్తి పారదర్శకత తీసుకొస్తేనే విద్యా రంగంలో ప్రజల విశ్వాసం మరింత పెరుగుతుందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో ఆధునిక భవనాలు, విశాలమైన తరగతి గదులు, ఆట స్థలాలు, తాగునీరు, మరుగుదొడ్లు, డిజిటల్ విద్య, శిక్షణ పొందిన ఉపాధ్యాయులు వంటి సౌకర్యాలు గణనీయంగా మెరుగుపడ్డాయి. విద్యార్థుల శారీరక, మానసిక అభివృద్ధికి అనుకూలమైన వాతావరణం ప్రభుత్వ పాఠశాలల్లో అందుబాటులో ఉందని పలువురు పేర్కొంటున్నారు. విద్యా రంగంలో సమతుల్యతను కాపాడాలంటే ప్రైవేట్ విద్యాసంస్థలు కూడా నాణ్యతతో పాటు పారదర్శకత, సామాజిక బాధ్యతను పాటిస్తూ ప్రభుత్వ నిబంధనలను పూర్తిగా అమలు చేయాల్సిన అవసరం ఉందని విద్యావేత్తలు, తల్లిదండ్రులు, ప్రజాసంఘాలు అభిప్రాయపడుతున్నాయి.

## విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో భారీ అగ్ని ప్రమాదం

- *రూ.20లక్షలు ఆస్తి నష్టం*
- *20 పొగాకు బేళ్లు, లక్షా 5వేల నగదు, ఐదు సవర్ల బంగారం, ఐదు బస్తాల ధాన్యం, రెండు పెంకుటిళ్లు, గృహాలు, తదితరవి అగ్ని ప్రమాదంలో ఆహుతి*
- *లబోదిబోమంటున్న రైతు కుటుంబం*

**సంతనూతలపాడు, జులై 19, ప్రభాతవార్త**

మండలంలోని గంగవరం గ్రామంలో ఆదివారం వేకువ జామున విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సంభవించి భారీ అగ్ని ప్రమాదం ద్వారా రూ.20లక్షల రూపాయలు విలువ చేసే ఆస్తి నష్టానికి గురవ్వడంతో సదరు రైతు మలసాని శేషయ్య కుటుంబం లబోదిబోమంటున్నాయి. శేషయ్య అతని భార్య రత్తమ్మ అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు ఇంటిలో




ఉన్నారు. రత్తమ్మ ఇంటిలో పండుకోక, శేషయ్య ఇంటి బయట నిద్రిస్తున్నారు. ఆదివారం వేకువజామున 3.30 గంటలకు విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ వల్ల మంటలు వచ్చాయి. తదుపరి ఇంటిలోని సామాగ్రి అంటుకొని పెద్ద అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ మంటలకు ఇంటిలో నిద్రిస్తున్న రత్తమ్మ బయటికి వచ్చి శేషయ్యను లేపింది. స్థానికులు ఆ ప్రాంతానికి వచ్చిమోటార్స్ ద్వారా నీటిని ప్రమాదం ప్రాంతంపై తడిపారు. అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు రంగ ప్రవేశంచేసి అగ్నిప్రమాదం నివారణకు చర్యలు



చేపట్టారు. ఈ అగ్ని ప్రమాదంలో 15 పొగాకు బేళ్లు, లక్ష అయిదు వేల రూపాయలు నగదు, ఐదు సవర్లు బంగారం, సామాగ్రి, ఐదు బస్తాలు ధాన్యం, రెండు గృహాలు దాదాపుగా దగ్ధమై సుమారు 20 లక్షల రూపాయలు విలువ చేసే ఆస్తి ఈ ప్రమాదంలో దగ్ధమైంది. హనుమంతరావు, సుబ్బరామయ్యలు ఈ అగ్ని ప్రమాదంలో శేషయ్య భార్య రత్తమ్మ స్వల్పంగా గాయపడ్డారు. తహసీల్దార్ ఎస్ఎల్ నారాయణరెడ్డి, వీఆర్వో దాసరి శ్రీనివాసులు అగ్ని ప్రమాదం జరిగిన ఆయా గృహాలను పరిశీలించారు. సదరు రైతు శేషయ్యకు చెందిన పట్టాదారు పాస్ పుస్తకాలు, డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ పత్రాలు ఈ అగ్ని ప్రమాదంలో ఆహుతి అయ్యాయి. మండల విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ పి.గోపి విద్యుత్ సిబ్బంది ప్రమాద సంఘటనను పరిశీలించారు. ప్రభుత్వం, పొగాకు బోర్డు, అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన రైతు శేషయ్య కుటుంబాన్ని ఆదుకోవాలని స్థానికులు, పలువురు రైతులు కోరుతున్నారు.



## పీజీఆర్ఎస్ సేవలపై క్యూఆర్ కోడ్ ద్వారా స్పందించండి: కలెక్టర్

**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**





ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) సేవలను మరింత సమర్థవంతంగా, పారదర్శకంగా తీర్చిదిద్దేందుకు ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు తెలిపారు. పీజీఆర్ఎస్ కేంద్రాల్లో సేవలు పొందిన అనంతరం ప్రజలు క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేసి తమ అభిప్రాయాలను తప్పనిసరిగా నమోదు చేయాలని ఆయన కోరారు. ప్రజల నుంచి వచ్చే సూచనలు, ఫిర్యాదులు, అభిప్రాయాల ఆధారంగా సేవల నాణ్యతను మెరుగుపరచడంతో పాటు అధికారుల పనితీరును మరింత జవాబుదారీతనంతో తీర్చిదిద్దే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో జిల్లా, మండల స్థాయి పీజీఆర్ఎస్ కేంద్రాల ప్రవేశ, నిష్క్రమణ ప్రాంతాల్లో క్యూ ఆర్ కోడ్‌లను స్పష్టంగా కనిపించే విధంగా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. అలాగే హెల్ప్‌డెస్క్‌లు, నోటీసు బోర్డులు, ఫిర్యాదుల కౌంటర్లు, వేచిచూసే ప్రదేశాలు వంటి ప్రజలు ఎక్కువగా వచ్చే ప్రాంతాల్లో కూడా క్యూ ఆర్ కోడ్‌లను ప్రదర్శించాలని సూచించారు. సేవలు పొందిన వెంటనే ప్రజలు తమ మొబైల్ ఫోన్‌తో క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేసి అభిప్రాయాన్ని నమోదు చేయడం ద్వారా సేవలపై తమ సంతృప్తి స్థాయిని తెలియజేయవచ్చని వివరించారు. క్యూఆర్ కోడ్ ద్వారా అందే ప్రతి స్పందన అధికారిక పీజీఆర్ఎస్ పోర్టల్‌కు చేరి సంబంధిత అధికారులు పరిశీలిస్తారని, ప్రజల సూచనల ఆధారంగా వ్యవస్థలో అవసరమైన మార్పులు చేపట్టే అవకాశం ఉంటుందని కలెక్టర్ తెలిపారు. ప్రజల అభిప్రాయాలు సేవల నాణ్యతను పెంచడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. అలాగే పీజీఆర్ఎస్‌లో సమర్పించిన అర్జీల స్థితిగతులను టోల్‌ఫ్రీ నంబర్ 1100కు కాల్ చేసి తెలుసుకోవచ్చన్నారు. ప్రతి సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం, అన్ని మండల కార్యాలయాల్లో నిర్వహించే పీజీఆర్ఎస్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, తమ సమస్యలను అర్జీల రూపంలో అందజేయడంతో పాటు సేవలపై తమ స్పందనను క్యూ ఆర్ కోడ్ ద్వారా నమోదు చేసి ప్రజా పరిపాలనను మరింత బలోపేతం చేయాలని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు విజ్ఞప్తిచేశారు.

## స్వాహాకారుల జేబు 'కొలత' పెద్దదే..!

- *కొందరు సర్వేయర్ల దనదాహం*
- *చెప్పినంత ఇస్తే.. నచ్చినట్లు నివేదిక*

**ఒంగోలు, ప్రభాతవార్త**

సర్వేయర్ అడుగుపెడితే ఒక లెక్క, కొలత వేస్తే మరో లెక్క, మధ్య వర్తిని పంపితే ఒకలా, ప్రభుత్వ స్థలాన్ని కలిపివేస్తే ఇంకోలా, తప్పుడు వివరాలతో ఏకంగా సర్వే సర్టిఫికేట్ ఇస్తే మరోలా.. ఇది క్షేత్రస్థాయిలో కొందరు సర్వేయర్ల దనదాహం. భూములు, స్థలాల హద్దులకు సంబంధించి సర్వే సర్టిఫికేట్ పొందాలంటే ముప్పు తిప్పలు తప్పడం లేదు. కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలే కాదు అనేక సార్లు సర్వేయర్లకు ఫోన్‌లు చేయాల్సిందే. వారికి దయ కలిగితే సర్వేకు వస్తారు. ఇక్కడే అసలు కథ ఆరంభమవుతుంది. అడిగినంత డబ్బులు ఇస్తే ఒకలా ఇవ్వకుంటే మరోలా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు తీవ్రంగా వస్తున్నాయి. స్థల విస్తీర్ణం ఆధారంగా సమర్పించుకోవాల్సిందేనని బాధితులు తలలు పట్టుకుంటున్నారు. ఒంగోలు మండలం కొత్తపట్నం, మద్దిపాడు, సంతనూతలపాడు, కొండపి, ఉలవపాడుతో పాటు ఇతర మండలాల్లో కూడా ఇదే పరిస్థితి. నెలకొంటుంది. సంతనూతలపాడు మండలంలో ఐదెకరాలకు సంబంధించి ఓ ప్రైవేటు వ్యక్తికి అనుకూలంగా మండల సర్వేయర్ నివేదిక ఇచ్చారు. ఈ అక్రమ వ్యవహారంలో భారీగా డబ్బులు చేతులు మారినట్లు ఆ శాఖలో చర్చ సాగుతుంది. ఒంగోలు మండలంలో సర్వేయర్ల హడావుడి అధికంగా ఉందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రతి పనికి ఒక రేటు అలా ఇస్తేనే కొలతలు వేసేది లేకపోతే వారికి చుక్కలు చూపిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. సర్వే జరపమని వారు మీ సేవలో నెలలు తరబడి కట్టినా జిల్లాలోని సర్వేయర్లు చాలా మంది పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. భూముల హద్దులు నిర్ణయించడానికి సర్వేకి దరఖాస్తు చేస్తే చాలని భావిస్తే పొరబడినట్లే. వాస్తవానికి దాంతో సంబంధం లేకుండా మధ్యవర్తులతో వెళ్తే.. రెండు మూడు రోజుల్లో సర్వే పూర్తవుతుంది. చాలా మండలాల్లో తహసీల్దార్ల కార్యాలయ పరిధిలో కొందరు తీరు ఇలాగే ఉంది. సదరు సర్వేయర్లకు ఇద్దరు ముగ్గురు సహాయకులు ఉంటున్నారు. వారు మధ్యవర్తులకు అనుసంధానంగా ఉంటూ కథ నడిపిస్తున్నారు. తక్కువ విస్తీర్ణం కలిగిన వాటికైతే పది వేల నుంచి రూ.50వేల వరకు వసూళ్లు చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. కొన్ని చోట్ల పలువురు మండల సర్వేయర్లు క్షేత్రస్థాయికి వెళ్లకుండా ప్రైవేటు వ్యక్తులను పంపి మమ అనిపిస్తున్నారు. కొందరి



అనుకూలంగా నివేదికలు తయారు చేసి అధికారిక ముద్ర వేస్తున్నారు. ఇలాంటివి జిల్లాలో ఇటీవల చాలా బయటపడ్డాయన్నట్లు సమాచారం. మద్రిపూడి మండలంలో ఒక సర్వేనంబరు 999/1లో ఒక వ్యక్తి పొలం అయితే ఆ పొలంలో కొందరి పేర్లు అదనంగా చేర్చి ఇచ్చారన్న ఆరోపణలు ఉన్నాయి. ఒంగోలులోని ఏడీ కార్యాలయంలో సర్వేకు సంబంధించిన రికార్డును మార్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. సదరు వ్యక్తి ఎమ్మార్వో ఇచ్చిన రిఫోర్టులో కరెక్టుగానే ఉంది. దీనిపై మద్రిపూడి పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు సమాచారం. మదర్ డాక్యుమెంట్‌లో కూడా ఆ వ్యక్తికి సంబంధించిన పేర్లు ఉన్నాయి. అయితే జిల్లా సర్వేకు సంబంధించిన ఏడీ కార్యాలయంలో రికార్డు తారుమారు అయినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆర్టీఏ చట్టం కింద ఆ స్థల యజమాని దరఖాస్తు చేసుకోగా చేర్చిన కొత్త పేర్లు బయటకు వచ్చాయి. ఆ పొలం గల వ్యక్తి దగ్గర అన్ని ఒరిజనల్ డాక్యుమెంట్స్ ఉండడంతో అతను కోర్టు ఆశ్రయించనున్నట్లు తెలిసింది. జిల్లా సర్వే కార్యాలయంలో కూడా ఇలాంటి సంఘటనలు చోటు చేసుకోవడం పట్ల రైతులు ఆందోళన చెందుతున్నారు. దీంతో మండల శివారు ప్రాంతాల్లో అర్హులైన రైతులు ఇబ్బంది పడుతున్నారు. రికార్డుల మార్పునకు హద్దులు నిర్ణయించడానికి దరఖాస్తు చేస్తే పెండింగ్‌లో ఉంచేస్తున్నారు. ఒక మండల పరిధిలో ఒకే కుటుంబానికి చెందిన భూమి హద్దులతో పాటు విస్తీర్ణం మారిపోయింది. ఆ కుటుంబీకులు సర్వే చేయాలని మద్దిపాడు మండల కార్యాలయంలో దరఖాస్తు చేయగా పట్టించుకోలేదని ఆ రైతు ఆరోపిస్తున్నాయి. ఓ గ్రామంలో ముగ్గురు పేరున్న భూములు పంపకాలు జరిపి హద్దులు నిర్ణయించాలని కార్యాలయం చుట్టూ తిరిగినా ప్రయోజనం లేదు. రైతులు ఏఎఫ్‌లైన్ దరఖాస్తు సమర్పిస్తున్నా వాటిని ఇతర ప్రాంతాలుగా గుర్తిస్తూ మినహాయిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి క్రింది స్థాయిలో జరుగుతున్న అవినీతిఅక్రమాలపై నివేదికలు తెప్పించుకుని రైతులను కాపాడాలని కోరుతున్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే ఉగ్ర



హనుమంతునిపాడు, జూలై 19, ప్రభాతవార్త

మండల కేంద్రమైన హనుమంతునిపాడు గ్రామం నందు వేశపోగు ప్రమీలమ్మ కుమారుల వివాహ మహోత్సవానికి కనిగిరి శాసనసభ్యులు, ఒంగోలు పార్లమెంట్ టీడీపీ పార్టీ అధ్యక్షులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి నూతన దంపతులకు ఆయురారోగ్యాలు, సుఖశాంతులు, ఆనందమయమైన దాంపత్య జీవితం కలగాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలపార్టీ అధ్యక్షులు సానికొమ్ము తిరుపతిరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి గాయం తిరుపతిరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి మురహరి నరసయ్య, మండల మహిళా అధ్యక్షురాలు అనుమాటి సుబ్బలక్ష్మీ, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు కత్తి తిరుపాలు, సింగిల్ విండో డైరక్టర్ వేశపోగు రాజేష్, మాజీ ఉప సర్పంచ్ కత్తి కిశోర్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

### ఎన్నికల్లో ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్



నాగులుప్పలపాడు, జూలై 19, ప్రభాతవార్త

నాగులుప్పలపాడు మండలం ఉప్పుగుండూరు గ్రామం క్రిస్టియన్‌పాలెం వాసులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ సంతనూతలపాడు నియోజకవర్గ శాసనసభ్యులు బీఎన్ విజయ్ కుమార్ క్రిస్టియన్‌పాలెం కమిటీ హాల్ నిర్మాణం కోసం తన సొంత డబ్బు రూ.5లక్షల ఆర్థిక సహాయాన్ని క్రిస్టియన్‌పాలెం వాసులకు అందజేశారు. ఈ సందర్భంగా క్రిస్టియన్‌పాలెం ప్రజలు ఎమ్మెల్యే సేవాభావాన్ని, మాట నిలబెట్టుకునే నాయకత్వాన్ని అభినందిస్తూ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. కమిటీ హాల్ నిర్మాణానికి గవర్నమెంట్ తరుపున రావాల్సిన రూ.35లక్షలపై ప్రత్యేక దృష్టి పెడతానన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే బీఎన్ విజయ్ కుమార్ పేర్కొన్నారు.

## సర్వే నెంబర్ 78లోనే ప్రభుత్వ వైద్యశాల నిర్మించాలి

- కుట్ర రాజకీయాలతో ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణాన్ని అడ్డుకోవడం తగదు
- టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి పార్టీ నేతలు పిలుపు





నాగులుప్పలపాడు, జూలై 19, ప్రభాతవార్త

ఉప్పుగుండూరు గ్రామం సర్వే నంబర్ 78లో ఒక ఎకరా 50 సెంట్లు ప్రభుత్వ భూమిలోనే కమ్యూనిటీ ప్రభుత్వ వైద్యశాల నిర్మాణం చేపట్టాలని తెలుగుదేశం, జనసేన, బీజేపీ, కూటమి పార్టీ నాయకులు కనగాల శ్రీనివాసరావు, బాలిశెట్టి నాగేశ్వరరావు, ఆత్మకూరు వాసులు సంయుక్తంగా పేర్కొన్నారు. ఆదివారం ఉప్పుగుండూరులో ఎన్టీఆర్ బస్టాండ్ ఆవరణలో జరిగిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర విద్యాశాఖ మంత్రినారాలోకేష్ కార్యకర్తల సమావేశం లో ప్రతి సారి తెలుగుదేశం, జనసేన పార్టీలలో వైసీపీ కోవర్టులు ఉన్నారని చెబుతున్న మాట నిజమేనని అది మన గ్రామంలోని తేటతెల్లమవుతుందన్నారు. గ్రామాభివృద్ధిని అడ్డుకోవడంతో పాటు తెలుగుదేశం, జనసేన, పార్టీలలో కూడా విద్వేషాలు పెంచుతున్నారన్నారు. ఉప్పుగుండూరు గ్రామంలో సర్వే నంబర్ 78లో ప్రభుత్వ స్థలం ఒక ఎకరా 50 సెంట్లు 1940వ సంవత్సరంలోనే అప్పటి దాతలు గ్రామంలో ప్రజా అవసరాలకు దానంగా భూమిని ఇచ్చారన్నారు. ఆ భూమిలోనే ప్రభుత్వ వైద్యశాల నిర్మాణం చేపట్టేందుకు అన్నిమౌలిక వసతులు సమృద్ధిగా ఉన్నాయని వారు తెలియజేశారు. వైసీపీ ఎంపీటీసీతో పాటు కొంత మంది ఉద్దేశపూర్వకంగా ఆ భూమి సరిపోదని నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారన్నారు. గ్రామంలో ప్రజలకు అందుబాటులో ప్రభుత్వ ఆసుపత్రి ఉండాలి. ఊరికి దూరంగా స్మశానాలు ఉండాలి కానీ ప్రభుత్వ ఆసుపత్రిని ఊరికి రెండు కిలోమీటర్ల దూరంలో లోతట్టు ప్రాంతం పెట్రోల్ బంకు, ధనియాల ప్రాసెస్ యూనిట్, రెండు బ్రాందీ షాపులు, ఉన్న ప్రాంతంలో ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణంకు మూడు ఎకరాలు దానం ఇస్తామని కొంత మంది వ్యాపారస్తులు ముందుకు వచ్చి వారు భూదానం ఇస్తామనటంలో కుట్ర దాగిఉందన్నారు. ఆ పరిసరాల్లో వారు భూములు కొనుక్కొని ఆ భూములకు రేట్లు పెంచేందుకు ఊరికి దూరంగా ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం చేపట్టాలని చూస్తే ఊరుకోమని వారు హెచ్చరించారు. గత కాంగ్రెస్, వైసీపీ, పార్టీలు అధికారంలో ఉన్న 2008, 2019 సమయాల్లో కూడా సర్వే నెంబర్ 78లోనే వంద పడకలు ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం చేపట్టాలని అప్పుడు గ్రామ పంచాయతీ తీర్మానం కూడా చేపట్టారని నేడు ఆ భూమి చాలదని చెప్పడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ఆ భూమిలో పార్కు ఉందని ప్రజలకు ఉపయోగపడుతుందని చెప్తున్న మాటలు అవాస్తమన్నారు. గ్రామంలో ఈపాటికి పార్కులు చాలా ఉన్నాయని హైస్కూల్, జూనియర్ కళాశాలలు విశాలమైన గ్రౌండ్లతో పాటు ఊర చెరువు ప్రాంగణలను పార్కుగా ప్రజలు వినియోగించుకుంటున్నారని ప్రత్యేకంగా పార్కు పేరుతో ఆసుపత్రి కొరకు 50 ఏళ్ల క్రితం కేటాయించిన భూమి చాలదని చెప్పి దుష్ప్రచారం చేస్తున్నారని వారందరూ కూడా ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణాన్ని అడ్డుకుంటున్నారన్నారు. గత సంవత్సరం ఫిబ్రవరి నెలలో స్థానిక ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ సర్వే నెంబర్ 78లోనే ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం జరగాలని సిఫార్సు లేఖ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి ఇచ్చారని దాని ఆధారంగానే ఆసుపత్రి నిర్మాణంకు ఫైల్ కరస్పాండింగ్ జరుగుతుందని కూటమి పార్టీ అధికారంలో ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం జరిగితే ఆ పార్టీకి మంచి పేరు వచ్చిందని దీనిని ఓర్వలేక కుట్రలు చేస్తున్నారన్నారు. కొంత మంది స్వార్థపరులు తెర వెనుక ఉండి సహాయం చేస్తున్నారని వారు ఏ పార్టీలో ఉన్నారో తెలుసుకోవాలని తెలియజేశారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో సంతనూతలపాడు నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మేరుగ నాగార్జున గెలుపుకు డబ్బులు పంపిణీ చేసిన వారు, రాఘవేంద్ర కాలనీ వద్ద పోలింగ్ బూత్ వద్ద తెలుగుదేశం పార్టీ నాయకులపై ఘర్షణకు దిగినవారు ఇప్పుడు తెలుగుదేశం పార్టీ అని చెప్తున్న వారు ఎన్నిక సమయాల్లో ఎవరి గెలుపు కోసం పని చేశారనేది ప్రజలకు తెలుసని ప్రజలే తగిన బుద్ధి వారికి చెప్పటం ఖాయమన్నారు. స్థానిక శాసనసభ్యులు బీఎన్ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం సర్వే నంబర్ 78లోని ప్రభుత్వ భూమి ఒక ఎకరా 50 సెంట్లు భూమిలోనే కూటమి పార్టీ హయాంలోనే జరిగి తీరుతుందనిధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రి కాకుండా కుట్రలు చేస్తున్న వారి పేర్లు త్వరలోనే బహిర్గతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన సీనియర్ నాయకులు నిడికొండ వెంకట్, బాపట్ల పార్లమెంటరీ ఎస్టీ సెల్ అధ్యక్షులు తిరుమలశెట్టి శ్రీనివాసరావు, మండల టీడీపీ బీసీ సెల్ అధ్యక్షులు కూతంబాకం సెల్వం, సంతనూతలపాడు నియోజకవర్గ ట్రేడ్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కొండా శ్రీనివాసరావు, టీడీపీ బీసీ సెల్ సీనియర్ నాయకులు ఉప్పుగుండూరు లక్ష్మీనారాయణ, గద్దె త్యాగరాజు, టీడీపీ యూనిట్ ఇన్‌చార్జి కుంచాల నాగరాజు, కొప్పర్తి నాగయ్య, మాజీ ఎంపీటీసీ కొండ్రు ఆశీర్వాదం, నల్లూరి భాస్కరరావు, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు గద్దె శేషయ్య, కొంజేటి జలంధర్, జాలాది సురేంద్ర, బెల్లం హరిబాబు, యేనిగండ్ల వెంకన్న, మాగులూరి రాఘవయ్య, గోగినేని రవి, గోపి, బెల్లంశ్రీనివాసరావు, మామిడాల పూర్ణచంద్రరావు, కత్తినాగార్జున, దేవరకొండ మురళీకృష్ణ, తదితర నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

### శ్రీపంచముఖ ఆంజనేయస్వామి వారి ఆలయం వద్ద ఎమ్మెల్యే ఇంటూరి పూజలు





గుడ్లూరు, జూలై 19, ప్రభాతవార్త

గుడ్లూరు మండలం చెమిడిదపాడు గ్రామ బస్టాండ్ వద్ద నిర్మాణంలో ఉన్న శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి వారి ఆలయం వద్ద కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ట్రస్టు అధ్యక్షులు ఆలూరి వెంకట హనుమంతరావు ఎమ్మెల్యేకు సాదర స్వాగతం పలికి శ్రీరామ నామ శాలువాతో సత్కరించారు. అనంతరం స్వామివారిని దర్శింమకుని కొబ్బరికాయ కొట్టారు. శ్రీవాణి ట్రస్టు ద్వారా ఆలయ నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని ఆలయ ట్రస్టు అధ్యక్షులు హనుమంతరావు రెండు రోజుల క్రితం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుని కలిసి విజ్ఞప్తి చేశారు. అందుకు సంబంధించిన లెటర్ దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి ఎమ్మెల్యే సిఫార్సు లేఖను నేరుగా ఆలయం వద్ద స్వామివారి సన్నిధిలో ట్రస్టు అధ్యక్షులు హనుమంతరావుకు అందజేశారు. స్వామివారి ప్రసాదాలను హనుమంతరావు ఎమ్మెల్యేకు అందజేసి కృతజ్ఞతలు తెలిపారు.

## కామినేని అంకమ్మ తల్లి తిరునాళ్ల కార్యక్రమంలో పాల్గొన్న యువ నాయకుడు ఆకుపాటి



పామూరు, జూలై 19, ప్రభాతవార్త

వలేటివారిపాలెం మండలం చుండి గ్రామం నందు గ్రామ దేవత అంకాలమ్మ తిరునాళ్ల సందర్భంగా కామినేని వీరాంజనేయులు(బెంగుళూరు) ఏర్పాటు చేసిన స్వామివారి కార్యక్రమంలో ప్రకాశం జిల్లా ఎంపీటీసీల సంఘం అధ్యక్షులు ఆకుపాటి వెంకటేష్ పాల్గొని స్వామివారి మొక్కులు చెల్లించారు. ఈ కార్యక్రమంలో కంట కోటయ్య, కామినేని వెంకటేశ్వర్లు, కామినేని వీరాంజనేయులు, గంధం రత్నంరాజు, గిన్నెల హర్ష, తిరుమలశెట్టి వెంకట్రావు, కామినేని మాధవ, విలేకర్లు బండి రమేష్, అరియం ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

## పువ్వాడిని పరామర్శించిన టీడీపీ నాయకులు




పామూరు, జూలై 19, ప్రభాతవార్త

తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పామూరు మండలపార్టీ మాజీ అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు ను పామూరు తెలుగుదేశం పార్టీ శ్రేణులు ఆదివారం నాడు కలిసి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఇటీవల గుండెసంబంధిత వ్యాధికి సంబంధించిన ఆపరేషన్ చేయించుకుని కర్నూలులో విశ్రాంతి తీసుకుంటున్న పువ్వాడిని రాష్ట్ర విభిన్న ప్రతిభావంతుల అధ్యక్షులు అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి, కంబాలదిన్నె గ్రామ కమిటీ టీడీపీ అధ్యక్షులు మన్నం రమణయ్య, పామూరు పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సయ్యద్ అమీర్‌బాబు, గోళ్ల వీరాంజనేయులు, పరిమి మురళి తదితరులు పరామర్శించి త్వరితగతిన కోలుకొని స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ తరుపున చురుకైన పాత్ర పోషించి మండలంలోని 25 పంచాయతీలను కైవసం చేసుకునే విధంగా కృషి చేయాలని వారు ఆకాంక్షించారు.

### షైనింగ్ స్టార్స్ అవార్డుకు ఎంపికైన కేఆర్‌జెడ్‌పీహెచ్‌ఎస్ విద్యార్థినులు





లింగసముద్రం, జూలై 19, ప్రభాతవార్త

2025-26 విద్యాసంవత్సరంలో పదవ తరగతిలో 584 మార్కులు సాధించి లింగసముద్రం మండలంలో ప్రథమ స్థానంలో నిలిచిన బాల వెంకట సాయి హరిత ఆర్తి, 544 మార్కులు సాధించిన పేరం మైథిలి విద్యార్థినులు ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా ప్రవేశపెట్టిన షైనింగ్ స్టార్స్ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ అవార్డుకి ఎంపికైన ప్రతి విద్యార్థికి రూ.20వేలు నగదు బహుమతి,ప్రశంసా పత్రం జిల్లా కలెక్టర్, మంత్రి, ఎమ్మెల్యే చేతుల మీదుగా ఈ నెల 20న ఒంగోలులో ప్రధానం చేయనున్నారు. అవార్డుకి ఎంపికైనందుకు విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు ఉమ్మడిశెట్టి మాధవరావు, ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ చైర్మన్, గ్రామ పెద్దలు అభినందనలు తెలియజేశారు. విద్యార్థినుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

## రోడ్లు, బ్రిడ్జిల నిర్మాణానికి ప్రాధాన్యత

- మాచవరం, పెదపవని బ్రిడ్జిలను కూడా త్వరలో నిర్మిస్తాం
- చెమిడిదపాడు వద్ద రాళ్లవాగుపై బ్రిడ్జి నిర్మాణానికి ఎమ్మెల్యే ఇంటూరి చేతుల మీదుగా భూమి పూజ
- ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపిన గుడ్లూరు మండల ప్రజలు







గుడ్లూరు, జూలై 19 ప్రభాతవార్త

తెట్టు గుడ్లూరు రోడ్డులో రాళ్ళ వాగు కష్టాలు తీరాయి. జగన్ ప్రభుత్వం, స్థానిక పాలకుల నిర్లక్ష్యం కారణంగా కందుకూరు నియోజకవర్గంలో అనేక రోడ్లు దెబ్బతిన్నాయి. కూటమి ప్రభుత్వంలో రోడ్లకు మోక్షం కలిగింది. అలాగే అవసరమైన చోట్ల కొత్త బ్రిడ్జిల నిర్మాణానికి శ్రీకారం చుట్టి ప్రజలు పడుతున్న ఒక్కొక్క ఇబ్బందిని తొలగించేలా ఒక ప్రణాళికతో ముందుకు వెళ్తున్నా అని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. గుడ్లూరు మండలం చెమిడిదపాడు సమీపంలో రాళ్లవాగుపై రూ.2కోట్లతో నిర్మించబోయే బ్రిడ్జి పనులకు ఎమ్మెల్యే ఆదివారం భూమి పూజ చేశారు. ఏళ్ల తరబడి తాము పడుతున్న అవస్థలు తీరబోతున్నాయని సంతోషం వ్యక్తం చేస్తూ అక్కడికి వచ్చిన నేతలు, ప్రజలు నాగేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రధానంగా ప్రజా రవాణాకు సంబంధించి మౌలిక వసతుల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. వర్షం కురిస్తే రాళ్లవాగు తీవ్ర రూపం దాల్చి రాకపోకలకు ఆటంకం కలుగుతుందన్నారు. తాను కూడా అనేక సార్లు ఈ మార్గంలో ఇబ్బంది పడ్డానని గుర్తు చేసుకున్నారు. ఈ సమస్య తీవ్రతను, బ్రిడ్జి నిర్మించాల్సిన అవసరాన్ని గతంలో నెల్లూరు కలెక్టర్‌గా పని చేసిన ఆనంద్‌కు, ఇతర అధికారులు దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించినట్లు ఎమ్మెల్యే వివరించారు. అయితే ప్రస్తుతం నిర్మాణానికి రూ.2కోట్లు సరిపోవని, సంబంధిత మంత్రి దృష్టికి తీసుకెళ్లి అదనంగా నిధులు మంజూరు చేయించేందుకు కృషిచేస్తానని ఎమ్మెల్యే చెప్పారు. మన్నేరుపై పెదపవని, సీతారామపురం, మాచవరం గ్రామాల వద్ద ఇంకా కందుకూరు సమీపంలోని ఎర్రవాగు, చుట్టుగుంట రోడ్డులో వాగులపై ప్రస్తుతం ఉన్న బ్రిడ్జిలు శిధిలావస్థకు చేరినందున వాటి స్థానంలో కొత్త నిర్మాణాల కోసం ప్రతిపాదనలు తయారు చేయించినట్లు ఎమ్మెల్యే నాగేశ్వరరావు తెలిపారు. త్వరలో వాటి నిర్మాణానికి కూడా శ్రీకారం చుడతామన్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు జనిగర్ల నాగరాజు, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పొట్టేళ్ల మురళి, సభ్యులు దివి శేషమ్మ, షేక్ పెద్దబాబు, రోడ్లు భవనాల శాఖ ఎస్ఈ ప్రసాదరావు, ఈఈ వేణుగోపాల్‌రావు, డీఈ కృష్ణారావు, ఏఈ అనిల్, కాంట్రాక్టర్ గుళ్ళా సుధాకర్, జనసేన మండల పార్టీ అధ్యక్షులు గిరిబాబు, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జిలు చిత్తారి మల్లిఖార్జున, ఉమ్మనేని సుబ్బారావు, గ్రామ పార్టీ అధ్యక్షులు ఉన్నం వెంకటేశ్వర్లు, వర్ధినేని వెంకట్రావు, సొసైటీ అధ్యక్షులు కారసాల బ్రహ్మయ్య, దామా వెంకటేశ్వర్లు, పార్టీ నేతలు కారసాల శ్రీనివాసులు, పోలుగంగు కృష్ణ, నూతలపాటి బుల్లియ్య, రావూరి వేణు, పువ్వాడి వేణు, చెన్నారెడ్డి, మహేష్, మేకపోతుల రాఘవులు, మేకల మాల్యాద్రి, మద్దసాని కృష్ణ, అల్లం సుమతి, జొన్నలగడ్డ రమణమ్మ, సింగమనేని పద్మ, తల్లపనేని పార్వతి, మద్దసాని శ్రీను, గద్దగుంట శ్రీను, కాకు నాగేశ్వరరావు, చాపల రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

## పీసీపల్లిలో ఆరోగ్య సేవల సందడి

- 400 మందికి ఉచిత వైద్య సేవలు.. పరీక్షలు, మందుల పంపిణీ

కనిగిరి, జూలై 19, ప్రభాతవార్త

గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో పామూరులోని మల్లిఖార్జునరెడ్డి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, కనిగిరిలోని పీవీఆర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం పీసీపల్లిలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి విశేష స్పందన లభించగా, సుమారు 400 మంది రోగులు ఉచిత వైద్య సేవలను పొందారు. శిబిరంలో వైద్యులు రోగులను పరీక్షించి ఆరోగ్య పరిస్థితులకు అనుగుణంగా వైద్య సలహాలు అందించారు. అలాగే ఈసీజీ, రక్తంలో చక్కెర(ఆర్‌బీఎస్), హెచ్‌బీఏ 1సీ(హెచ్‌బీ1సీ) పరీక్షలను ఉచితంగా నిర్వహించి, అవసరమైన మందులను పంపిణీ చేశారు. గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించించిన డాక్టర్ పి.మల్లిఖార్జునరెడ్డి, డాక్టర్ పి.ప్రతాపరెడ్డిలను గ్రామస్తులు అభినందించారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణే తమ ప్రధాన లక్ష్యమని, భవిష్యత్తులో కూడా ఇటువంటి ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించి నాణ్యమైన వైద్య సేవలను గ్రామీణ ప్రాంతాలకు చేరవేస్తామని వైద్యులు తెలిపారు.



## చల్లంగ చూడమ్మా... గంగమ్మ



తాళ్లూరు, జూలై 19,ప్రభాతవార్త

మండలం లోని తూర్పు గంగవరం పంచాయతీ పరిధిలోని సోమవరప్పాడు గ్రామంలో వెలిసిన జిల్లాలో ప్రసిద్ధిగాంచిన ప్రముఖ పుణ్య క్షేత్రం గుంటి గంగా భవానీ అమ్మవారికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారిలు మెట్టెల బాలరాజు, పుచ్చకాయల విజయ లక్ష్మి అమ్మవారి మూల విరాట్ ను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ అర్చకుడు ఎన్. కామేశ్వర శర్మ, అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చన, గోత్రనామాలు పూజలు నిర్వహించారు. అమ్మవారికి నైవేద్యాలు, పొంగళ్లు సమర్పించారు. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పేరొందిన అమ్మవారిని దర్శించుకోవడానికి జిల్లాతో పాటు పలు జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులు పొంగళ్లు పెట్టి, జంతు బలులిచ్చి మొక్కులు చెల్లించారు. ఆలయ ప్రక్కన ఉన్న పుట్ట, నాగ శిలలకు భక్తులు పూజలు చేశారు. అమ్మవారి దర్శించుకున్న భక్తులకు ఆలయ అన్నదాన సత్రంలో అన్నదానం చేశారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయచైర్మన్ సానె సురేష్, ఈవో నర్రా నారాయణరెడ్డి, ఆర్ఏ కాటూరి ప్రసాదు, సిబ్బంది పర్యవేక్షించారు.

## చిన్నారులకు ఎమ్మెల్యే ఆశీర్వాదం



కందుకూరు జూలై 19, ప్రభాతవార్త

కందుకూరు పట్టణంలోని శ్రీ సీతారామ ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఆదివారం ఉలవపాడు మండలం కరేడు గ్రామానికి చెందిన పేరూరిరాము సౌభాగ్యలక్ష్మి దంపతుల కుమారుడు, కుమార్తెల నూతన వస్త్రధారణ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరై చిన్నారులును ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతోపాటు ఆర్యవైశ్య ప్రముఖులు గుర్రం వెంకట్రావు, కోట సురేంద్ర, గుర్రం అల్లూరయ్య, గుర్రం వెంకటేశ్వర్లు, గుర్రం వెంకటసుబ్బయ్య, కోట వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు .

## వెలిగండ్ల విద్యార్థులకు షైనింగ్ స్టార్ అవార్డులు











వెలిగండ్ల, జూలై 19, ప్రభాతవార్త

వెలిగండ్ల మండలంలోని వివిధ పాఠశాలల్లో చదువుకుని పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ కనపరిచిన ఐదుగురు విద్యార్థులు షైనింగ్ స్టార్ అవార్డులకు ఎంపికైనట్లు మండల విద్యాశాఖాధికారులు దాస్ ప్రసాద్, దేవిరెడ్డి రామిరెడ్డి తెలిపారు. ఈ నెల 20వ తేదీన జిల్లా కలెక్టర్ విజయ సునీత చేతుల మీదుగా విద్యార్థులకు అవార్డులు ప్రధానం చేయనున్నట్లు వారు వెల్లడించారు. పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించి ప్రతిభ కనపరిచిన విద్యార్థులుగా జడ్పీహెచ్ఎస్ వెలిగండ్ల విద్యార్థులు సీహెచ్ అమృత(585 మార్కులు), జి.రిషిత(580మార్కులు), ఎస్.సిప్రహా (584), జడ్పీహెచ్ఎస్ మొగుళ్లూరు నుండి విద్యార్థి పల్నాటి శివకుమార్, జడ్పీహెచ్ఎస్ ఇమ్మడిచెరువు నుండి బి.రాజేశ్వరి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఎంఈఓలు మాట్లాడుతూ విద్యార్థులు తమ విద్యాభ్యాసంలో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించి తల్లిదండ్రులు, పాఠశాలలు, మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. వారి భవిష్యత్తు విజయవంతంగా ఉండాలని అభినందనలు

## రామాయపట్నం పోర్టును పరిశీలించిన విపక్షాల నేతలు


- పోర్టు ప్రైవేటీకరణ నిలుపుదల చేయాలి
- ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తాం - సీపీఐ,వైసీపీ,ఆమ్ ఆద్మీ



కందుకూరు జూలై 19, ప్రభాతవార్త

కందుకూరు నియోజకవర్గంలోని రామాయపట్నం పోర్టును ప్రైవేటీకరణనునిలుపుదల చేయాలని విపక్షనేతలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని వైసీపీ, సీపీఐ, ఆమ్ ఆద్మీ పార్టీనేతలు బుర్రా మధుసూదన్‌యాదవ్, బి.సురేష్‌బాబు, నేతి మహేశ్వరరావులు పలు వేదికల్లో ప్రభుత్వానికి విజ్ఞప్తిచేస్తున్నారు. రామాయపట్నం పోర్టు ప్రైవేటీకరణ అంశం కందుకూరు ప్రాంతంలో చర్చనీయాంశమైంది. పీపీపీ పద్ధతిలో ప్రైవేటీకరణకు ప్రభుత్వం జీవో నం.53ను జారీచేసింది. ప్రైవేటీకరణతోనే లాభదాయకమని అధికారపక్షం, లేదని విపక్షాలు విమర్శలు ప్రతివిమర్శలు పలు సామాజిక మాధ్యమాల ద్వారా గుప్పిస్తున్నారు. ఇందులోబాగంగా ఈనెల 18న శనివారం వైసీపీనేతలు మాజీ మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బుర్రా మధుసూదన్‌యాదవ్, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తదితరులు రామాయపట్నం పోర్టు ముట్టడి కార్యక్రమం చేపట్టారు. వీరిని పోలీసులు అడ్డుకున్నారు. కేసులు బనాయించారు. అదేవిధంగా ఆదివారం సీపీఐ నేత బూసి సురేష్, ఆమ్ ఆద్మీపార్టీనేత నేతి మహేశ్వరరావులు సైతం పోర్టుప్రాంతాన్ని సందర్శించారు. స్థానికులుతో మాట్లాడారు. పోర్టుప్రైవేటీకరణను తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు పలు గ్రామస్తులు వివరించారు.

### 50 ఏళ్ల పాటు కారు చౌకగా లీజుకు :



రామాయపట్నం పోర్టు పనులు గత ప్రభుత్వ హయాంలో 95శాతం పూర్తయ్యాయని వైసీపీ నేతలు బుర్రా మధుసూదన్‌యాదవ్‌తోపాటు పలువురు వివరిస్తున్నారు. అయితే ముఖ్యమంత్రి చంద్రబాబు దురాశతో సుమారు 850ఎకరాలలో సుమారు రూ.5వేల కోట్లు విలువైన పోర్టును కేవలం రూ.1500కోట్లుకు 50ఏళ్లకు కారుచౌకగా ప్రైవేటు పరం చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. అదేవిధంగా రైతుల నుంచి సేకరించిన పొలాలను ఎకరాకి ఏడాదికి ఒక రూపాయ చొప్పున లీజుకు ఇస్తున్నారని వివరిస్తున్నారు. కేవలం 5శాతం పనులు పూర్తిచేసి ప్రభుత్వమే ఈ పోర్టును నిర్వహిస్తే ఈ ప్రాంతం అభివృద్ధిచెందుతుందన్నారు. ఈ పోర్టుతోపాటు బీపీసీఎల్, ఇండో సోలార్ తదితర సంస్థల ఆధ్వర్యంలో అనేక పరిశ్రమలు ద్వారా ఈ ప్రాంత ప్రజలకు ప్రత్యక్షంగా పరోక్షంగా ఉద్యోగ ఉపాధి లభిస్తుందని, తద్వారా కందుకూరు ప్రాంతం పారిశ్రామిక హబ్‌గా మారడానికి అవకాశం ఉందని వివరిస్తున్నారు. అదే ప్రైవేటుపరం అయితే వారి స్వార్ధానికి బలైఅనేక కష్టనష్టాలకు గురవుతామని వివరించారు. అయితే ఈ విషయమై ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ పీపీపీ పద్ధతిలోనే ప్రభుత్వానికి ప్రజలకు లాభదాయకంగా ఉంటుందంటున్నారు. వైసీపీ హయాంలో కేవలం 50శాతం పనులే పూర్తిచేశారన్నారు. ఏడాదికి 1500కోట్లకి పైగా ప్రభుత్వానికి చెల్లిస్తారన్నారు. పైగా సర్వహక్కులు ప్రభుత్వానికి ఉంటాయని వివరిస్తున్నారు.

### ప్రైవేటీకరణ ఆపండి - సీపీఐ



ఈ నేపధ్యంలో ఆదివారం సీపీఐ నేత సురేష్, ఆమ్ ఆద్మీనేత నేతి మహేశ్వరరావులు పోర్టు ప్రాంతాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతంలోని ప్రజలతో పలు అంశాలపై నాయకులు చర్చించారు. ఆ ప్రాంతంలోని అన్ని వర్గాల ప్రజలు రామాయపట్నం పోర్టు ప్రైవేటు అంగీకరించే ప్రసక్తి లేదని తమ అభిప్రాయాలను నాయకులు వద్ద విన్నవించారు. ఈ సందర్భంగా సురేష్ బాబు మాట్లాడుతూ తమ ప్రాంతం అభివృద్ధి చెందితే తమ బిడ్డల భవిష్యత్తు బాగుంటుందని రైతులు తమ భూములును ప్రభుత్వానికి ఇచ్చారన్నారు. అయితే ప్రభుత్వం రైతులకు మాయమాటలు చెప్పి భూములు తీసుకున్న తర్వాత పోర్టును ప్రైవేటీకరణ చేసి వారికి అన్యాయం చేస్తుందన్నారు. వెనకబడిన ప్రకాశం జిల్లా రామాయపట్నం పోర్టుతో ప్రజలకు, కార్మికులకు యువతకు ఉపాధి లభిస్తుందని భావిస్తున్న తరుణంలో పిడుగుపాటుగా ప్రైవేటీకరణ అంశం తెరమీదుగా తీసుకురావడం దుర్మార్గపు చర్య అన్నారు. సుమారు రూ.20వేల కోట్లతో పోర్టు సమీపంలో పరిశ్రమలు పెట్టే సంస్థలు తమ స్వార్ధం, ఆదాయం ప్రయోజనాలు చూసుకుంటాయే తప్ప, ప్రజలకు, యువతకు, కార్మికులకు ఉపాధి ఎక్కడ కల్పిస్తారని ప్రశ్నించారు. ఈ నేపద్యంలో ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని పేర్కొన్నారు. లేని పక్షంలో సిపిఐ ప్రజా ఉద్యమం చేపడుతుందని హెచ్చరించారు. ప్రజా సంఘాల నాయకులు మహేశ్వరరావు మాట్లాడుతూ వెనుకబడిన ప్రకాశం జిల్లా అభివృద్ధికి తోడ్పాటు నిచ్చే రామాయపట్నం పోర్టును ప్రైవేటీకరణ చేస్తే జిల్లాలోని ప్రజలు సహించే ప్రసక్తే లేదని తగిన గుణపాఠం చెబుతారని అన్నారు.

7:7.qxd 7/19/2026 11:37 PM Page 1



# నేడే చివరి గడువు

## - ఏఈఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి



**మార్కాపురం, జూలై 19, ప్రభాతవార్త**
విద్యుత్ శాఖలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఏఈఈ) పోస్టుల భర్తీకి విడుదలైన నోటిఫికేషన్‌కు ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ గడువు ఈరోజు (జూలై 20) రాత్రి 11:59 గంటలతో ముగియనున్నట్లు ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ పి పుల్లారెడ్డి తెలిపారు. అర్హత ఉన్నప్పటికీ ఇంకా దరఖాస్తు చేయని అభ్యర్థులు చివరి నిమిషం వరకు వేచి ఉండకుండా, నిర్ణీత గడువులోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు సమర్పించి ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసేముందు అధికారిక నోటిఫికేషన్‌ను పూర్తిగా పరిశీలించి, అవసరమైన పత్రాలను జతచేసి గడువు ముగిసేలోపు దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేయాలని సీఎండీ కోరారు.

# ఇన్ సర్వీస్ టెట్ అభ్యర్థులకు ఎస్టీయూ స్టడీ మెటీరియల్

## - డీఈవో సామ సుబ్బారావు ఆవిష్కరణ



**మార్కాపురం, జూలై 19, ప్రభాతవార్త**
ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయుల టెట్ (పేపర్ 1ఎ) పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థుల కోసం రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) ఆధ్వర్యంలో రూపొందించిన ప్రత్యేక స్టడీమెటీరియల్‌ను మార్కాపురం జిల్లా విద్యాశాఖాధికారి (డీఈవో) సామ సుబ్బారావు ఆదివారం ఆవిష్కరించారు. నిష్ణాతులైన ఉపాధ్యాయులచే రూపొందించిన ఈ మెటీరియల్ టెట్ పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించేందుకు ఎంతో ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా డీఈవో సామ సుబ్బారావు మాట్లాడుతూ రాష్ట్రోపాధ్యాయ సంఘం రూపొందించే ప్రతి స్టడీ మెటీరియల్ నాణ్యతతో పాటు ఉపాధ్యాయుల అనుభవాన్ని ప్రతిబింబిస్తుందని ప్రశంసించారు. 2026 ఎస్ఎస్‌సీ బుల్లెట్ స్టడీ మెటీరియల్‌లోని అంశాల నుంచే సుమారు 90 శాతం ప్రశ్నలు పరీక్షల్లో రావడం, ఎస్టీయూ రూపొందించే మెటీరియల్ నాణ్యతకు నిదర్శనమని పేర్కొన్నారు. ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు కే. ఎర్రయ్య మాట్లాడుతూ టెట్ పేపర్ 1ఏ కు సంబంధించిన తెలుగు, ఇంగ్లీష్, సైకాలజీ, మెథడాలజీ అంశాలను సమగ్రంగా పొందుపరిచి ఈ స్టడీ మెటీరియల్‌ను సిద్ధం చేశామని తెలిపారు. ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులు టెట్ పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించాలనే లక్ష్యంతో దీనిని సిద్ధం చేశామని చెప్పారు. త్వరలో పేపర్ 1ఏ అభ్యర్థుల కోసం ఆఫ్‌లైన్ మోడల్ పరీక్షలను కూడా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అసిస్టెంట్ ఎగ్జామినేషన్ కమిషనర్ కొండారెడ్డి, డీసీఈబీ కార్యదర్శి ఎం సుధాకర్, బంగారు బాల్యం కన్వీనర్ గిరిధర్ శర్మ, గిద్దలూరు ఎంఈఓ అశ్విని కుమార్, ఎస్టీయూ జిల్లా ఆర్థిక కార్యదర్శి సీహెచ్ గాలయ్య, ఉపాధ్యాయ వాణి కన్వీనర్ ఎస్కే యూసఫ్ షరీఫ్, మార్కాపురం మండల శాఖ అధ్యక్షులు అక్కల నారాయణ, ప్రధాన కార్యదర్శి టి వెంకటరమణ, జిల్లా ఉపాధ్యక్షులు పగడాల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

# షైనింగ్ స్టార్ అవార్డుకు ఎంపికైన త్రిపురాంతకం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని



**త్రిపురాంతకం, జులై 19,ప్రభాతావార్త**
స్థానిక మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థిని గజవల్లి మంజు భార్గవి (సిడబ్ల్యూఎస్ఎన్ విద్యార్థిని) షైనింగ్ స్టార్ అవార్డుకు ఎంపికైంది. ఇటీవల నిర్వహించిన పరీక్షల్లో 800 మార్కులకు గాను 762 మార్కులు సాధించడం చెప్పుకోదగిన విషయమే కాబట్టి, ప్రభుత్వం విద్యార్థిని ప్రతిభను గుర్తించి ఈ అవార్డుకు ఎంపిక చేయడం జరిగింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ వై డేవిడ్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, తల్లిదండ్రులు విద్యార్థినిని అభినందించారు.

# స్వర్ణోత్సవాల వేడుకలకు సహకారం అందిస్తాం

## - కళాశాల పూర్వ విద్యార్థులు, గ్రామపెద్దలు





**కంభం, జూలై 19, ప్రభాతవార్త**
కంభం మండలం తురిమెళ్ళ ప్రభుత్వ జూనియర్ కళాశాల స్వర్ణోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా జరిపేందుకు తమ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని కళాశాల పూర్వ విద్యార్థులు ప్రిన్సిపాల్ డాక్టర్ జి సోనీకి హామీ ఇచ్చారు. ఆదివారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ జి సోని అధ్యక్షతన జరిగిన కళాశాల పూర్వ విద్యార్థుల సమావేశంల నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ జి.సోని మాట్లాడుతూ కళాశాల స్వర్ణోత్సవాలు 2027 జనవరిలో ఘనంగా జరగడానికి సహాయసహకారాలు అందివ్వాలని పూర్వ విద్యార్థులను, గ్రామ పెద్దలను, తల్లిదండ్రులను ఆమె కోరారు. దీనిపై పూర్వ విద్యార్థులు, గ్రామ పెద్దలు ఉంటాయని వారు ముక్తకంఠంతో తెలిపారు. సమావేశంలో పాల్గొన్న తురిమెళ్ళ మాజీ సర్పంచ్ నారిశెట్టి వీరమ్మ, స్థలదాత పగడాల వెంకటపతి వారసులు పగడాల నాగేశ్వరరావు పాల్గొని విలువైన సూచనలు, సలహాలు ఇచ్చారు. పది రోజుల్లో మరొక సమావేశం నిర్వహించి కమిటీలు నిర్ణయించి కళాశాల స్వర్ణోత్సవాలు ఘనంగా జరుపుకుందామని వారు తెలిపారు. ఈ సమావేశానికి పూర్వ విద్యార్థులు, కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు. తన మాటకు స్పందించి వచ్చిన పూర్వ విద్యార్థులు గ్రామ పెద్దలు, తల్లిదండ్రులకు ప్రిన్సిపాల్ డాక్టర్ జి సోనీ కృతజ్ఞతలు తెలిపారు.

# నూతన బోరు ఏర్పాటుతో త్రాగునీటి సమస్య పరిష్కారం



**రాచర్ల, జూలై 19, ప్రభాతవార్త**
మండలంలోని చినగానిపల్లి ఎస్సీ కాలనీలో నెలకొని ఉన్న త్రాగునీటి సమస్యను ఆదివారం నూతన బోరు ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించారు. కాలనీలో త్రాగునీటి సమస్య ఉందని ప్రస్తుతం ఉన్న సింగిల్ ఫేస్ మోటార్లకు సరిగా నీరు రావడంలేదని కాలనీ ప్రజలు స్థానిక టిడిపి నాయకుల దృష్టికి తీసుకువెళ్లడంతో స్పందించిన వారు విషయాన్ని గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డికి తెలిపారు. వెంటనే ఆయన స్పందించి ఎంపీపీ నిధులతో బోరు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అధికారులు, స్థానిక నాయకులు శివారెడ్డి, రమణ, ప్రతాప్‌రెడ్డి, శ్రీకాంత్, తదితరులతో కలిసి నూతన బోరు ఏర్పాటు చేశారు. సమస్య పరిష్కారానికి చొరవ చూపిన ఎమ్మెల్యే అశోక్ రెడ్డికి కాలనీ ప్రజలు గ్రామ నాయకులు కృతజ్ఞతలు తెలియజేశారు.

# రాచర్లలో ముమ్మరంగా వాహనాలు తనిఖీ



**రాచర్ల, జూలై 19, ప్రభాతవార్త**
మండల కేంద్రమైన రాచర్లలోని స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలో ఎస్సై శివ తమ సిబ్బందితో కలిసి ఆదివారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ శివ మాట్లాడుతూ ద్విచక్ర వాహన దారులుహెల్మెట్లు ధరించి వాహనాలు నడపాలని పలురకాలుగా అవగాహన కల్పిస్తున్నా హెల్మెట్లు ధరించడం లేదని మీ భద్రత కోసం హెల్మెట్ ధరించాలని చెప్పిన పోలీసులు మాటలు పెడచెవిని పెట్టడం సరికాదన్నారు. ఇప్పటికైనా వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని లేకపోతే జరిమానాలతో పాటు కేసులు తప్పవని హెచ్చరించారు. నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న పలు వాహనాలకు జరిమానా విధించారు. ఈ తనిఖీల్లో స్థానిక పోలీసులు, హోంగార్డులు పాల్గొన్నారు.

# మార్కాపురంలో షైనింగ్ స్టార్స్ - 2026 అవార్డుల ప్రదానోత్సవం




**మార్కాపురం, జూలై 19, ప్రభాతవార్త**
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న "షైనింగ్ స్టార్స్-2026" జిల్లా స్థాయి అవార్డుల ప్రదానోత్సవం సోమవారం ఉదయం 10 గంటలకు మార్కాపురంలోని శతవసంతాల జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఘనంగా జరగనుంది. ఈ కార్యక్రమంలో ఎంపికైన విద్యార్థులకు పతకం, ప్రశంసాపత్రంతో పాటు రూ.20వేల నగదు బహుమతి అందజేయనున్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి అధ్యక్షతన, జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత, ఐఏఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొంటారు. కార్యక్రమానికి పాత్రికేయులు, మీడియా ప్రతినిధులు హాజరై విజయవంతం చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి సామా సుబ్బారావు ఆహ్వానించారు.

# మార్కాపురం వార్త



# కాపు ఉద్యమ నేత

## దివంగత ముద్రగడకు నివాళి

**పొదిలి, జులై 19, ప్రభాతవార్త**
ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కాపు ఉద్యమనేత, మాజీ మంత్రి దివంగత ముద్రగడ పద్మనాభం చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. పొదిలిలో జరిగిన ఈ కార్యక్రమంలో ఒంగోలు పార్లమెంటు అధ్యక్షులు పోగుల మల్లిఖార్జునరావు, జిల్లా కాపునాడు ప్రధాన కార్యదర్శి దాసరి పిచ్చయ్యలు పూలమాల వేసి ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాపు ఉద్యమ నేతగా, మంత్రిగా ఆయన అందించిన సేవలను కొనియాడారు. నివాళులర్పించిన వారిలో నాయకులు బండారు సురేష్, మార్కాపురం కాపు నాడు జిల్లా అధ్యక్షుడు వెలుగోలు కాశి, పొదిలి మండల కాపునాడు అధ్యక్షులు వీరిశెట్టి సురేష్, మండల యువ కాపునాడు అధ్యక్షులు మలిశెట్టి సందీప్, మండల ఉపాధ్యక్షులు చాతరాసి వెంకటేశ్వర్లు, పట్టణ కాపునాడు అధ్యక్షులు ముని శ్రీను, మండలం మహిళా కాపునాడు అధ్యక్షులు గుమ్మడి శిరీష అమర్నాథ్, పట్టణ ప్రధాన కార్యదర్శి పోలుదాసు శ్రీను, ఒంగోలు కాపునాడు మహిళా విభాగం అధ్యక్షురాలు లక్ష్మీ ప్రసన్న, ఎన్.నిర్మల తదితరులు పాల్గొన్నారు.



# బూచేపల్లి, ఆదిమూలపులను కలిసిన మధు



**పామూరు, జులై 19, ప్రభాతవార్త**
వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్‌లను పామూరు మండలానికి చెందిన దొడ్డవెంకటపల్లి వైసీపీ నాయకులు మధుసూదన్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి వారిని సన్మానించారు. ఇటీవల జరిగిన ప్రభుత్వ వ్యతిరేక ఆందోళన కార్యక్రమం సందర్భంగా మధు వారిని కలిసి తన సంఘీభావం తెలిపారు. పామూరు మండలంలో వైసీపీ పార్టీ నాయకులు చేపడుతున్న అనేక ఆందోళన కార్యక్రమాలు, ప్రజా వ్యతిరేక విధానాలపై చేస్తున్న పోరాటాల గురించి వారికి వివరించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మనం 25 పంచాయతీల్లో అభ్యర్థులు నిలిపి ఘన విజయం సాధించేందుకు నియోజకవర్గ ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ ఆదేశాలతో ముందుకు సాగుతున్నట్లు మధుసూదన్‌రెడ్డి తెలిపారు.

# చెట్టు ఢీకొన్న బొలెరో వాహనం

## - వాహన చోదకుడు దుర్మరణం

## - మృతుడు అన్నమయ్య జిల్లా వాసి





**పొదిలి, జులై 19, ప్రభాతవార్త**
మండలంలోని పొదిలి- దర్శి ప్రధాన రహదారిలో ఉన్నగురవాయపాలెం సమీపంలో ఆదివారం వేకువజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో బొలెరో వాహన చోదకుడు షేక్ హర్షద్ వలి(25) అక్కడికక్కడే మృతి చెందాడు. అన్నమయ్య జిల్లా మదనపల్లె నుంచి టమాటా లోడ్‌తో విజయవాడకు వెళ్తున్న బొలెరో వాహనం ఆదివారం వేకువ జామున అదుపు తప్పి చింతచెట్టును బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బొలెరో వాహనానికి యజమాని, వాహన చోదకుడైన హర్షద్ వలి ముందున్న ఇంజిన్ భాగంలో ఇరుక్కుపోయి తీవ్ర గాయాలై అక్కడిక్కడే మృతి చెందాడు. అటుగా వెళ్తున్న వాహన చోదకులు ఇచ్చిన సమాచారంతో మృతుడికి స్నేహితుడైన గడ్డిపాటి వెంకట నాగరాజు ప్రమాద సంఘటన స్థలానికి చేరుకుని బంధువులకు సమాచారం అందించారు. మృతుని స్వగ్రామమైన అన్నమయ్య జిల్లా చినమండెం మండలం బోనపల్లి గ్రామానికి చెందిన బంధువులు, తల్లి పొదిలి ప్రభుత్వ వైద్యశాల వద్దకు చేరుకున్నారు. కుటుంబాన్ని పోషించే పెద్దదిక్కుగా ఉన్న కుమారుడు హర్షద్ వలి రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం పట్ల తల్లి కమ్మరునిషా, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించడం చూపరులను కలిచివేసింది. సంఘటన జరిగిన కొద్దిసేపటికి స్థానిక పోలీసులు విషయం తెలుసుకుని అక్కడికి చేరుకున్నారు. అప్పటికే హర్షద్ వలి మృతి చెందాడు. పొదిలి ఎస్సై రాజేష్ తన సిబ్బందితో సంఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని బయటికి తీసి పంచనామ నిమిత్తం పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. హర్షద్ వలికి తల్లి, ఇద్దరు అక్కలు, ఒక చెల్లులు ఉన్నారు. చేతికి అంది వచ్చిన చెట్టంత కొడుకు, కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉండి బరువు బాధ్యతలు మోస్తున్న కుమారుడు మరణంతో ఆ తల్లి ఒక్క సారిగా కుప్ప కూలిపోయింది. కుటుంబ సభ్యులు కన్నీటిసంద్రంలో మునిగిపోయారు. పొదిలి ఎస్సై రాజేష్ కేసు నమోదు చేసి పంచనామ అనంతరం మృతదేహాన్ని వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

### పెద్దదిక్కు కోల్పోయాం : మృతుడి తల్లి ఆవేదన

ఉన్నగురవాయపాలెం సమీపంలో ఆదివారం వేకువ జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మారణం చెందిన అర్షద్ వలి మృతదేహం వద్ద తల్లి కన్నీరుమున్నీరుగా విలపిస్తుంది. కుటుంబ బాధ్యతలు భుజానికి ఎత్తుకున్న అర్షద్ వలి వాహన చోదకుడి వృత్తిని ఎంచుకుని జీవనం సాగిస్తూ కుటుంబ పోషణ చూసుకుంటున్నాడు. తల్లి, ఇద్దరు అక్కలు, ఒక చెల్లెలు వివాహాలు చేసి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో శభాష్ అనిపించుకున్నాడు. వయస్సు పైబడుతున్న కుటుంబ బాధ్యతలు మోస్తున్న తల్లికి తలలో నాలుకల ఆర్థికంగా నిలబడ్డాడు. ముగ్గురు అక్క చెల్లెల వివాహం అనంతరం ఇటీవలనే చోళ మండలం ఫైనాన్స్‌లో సొంతంగా బొలెరొ వాహనాన్ని కొనుగోలు చేశాడు. సొంత వాహనంతో కుటుంబ జీవనాన్ని నెట్టుకొస్తూ టమోటా ఇతర పచ్చి పంటల రవాణా ఎగుమతికి తన వాహనం ఉపయోగిస్తూ జీవనం సాగిస్తున్న క్రమంలో ఆదివారం నాటి ఘటన ఆ కుటుంబాన్ని చిన్నాభిన్నం చేసింది. టమోటా లోడ్‌తో విజయవాడ వెళ్తున్న వాహనం అదుపు తప్పి చెట్టును ఢీకొట్టి మృతి చెందడంతో చేతికి అంది వచ్చిన కుమారుడు మరణం ఆ కుటుంబం జీర్ణించుకోలేక తల్లడిల్లుతోంది.

# సైనింగ్ స్టార్ అవార్డ్స్‌లో శ్రీ సాధన కళాశాల సత్తా

## - నలుగురు విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వ పురస్కారాలు



**మార్కాపురం, జులై 19,ప్రభాతవార్త**
రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన సైనింగ్ స్టార్ అవార్డ్స్-2026లో మార్కాపురంలోని శ్రీసాధన జూనియర్‌కళాశాల విద్యార్థులు మరోసారి ప్రతిభ చాటారు. జిల్లా స్థాయిలో నలుగురు విద్యార్థులు అవార్డులకు ఎంపికై కళాశాలకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారు. బైపీసీ విభాగంలో ఎం సత్య రజిత 1000కి 990 మార్కులు, ఆర్ భద్ర నాయక్ 1000కి 954 మార్కులు, ఎంపీసీ విభాగంలో ఎ. మాధవి 1000కి 975 మార్కులు, ఎంఈసీ విభాగంలో ఆర్.పీ తేజేశ్వర్ 1000కి 944 మార్కులు సాధించి సైనింగ్ స్టార్ అవార్డులకు ఎంపికయ్యారు. ఎంపికైన ప్రతి విద్యార్థికి రాష్ట్ర ప్రభుత్వం రూ.20 వేల నగదు బహుమతితో పాటు సైనింగ్ స్టార్ అవార్డు అందజేయనుంది. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం డి.రాజగోపాల్‌రెడ్డి, ఎంవి కృష్ణారెడ్డి, విఆర్‌కె ప్రసాద్, జి.లావణ్య, రమేష్ బాబుతో పాటు ప్రిన్సిపాల్ వై.చలమయ్య విజేతలను అభినందించారు. విద్యార్థుల విజయానికి కృషిచేసిన అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందిని ప్రశంసించడంతో పాటు తల్లిదండ్రులకు కూడా అభినందనలు తెలిపారు. వరుస విజయాలతో శ్రీ సాధన జూనియర్ కళాశాల విద్యారంగంలో తన ప్రతిభను మరోసారి నిరూపించుకుందని యాజమాన్యం పేర్కొంది.

# జాతీయ రహదారిపై డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు



**పర్చూరు, జులై 19, ప్రభాతవార్త**
వాడరేవు- పిడుగురాళ్ల జాతీయ రహదారిపై కారంచేడు ఎస్సై ఖాదర్ భాషా ఆధ్వర్యంలో ఆదివారం డ్రంక్ అండ్ డ్రైవ్ ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. వాహనదారులకు బ్రీత్ ఎనలైజర్ పరీక్షలు నిర్వహించి, మద్యం తాగి వాహనాలు నడపవద్దని అవగాహన కల్పించారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. మద్యం మత్తులో వాహనాలు నడపటం వల్ల ప్రమాదాలు జరిగి ప్రాణనష్టం సంభవించే అవకాశం ఉందని తెలిపారు. వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, డ్రైవింగ్ సమయంలో సీట్ బెల్టు ధరించడం, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ వినియోగించడం తప్పనిసరి అని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

# లక్ష్మీ సామ్రాజ్యం నేత్రాలు దానం



**మార్టూరు, జులై 19, ప్రభాతవార్త**
రోటరీ క్లబ్ ఆఫ్ మార్టూరు ఆధ్వర్యంలో నేత్రదానం కార్యక్రమం జరిగింది. గుంటుపల్లి గ్రామస్తులు పుచ్చకాయల లక్ష్మీ సామ్రాజ్యం మరణించారు. ఆమె నేత్రాలను కుటుంబ సభ్యులు రోటరీ క్లబ్ ఆఫ్ మార్టూరు వారి సహకారంతో పెద్ద కాకాని శంకర్ కంటి ఆసుపత్రి వారికి నేత్రాలను దానం చేశారు. వైద్యులు మృతురాలి కార్నియాలను సేకరించారు. ఈ సందర్భంగా కుమారుడు రొటేరియన్ పుచ్చకాయల సుబ్బరామయ్యకి, కుటుంబ సభ్యులకు రొటరీ అధ్యక్షులు కొరపాటి సుబ్రహ్మణ్యం, సెక్రటరీ కాకోలు వెంకటేశ్వర్లు, ట్రెజరర్ గరిమిడి శ్రీనివాసరావు, రీజనల్ చైర్మన్(ఆర్గాన్ డొనేషన్), రావి అంకమ్మ చౌదరి, క్లబ్ సభ్యులు అభినందనలతో పాటు కృతజ్ఞతలు తెలిపారు.

# ఇసుక దర్శి- అంబడిపూడికి రూ.6 కోట్ల బీటీ రోడ్డు

## - ఎమ్మెల్యే ఏలూరి చొరువతో పనులకు శ్రీకారం



**మార్టూరు, జులై 19, ప్రభాతవార్త**
దశాబ్దాలుగా మెరుగైన రహదారి కోసం ఎదురుచూస్తున్న ఇసుక దర్శి, అంబడిపూడి గ్రామాల ప్రజల చిరకాల ఆకాంక్ష నెరవేరనుంది. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రత్యేక చొరువతో ఇసుక దర్శి నుంచి అంబడిపూడి వరకు రూ.6కోట్ల వ్యయంతో బీటీ రహదారి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ రహదారి నిర్మాణంతో గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం అందుబాటులోకి రానుంది. ముఖ్యంగా రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్ యార్డులు, కొనుగోలు కేంద్రాలకు తక్కువ సమయంలో తరలించుకునే అవకాశం కలగనుంది.

# తాళ్లూరులో ఉచిత మెగా వైద్య శిబిరం విజయవంతం

## - 300 మందికి ఉచిత వైద్య సేవలు.. మందుల పంపిణీ



**కనిగిరి, జులై19, ప్రభాతవార్త**
గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో కేకే మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో తాళ్లూరు గ్రామంలోని పాత సచివాలయం సమీపంలో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరానికి తాళ్లూరు, కనిగిరి పరిసర గ్రామాల నుంచి సుమారు 300 మంది రోగులు హాజరై ఉచిత వైద్య సేవలను పొందారు. ఈ సందర్భంగా డాక్టర్ నంబుల మాల్యాద్రి(జనరల్, లాపరోస్కోపిక్, లేజర్ సర్జన్), డాక్టర్ పామర్తి శ్వేత(క్రిటికల్ కేర్ స్పెషలిస్టు) ,డాక్టర్ కొలిపర్తి మౌనిక(స్త్రీల వ్యాధుల నిపుణులు) రోగులను పరీక్షించి ఆరోగ్య పరిస్థితులకు అనుగుణంగా వైద్య సలహాలు అందించారు. శిబిరంలో షుగర్, రక్తపోటు, ఈసీజీ పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. అలాగే థైరాయిడ్ సమస్యలు, సిస్టులు, వెరికోజ్ వేన్స్, ఫైల్స్, ఫిస్టులా, ఇతర శస్త్ర చికిత్స అవసరమయ్యే వ్యాధులతో బాధపడుతున్న వారికి నిపుణుల సూచనలు అందించి తదుపరి చికిత్సపై అవగాహన కల్పించారు. పరీక్షల అనంతరం అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రత్యేక వైద్యులను అందుబాటులోకి తీసుకువచ్చి ఒకే చోట పలు వైద్య సేవలు అందించడంతో శిబిరానికి వచ్చిన ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. వైద్యులు సేవాభావాన్ని అభినందిస్తూ ఇటువంటి ఉచిత వైద్య శిబిరాలను తరచూ నిర్వహించాలని కోరారు. ఈ సందర్భంగా డాక్టర్ నంబుల మాల్యాద్రి మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణే తమ ప్రధాన లక్ష్యమని, భవిష్యత్తులో కూడా గ్రామీణ ప్రాంతాల్లో మరిన్ని ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి నాణ్యమైన వైద్య సేవలను ప్రజలకు చేరవేస్తామని తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన వైద్య బృందానికి, సిబ్బందికి సహకరించిన గ్రామ పెద్దలకు, ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# అంగరంగ వైభవంగా ధార్విక్ నామకరణ మహోత్సవం





**కనిగిరి, జులై 19, ప్రభాతవార్త**
కనిగిరి పట్టణానికి చెందిన ప్రముఖ ఆర్యవైశ్య ప్రముఖులు, వార్త జాతీయ దినపత్రిక జర్నలిస్టు కొలిపాకుల దుర్గా శ్రీనివాసరావు- సత్యవతి దంపతుల మనవడు, కొత్తూరి ప్రవీణ్ కుమార్- లక్ష్మీ రేవతి దంపతుల కుమారుడు కొత్తూరి ధార్విక్ నామకరణ మహోత్సవం ఆదివారం గోనుగుంట్ల కన్వెన్షన్ హాల్‌లో అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేద మంత్రోచ్ఛరణల నడుమ సంప్రదాయబద్ధంగా జరిగిన ఈ కార్యక్రమానికి కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, వాసవి సత్ర సముదాయాల జాతీయ అధ్యక్షులు దేవకి వెంకటేశ్వర్లు, తెలుగుదేశం పార్టీ నాయకులు కొలిపర్తి మారుతి కుమార్, షిర్డీ సాయిబాబా దేవస్థానం అధ్యక్షులు కొప్పరపు సత్యాలు, ఉపాధ్యాయుడు అద్దంకి రంగా, దేవకి సుబ్రహ్మణ్యం, దేవకి శ్రీనివాసులు, గోపాల్ సిండికేట్ అధినేత గోనుగుంట్ల పవన్ కుమార్‌తో పాటు పట్టణ ప్రముఖులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ఉద్యోగులు, ఆర్యవైశ్య ప్రముఖులు, జర్నలిస్టులు, బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో హాజరై చిన్నారి ధార్విక్‌ను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు కొత్తూరి జాన్వి, బొంతల శ్రీకాంత్- సింధూరి, ఆనంద కృష్ణ, వెంకట శ్రీ మోక్షిత్, ఉరిమి ప్రవీణ్ కుమార్, వెంకట అశ్విని, రియాన్స్ చేతుల మీదుగా నామకరణ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం కొలిపాకుల దుర్గా శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు విచ్చేసిన అతిథులను ఆత్మీయంగా ఆహ్వానించి విందు ఏర్పాటు చేశారు. చిన్నారి ధార్విక్‌కు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో కూడిన ఉజ్వల భవిష్యత్తు కలగాలని పలువురు ప్రముఖులు, బంధుమిత్రులు ఆశీర్వదించి కటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

# కనిగిరిలో మైనార్టీ నాయకుల సమావేశం.. పార్టీ బలోపేతానికి కార్యచరణ



**కనిగిరి, జులై 19, ప్రభాతవార్త**
కాంగ్రెస్ పార్టీని గ్రామ స్థాయి నుంచి మరింత బలోపేతం చేయడంతో పాటు మైనార్టీ వర్గాలను పార్టీలోకి చేర్చే లక్ష్యంతో కనిగిరి నియోజకవర్గ మైనార్టీ విభాగం ఆధ్వర్యంలో ఆదివారం కనిగిరిలో సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఉమ్మడి ప్రకాశం జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం చైర్మన్ డాక్టర్ షేక్ మహబూబ్ వలి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కార్యకర్తలు సమిష్టిగా పని చేయాలని, మైనార్టీల సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా జిల్లా మైనార్టీ విభాగం ఉపాధ్యక్షుడు షేక్ అబ్దుల్ కలాం ఆధ్వర్యంలో మూడు కుటుంబాలకు చెందిన సభ్యులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కనిగిరి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ మహబూబ్ పీరా, కనిగిరి నియోజకవర్గ మైనార్టీ విభాగం చైర్మన్ షేక్ మక్బూల్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో కనిగిరి పట్టణ మైనార్టీ విభాగం చైర్మన్ షేక్ ఖాశీం, కనిగిరి మండల మైనార్టీ విభాగం చైర్మన్, హెచ్‌ఎంపాడు మండల మైనార్టీ విభాగం చైర్మన్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. పార్టీలో చేరిన వారిని నాయకులు అభినందిస్తూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ong-8_ong-8.qxd 7/19/2026 10:47 PM Page 1



## రోటరీ ఆధ్వర్యంలో చేతి వ్రాత శిక్షణా తరగుతులు

**అద్దంకి, జులై 19, ప్రభాతవార్త**



రోటరీ క్లబ్ సింగర్ కొండ అద్దంకి ఆధ్వర్యంలో, ఎపిటిఎఫ్ ముండ్లమూరు శాఖ సౌజన్యంతో, క్యాలిగ్రఫీ(చేతి వ్రాత) ట్రైనింగ్ స్థానిక ప్రకాశం ప్రభుత్వం బాలుర పాఠశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమం లో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వి రామ్మోహన్ రావు బృందం ఉపాధ్యాయులకు క్యాలిగ్రఫీ లో ట్రైనింగ్ ఇచ్చి వారిని, వారి పాఠశాలలో పిల్లలకు చేతి వ్రాత నేర్పటానికి శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అద్దంకి ఎంఈఓ2 కెవి శ్రీనివాసరావు, పంగులూరు ఎంఇఒ షేక్ కాలీష వలి, సంతమాగులూరు ఎంఇఒ దినేష్ కుమార్, రోటరీ అధ్యక్షులు పువ్వాడ రామ కోటేశ్వరరావు, సెక్రెటరీ కరి రామయ్య,ట్రెజరర్ గూడా లక్ష్మీ రెడ్డి, పూర్వాధ్యక్షులు పూర్ణ చంద్రరావు, తాతా హరిబాబు, అద్దంకి లేవి ప్రసాద్, బి. ఎలీషా, బి. శ్రీనివాసరావు, చప్పిడి వీరయ్య, స్థానిక ఉపాధ్యాయులు 60 మంది పాల్గొన్నారు.

## వాసవి క్లబ్ ఆధ్వర్యంలో రక్తదానం



**అద్దంకి, జులై 19, ప్రభాతవార్త :**

వాసవి క్లబ్ అద్దంకి ఆధ్వర్యంలో మాజీ ట్రెజరర్ వేముల జయరామ్ విజయవాడ మణిపాల్ హాస్పిటల్ నందు పోలిశెట్టి శ్రీనివాసరావుకు బైపాస్ సర్జరీ జరుగుతుంది. వారికి రక్త దానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆత్మకురి సాయి, క్యాబినెట్ జాయింట్ ట్రెజరర్ వి వి ఆదినారాయణ పాల్గొన్నారు.

## గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు

**అద్దంకి, జులై 19, ప్రభాతవార్త :**



హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్ ఆధ్వర్యంలో వాసవి మహిళల ఆధ్వర్యంలో ఆషాడ మాసం ఆదివారం సందర్భంగా, అద్దంకి గ్రామ దేవతలు గంగమ్మ, పోలేరమ్మ అమ్మ వార్లకు సారె సమర్పించే మనసారా మన సారె కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 101 మంది మహిళలు పాల్గొన్నారు.

## మొక్కలు వేద్దాం, ఆరోగ్యంగా జీవిద్దాం

**అద్దంకి, జులై 19, ప్రభాతవార్త :**



రోటరీ క్లబ్ ఇంటర్నేషనల్ నిర్దేశిత కార్యక్రమాల మేరకు రోటరీ క్లబ్ ఆఫ్ సింగరకొండ అద్దంకి ఆధ్వర్యంలో రోటరీ ప్లాంటేషన్ ఆర్గనైజర్ మన్నం త్రిమూర్తులు సౌజన్యంతో అద్దంకి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కాకాని పాలెంలో చదలవాడ మోహన్ రావు, శ్రీధర కుమారి మెమోరియల్ పార్క్ ( వేలమూరుపాడు రోడ్డు ), మామిడి, జామ, సపోటా, చెర్రీ, సీతాఫలం, చీమచింత, బాదం, గానుగ, తురాయి, పూల మొక్కలు 50 మొక్కలకు పైగా వేయడం జరిగింది. రోటరీ ప్రెసిడెంట్ పువ్వాడ రాంకోటేశ్వరావు మాట్లాడుతూ మొక్కలే మన నేస్తాలు అని అవే మన ఆరోగ్య కేంద్రాలని అన్నారు. పర్యావరణ పరిరక్షకులు, రోటరీ ప్లాంటేషన్ ఆర్గనైజర్ మన్నం త్రిమూర్తులు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రత ప్రతి ఒక్కరి జీవితంలో భాగమైనప్పుడే ఆరోగ్యకరమైన సమాజాన్ని చూడగలమని త్రిమూర్తులు అన్నారు. ఆరోగ్య కేంద్రానికి 100 అడుగుల వాటర్ పైపు రోటరీ ప్రెసిడెంట్ రామకోటేశ్వరరావు స్పాన్సర్ చేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ సెక్రటరీ కర్రీ రామయ్య, ట్రెజరర్ లక్ష్మారెడ్డి, చప్పిడి వీరయ్య, సంధి రెడ్డి శ్రీనివాసరావు, మల్లాది శ్రీనివాసరావు, కోవి శ్రీనివాసరావు,లేవీ ప్రసాద్, అంజాద్‌బాషా, భాస్కర్ రావు పాల్గొన్నారు.

## దెబ్బతిన్న మైనంపాడు రహదారి

**సంతనూతలపాడు, జులై 19, ప్రభాతవార్త**



సంతనూతలపాడు నుండి మైనంపాడు వెళ్లే రహదారి పలు ప్రాంతాల్లో భాగా దెబ్బతింది. సంతనూతలపాడు నుండి మైనంపాడు కేంద్రానికి సుమారు మూడు కిలోమీటర్ల దూరం కలదు. ఈ రహదారిలో పలు ప్రాంతాల్లో రోడ్డు గంటలమయమైంది. దీని వల్ల రాత్రి వేళలో దెబ్బతిన్న ఈ రహదారిలో ప్రయాణించాలంటే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో రహదారి భాగా దెబ్బతినడంతో రోడ్డు మార్జిన్ నుంచి వాహనదారులు పయనించాల్సి వస్తుంది. ముఖ్యంగా మలుపుల వద్ద ఎటువంటి సిగ్నల్స్ లేకపోవడం ప్రమాదకరంగా మారింది. దెబ్బతిన్న ఈ రహదారికి మరమ్మత్తులు నిర్వహించి ప్రమాదాలు నివారించాల్సిందిగా వాహనదారులు కోరుతున్నారు.

## ఎమ్మెల్యే విజయ్ కుమార్ కార్యాలయంలో జరిగిన ప్రజా దర్బార్‌కు 45 అర్జీలు

**సంతనూతలపాడు, జులై 19, ప్రభాతవార్త**



ఒంగోలులోని సంతనూతలపాడు శాసనసభ్యులు బీఎన్ విజయ్ కుమార్ కార్యాలయంలో ఆదివారం నాడు జరిగిన ప్రజా దర్బార్‌కు నియోజకవర్గ పరిధిలోని వివిధ వర్గాలకు చెందిన వారి నుండి వివిధ సమస్యలకు సంబంధించి 45 అర్జీలు వచ్చాయి. బాధితులు ఎమ్మెల్యే విజయ్ కుమార్‌కు తమ సమస్యలపై వివరించి అనంతరం వినతిపత్రాలు అందజేశారు. ముఖ్యంగా ఇళ్ల స్థలాలు, రేషన్ కార్డులు, నూతన పెన్షన్‌లు, గృహ నిర్మాణ అనుమతులు, తదితర వాటికి సంబంధించి అధికంగా అర్జీలు వచ్చాయి. ఆయా అధికారులతో ఎమ్మెల్యే విజయ్ కుమార్ ఈ సందర్భంగా ఫోన్లో మాట్లాడి పరిష్కార చర్యలు చేపట్టారు. కొన్ని సమస్యలకు సంబంధించి అక్కడికక్కడే ఎమ్మెల్యే విజయ్ కుమార్ పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

## మృతిచెందిన మేకతో నిరసన

**సంతనూతలపాడు, జూలై 19.ప్రభాతవార్త**



మండలంలోని మైనంపాడు గ్రామంలో బత్తుల శీను, సుజాత లకు చెందిన దేవర మేకపోతును అదే గ్రామానికి చెందిన రెబ్బవరపు అవి నాష్, అల్లడి చిరంజీవి, దాసరి వేణులు మోటార్ సైకిల్ పై వస్తూ స్థానిక హై స్కూల్ ప్రాంతంలో ఆది వారం సాయంత్రం ఢీకొట్టుగా మృతి చెందినది. దీనిపై వారు తమకు న్యాయం చేయకపోగా తమపై రుబాబు చేసి తమ ఇంటికి వచ్చి గొడవకు దిగుతున్నారని బాధితులు శీను, సుజాతలు వాపోయారు. దీనిపై యాదవ సంఘం ఆధ్వర్యంలో మృతి చెందిన మేకపోతుతో సంతనూతలపాడు పోలీస్ స్టేషన్ వద్దకు పలువురు ఆదివారం రాత్రి చేరుకొని నిరసన వ్యక్తం చేశారు. మృతి చెందిన మేకపోతుతో యాదవ్ సంఘ నాయకులు స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద తమకు న్యాయం చేయాలని ఆందోళన వ్యక్తం చేశారు. తమ మేకపోతుని గుద్ది తమకు న్యాయానికి బదులుగా వారు తమపై రుబాబు చేస్తున్నారని యాదవ సంఘం నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. అంతేకాకుండా మేకపోతుని గుద్ది న వారు తమ గొర్రెల మంద ప్రాంతానికి వచ్చి తమపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని యాదవ సంఘం నాయకులు, బాధితులు, సంతనూతలపాడు పోలీసు లకు ఫిర్యాదు చేశారు. అదేమంటే తమ మేకపోతుని గుద్ది తీరా తమపైనే ఎస్సీ ఎస్టీ కేసు పెడతామని బెదిరిస్తున్నారని బాధితులు ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు బత్తుల శీను, సుజాత, పెరుగు రాము, కొనికి కోటేశ్వరరావు, కిలారి పెద్దబ్బాయి, పెరుగు కృష్ణ, మంగమూరు శీను, కే సుబ్బారావు, పి.వేణు, నల్లగట్ల సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు. మోటార్ సైకిల్ ఢీ కొట్టిన సంఘటనలో 80 వేల రూపాయలు విలువ చేసి చేసే తమ మేకపోతు మృతి చెందినట్లు బాధితులు ఈ సందర్భంగా ఆందోళన వ్యక్తం చేశారు. తమ మేకపోతు మృత్యు వాతకు కారణమైన నిందితులపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని వారు ఈ సందర్భంగా కోరారు.

## గ్రామ దేవతల ఆలయాలలో ప్రత్యేక పూజలు

**బల్లికురవ జులై 19( ప్రభాతవార్త)**



ఆషాడ మాసం సందర్భంగా గ్రామదేవతల ఆలయాలలో ఆదివారం ప్రత్యేక పూజలు కొనసాగుతున్నాయి. ఏర్ల గంగమ్మ తల్లి పోలేరమ్మ తల్లి గొర్రెపాడు అంకమ్మ తల్లి రేణుకమ్మ తల్లి ఆలయాలలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఆలయాలలోని అమ్మవారి విగ్రహాలకు సువర్ణ శోభితమైన అలంకారములతో పాటు, రంగు రంగుల పూలతో శోభాయా మానంగా అలంకరణలు, కొనసాగాయి. పలువురు గ్రానైట్ కంపెనీల యాజమాన్య ప్రతినిధులు గంగమ్మ తల్లికి తమ మొక్కుబడులు చెల్లించుకున్నారు. నూతన వాహనాల పూజ కోసం వాహనాలు బార్లు తీరాయి. అయితే అమ్మవారి ఎగువ భాగాన గ్రానైట్ గనిలో పనులు కొనసాగుతుండటంతో భక్తులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. రాళ్లు ఎప్పుడు జారిపడతాయో, పేలుళ్లు ఎప్పుడు నిర్వహిస్తారో తెలియక భక్తులకు ఆందోళన మాత్రం తప్పలేదు.

## వినాశకాలే విపరీత బుద్ధి..

*- ఆలయాలను మింగాలనుకుంటున్న గనుల నిర్వాహకులు*

*- మహాకూటమి నేతలు సనాతన వాదులు స్పందించాలి*

**బల్లికురవ జులై 19(ప్రభాతవార్త)**



ఆలయం అనేది, ప్రకృతికి, మనిషికి, పరమాత్మకు మధ్య అనుసంధానాన్ని పెంచే ఒక పవిత్ర స్థలం. హిందూ దేవాలయాలు సాంప్రదాయం, కళలు, సనాతన ధర్మ ఆదర్శాలు, నమ్మకాలకు ప్రతీకలు గా నిలుస్తాయి. సనాతన ధర్మ ఆదర్శాలు, నమ్మకాలు, విలువలు హిందూమతం ఆచరించే జీవన విధానం యొక్క సమ్మేళనాన్ని ప్రతిబింబిస్తాయి. అలాంటి స్వయంభుగా వెలిసిన మండలంలోని ఈర్ల గంగమ్మ తల్లి దేవాలయం, కొనిదేనగ్రామంలోని బ్రహ్మగుండం ఎంతో మహిమాన్వితమైన క్షేత్రాలు గా పేరు పొందాయి. అంతటి మహిమాన్విత క్షేత్రాల మనుగడ గ్రానైట్ గనుల పుణ్యమా అని నేడు ప్రశ్నార్థకంగా మారనుంది. వందల సంవత్సరాల నాటి చరిత్రకు ప్రత్యక్ష సాక్ష్యంగా, భక్తజన కోటి నుండి పూజలందుకుంటున్న ఈ క్షేత్రాలను



కాపాడుకోవాల్సిన బాధ్యత సనాతన హిందూ బంధువులందరికీ ఉంది. ఇందులో భాగంగా భారతీయ జనతా పార్టీ యువమోర్చా నేత శ్రీరామ్ తొలి అడుగు వేశారు. వినాశకాలే విపరీత బుద్ధి అన్న చందంగా స్థానిక ఎస్సార్ గ్రానైట్ గంగమ్మ ఆలయం తల బాగాన పేలుళ్లు నిర్వహిస్తూ హిందూ బంధువులకు సవాల్ విసురుతుంది. ఏకంగా ఆలయమే తమ క్వారీలో భాగం అన్నట్లుగా వ్యవహరిస్తూ, మా బిక్షతో ఆలయం కొనసాగుతుంది అన్న వ్యవహార శైలి వారిది. అదేవిధంగా బ్రహ్మగుండం క్షేత్రం అత్యంత మహిమాన్వితమైనది. పక్కనే గ్రానైట్ క్వారీ నిర్వాహకులు గ్రానైట్ వ్యర్థాలను క్షేత్రం వైపు పడవేస్తూ క్షేత్రాన్ని ఆక్రమించుకోవడం మరి ఎంతోసేపు పట్టదు అన్న విధానంగా ముందుకు పోతుంటారు. మహాకూటమి ప్రభుత్వంలోని హిందూ ధర్మ పరిరక్షకులు, సనాతన ధర్మవాదులు, ఈ క్షేత్రాల మనుగడ పై దృష్టి సారించకపోతే ,పాలకులు చెప్పే మాటలు ప్రకటనలకే పరిమితం అవుతాయనటంలో ఏమాత్రం సందేహం లేదు.

## పాతమాగులూరులో మెగా వైద్య శిబిరం

*- 700 మందికి పైగా వైద్య పరీక్షలు నిర్వహణ*

*- నరసరావుపేట ఏషియన్ వైద్యశాల వైద్యులచే వైద్యపరీక్షలు*

*- కుమ్మెత మల్లారెడ్డి జ్ఞాపకార్థంగా మెగా వైద్య శిబిరం ఏర్పాటు*

**సంతమాగులూరు, జూలై 19, ప్రభాతవార్త**



మండలంలోని పాత మాగులూరు గ్రామంలో ఆదివారం మెగా ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన ఏఆర్కె ఫుడ్స్ సంస్థ అధినేత కుమ్మెత అంజిరెడ్డి పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట లో స్థిరపడి పాత్రికేయ వృత్తి లో కొనసాగుతున్నారు . తన తండ్రి కుమ్మిత మల్లారెడ్డి 18వ జ్ఞాపకార్థం సందర్భంగా పల్నాడు జిల్లా నరసరావుపేట పట్టణంలోని ఏషియన్ హాస్పిటల్ అధినేత వైద్యులు పి వంశీనాథ్ రెడ్డి, కొండారెడ్డి త్రివేణి లచే ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ముందుగా వైద్య శిబిరాన్ని మండల టిడిపి అధ్యక్షుడు చేవూరి వాసు రెడ్డి సర్పంచుల సంఘం మండల మాజీ అధ్యక్షుడు సన్నిబోయిన గురు యాదవ్ లు రిబ్బన్ కట్ చేసిప్రారంభించారు. అనంతరం కుమ్మెత మల్లారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ ఉచిత మెగా వైద్య శిబిరంలో గ్రామం తో పాటు చుట్టుపక్కల గ్రామాల వారు సుమారు 700 మందికి పైగా వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికీ ఉచితంగా మందులను పంపిణీ చేశారు. వైద్య పరీక్షల కొరకు వచ్చిన వారు కాకుండా గ్రామం మొత్తానికి సుమారు 2000 మందికి పైగా అంజిరెడ్డి అన్నదాన కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షులు ఎనుబర్ల ఎల్లమంద, చేవూరి వాసురెడ్డి, మండల సర్పంచ్ లా సంఘం మాజీ అధ్యక్షులు సన్నెబోయిన గురు బ్రహ్మం, వైసీపీ నాయకులు గడ్డం సుబ్బారెడ్డి, గడ్డం నర్సిరెడ్డి, గ్రామ మాజీ సర్పంచ్ జిర్రా విజయ్ బాబు, బలుపునూరి అమరం, వైద్యులు విజయ్ కుమార్, మణిశ్రీ, షేక్ సుభాని, వైద్యశాల మేనేజర్ వెంకటరెడ్డి, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## పమిడాల ట్రస్టుకు రామిశెట్టి వారి విరాళం

**వేటపాలెం, జూలై 19, ప్రభాతవార్త**



వేటపాలెం మండలం పందిళ్ళ పల్లి వాస్తవ్యులైన రామిశెట్టి వెంకటేశ్వర్లు జ్ఞాపకార్థం వారి భార్య విద్యా రాణి, వారి కుమార్తెలు కావ్య, బిందులు పమిడాల చెంచయ్య మరియు రాఘవమ్మ ట్రస్ట్ వారు చేస్తున్న వైద్య సేవలు గురించి తెలిసి వాళ్ళ అత్తయ్య రామిశెట్టి రాధ ద్వారా ట్రస్టు వారికి 5500 రూపాయలు విలువ గల డ్రెస్సింగ్ మెటీరియల్ ను పేద వారికి వైద్య సహాయం నిమిత్తం ఆదివారం నాడు ట్రస్ట్ కు అందించారు. వారీ అన్నయ్య రామిశెట్టి వెంకటేశ్వర్లు ప్రధానోపాధ్యాయులు గా సేవలు అందించారు. వారీ మీద ప్రేమతో పేద ప్రజలకు తన వంతుగా సహాయం చేయదలచి ట్రస్ట్ వారికి అందించినారు. ఈయన ట్రస్టు నిర్వహణ కర్త పమిడాల సుబ్బారావు కి కూడా గురువు. ఈ కార్యక్రమంలో పందిళ్ళ పల్లి గ్రామ పెద్దలు మరియు పేషెంట్లు పాల్గొన్నారు. ఆమె దాతృత్వ గుణమునకు ట్రస్టు వారు ప్రత్యేక ధన్యవాదములు తెలిపినారు.

## రోటరీ క్లబ్ ద్వారా విస్తృత సేవలు అందించాలి

**చీమకుర్తి, జూలై 19, ప్రభాతవార్త**



రోటరీ క్లబ్ ద్వారా చీమకుర్తి ప్రాంతంలో ప్రజలకు మరింత విస్తృతమైన సేవలు అందిద్దా మని ఆ క్లబ్ వ్యవస్థాపక అధ్య క్షులు చెరుకూరి రఘు కిరణ్ కోరారు. చీమకుర్తి ముత్యాల కన్వెన్షన్ హాల్లో ఆదివారం రోటరీ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం జరిగింది. నూతన అధ్యక్షునిగా పి శ్రీనివాసమూర్తి, ప్రధాన కార్యదర్శిగా నా గళ్ళ సత్యం, కోశాధికారిగా గుడ్డ శంకర్రావు ప్రమాణస్వీకారం చేశారు. పూర్వపు అధ్యక్ష కార్యదర్శులు తొగటి శ్రీనివాసరావు, పారిల్ల శ్రీనివాసరావు వారి హయాంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. క్లబ్బు పిడిజి రాజశేఖర్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు.ప్రభుత్వ హైస్కూల్‌కు స్పోర్ట్స్ కిట్టును బహుకరించారు. మహా ప్రస్థానంలో మొక్కలు నాటారు. క్లబ్ సభ్యులు శిద్దా సురేష్, గొల్లపూడి వెంకట్రావు, యడ్లపల్లి రామ బ్రహ్మం, అంబటి వీరారెడ్డి,మున్సిపల్ కమిషనర్ వై రామకృష్ణయ్య, పిఇటి స్వరూపరాణి పాల్గొన్నారు.

## దేశం గర్వించేలా జపాన్ ఓపెన్‌లో పీవీ సింధు సంచలన విజయం

**- డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ**

**దర్శి, జులై 19, ప్రభాతవార్త**



దేశం గర్వించేలా జపాన్ ఓపెన్‌లో పీవీ సింధు సంచలన విజయం సాధించిన దర్శి టీడీపీ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మీ పేర్కొన్నారు. ఉత్కంఠ పోరులో విజయంతో సింధు సరికొత్త మైలురాయి లిఖించారన్నారు. భారత బ్యాడ్మింటన్ చరిత్రలో చారిత్రాత్మక ఘట్టం అన్నారు. అద్భుత విజయం అందుకున్న సింధుకు అభినందనలు తెలిపారు. రాబోయే ఒలంపిక్స్ బరిలో కూడా ఇదే జోరు కొనసాగించాలన్నారు. దేశానికి పసిడి పథకాన్ని తీసుకురావాలని ఆకాంక్షిస్తున్నానన్నారు.

## దర్శి యువ కళాకారుడికి అరుదైన గౌరవం

**దర్శి, జులై 19, ప్రభాతవార్త**



దర్శి మండలం బొట్లపాలెం గ్రామానికి చెందిన యువ నాదస్వర విద్యాంసుడు గోనుగుంట నాగరాజు ప్రతిష్ఠాత్మకమైన ఆల్ ఇండియా రేడియో నిర్వహించిన ఆడిషన్‌లో ప్రతిభ కనపరిచి బి-గ్రేడ్ నాదస్వర ఆర్టిస్టుగా ఎంపికయ్యారు. 2024లో నిర్వహించిన ఆడిషన్‌లో తన సంగీత ప్రతిభతో న్యాయనిర్ణేతలను ఆకట్టుకున్న నాగరాజు ఈ అరుదైన గుర్తింపును సొంతం చేసుకున్నారు. దర్శి ప్రాంతానికి చెందిన కళాకారుడికి నాదస్వర విభాగంలో ఈ స్థాయి గుర్తింపు పొందడం విశేషంగా నిలిచింది. త్వరలో విజయవాడలోని ఆల్ ఇండియా రేడియో కేంద్రంలో ఆయనకు బిగ్రేడ్ సర్టిఫికేట్‌తో పాటు నగదు ప్రోత్సాహకం అందజేయనున్నారు. ఈ సందర్భంగా గోనుగుంట నాగరాజుకు బంధువులు, స్నేహితులు, గ్రామస్తులు, సంగీతాభిమానులు, పలువురు ప్రముఖులు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ ఆయన మరెన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

## శ్రీవారిని దర్శించుకున్న డాక్టర్ బూచేపల్లి

**దర్శి, జులై 19, ప్రభాతవార్త**



తిరుపతి తిరుమలలో కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వరస్వామిని ఆదివారం దర్శించుకున్న దర్శి ఎమ్మెల్యే, ప్రకాశం జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ, బూచేపల్లి కుటుంబ సభ్యులు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పూజా కార్యక్రమంలో పాల్గొని దేవుని ఆశీర్వాదాలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో బూచేపల్లి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ట్రాన్స్‌ఫార్మర్ దొంగతనాలపై అవగాహన

**ముండ్లమూరు, జులై 19, ప్రభాతవార్త**



ఈ మధ్య కాలంలో ట్రాన్స్ ఫార్మర్ దొంగతనాలు ఎక్కువగా కావడంతోటి రైతుల సమన్వయంతో ట్రాన్స్ ఫార్మర్ వద్ద కాపలా కాయుటకు దొంగతనాలు అరికట్టుటకు తీసుకోవాల్సిన చర్యల గురించి రైతులతో మాట్లాడి అవగాహన కల్పించడం జరిగింది. ఈ క్రమంలో రాత్రిపూటపొలాలలో ఎవరైనా కొత్త వ్యక్తులు కనపడితే వారి గురించి వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ట్రాన్స్ ఫార్మర్ దొంగలను పట్టుకునే దానికి ప్రత్యేక బృందాలను దర్శి సీఐ ఆధ్వర్యంలో ముండ్లమూరు, కురిచేడు, తాళ్లూరు ఎస్సైలను మూడు టీమ్‌లుగా ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశంలో ముండ్లమూరు మండల ఎలక్ట్రికల్ ఏఈ అంకబాబు పాల్గొన్నారు.

## జిల్లా కాపుసంఘం ఆధ్వర్యంలో ముద్రగకు నివాళి

**ఒంగోలు, ప్రభాతవార్త**



జిల్లా కాపుసంఘం ఆధ్వర్యం లో ఒంగోలు రామనగర్ ప్రకాశం జిల్లా కాపు సంఘం కార్యాలయం నందు ముద్రగడ పద్మనాభం "సంతాప సభ" నిర్వహించారు. సభ నందు ముద్రగడ పద్మనాభం పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబానికి మా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ వారికి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ప్రకాశం జిల్లా కాపు సంఘం అధ్యక్షుడు కొక్కిరాల సంజీవకుమార్, కాపుసంఘం నాయకులు అయినాబత్తిన ఘనశ్యామ్, తోట రామస్వామి, చిట్టెం వెంకటేశ్వర్లు, నరహరి సాంబయ్య,జేష్ఠ ప్రసాద్,ఉమ్మిడిశెట్టి శ్రీనివాస రావు,నారపుశెట్టి రామమోహన్, నరహరి దుష్యంత్ మాట్లాడుతూ ముద్రగడ పద్మనాభం రాజకీయ ప్రస్తానంలో యమ్.యల్.ఏగా, మంత్రిగా, యమ్.పిగా నీతి,నిజాయితీ అంటే ముద్రగడ అని పేరు ప్రఖ్యాతులు సంపాదించారన్నారు. ఒక చిన్న మాట కోసం తృణపాయంగా మంత్రి పదవి వదిలేసిన మహోన్నత వ్యక్తి, ఇచ్చిన మాటకు కట్టుబడి తన ఆస్తులు పోగొట్టుకున్న వ్యక్తి, కాపుజాతి కోసం ఆయన రాజకీయ జీవితం సామాధి అయిందని, కాపు రిజర్వేషన్స్ కోసం, కాపుల ఐక్యత కోసం ఉద్యమం చేస్తే, కాపు కార్పొరేషన్ ఏర్పడి, విదేశీ విద్య, 1లక్ష, 2లక్షల లోన్లు చాలమంది పేద కాపులు లబ్దిపొందారన్నారు. ఆయన కాపుజాతి రిజిస్ట్రేషన్ల కోసం ఏన్నోరకాలుగా ప్రయత్నం చేశారు కానీ ఫలించలేదని కొనియాడారు.కార్యక్రమంలో మంత్రి శ్రీనివాసరావు, సుంకర సాయిబాబా, పసుపులేటి శ్రీనివాసరావు, కొల్లా హనుమంతరావు, శెట్టి పాపారావు, వల్లంశెట్టి హనుమంతరావు, వాసాని అంకబాబు, చెన్నంశెట్టి శివ, లింగిశెట్టి సుబ్బారావు, పేస్ రాంబాబు, సూరినేని పోలెరయ్య, ఆరిక మల్లికార్జునరావు, కామిరియాల వెంకటేశ్వర్లు, ఉంగరాల వెంకటేశ్వర్లు,వల్లంశెట్టి రాజేష్ పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వంలో అన్ని వర్గాల వ్యాపారాలు దెబ్బతిన్నాయి

**- మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్**

**ఒంగోలు, ప్రభాతవార్త**





రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన 25 నెలల కాలంలో అన్ని వర్గాల వ్యాపారాలు పూర్తిగా దెబ్బతిన్నాయని, ముఖ్యంగా ఆర్యవైశ్యులను ఈ ప్రభుత్వం తీవ్రంగా వేధిస్తోందని మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ తీవ్ర ఆరోపణలు చేశారు. ఆదివారం ఒంగోలు వైసీపీ కార్యాలయంలో ఆర్యవైశ్య రాష్ట్ర మాజీ కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఆర్యవైశ్యుల ఆత్మీయ సమావేశం కార్యక్రమంలో ముఖ్య అతిధులుగా మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు పాల్గొన్నారు. ఆర్యవైశ్యుల ఆత్మీయ సమావేశం అనంతరం మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాసరావు మీడియాతో మాట్లాడారు.గతంలో ఎన్నడూ లేని విధంగా ఆర్యవైశ్యులపై అక్రమ కేసులు బనాయిస్తూ, దాడులకు తెగబడుతున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వంలో ఆర్యవైశ్యులకు కనీస గుర్తింపు కరువైందని వెల్లంపల్లి విమర్శించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి దేవాలయ కమిటీలోనూ ఆర్యవైశ్యులకు సముచిత స్థానం కల్పించారని, కానీ ప్రస్తుత ప్రభుత్వంలో ఏ ఒక్కరికి నామినేటెడ్ పదవులు దక్కలేదని ధ్వజమెత్తారు. ఎన్నికల ముందు ఆర్యవైశ్యులపై అపారమైన ప్రేమ కురిపించిన చంద్రబాబు నాయుడు, అధికారంలోకి రాగానే కేసులు పెడుతూ వేధిస్తున్నారని వెల్లంపల్లి మండిపడ్డారు. కూటమి ప్రభుత్వంలో ఉన్న ఆర్యవైశ్య నాయకులు నామినేటెడ్ పదవుల విషయమై ప్రభుత్వాన్ని ఎందుకు ప్రశ్నించడం లేదని నిలదీశారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను ప్రజలు గమనిస్తున్నారని, రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయడానికి ఆర్యవైశ్యులు ఏకతాటిపై సిద్ధంగాఉన్నారని ఆయన ప్రకటించారు. ఈ మీడియా సమావేశంలో పీఏసీ మెంబర్ పుబ్బా చంద్రశేఖర్, ఆర్టీఐ మాజీ కమీషనర్ శ్రీనివాసరావు, కరుణాకర్, విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు పానుగంటి చైతన్య, జిల్లాలోని వివిధ నియోజకవర్గాల నుంచి ఆర్యవైశ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

20-7Pg5_20-7Pg5.qxd 19/Jul/26 10:45 PM Page 1



# జమ్ము-కాశ్మీర్‌లో వరద విలయం!

## ఎడతెగని వర్షాలతో 17 మంది మృతి, పలువురు గల్లంతు

## రజౌరి, పూంఛ్ జిల్లాల్లో పరిస్థితి మరింత తీవ్రం

## అమర్‌నాథ్, వైష్ణోదేవి యాత్రకు బ్రేక్

## ఇళ్లలో పారుతున్న వరదనీరు, కొట్టుకు పోయిన వాహనాలు





**శ్రీనగర్,జులై 19:** జమ్మూకశ్మీర్ లో భారీ వర్షాలు, వరదలుబీభత్సం సృష్టించాయి. ఎడతెగని వర్షా ల వల్ల రాజౌరీ, పూంచ్ జిల్లాల్లో మెరుపు వరదలు సంభవించాయి. రాజౌరీలో నదులు పొంగిపొర్ల డంతో పలు ప్రాంతాలను వరద ముంచెత్తింది. కొత్త బస్టాండ్ పూర్తిగా నీట మునిగింది. ఈ వరదలవల్ల 17 మంది మృతిచెందారు. పలువురు గల్లంతయ్యారు. మరికొందరు తీవ్రంగా గాయ పడ్డారు. శనివారం సాయంత్రం నుంచి కురిసిన భారీ వర్షాలకు ఆదివారం వరదలు పోటెత్తాయి. ఈ ఘటనలో నలుగురు మృతిచెందగా మరో ఐదుగురు గల్లంతయ్యారు. మృతుల్లో భారీ వర్షాల కారణంగా పూంచ్ జిల్లాలో ఇల్లు కూలి ముగ్గురు మరణించగా రాజౌరిలో కొండచరియలు విరిగి పడటం, ఆకస్మిక వరదలు, భారీ వర్షాలతో ఒకరు ప్రాణాలు కోల్పోయారు. మరోవైపు గల్లంతైన ఐదుగురి కోసం సహాయక బృందాలు గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయి. వందలాది మందిని అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. రాజౌరి జిల్లాలోని దర్హాలి, ఖండ్లీ, సుక్తోహ్, జమోలా నదులతో సహా అన్ని ప్రధాన నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. వాటిలో చాలా వరకు ప్రమాదకర స్థాయికి చేరి అనేక లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. ముఖ్యంగా రాజౌరి పట్టణాన్ని వరదనీరు ముం చెత్తింది. దర్హాలి నదికి వరద పోటెత్తగా బేలా కాలనీ సమీపంలోని రక్షణ గోడ కూలిపోయింది. దాంతో కొత్త బస్టాండ్ ఆవరణలోకి వరద నీరు దూసుకొచ్చి డజన్ల కొద్దీ వాహనాలు కొట్టుకుపో యాయి. అబ్దుల్లా వంతెన సమీపంలోని మురికి వాడ కూడా తీవ్రంగా దెబ్బతింది. ఆ ప్రాంతంలోకి వరదనీరు ప్రవేశించడంతో 50 కిపైగా కుటుం బాలను అధికారులు ఖాళీ చేయించారు. తారిఖ్ వంతెన సమీప ప్రాంతాన్నీ వరద నీరు ముం చెత్తింది. దాంతో పోలీసులు, అత్యవసర సిబ్బంది స్థానికులను నదీ తీర ప్రాంతానికి దూరంగా తర లించారు. అలాగే నదీ తీరం, లోతట్టు ప్రాంతాల ప్రజలు వెంటనే ఇళ్లను ఖాళీ చేయాలని అధి కారులు సూచించారు. జమ్మూకశ్మీర్ వ్యాప్తంగా జూలై 23 వరకు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో శనివారం సాయంత్రం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షాలు కురిశాయి. గత 24 గంటల్లో రియాసిలో అత్యధికంగా 106 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. రాజౌరిలో 103 మిల్లీమీటర్లు, ఉధంపూర్‌లో 101.6 మిల్లీ మీటర్లు,కత్రాలో 85 మిల్లీమీటర్లు, పూంచ్‌లో 77 మిల్లీమీటర్లు, బటోటేలో 57.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. దీంతో అమర్‌నాథ్ యాత్రకు బ్రేక్ పడింది. ఆదివారం నుంచి అధికారులు ఈ యాత్రను నిలిపివేశారు. బేస్ క్యాంపుల నుంచి భక్తులు ఎవరినీ కూడా యాత్రకు అనుమతి ఇవ్వట్లేదు. బేస్ క్యాంపుల్లో తమకు కేటాయించిన చోటే ఉండిపోవాలంటూ ఆదేశాలు ఇచ్చారు. అమర్‌నాథ్‌తో పాటు ప్రఖ్యాత వైష్ణోదేవి అమ్మవారి యాత్ర కూడా స్తంభించిపోయింది. తదుపరి ఆదేశాలు వెలువడేంత వరకూ ఈ రెండింటినీ పునరుద్ధరించబోమని తెలిపారు. ఈ వాతావరణ మార్పుల నేపథ్యంలో జమ్మూ డివి జనల్ కమిషనర్ రమేష్ కుమార్ మార్గదర్శకాలు విడుదల చేశారు. జమ్మూ నుంచి కాశ్మీర్ వైపునకు యాత్రికులను రానివ్వట్లేదు. ఇతర ప్రాంతాల వైపు నుంచి వచ్చే భక్తులు ప్రస్తుతానికి జమ్మూ, ఉధం పూర్, రామ్ బన్‌లలో ఏర్పాటు చేసిన వసతి కేంద్రాల వద్దే తలదాచుకోవాలి. తదుపరి ఆదేశాలు వెలువడిన తర్వాతే వైష్ణోదేవి యాత్రకు అనుమతి లభిస్తుందని ఈ మార్గదర్శకాల్లో పొందుపరిచారు. బాల్తల్ బేస్ క్యాంప్‌లోనే అమర్ నాథ్ యాత్రికు లను నిలిపివేశారు. బంగాళాఖాతం, అరేబియా సముద్రాల నుంచి వస్తున్న తీవ్ర తేమ గాలుల ప్రభావంతో జమ్మూ కాశ్మీర్‌లో నేటి నుంచి 23 వరకు కుండపోత వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం ప్రకటించింది. ప్రత్యేకించి 21 నుంచి 23 మధ్య కాశ్మీర్‌లో అతి భారీ వర్షాలు పడొచ్చని,20నుంచి 23 మధ్య జమ్మూ రీజియన్ లోని రియాసీ, ఉధంపూర్ జిల్లాల్లో రికార్డు స్థాయి వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని స్పష్టం చేసింది.

# సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ ఇరాన్‌లో లేరు?

## అధికార పోరుతో ఉద్రిక్త పరిస్థితులు



**దుబాయి,జులై 19:** ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తబా ఖామెనీ ప్రస్తుతం ఇరాన్‌లో లేరని సౌదీ అరేబి యాకు చెందిన వార్తా సంస్థ అల్‌హదాత్ ఇజ్రా యెల్ భద్రతా వర్గాల సమాచారంతో సంచలన కథనం ప్రచురించింది. ఫిబ్రవరి 28న అమెరికా ఇజ్రాయెల్ సంయుక్త దాడిలో మాజీ సుప్రీం లీడర్ అయతొల్లా అలీఖామెనీ మరణించగా, అదే దాడిలో మొజ్తబా ఖామెనీ తీవ్రంగా గాయపడి నట్లు సమాచారం. అనంతరం ఆయన ఇరాన్ కొత్త సుప్రీం లీడర్‌గా బాధ్యతలు స్వీకరించినప్పటికీ, యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు బహిరంగంగా ఎక్కడా కనిపించలేదు. ప్రపంచం తో ఆయన రాతపూర్వక ప్రకటనల ద్వారానే సంభాషిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే, మొజ్తబా ఖామెనీ గాయాల నుంచి కోలుకుంటున్నారని, అమెరికాతో జరుగుతున్న చర్చలకు కూడా ఆయనే మార్గనిర్దేశం చేస్తున్నారని ఇరాన్ అధికారులు చెబుతున్నారు. కానీ అల్‌హదాత్ కథనం ప్రకా రం, ఖమేనీ పేరుతో వెలువడుతున్న అధికారిక ప్రకటనలను కొత్తగా నియమితులైన ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ చీఫ్ అహ్మద్ వహీదితో పాటు ఆ సంస్థకు చెందిన ఇతర ఉన్నతాధికారులే రూపొందిస్తున్నారని ఇజ్రాయెల్ భద్రతా వర్గాలు ఆరోపించాయి. ఇజ్రాయెల్ భద్రతా వర్గాల ప్రకా రం, ఇరాన్‌లో అంతర్గత విభేదాలు తీవ్రస్థాయికి చేరుకున్నాయని, అవి ఐఆర్‌జీసీ ఉనికికే ముప్పు గామారుతున్నాయని పేర్కొన్నారు. ఇరాన్‌పై మరోసారి దాడులు జరిగితే అందులో ఇజ్రాయెల్ పాల్గొనాలని అమెరికా కోరుకోవడం లేదని కూడా ఆవర్గాలు తెలిపాయి.

మొజ్తబా ఖామెనీ ప్రజలకు కనిపించకుండా ఉండటంతో ఇరాన్ రాజకీయాల్లో అధికార పోరు ముదురుతున్నట్లు అంతర్జాతీయ మీడియా సంస్థ నివేదించింది.

## ట్రంప్ సంతకానికే విలువలేదు: మొజ్తబా ఖమేనీ

**టెహ్రాన్,జులై 19:** అమెరికాఅధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంతకానికి ఎలాంటి విలువ లేదని ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ విమర్శించారు. ఇటీవల ఇరాన్అమెరికా మధ్య కుదిరిన శాంతి అవగాహన ఒప్పందం (ఎంఓయూ)ను అమెరికానే ఉల్లంఘించిందని ఆరోపించారు. దీంతో ట్రంప్ సంతకం విలువలేనిదనే విషయం మరోసారి రుజువైందన్నారు. ఇరాన్‌ప్రజలకు విడుదల చేసిన సందేశంలో ఖమేనీ ఈవ్యాఖ్యలు చేశారు. జూన్ 18న ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మధ్య కుదిరిన ఎం ఓయూను ఉల్లంఘిస్తోందని విమర్శించారు.

# వర్షాలకోసం గాడిదలకు గులాబ్‌జామూన్

## మధ్యప్రదేశ్‌లో వింత సాంప్రదాయం



**భోపాల్,జులై 19:** మధ్యప్రదేశ్ రాజధాని భోపా ల్‌లో రుతుపవనాల రాక ఆలస్యం కావడంతో స్థానికులు వర్షాల కోసం ఒక వింత ఆచారాన్ని ఆశ్రయించారు. నగరంలో తీవ్రమైన ఉక్కపోత, పొడివాతావరణం నెలకొనడంతో వానలు పడా లని కోరుకుంటూ గాడిదలకు గులాబ్ జా మూన్లు తినిపించే వినూత్న కార్యక్రమాన్ని చేప ట్టారు. స్థానికులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి గాడిదలకు ఎంతో ఇష్టంగా ఈ భారతీయ సం ప్రదాయ స్వీటును తినిపించారు. దీనికి సంబం ధించిన వీడియోలు, ఫోటోలు సోషల్ మీడి యాలో విపరీతంగా వైరల్ కావడంతో దేశవ్యా ప్తంగా నెటిజన్లు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు సమయానికి పడకపోయినా, రుతు పవనాలు బలహీనపడినా ఈ వింత ఆచారాన్ని పాటించడం ఇక్కడ ఎప్పటి నుంచో వస్తున్న ఒక సంప్రదాయం. ఇలా జంతువులకు తియ్య టి పదార్థాలు తినిపించడం వల్ల వాన దేవుడైన ఇంద్రుడు ప్రసన్నమై, సకాలంలో వర్షాలు కురుస్తాయని ప్రజల గట్టి నమ్మకం. వర్షాలు ఆలస్యమైనప్పుడు మా పెద్దలు ఈ సంప్రదాయాన్ని పాటించడం మేము చిన్నప్పటి నుండి చూస్తున్నాం. అందుకే గాడిదలకు స్వీట్లు తినిపించి మంచి వర్షాలు పడాలని ప్రార్థిం చామని ఈ వేడుకలో పాల్గొన్న ఒకరు తెలి పారు. రుతుపవనాల గమనానికి వాతావరణ మార్పులే కారణమని శాస్త్రవేత్తలు చెబుతున్నప్ప టికీ ఇలాంటి సంప్రదాయాలు భారతదేశంలోని అనేక ప్రాంతాల్లో ప్రజల జీవన విధానంలో అంతర్భాగంగా మారిపోయాయి. ఈవింత పూజ తో వానదేవుడు కరుణిస్తాడో లేదో చూడాలి కానీ,ప్రస్తుతానికి మాత్రం భోపాల్‌లోని గాడ దలు గులాబ్ జామూన్ల విందును ఆరగిస్తూ హుషారుతో గంతులేస్తున్నాయి.

# రామమందిర విరాళాల చోరీపై సమగ్ర విచారణ జరపాలి

## శ్రీరామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ వ్యవహారాలపైనా దర్యాప్తు చేయించాలి

## ప్రధాని మోడీకి రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే సంయుక్త లేఖ



**న్యూఢిల్లీ, జులై 19:** శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ యొక్క 'ఆర్థిక వ్యవహారాలపై స్వతంత్ర, సమగ్ర విచారణ' జరపాలని కోరుతూ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి సంయుక్త లేఖ రాశారు. పార్ల మెంటు వర్షాకాల సమావేశాలు ప్రారంభం కావ డానికి ఒక్క రోజు ముందు ఆదివారం ఈ లేఖ విడుదల చేశారు. దీంతో పార్లమెంటులో వాడివేడి చర్చలకు వేదిక కానున్నట్లు కనిపిస్తోంది. 'శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్రట్రస్ట్‌లో వేల కోట్ల రూపా యల చోరీ జరగడం మీకు తెలిసిన విషయమే. తమ కష్టార్జితాన్ని విశ్వాసం, భక్తి, నమ్మకంతో విరాళంగా ఇచ్చిన లక్షలాది మంది భక్తులు ఈ చోరీతో మోసపోయామని భావిస్తున్నారు' అని ఆ లేఖలో ప్రతిపక్ష నాయకులు పేర్కొన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ప్రధాన మంత్రి ఈ ట్రస్ట్‌ను ఏర్పాటు చేసినప్పటికీ, దాని సభ్యులను పూర్తిగా ప్రభుత్వమే ఎంపిక చేసిందని కాంగ్రెస్ నేతలు తెలిపారు. "ట్రస్ట్ సభ్యులు రాష్ట్రీయ స్వ యంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్), విశ్వ హిందూ పరిషత్ (విహెచ్‌పి), వాటి అనుబంధ సంస్థలతో సంబంధం కలిగి ఉన్నారన్న విషయం బహిరంగ రహస్యం. అప్రతిష్టపాలైన దాని మాజీ ప్రధాన కార్యదర్శి కూడా మీకు సన్నిహితుడే. ఇంతటి నేరం జరిగినప్పుడు మీరు మౌనంగా ఉండటం ఆమోదయోగ్యం కాదు. జవాబుదారీతనాన్ని, నష్టపరిహారాన్ని (లేదా నిధుల పునరుద్ధరణను) నిర్ధారించడం మీ బాధ్యత' అని కాంగ్రెస్ నేతలు పేర్కొన్నారు. నగదు, బంగారం, వెండితో సహా అన్ని కానుకల నిర్వహణతో సహా ట్రస్ట్ ఆర్థిక వ్యవహారాలపై 'స్వతంత్ర, సమగ్ర విచారణకు ఆదేశించాలని' మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ ప్రధాన మంత్రిని కోరారు. 'తమ కానుకలు ఎలా వినియోగించబడ్డాయో ప్రతి భక్తుడికి తెలిసేలా' విచారణ ఫలితాలు, ట్రస్ట్ ఖాతాలను బహిర్గతం చేయాలని కూడా వారు డిమాండ్ చేశారు.

# అమెరికాను కమ్మిన కెనడా కార్చిచ్చు పొగ



## ఆ దేశంపై అదనపు సుంకాలు విధిస్తాం: ట్రంప్

**న్యూయార్క్, జులై 19:** వాతావరణ మార్పుల వల్ల అమెరికా, కెనడాల్లో కార్చిచ్చులు రేగుతూనే ఉన్నాయి. అదుపులోని అడవి మంటల వల్ల అమెరికాలో మిన్నెసోటా, ఇల్లినోయీ, మిషిగాన్, డెట్రాయిట్‌తోపాటు పలు ప్రాంతాల్లో గాలి నాణ్యత క్షీణించింది. అమెరికా రాజధాని నగరం వాషింగ్టన్‌ను కూడా దట్టమైన పొగ కమ్మేసింది. ప్రజలు, ముఖ్యంగా గుండె లేదా ఊపిరితిత్తుల వ్యాధులు ఉన్నవారు, వృద్ధులు, పిల్లలు గాలి నాణ్యత మెరుగుపడే వరకు బయటకు వెళ్లరాదని అధికారులు సూచించారు. చాలా రాష్ట్రాల్లో శని వారం వరకు ప్రమాదకర పరిస్థితులు కొనసాగు తాయన్నారు. కార్చిచ్చుల ద్వారా వ్యాపిస్తున్న పొగ, మంటలకు కెనడా అటవీ నిర్వహణ లోపాలే కారణమని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విమర్శించారు. కెనడాపై అదనపు సుంకాలను విధిస్తామని హెచ్చరించారు. ట్రంప్ వ్యాఖ్యలపై కెనడా ప్రభుత్వం మొదట్లో స్పం దించలేదు. గతంలో కార్చిచ్చులను ఎదుర్కో వడంలో అమెరికాకు కెనడా సహాయం చేసిందని అంటారియో రాష్ట్ర నేత డగ్‌ఫోర్డ్ గుర్తు చేశారు. 'రాజకీయ నాయకులు ఫిర్యాదులు చేయడం మాని పొరుగువారికి సహాయం చేయడం మం చిది. మనం మన అమెరికన్ స్నేహితుల కోసం గతంలో కచ్చితంగా అదే పని చేశాం' అని ఫోర్డ్ చెప్పారు. కెనడాలోని ఉత్తర అంటారియోలో సు మారు 190 చోట్ల కార్చిచ్చులు, మంటలు వ్యా పించాయి. మంటలు రేగుతున్న ప్రాంతాల నుంచి ప్రజలను ఖాళీ చేయించారు. మరికొన్ని ప్రాంతాల వారిని ఖాళీ చేసే అవకాశం ఉంది.



# నాలుగుదేశాల ఎంబసీల్లో కాన్సులర్ సేవలు నిలిపివేత

**న్యూఢిల్లీ, జూలై 19:** అబుదాబి, కువైట్, సింగ పూర్, కాన్‌బెర్రాలోని భారత రాయబార కార్యా లయాల్లో పాస్‌పోర్ట్, వీసా, కాన్సులర్ సేవలు యథావిధిగా కొనసాగాలా లేదా అన్న అంశంపై సుప్రీంకోర్టు సోమవారం కీలక నిర్ణయం ప్రకటిం చనున్నది. ఈ సేవలు నిర్వహిస్తున్న కాంట్రా క్టును ఢిల్లీ హైకోర్టు రద్దుచేయడంతో ఆయా దేశాల్లో సేవలు దాదాపు స్తంభించిన పరిస్థితి నెలకొన్నట్లు కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలిపింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ముందు కేం ద్రంతరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహ తా వాదనలు వినిపించారు. హైకోర్టు తీర్పు కార ణంగా విదేశాల్లోని భారతీయులకు పాస్‌పోర్ట్, వీసా సేవలు అందించడం తీవ్రంగా దెబ్బతిన్న దని, కొత్త సేవల సంస్థను ఒక్కరోజులో నియ మించడం సాధ్యం కాదని కోర్టుకు వివరించారు. ఈ నేపథ్యంలో కేంద్రం దాఖలు చేసిన అప్పీ ల్‌పై విచారణను జులై 20కు సుప్రీంకోర్టు నిర్ణ యించింది. జులై 15న ఢిల్లీ హైకోర్టు కేరళకు చెందిన అల్విండ్ టూర్స్ అండ్ ట్రావెల్స్ సం స్థకు అప్పగించిన సిపివి సేవల కాంట్రాక్టును రద్దు చేసింది.

# న్యూయార్క్ వస్తే నెతన్యాహును అరెస్టుచేస్తాం: మేయర్ మమ్దానీ



**న్యూయార్క్,జులై 19:** ఐక్యరాజ్యసమితి సదస్సు కోసం న్యూయార్క్ రానున్న ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహును అరెస్ట్ చేసే అంశంపై న్యూయార్క్ నగర మేయర్ జోహ్రాన్ మామ్దానీ చేసిన వ్యాఖ్యలు అంతర్జాతీయంగా తీవ్ర దుమారంరేపుతున్నాయి. శనివారం దిన్యూ యార్క్ టైమ్స్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మేయర్ మాట్లాడుతూ నెత న్యాహును ఒక యుద్ధ నేర స్థుడిగా అభివర్ణించారు. అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు (ఐసీసీ) ఆయనపై మోపిన ఆరోపణల నేప థ్యంలో, ఆయన ది హేగ్‌లోని జైలుకు వెళ్లాల్సిన వ్యక్తి అని స్పష్టం చేశారు. అయితే, ఒక విదేశీ దేశాధినేతను అరెస్ట్ చేసే అధికారం నగర మేయ ర్‌కు ఉందా లేదా అనే అంశంపై తాము ప్రస్తుతం నగర న్యాయ సలహాదారులతో సంప్రదింపులు జరుపుతున్నట్లు ఆయన వెల్లడించారు. ఐరాసలో ఇజ్రాయెల్ రాయబారి డానీ డానన్ సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా కౌంటర్ ఇస్తూ ఈ కేసు లో ఎవరినైనా అరెస్ట్ చేయాల్సివస్తే, మొదట మేయర్ జోహ్రాన్ మామ్దానీనే అని మండిపడ్డారు. కాగా,ఒక రేడియో షోలో నెతన్యాహు మాట్లాడు తూ మేయర్ మామ్దానీ హమాస్ ఉగ్రవా దులకు మద్దతుఇస్తున్నారని, ఆయన మనసులో అమెరి కాపై తీవ్ర ద్వేషం దాగి ఉందని ఆరోపించారు.

# 'మేడ్ ఇన్ ఇండియా' సి-295 ఆత్మనిర్భర్ భారత్‌కు ఊతం



## కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

**న్యూఢిల్లీ, జులై 19:** దేశీయ రక్షణ, విమాన తయారీ రంగాల్లో భారత్ మరో కీలక మైలురాయిని చేరుకుంది. తొలి స్వదేశీ ఎయిర్‌బస్ సి-295 వ్యూహాత్మక సైనిక రవాణా విమానాన్ని కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు పరిచయం చేశారు. గుజరాత్ రాష్ట్రం వడోదరలోని టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ (టిఎఎస్ఎల్) తయారీ కేంద్రాన్ని సందర్శించిన ఆయన ఓ విడియోను సోషల్ మీడియా 'ఎక్స్'లో పంచుకున్నారు. ఈ సందర్భంగా రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ 'ప్రధాని మోడీ కలలు గన్న 'ఆత్మనిర్భర్ భారత్', 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమాలకు ఈ ప్రాజెక్టు ప్రతీకగా నిలుస్తుంది. దేశంలో విమాన తయారీ సామర్థ్యం వేగంగా పెరుగుతోంది. త్వరలో భారతీ యులు పూర్తిగా స్వదేశీ విమానాల్లోనే ప్రయా ణిస్తారు. ఆరోజు కూడా ఎంతో దూరంలో లేదు' అని అన్నారు. కాగా ఎయిర్‌బస్-టాటా అడ్వా న్స్‌డ్ సిస్టమ్స్ ఉమ్మడి భాగస్వామ్యంతో అమల వుతున్న సి-295 ప్రాజెక్టు కింద తొలిసారిగా ప్రైవేట్ రంగంలో ఓ క్లిష్టమైన సైనిక విమానం భారత్‌తో తయారవుతోంది. దీనికి 2021లో 2.6 బిలియన్ డాలర్లతో ఒప్పందం కుదిరింది. దీని ప్రకారం భారత్‌కు మొత్తం 56 సి-295 విమానాలు అందించాలి. వీటిలో 16 విమానాలు స్పెయిన్‌లో మాన్యుఫాక్చర్ కానుం డగా, మరో 40 విమానాలు వడోదరలో తయారు చేస్తు న్నారు. అందులో భాగంగా తొలి సి-295 విమా నాన్ని జూన్ 10న విజయవంతంగా పరీ క్షిం చారు. ఇటీవల 'మన్ కీ బాత్' కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కూడా ఈ ప్రాజె క్టును గురించి ప్రస్తావించారు. సి-295 తయారీ వల్ల సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్ర మలకు (ఎంఎస్ఎంఇలు) కొత్త అవకాశాలు లభిస్తాయని, సాంకేతిక పరిజ్ఞానం బదలీ, నైపుణ్యాభివృద్ధి, దేశీయ ఏరోస్పేస్ పరిశ్రమ విస్తరణకు ఇది కీల కంగా మారుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

# సంక్షిప్త వార్తలు

## హంగేరీ అధ్యక్షుడి పదవీకాలం ముగింపు



**బుడాపెస్ట్,జులై 19:** హంగేరీ అధ్యక్షుడు టామాస్ సుల్యోక్ తన పదవీకా లాన్ని తక్షణమే ముగించే రాజ్యాంగ సవరణపై సంతకం చేశారు. దీంతో కొత్త ప్రధాని పీటర్ మగ్యార్ ప్రభుత్వం, మాజీ ప్రధాని విక్టర్ ఓర్బాన్ నియమించిన కీలక అధి.కారులను తొలగించే చర్యల్లో మరో కీలక ఘట్టం పూర్తిచేసుకున్నట్లయింది. ఏప్రిల్‌లో జరిగిన ఎన్నికల్లో ఓర్బాన్ ప్రభుత్వాన్ని ఘోరపరాజయం పాలుచేసిన పీటర్ మగ్యార్, అధ్యక్షుడు సుల్యోక్ రాజీనామా చేయాలని పలు మార్లు డిమాండ్ చేశారు. ఓర్బాన్ ప్రభుత్వ హయాంలో ప్రజాస్వామ్యవ్యతిరేక చర్యలను అడ్డుకోవ డంలో అధ్యక్షుడిగా తన రాజ్యాంగ బాధ్యతలను సుల్యోక్ నిర్వర్తించలేదని ఆయన ఆరోపించారు.

## ఇరాన్, అమెరికా దాడులు ఉధృతం



**టెహ్రాన్,జులై 19:** గల్ఫ్‌ప్రాంతంలో అమెరికా, ఇరాన్ మధ్య ఘర్షణలు తీవ్ర స్థాయికి చేరుకున్నాయి. ఇరాన్‌ను లక్ష్యంగా చేసుకుని అమెరికా దళాలు జరుపుతున్న వరుసదాడుల్లో ఇప్పటివరకు కనీసం 50మంది మరణిం చగా, 500 మందికి పైగా గాయపడ్డారు. ఈ విషయాన్ని ఇరాన్ ఆరోగ్య మంత్రిత్వశాఖ ప్రతినిధి హుస్సేన్ కెర్మాన్‌పూర్ అధికారికంగా వెల్లడిం చారు. గత 24 గంటల్లోనే 12మంది పౌరులు ప్రాణాలు కోల్పోయారని, గాయపడిన వారిలో 37 మందిపరిస్థితి ఆందోళ నకరంగా ఉండటంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని ఆయన తెలిపారు.

## అమెరికా పౌరులకు అంతర్జాతీయ హెచ్చరికలు జారీ



**వాషింగ్టన్,జులై 19:** అమెరికా-ఇరాన్ మధ్యకొనసాగుతున్న యుద్ధం మరిం త తీవ్రరూపం దాల్చుతున్న నేపథ్యంలో, ప్రపంచవ్యాప్తంగా ప్రయాణి స్తున్న లేదావిదేశాల్లో నివసిస్తున్న అమెరికా పౌరులకు అమెరికా విదేశాంగ శాఖ గ్లోబల్ ట్రావెల్ అడ్వైజరీ జారీ చేసింది. భద్రతా పరిస్థితులు వేగంగా మారుతున్నాయని, ముఖ్యంగా మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు మరింత పెరిగే అవకాశం ఉందని హెచ్చరించింది.

## మధ్యప్రదేశ్‌లో యూనిఫామ్ సివిల్ కోడ్‌కు రాష్ట్ర కేబినెట్ ఆమోదం



**భోపాల్,జులై 19:** మధ్యప్రదేశ్‌లో ఉమ్మడిపౌరశిక్షాస్మృతి (యుసిసి) అమలుకు కీలక ముందడుగు పడింది. రాష్ట్ర కేబినెట్ ఆదివారం యూసీసీ ముసాయిదా బిల్లుకు ఆమోదం తెలిపినట్లు ముఖ్య మంత్రి మోహన్ యాదవ్ వెల్లడించారు. ఈ బిల్లును సోమవారం ప్రారంభమయ్యే ఐదు రోజుల రాష్ట్ర శాసనసభ వర్షాకాల సమావేశాల్లో ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. సమాజంలోని అన్ని వర్గాల నుంచి అభిప్రాయాలు, సూచనలు స్వీకరించిన అనంతరం యూసీసీ ముసాయిదాను రూపొం దించామని, దీనికి మెజారిటీ ప్రజల మద్దతు లభించిందని ముఖ్యమంత్రి చెప్పారు.

## మేకెధాతుపై పార్లమెంటులో చర్చించాలి: డిఎంకె



**న్యూఢిల్లీ,జులై 19:** కర్ణాటక ప్రభుత్వం ప్రతిపాదించిన మేకెధాతు ప్రాజెక్టుకు వ్యతిరేకంగా ద్రవిడ మున్నేట్ర కజగం తన పోరాటాన్ని తీవ్రతరం చేసింది. ఈ అంశంపై పార్లమెంటులో తక్షణమే చర్చ చేపట్టాలని డిమాండ్ చేస్తూ లోక్‌సభ, రాజ్యసభల్లో వాయిదా తీర్మాన నోటీసులు అందజేసింది. సోమవారం నుంచి ప్రారంభం కానున్న పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ఈ అంశాన్ని చర్చకు చేపట్టాలని కోరింది. డీఎంకే పార్లమెంటరీపార్టీ నేత టీ.ఆర్. బాలు లోక్ సభలో, పార్టీ ఫ్లోర్ లీడర్ తిరుచ్చి శివ రాజ్యసభలో ఈ నోటీసులను సమర్పించారు.


## మీరట్‌లో ప్రియుడి ఘాతుకం: సెలైన్‌లో విషం ఎక్కించి నర్సు హత్య



**మీరట్,జులై 19:** ఉత్తర్ ప్రదేశ్ మీరట్‌లోని లోహియా నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక ప్రైవేట్ ఆస్పత్రి నర్సు అనుమానాస్పదంగా మరణించింది. పోలీసులు లోతుగా దర్యాప్తు చేయగా ఇది హత్య అని తేలింది. ప్రియుడే హత్య చేసినట్లు వెల్లడైంది. తనను పెళ్లి చేసుకోవాలని ప్రియురాలు ఒత్తిడి తెస్తుండటంతో పథకం ప్రకారం ప్రియుడు హత్యకు పాల్పడినట్లు తేలింది. ఆస్పత్రి ఉదోగితో కలిసి ఆపరేషన్ థియేటర్‌లో విషాన్ని ఇంజెక్ట్ చేయడం ద్వారా హత్యకు పాల్పడినట్లు తెలిసింది. ఈ హత్యను ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు ఒక నకిలీ సూసైడ్ నోట్ రాసి మృ తదేహం వద్ద ఉంచారు. ఈ కేసులో ప్రియుడితో పాటు మరో వ్యక్తిని అరెస్ట్ చేశారు.

# పార్లమెంటు ర్యాలీని విజయవంతం చేయండి

## సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ పిలుపు




**న్యూఢిల్లీ, జులై 19:** జంతర్‌మంతర్ నుంచి పార్ల మెంట్ వరకూ రేపు తలపెట్టిన ర్యాలీని విజ యవంతం చేయాలని సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ ఒక సందేశాన్ని విడుదల చేశారు. ఆమరణ దీక్ష చేస్తున్న ఆయనను శనివారం ఆస్పత్రికి తరలించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆసుపత్రి నుంచి ఆయన తన స్వదస్తూరితో రాసిన చీటీని రిలీజ్ చేశారు. నీట్ పేపర్ లీక్ ఉదంతాలకు వ్యతిరేకంగా వాంగ్‌చుక్ ఉద్యమిస్తున్న విషయం తెలిసిందే. తన నిరసన కార్యక్రమాన్ని ఆయన రెండో స్వాతంత్ర్య పోరాటంగా అభివర్ణించారు. పేపర్ లీక్ వంటి అన్యాయాల నుంచి విముక్తి కావాలని తన సం దేశంలో రాశారు. తన భార్య గీతాంజలి ద్వారా ఈ సందేశాన్ని పంపించినట్లు కూడా ఆయన పేర్కొన్నారు. పేపర్ లీక్ ఉదంతంపై గత నెల 28న కాక్రోచ్ జనతా పార్టీ చేపట్టిన నిరసనలో కూడా వాంగ్‌చుక్ పాల్గొన్నారు. తర్వాత, ఆమరణ దీక్ష ప్రారంభించారు. ఆయన దీక్ష ప్రారంభించి ఇప్పటికే 21 రోజులు పూర్తయింది. ఈ క్రమంలో వాంగ్‌చుక్ ఆరోగ్యం దృష్ట్యా పోలీసులు ఆయనను సఫ్దర్‌జంగ్ ఆసుపత్రికి తరలించారు. ఇదిలా ఉంటే, తన భర్త వాంగ్‌చుక్‌ను ప్రైవేట్ ఆసుపత్రికి తరలించేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ గీతాంజలి తాజాగా ఢిల్లీ హైకోర్టును ఆశ్రయిం చారు. తన భర్తకు అందిస్తున్న చికిత్సలో పారద ర్శకత లేదని ఆరోపించారు. తన పిటిషన్‌పై తక్షణ విచారణ చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

**వాంగ్‌చుక్ ఆరోగ్య స్థితిపై హెల్త్ బులెటిన్ విడుదల**

కాగా, పర్యావరణ ఉద్యమకారుడు సోమన్ వాంగ్ చుక్ ఆరోగ్యం నిలకడగా ఉందని న్యూఢిల్లీలోని సఫ్దర్‌జంగ్ ఆసుపత్రి వైద్యులు వెల్లడించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై హెల్త్ బులెటిన్‌ను ఆదివారం వైద్యులు విడుదల చేశారు. గత 20 రోజులుగా ఆయన ఎలాంటి ఆహారం తీసుకోలేదని వారు తెలిపారు.

సుదీర్ఘ ఉపవాసం కారణంగా ఆయన తీవ్ర నీరసంతో ఉన్నారని, ఆసుపత్రిలో చేర్చే సమయంలో ఆయన పూర్తి స్పృహలోనే ఉన్నారని వివరించారు. అలాగే ఆయన శరీరంలోని ఆక్సిజన్ స్థాయిలు బాగానే ఉన్నాయని పేర్కొన్నారు. సోనమ్ వాంగ్‌చుక్‌కు ఐవీ ఫ్లూయిడ్స్ ఇవ్వాల్సి ఉందని వైద్యులు స్పష్టం చేశారు. వాటిని తీసుకునేందుకు ఆయన నిరాకరి స్తున్నారని అన్నారు. కాగా తన భర్తను ప్రైవేట్ ఆసుపత్రికి తరలించేందుకు అనుమతి ఇవ్వాలని వాంగ్‌చుక్ భార్య గీతాంజలి ఆంగ్మో ఢిల్లీ హైకో ర్టులో దాఖలు చేసిన పిటిషన్ సోమవారం విచా రణకు వచ్చే అవకాశం ఉంది.

20-7Pg6exHMNWJQE_20-7Pg6exHMNWJQE.qxd 19/Jul/26 10:46 PM Page 1



## ఏనుగుల స్వైరవిహారం..
# రైతులకు రూ.లక్షల్లో పంట నష్టం



**పీలేరు / కె.వి.పల్లి, జులై 19 ప్రభాతవార్త:** కేవీ పల్లె మండలం జిల్లేళ్లమంద సమీప అటవీ ప్రాంతంలో ఏనుగుల గుంపు సంచారం రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. నాలుగైదు రోజులుగా సంచరిస్తున్న గజరాజులు శేషాచలం సమీపంలోని మామిడి, కొబ్బరి, అరటి తోటలపై దాడి చేసి భారీ నష్టం కలిగించాయి. మామిడి, కొబ్బరి చెట్లను నేలమట్టం చేయడంతో పాటు సాగునీటి పైపులు, కంచెలు, రాతి కూసాలను ధ్వంసం చేశాయి. జిల్లేళ్లమంద గ్రామానికి చెందిన సుమారు 20 మంది రైతులు రూ.లక్షల్లో నష్టపోయినట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళ పొలాల వద్దకు వెళ్లేందుకు కూడా భయపడుతున్నామని రైతులు చెబుతున్నారు. ఏనుగుల బెడదను అరికట్టేందుకు అటవీ అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని, నష్టపోయిన రైతులకు తగిన పరిహారం అందించాలని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# ఎఇఇ పోస్టుల దరఖాస్తులకు నేడే గడువు

**• ఆగస్టు 22 నుండి 29వరకు రాతపరీక్షలు • ఎస్‌పిడిసిఎల్ సిఎండి శివశంకర్**

**తిరుపతి, జులై 19 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో ఎపిట్రాన్స్‌కో, ఎపిజెన్‌కో, ఎపిఎస్‌పిడిసిఎల్, ఇపిడిసిఎల్, సిపిడిసిఎల్ సంస్థల్లో ఎఇఇ పోస్టుల నియామకాలకై అభ్యర్థులు నేటి లోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఎస్‌పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి ఆదివారం తెలిపారు. ట్రాన్స్‌కోలో ఎలక్ట్రికల్ ఇంజనీర్లు 16, టెలికామ్ 10, సివిల్ ఇంజనీర్లు 23 మొత్తం కలిపి 200, జెన్‌కోలో ఎలక్ట్రికల్ ఇంజనీర్లు 52, మెకానికల్ 21, ఎలక్ట్రానిక్స్ 7, సివిల్ ఇంజనీర్లు 20 మొత్తం కలిపి 100, ఎస్పిడిసిఎల్‌లో ఎలక్ట్రికల్ ఇంజనీర్లు 125, టెలికామ్ 4, సివిల్ ఇంజనీర్లు 6 మొత్తం కలిపి 135, ఇపిడిసిఎల్‌లో ఎలక్ట్రికల్ ఇంజనీర్లు 128, టెలికామ్ 3, సివిల్ ఇంజనీర్లు 4 మొత్తం కలిపి 135, ి సిపిడిసిఎల్‌లో ఎలక్ట్రికల్ ఇంజనీర్లు 56, టెలికామ్ 1, సివిల్ ఇంజనీర్లు 3 మొత్తం కలిపి 60 పోస్టుల నియామకానికి ఆయా సంస్థలు ప్రకటనను జారీ చేయడం జరిగిందన్నారు. నియామక ప్రకటనలో పేర్కొన్న షెడ్యూల్ మేరకే ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ కొనసాగుతోందని, (నేడు)20వ తేదీ సాయంత్రంలోగా అభ్యర్థులు ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. షెడ్యూల్ పేర్కొన్న విధంగానే ఈ ఏడాది ఆగష్టు 22వ తేదీ నుండి 29వ తేదీ వరకు కంప్యూటర్ ఆధారిత పరీక్షలను నిర్వహించడం జరుగుతుందని, ఈ షెడ్యూల్‌లో ఎటువంటి మార్పు ఉండబోదని స్పష్టం చేశారు. ఎఇఇ పోస్టుల నియామక ప్రక్రియ మొత్తాన్ని పారదర్శకంగా నిర్వహించడం జరుగుతుందని వివరించారు. ఈ ప్రక్రియకు సంబంధించిన అధికారిక సమాచారాన్ని వెబ్ సైట్ ద్వారా తెలుసుకోవచ్చన్నారు. ఎఇఇ పోస్టుల నియామక అంశంలో అభ్యర్థులు దళారుల మాటలు, ఇతర అనధికారిక సామాజిక మాధ్యమాల ద్వారా వెలువడే సమాచారాన్ని నమ్మి మోసపోవద్దని సూచించారు.

**నేడు డయల్ యువర్ ఎస్‌పిడిసిఎల్ సిఎండి**

విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం సోమవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు డయల్ యువర్ సిఎండి కార్యక్రమాన్ని ఎస్‌పిడిసిఎల్ నిర్వహించనుంది. ప్రతి సోమవారం నిర్వహించే డయల్ యువర్ సిఎండి కార్యక్రమం ద్వారా వినియోగదారులు 89777 16661 నంబర్‌కు కాల్ చేసి తమ విద్యుత్ సమస్యలను సిఎండి దృష్టికి తీసుకురావచ్చు.

**సర్కిల్ స్థాయిలో కూడా...**

డయల్ యువర్ ఎస్‌పిడిసిఎల్ సిఎండి కార్యక్రమంతో పాటు సర్కిల్ స్థాయిలో కూడా ప్రతి సోమవారం 'డయల్ యువర్ ఎస్ఇ' కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. జిల్లా స్థాయిలో తమ విద్యుత్ సమస్యలను సూపరింటెండింగ్ ఇంజనీర్ దృష్టికి తీసుకువచ్చేందుకు వీలుగా వినియోగదారులు తిరుపతి: 87126 52679, చిత్తూరు: 79931 47979, నెల్లూరు: 08612 320427, అన్నమయ్య: 94408 17449, కడప: 08562 242457, కర్నూలు: 73826 14308, నంద్యాల: 73826 18976, అనంతపురం: 91547 90350, శ్రీసత్యసాయి: 94906 15721 నంబర్లకు ఫోన్‌చేసి తెలపాలి.

## కృష్ణలంక పిఎస్‌లో లాకప్ డెత్ అయిన గాదె సాయికృష్ణకు కర్మకాండలు నిర్వహణ



**విజయవాడ, జులై 19 ప్రభాతవార్త ప్రతినిధి:** కృష్ణలంక పీఎస్‌లో లాకప్ డెత్ అయిన గాదె సాయికృష్ణకు మరణానంతర కర్మకాండలను అతని కుటుంబ సభ్యులు నిర్వహించినట్లు సమాచారం. ఈ స్మృత్యార్థం కుటుంబ సభ్యులు హిందు సంప్రదాయక విధానంలో క్రతువులు నిర్వహించి అన్నదానం చేసారని సమాచారం. సాయికృష్ణ లాకప్‌డెత్ జరిగిన ఈ కేసు విచారిస్తున్న సిట్ అభిప్రాయపడింది. కీలక నిందితుడు సస్పెండయిన సీఐ నాగరాజు రిమాండ్ రిపోర్టులో ఈ విషయాన్ని స్పష్టం చేసింది. బూడిద, మరణించిన తేదీ చెపితే కర్మకాండలు చేసుకుంటామని అనేకమార్లు చెప్పిన కుటుంబ సభ్యులు పోలీసులను అభ్యర్ధించారు. ఈ క్రమంలో పండితుల సూచనల మేరకు మరణించిన తారీఖు, చితాభస్మం లేకుండా శార్ధ క్రతువులు చేసారంటున్నారు. సాయికృష్ణ ఫోటో వద్ద పూలువేసి కుటుంబ సభ్యులు నివాళులు అర్పించారు. అయితే ఈ కార్యక్రమాలకు సాయికృష్ణ పిన్ని అద్వకేట్ కనకదుర్గ హాజరు కాలేదు. సాయికృష్ణ లాకప్‌డెత్ అంశంపై ఆమె న్యాయం పోరాటం చేస్తున్నారు. కేసును వెలుగులోకి తీసుకుని రావడంలో ముఖ్యపాత్ర వహించారు.

# కమ్యూనిస్టులు మరింత బలపడాలి

**• స్థానిక ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధపడాలి • సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య**



**తిరుపతి, జులై 19 ప్రభాతవార్త ప్రతినిధి:** 'దేశంలో నేటి పరిస్థితుల దృష్ట్యా కమ్యూనిస్టులు మరింత బలపడాల్సిన సమయం ఆసన్నమైందని, చట్టసభల్లో ప్రజల గొంతుక వినిపించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య పేర్కొన్నారు. కమ్యూనిస్టులు కేవలం పోరాటా లు, ఆందోళనలకే పరిమితం కాకూడదన్నారు. ప్రధాన రాజకీయ పార్టీల్లాగే ప్రజల్లో బలపడాలని, రానున్న స్థానిక ఎన్నికల్లో పోటీ చేయడానికి కార్యకర్తలు సిద్ధపడాలని అన్నారు. కమ్యూనిస్టు సిద్ధాంతం పట్ల నిబద్ధతతో ముందు కెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. నిరంతరం ప్రజలతో మమేకమై, సామాజిక మాధ్యమంలో జరుగుతున్న తప్పుడు ప్రచారాలను శాస్త్రీయంగా వాస్తవాలను చెప్పి తిప్పి కొట్టాలని ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. తిరుపతి నగరం బైరాగపట్టెడలోని గంధమనేని శివయ్య కృష్ణారెడ్డి భవన్‌లో మూడు రోజుల పాటు జరిగిన సైద్ధాంతిక శిక్షణ తరగతులు ఆదివారం ముగిశాయి. ఈ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. సమాజంలో అనాగరిక వ్యవస్థను రూపుమాపి, సామాజిక మార్పు కోసం కమ్యూనిస్టు పార్టీ అనేక చారిత్రక పోరాటాలు సాగించిందన్నారు. నాటి సామాజిక రుగ్మతలను, ముఖ్యంగా సతీసహగమనం వంటి దురాచారాలను రూపుమాపడంలో కమ్యూనిస్టులు కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. దోపిడీ వర్గాల నుండి పేద, బడుగు, బలహీన వర్గాల హక్కులను కాపాడి రక్షణగా నిలిచామన్నారు. సమాజంలో చైతన్యం తీసుకురావడానికి ఎంతో మంది అభ్యుదయ రచయితలను, కళాకారులను కమ్యూనిస్టు పార్టీ తయారు చేసిందని కొనియాడారు. దేశంలో సహజ సంపదను పాలకులే కొల్లగొడుతున్నారని ఈశ్వరయ్య తీవ్రంగా ధ్వజమెత్తారు. అటవీ భూములను గుంజుకునేందుకు గిరిజనులను భయభ్రాంతు లకు గురిచేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో విద్యాపరమైన సమస్యల వల్ల సుమారు 70వేల మంది విద్యార్థులు ఇబ్బందులు పడుతుంటే ఇటు చంద్రబాబు, పవన్ కల్యాణ్ గానీ, అటు జగన్ గానీ ఎవరూ పట్టించుకోలేదని విమర్శించారు. కేంద్రం నుండి రాష్ట్రానికి రావాల్సిన నిధులు, హక్కులను తీసుకురావడంలో చంద్రబాబు, జగన్ ఇద్దరూ పూర్తిగా విఫలమయ్యారని దుయ్యబట్టారు.

**ఆగస్టు 6 నుండి రాష్ట్రవ్యాప్త ప్రచార ఉద్యమం:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేందుకు సిపిఐ శ్రేణులు సిద్ధం కావాల న్నారు. ఆగస్టు 6 నుండి 17 వరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రచార ఉద్యమం చేపట్టనున్నట్లు ఈశ్వరయ్య వెల్లడిం చారు. ఈ ముగింపు కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పి.మురళి, నగర కార్యదర్శి విశ్వనాథ్, జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్ని రాజు, డాక్టర్ కె. రాజశేఖర్ తదితర పార్టీ ముఖ్య నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రధాని మోడీ రాజీనామా చేయాలి

**• ధర్మేంద్ర ప్రధాన్‌ను బర్తరఫ్ చేయాలి • సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య**



**తిరుపతి, జులై 19 ప్రభాతవార్త ప్రతినిధి:** 'నీట్ పరీక్ష ప్రశ్నాపత్రం లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను పదవి నుంచి బర్తరఫ్ చేయాలి' అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. ఆదివారం తిరుపతి నగరంలోని బైరాగిపట్టెడ సిపిఐ కార్యాలయం నుండి పద్మావతి పార్క్ కూడలి వరకు సిపిఐ నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించి, అనంతరం కూడలి వద్ద రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ దేశంలో విద్యా రంగాన్ని ప్రక్షాళన చేయాలని, నీట్ పరీక్ష అక్రమాలను వెలికితీయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ప్రముఖ పర్యావరణ వేత్త, సైంటిస్ట్ సోనమ్ వాంగ్‌చుక్ 19 రోజులుగా ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం దుర్మార్గమన్నారు. దేశవ్యాప్తంగా విద్యార్థులు, మేధావులు, వివిధ రంగాల ప్రముఖులు ఇంత పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తున్నప్పటికీ ప్రధాని మోడీ కనీసం ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం దేశ ప్రజల దౌర్భాగ్యమని మండిపడ్డారు.
బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత టెట్, సిబిఎస్ఇ, యుపిపిఎస్‌సి, నీట్ వంటి దేశవ్యాప్తంగా దాదాపు 89 రకాల పరీక్షల ప్రశ్నపత్రాలు లీక్ అయ్యాయని ఈశ్వరయ్య ఆరోపించారు. పరీక్షల లీకేజీల వల్ల మానసిక వేదనకు గురై 20మంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నారని, 23 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలో పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థను కార్పొరేట్ మాఫియా చేతుల్లో పెడుతోందని ఆరోపించారు. సోనమ్ వాంగ్‌చుక్ అక్రమ అరెస్టును తాము తీవ్రంగా ఖండిస్తున్నామని, సోమవారం జరగబోయే చలో పార్లమెంట్ కార్యక్రమానికి విద్యార్థి, యువజన, మహిళా సంఘాలు, కమ్యూనిస్ట్ పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి సంఘీభావం ప్రకటించాలని పిలుపునిచ్చారు. ఈ నిరసన కార్యక్రమంలో సిపిఐ తిరుపతి జిల్లా కార్యదర్శి పి. మురళి, నాయకులు విశ్వనాథ్, చిన్ని రాజు, గురవయ్య, సుధాకర్ రెడ్డి, రాధాకృష్ణ, నదియా, కత్తి రవి, చంద్రశేఖర్ రెడ్డి, ఎన్.డి. రవి, పద్మనాభ రెడ్డి, రాజా, నాగరాజు, మహేంద్ర, శివ, మంజుల, రత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

# తిరుమల సమాచారం



## శ్రీవారి సేవలో వరాహమహాదేశికన్

**తిరుమల, జులై 19 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆషాడమాసంలో ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనానికి విచ్చేసిన శ్రీరంగం శ్రీమధన ఆండవన్ ఆశ్రమం పీఠాధిపతి వరాహమహాదేశికన్‌కు టిటిడి పెద్ద మర్యాదతో స్వాగతం పలికింది. ఆదివారం శిష్యులతో కలసి తిరుమలకు చేరుకున్న వరాహమహాదేశికన్ స్వామికి టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, పేష్కార్ రామకృష్ణ అర్చకులు ఆలయ సాంప్రదాయంతో స్వాగతం పలికారు. మంగళవాయిద్యాల నడుమ ఆలయంలోనికి చేరుకున్నారు. ధ్వజస్తంభానికి నమస్కరించారు. ఆనందనిలయంలో శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వేదాశీర్వచనం, స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## 22న తిరుమలలో పల్లవోత్సవం



**తిరుమల, జులై 19 ప్రభాతవార్త ప్రతినిధి:** మైసూరు మహారాజు జన్మించిన ఉత్తరాభాద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని టిటిడి 22వతేదీ బుధవారం పల్లవోత్సవం నిర్వహించనుంది. ఇందులో భాగంగా ఆరోజు సాయంత్రం సహస్రదీపాలంకారసేవ అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామి ఊరేగింపుగా కర్ణాటక సత్రానికి వేంచేపు చేస్తారు.. కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులు, మైసూరు సంస్థానం ప్రతినిధులు స్వామి, అమ్మవార్లకు ఆహ్వానం పలికి ప్రత్యేక హారతి సమర్పిస్తారు. మైసూరు మహారాజు జ్ఞాపకార్థం దాదాపు 300 సంవత్సరాల నుండి తిరుమలలో పల్లవోత్సవం జరుగుతోంది.

### తిరుమలకు వస్తే ప్రదర్శన బోర్డులు, ఎస్ఎంఎస్ ద్వారా
# గదుల కేటాయింపు

**ఉప విచారణ కార్యాలయాల్లో సులభంగా వసతి గదులు**






**తిరుమల, జులై 19 ప్రభాతవార్త ప్రతినిధి:** దేశం నలుమూలల నుండి శ్రీవారి దర్శనానికి తిరుమలకు వస్తున్న భక్తులకు మరింత సులభంగా వసతి గదులు కేటాయించేలా టిటిడి వసతి కల్పన విభాగం చర్యలు చేపట్టింది. సామాన్య భక్తులు గదుల కోసం ఇబ్బంది పడకుండా టిటిడి విస్తృత ఏర్పాట్లు చేసింది. గతంలో సిఆర్ఒ వద్ద గదుల కోసం భక్తులు గంటల సమయం వేచి ఉండే విధానాన్ని మార్పు చేస్తూ భక్తుల అవస్థలు, సమయాన్ని దృష్టిలో ఉంచుకుని ఉప విచారణ కార్యాలయాల ద్వారా గదులు కేటాయించే విధానాన్ని అమలు చేస్తోంది. భక్తులు ముందుగా తిరుమలలోని కేంద్రీయ విచారణ కార్యాలయం (సిఆర్ఒ) వద్ద రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. ఉదయం 5 గంటల నుండి సిఆర్ఒ కార్యాలయం తెరుచుకుంటుంది. గదులు అందుబాటులో ఉన్నంత వరకు సులభంగా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు.
భక్తులు క్యూలైన్‌లో నిలబడి తమ వంతు వచ్చిన తర్వాత రిజిస్ట్రేషన్ కౌంటర్ వద్ద తమ ఒరిజినల్ ఆధార్ కార్డు గానీ జిరాక్స్ కాపీని తీసుకెళ్లి ఫోన్ నెంబర్ వివరాలు తెలియజేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. ముఖ గుర్తింపు విధానం ద్వారా రిజిస్ట్రేషన్ చేయడం జరుగుతుంది. కౌంటర్ వద్ద రెండు కేటగిరీలకు సంబంధించిన గదుల్లో తమకు నచ్చిన కేటగిరీని ఎంచుకోవచ్చు.
ఎ కేటగిరీలో 50 రూపాయలు గదులు, 100 రూపాయలు గదులు, బి కేటగిరీలో వెయ్యి రూపాయలు అద్దె గదులు ఉంటాయి. ఈ ప్రక్రియ పూర్తి కాగానే భక్తులకు ఒక అక్నాలెడ్జ్మెంట్ స్లిప్ కేటాయించబడుతుంది. క్యూలైన్ల వద్ద భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా తాగునీరు, అన్న ప్రసాదం, మరుగుదొడ్లు వంటి సదుపాయాలు అందుబాటులో ఉంటాయి.

**గదుల కోసం మార్గదర్శకాలు:** తిరుమలలో గదులు పొందడానికి 21 సంవత్సరాల వయస్సు నిండి ఉండాలి. ఒకసారి గదిని పొందిన వ్యక్తి 30 రోజుల వరకు తిరిగి గదిని పొందలేరు. ఒక కుటుంబం నుండి ఒక వ్యక్తి మాత్రమే క్యూ లైన్‌లోకి రావాలి.
ఒంటరి వ్యక్తికి, అవివాహితులకు గదులు కేటాయించ బడవు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయిన తర్వాత సిఆర్ఒ వద్ద ఉన్న ప్రదర్శన బోర్డులలో వరుస క్రమంలో రిజిస్ట్రేషన్ సంఖ్య కనిపిస్తుంది. వారి క్రమ సంఖ్య కనిపించిన 15 నిమిషాలలోపు వారి సెల్‌ఫోన్‌కు కేటాయించిన గదికి సంబంధించిన సమాచారం మెసేజ్ రూపంలో అందుతుంది. ఒకవేళ ప్రదర్శన బోర్డుల్లో భక్తుల రిజిస్ట్రేషన్ క్రమ సంఖ్య వచ్చినప్పటికీ మెసేజ్ రాకపోతే సిఆర్ఒ వద్ద ఏర్పాటు చేసి కీయోస్క్ మిషన్లలో తమ స్లిప్ స్కాన్ చేస్తే తమకు కేటాయించిన గది వివరాలు చూపిస్తుంది. అనంతరం భక్తులు వారికి గది కేటా యించిన ప్రాంతంలోని ఉప విచారణ కార్యాల యాలకు చేరుకుని గదికి సంబంధించిన రుసుమును ఆన్ లైన్ (ఫోన్ పే/ గూగుల్ పే/ యూపీఐ/ క్రెడిట్ కార్డు/ డెబిట్ కార్డు ద్వారా మాత్రమే చెల్లించి తాళాలు తీసుకోవాల్సి ఉంటుంది.

**తిరుమలలో ఉప విచారణ కార్యాలయాలు:** భక్తుల కోసం సులభంగా ఉపవిచారణ కార్యాలయాలను ఆధునీకరించారు. అంజనాద్రి నగర్ కాటేజస్, శేషాద్రి నగర్ కాటేజస్, శంఖుమిట్ట కాటేజస్, గరుడాద్రి నగర్ కాటేజస్, హిల్ వ్యూ కాటేజస్., సుదర్శన సత్రం, గోవర్ధన్ సత్రం, కళ్యాణి సత్రం, సప్తగిరి విశ్రాంతి గృహంతో బాటు రామ్ భగిచా విశ్రాంతి గృహం2, వరాహ స్వామి విశ్రాంతి గృహం 1,2, అష్ట వినాయక విశ్రాంతి గృహం,కౌస్తుభం విశ్రాంతి గృహం, పాంచజన్యం విశ్రాంతి గృహం, మాతృశ్రీ వకుళామాత విశ్రాంతి గృహం, నందకం విశ్రాంతి గృహం, సూరాపురం తోట ఉన్నాయి.

**గదులు పొందిన భక్తులకు నిబంధనలు:** గదులు 24 గంటలకు మాత్రమే కేటాయించబడతాయి. ఒకవేళ 24 గంటలు దాటితే టారిఫ్ 200 శాతం, 48 గంటలు దాటితే 400 శాతం పెరుగుతుంది.
నీరు విద్యుత్‌ను వృథా చేయరాదు. తిరుమలలో ప్లాస్టిక్ నీళ్ల బాటిళ్లను ఉపయోగించరాదు. జగ్గులు నీటి గ్లాసులను ఉపయోగించాలి.. వాటిని శుభ్రంగా ఉంచాలి. తడి పొడి చెత్తను వాటికి వేర్వేరుగా కేటాయించిన చెత్త బుట్టలలో వేయాలి. భక్తులు వారి వస్తువులను వారే బాధ్యత వహించాలి. గదులు పొందిన భక్తుడు/ భక్తురాలు మాత్రమే గది ఖాళీ చేయాల్సి ఉంటుంది. లేకుంటే కాషన్ డిపాజిట్ తిరిగి ఇవ్వబడదు.

## కళాకారుల కుటుంబాలకు టిటిడి ఉదారత

**• మృతుల అంత్యక్రియలకు రూ.25 వేల తక్షణ సాయం**



**తిరుమల, జులై 19 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన హెచ్‌డిపిపి కళాకారులకు టిటిడి ఉదారత చాటుకుంది. హిందూ ధర్మ ప్రచార పరిషత్ (హెచ్‌డిపిపి) టిటిడి ఆధ్వర్యంలో చిత్తూరు జిల్లా నగరి సమీపంలోని సత్రవాడలో టిటిడి ఆలయంలో ఆదివారం ఉదయం నిర్వహించాల్సిన హరికథ కార్యక్రమంలో భక్తి సేవలు అందించేందుకు తిరుపతి నుండి సత్రవాడకు వెళ్తున్న ప్రైవేట్ కళాకారులు కె.చక్రవర్తి (వయోలిన్), కె.నాగరాజుచెట్టి (తబలా) తిరుపతికి సమీపంలోని వడమాలపేట- పూడి క్రాస్ సమీపంలో రోడ్డుప్రమాదానికి గురయ్యారు. ఈ విషాదకర ప్రమాదంలో దురదృష్టవశాత్తు అక్కడికక్కడే మృతి చెందారు. విధుల్లో భాగంగా ఈ విషాదం చోటుచేసుకోవడంతో టిటిడి ధర్మకర్తల మండలి ఛైర్మన్ బి.ఆర్.నాయుడు, టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, జెఇఒ డాక్టర్ ఎ.శరత్ మానవతా దృక్పథంతో మృతుల కుటుంబాలకు తక్షణ సహాయం అందించాలని ప్రత్యేక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ మేరకు మరణించిన ప్రతి కళాకారుడి కుటుంబానికి అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం హెచ్‌డిపిపి నిధి నుండి 25 వేల రూపాయలు చొప్పున తక్షణ ఆర్థిక సహాయాన్ని మృతుల కుటుంబ సభ్యులకు హెచ్‌డిపిపి కార్యదర్శి డాక్టర్ మేడసాని మోహన్ అందజేశారు.

## తిరుమల రెండోఘాట్‌లో కారు బోల్తా



**తిరుమల, జులై 19 ప్రభాతవార్త ప్రతినిధి:** శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వస్తున్న తెలంగాణ హైదరాబాద్ వాసుల కారు రెండోఘాట్‌లో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో భక్తులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. హైదరాబాద్‌కు చెందిన శ్రీధర్ కుటుంబంతో కలసి ఆదివారం మధ్యాహ్నం తిరుమలకు ట్యాక్సీ కారులో వస్తుండగా రెండో ఘాట్‌లో లింకురోడ్డు దాటిన తరువాత రక్షణగోడను ఢీకొంది. కారు బోల్తాపడటంతో భక్తులు గాయపడ్డారు. ఈ సంఘటనతో ఘాట్‌లో వాహనాలు ఆగిపోయాయి. ట్రాఫిక్ స్తంభించింది. సమాచారం అందుకున్న విజిలెన్స్, పోలీసులు కారును పక్కకు తప్పించి వాహనాలను క్రమబద్ధీకరించారు. గాయపడిన వారిని అశ్వినీకి తరలించారు.

## అలిపిరిలో బస్సు తప్పితే భక్తులకు ప్రత్యామ్నాయం




**తిరుమల, జులై 19 ప్రభాతవార్త ప్రతినిధి:** దేశం నలుమూలల నుండి రైళ్ళలో, ఆర్టీసి బస్సులద్వారా ఇతరత్రా ప్రయాణ సౌకర్యాలతో తిరుపతికి చేరుకుని తిరుమలకు ఆర్టీసి బస్సుల్లో ప్రయాణించే భక్తులకు కష్టాలు తప్పాయి. ఇప్పటివరకు అలిపిరి సప్తగిరి తనిఖీ కేంద్రంలో లగేజీ తనిఖీతోబాటు భక్తుల తనిఖీకి క్రిందకు దిగాలి. ఇక్కడ దిగిన తరువాత ఆర్టీసి బస్సులు తనిఖీ చేసుకుని ముందుకు కదులుతాయి. ఆ సమయంలో భక్తులు కూడా తమ లగేజీలను తనిఖీ అయిన తరూవాత అదే బస్సులను ఎక్కి తిరుమలకు రావాల్సి ఉంది. అయితే కొన్ని సందర్భాల్లో చాలామంది భక్తులు బస్సులు తప్పిపోవడం, వచ్చిన బస్సుల టిక్కెట్ చేతిలో ఉన్నా మరోబస్సులో ప్రయాణించే వీలులేకపోతోంది. దీంతో సుదూర ప్రాంతాల నుండి వస్తున్న గ్రామీణ ప్రాంత భక్తులు సామాన్యభక్తులు కొండకు చేరుకునేందుకు కష్టాలు పడుతున్నారు. భక్తులకు అలిపిరిలో ఎదురవుతున్న ఆర్టీసి కష్టాలపై 'వార్త' దినపత్రిక ప్రత్యేక కథనం ప్రచురించింది. అలిపిరిలో దిగితే బస్సు తప్పితే కన్నీళ్ళే శీర్షికతో ఆర్టీసి అధికారులు స్పందించారు. టిటిడి అధికారుల ఆదేశాలతో ఆర్టీసి అధికారులు ప్రత్యాయ్నాయ చర్యలు చేపట్టారు. ఎవరైనా భక్తులు ఆర్టీసి బస్టాండ్‌లలో గానీ, రైల్వేస్టేషన్ వద్ద నుండి గానీ ఆర్టీసి బస్సుల్లో ప్రయాణించి అలిపిరి వద్ద తప్పిపోతే వారిని తిరిగి సురక్షితంగా మరో బస్సు ఎక్కించి తిరుమలకు పంపేలా చర్యలు తీసుకున్నారు. ఇందుకు అలిపిరి వద్ద సిబ్బందిని నియమించారు. అదేగాక భక్తులు తమ కష్టాలను అలిపిరి డిఎం, తిరుపతి డిఎం, తిరుమల డిపో డిఎంలకు ఫోన్‌చేసినా వారికి సాయం అందిస్తారు. ఈ ప్రకటనతో ఉన్న గోడపత్రికలను అలపిరి తనిఖీ కేంద్రంలో బస్సుల మార్గాల్లో అంటించారు. దీనివల్ల భక్తులకు బస్సు తప్పిపోతే తిరుమలకు చేరుకోవడం సులభమైంది. భక్తులు దీన్ని గమనించి తమ ప్రయాణీన్ని సులభం చేసుకోవాలని ఆర్టీసి కోరింది.

## శ్రీకాళహస్తీశ్వరాలయంలో భీముని బిక్షాటన: భక్తుల సంబరం

**శ్రీకాళహస్తి, జులై 19 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలయం వద్ద భారతం పఠనం జరుగుతుంది. ఈ సందర్భంగా భారతంలోని సన్నివేశాలను తిరుపతి, శ్రీకాళహస్తి, చౌడేపల్లి రంగస్థల కళాకారులచే ప్రదర్శిస్తున్నారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కొట్టుసాయిప్రసాద్, ఇఓ బికె వెంకటేశులు పర్యవేక్షించారు. ఉత్సవాలకు హాజరౌతున్న భక్తుల సౌకర్యాలను పరిశీలించారు. అంతేకాక ప్రధాన ఉత్సవాల ఏర్పాట్లును పరిగణలోకి తీసుకొని ఇంజనీరింగ్ అధికారులతో చర్చించారు. ఆదివారం ఉదయం శ్రీకృష్ణుడు, అర్జునుడు, ద్రౌపదీ దేవి విగ్రహాలను ఊరేగించారు. ఊరేగింపు సుమారు 5కిలో మీట్లు పట్టణంలో సాగింది. ఉత్సవంతో పాటు ఇన్‌చార్జి ఆర్ సుబ్రమణ్యం, దుర్గా ప్రసాద్ పర్యవేక్షించారు. పూజారి పురుషోత్తం వెంటరాగా ఉత్సవం కన్నుల పండువగా సాగింది. భారతంలోని అంశాల్లో భీముని బిక్షాటన కార్యక్రమాలను అత్యంత ఆకర్షిణీయంగా నిర్వహించారు.



శ్రీకాళహస్తిలో శ్రీకృష్ణుడు, అర్జునుడు, ద్రౌపదీ దేవి ఊరేగింపు

పాలక మండలి సభ్యుడు వాకచర్ల గుర్రప్పశెట్టి తదితరులు పాల్గొన్నారు.

20-7Pg7exHMNWJQE_20-7Pg7exHMNWJQE.qxd 20/Jul/26 12:24 AM Page 1





## సైకిళ్ళ పంపిణీ తాత్కాలికంగా వాయిదా

**● మంత్రి పొంగూరు నారాయణ వెల్లడి**

**నెల్లూరు(వైద్యం), జులై 19 ప్రభాతవార్త:** నెల్లూరు కార్పొరేషన్ పరిధిలోని ప్రభుత్వ స్కూల్స్‌లో చదువుతున్న 10 వేల మంది పేద విద్యార్థుల కోసం 6 కోట్ల రూపాయల సొంత నిధులతో రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తలపెట్టిన సైకిళ్ల పంపిణీ కార్యక్రమం వర్షాల కారణంగా తాత్కాలికంగా వాయిదా పడింది. పురపాలిక శాఖ మంత్రి నారాయణ మాట్లాడుతూ వర్షాల కారణంగా సైకిళ్ళ పంపిణీ కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేశామని తెలిపారు. వాతావరణం అనుకూలిస్తే శుక్ర, శనివారాల్లో పంపిణీ చేస్తామని స్పష్టం చేశారు. అనంతరం వర్షపు నీరు చేరిన వీఆర్సీ గ్రౌండ్‌ను మంత్రి నారాయణ పరిశీలించారు. సైకిళ్ల పంపిణీ ఏర్పాట్లకు వర్షం ఆటంకం కలిగించటంతో వీఆర్సీ మైదానాన్ని మంత్రి నారాయణ అదివారం స్వయంగా పరిశీలించారు. మంత్రి వెంట డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, బిజెపి నేత కర్నాటి ఆంజనేయ రెడ్డి, కమీషనర్ నందన్, డిఈఓ బాలాజీరావు, మాజీ మున్సిపల్ ఛైర్పర్సన్ తాళ్ళపాక అనురాధ, మాజీ జెడ్పిటిసి విజేతా రెడ్డి, నగర పార్టీ అధ్యక్షులు మామిడాల మధు, కార్పొరేటర్లు కర్తం ప్రతాప్ రెడ్డి, రామకృష్ణ, కిన్నెర ప్రేమ్ కుమార్, టీడీపీ నేతలు డాక్టర్ పోకల రవి, కిన్నెర ప్రసాద్, బాలాజీ, తిరుమల నాయుడు, దర్శి హరికృష్ణ, జహీర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# టిడిపి పెద్దల జేబులు నింపేలా రామాయపట్నం పోర్టు స్కామ్

**● మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆరోపణలు**

**విజయవాడ, జులై 19 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్ర భవిష్యత్తుకు అత్యంత కీలకమైన రామాయపట్నం పోర్టును టిడిపి పెద్దల జేబులు నింపేందుకు ఓ భారీ స్కామ్‌గా మార్చారని వైసీపీ అధినేత జగన్ ఆరోపించారు. రామాయపట్నం పోర్టు విషయంలో ప్రస్తుత టిడిపి కూటమి ప్రభుత్వం జగన్ పలు అభియోగాలు చేసారు. రాష్ట్ర ఖజానాకు వేల కోట్ల రూపాయల నష్టం కలిగించేందుకు సిద్ధమయ్యారని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా ఒక పోస్ట్ చేస్తూ ప్రభుత్వంపై ఘాటు విమర్శలు గుప్పించారు. మా హయాంలో పురోగతి. ఇప్పుడు ప్రైవేటుపరం అవుతుందన్నారు. నవ్యాంధ్రప్రదేశ్ ఆర్థికాభివృద్ధికి పోర్టులే కీలకమని భావించిన తమ ప్రభుత్వం, రామాయపట్నం, మచిలీపట్నం, మూలపేట పోర్టుల నిర్మాణంలో గణనీయమైన పురోగతి సాధించిందని జగన్ గుర్తుచేశారు. ఈ మూడు పోర్టులకు సంబంధించి భూసేకరణ, అన్ని రకాల చట్టబద్ధమైన అనుమతులు, ఆర్థిక వనరుల సమీకరణ వంటి అత్యంత క్లిష్టమైన పనులన్నీ తమ హయాంలోనే పూర్తయ్యాయని ఆయన వివరించారు. ప్రాజెక్టుల పూర్తి కోసం ఈపీసీ కాంట్రాక్టులను కూడా ఖరారు చేసి, 2024 జూన్ నాటికి నిర్మాణ పనుల్లో చెప్పుకోదగ్గ పురోగతిని సాధించామని తెలిపారు.



ఇంత కష్టపడి ఒక రూపు తీసుకొచ్చిన పోర్టును ఇప్పుడు టీడీపీ ప్రభుత్వం అప్పనంగా ప్రైవేటుపరం చేసేందుకు కుట్ర పన్నుతోందని ఆయన ఆరోపించారు. రామాయపట్నం పోర్టు వల్ల రాష్ట్రానికి అపారమైన ఆర్థిక ప్రయోజనాలు చేకూరనున్నాయని జగన్ తన పోస్టులో ప్రస్తావించారు. భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్) సుమారు రూ.1 లక్ష కోట్లకు పైగా పెట్టుబడితో ఏర్పాటు చేయనున్న గ్రీన్‌ఫీల్డ్ రిఫైనరీ, పెట్రోకెమికల్ కాంప్లెక్స్ పూర్తిగా రామాయపట్నం పోర్టుపైనే ఆధారపడి ఉందని తెలిపారు. ముడి చమురు దిగుమతికి ఈ పోర్టు కీలకం కానుందన్నారు. అలాగే, ఇండోసోల్ సోలార్ సంస్థ ఏర్పాటు చేయనున్న గిగా స్కేల్ తయారీ ప్లాంటుకు కూడా ఈ పోర్టే ఆధారం అని తెలిపారు. ముడిసరుకుల దిగుమతికి, తయారైన సోలార్ మాడ్యూళ్ల ఎగుమతికి ఈ డీప్ వాటర్ పోర్టు అత్యంత అవసరమని పేర్కొన్నారు. వీటితో పాటు, వైఎస్సార్ కడప జిల్లాలో జేఎస్‌డబ్ల్యూ స్టీల్ నిర్మిస్తున్న ఉక్కు కర్మాగారానికి అవసరమైన ముడి ఇనుము, కోకింగ్ కోల్ వంటివి దిగుమతి చేసుకోవడానికి రామాయపట్నం పోర్టులో ఆ సంస్థ రెండు బెర్తులను అభివృద్ధి చేస్తోందని గుర్తుచేశారు. ఈ ప్రాజెక్టులన్నీ వేలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పించడమే కాకుండా, రాష్ట్రానికి పన్నుల రూపంలో భారీ ఆదాయాన్ని సమకూరుస్తాయని జగన్ వివరించారు. రామాయపట్నం పోర్టును టీడీపీ ప్రభుత్వం ఓ భారీ స్కామ్‌గా మార్చేందుకు ప్రయత్నిస్తోందని జగన్ తీవ్రంగా ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.4,929 కోట్లు ఖర్చు చేసి నిర్మిస్తున్న ఈ పోర్టును, కేవలం రూ.1,500 కోట్ల ముందస్తు చెల్లింపులకే ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టాలని చూస్తోందని ఆయన విమర్శించారు. దీనివల్ల రాష్ట్ర ఖజానాకు తీరని నష్టం వాటిల్లుతుందని, మిగిలిన రూ.3,500 కోట్లకు పైగా అప్పుల భారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే మోయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తంచేశారు. టీడీపీ పెద్దలకు నగదు ప్రవాహాలు సృష్టించడమే ఈ కుట్ర వెనుక ఉన్న అసలు లక్ష్యమని జగన్ ధ్వజమెత్తారు.

# హంద్రీనీవా కాలువ సామర్థ్యం 11,500క్యూసెక్కులకు పెంచాలి

**● లైనింగ్ పనుల్లో భారీ ఎత్తున అవినీతి ● వైసిపి నేతలు ఆరోపణ ● త్వరలో ఉద్యమిస్తామని వెల్లడి**



**అనంతపురం, జులై 19 ప్రభాతవార్త బ్యూరో:** రాయలసీమ జిల్లాల్లో సాగునీరు, తాగునీరు అందించే లక్ష్యంతో చేపట్టిన హంద్రీ నీవా ప్రాజెక్టు లైనింగ్ పనులను అనంతపురం జిల్లా కూడేరు మండలం చోళ సముద్రం వద్ద వైసిపి రాయలసీమ జిల్లాల నేతలు ఆదివారం పరిశీలించారు. గ్రేటర్ రాయలసీమ సాగునీటి హక్కుల కోసం ఇరిగేషన్ ప్రాజెక్టులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్న పార్టీ నిర్ణయం మేరకు హంద్రీనీవా కాలువను వైసిపి నేతలు పరిశీలించారు. రెండు కిలోమీటర్ల మేర రైతులు, పార్టీ శ్రేణులతో కలిసి వైసిపి అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, నంద్యాల, కర్నూలు జిల్లాల అధ్యక్షులు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, ఎస్వీ మోహన్‌రెడ్డి, మాజీ మంత్రి శైలజానాథ్, మాజీ ఎమ్మెల్యేలు వై.విశ్వేశ్వరరెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి, మాజీ ఎంపీ రంగయ్య, జిల్లా పరిషత్ చైర్మన్ బోయ గిరిజమ్మ, వైసిపి జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతిరెడ్డి, మంగమ్మ, గ్రేటర్ రాయలసీమ రాయలసీమ ప్రాజెక్టుల టాస్క్‌ఫోర్స్ కమిటీ అనంతపురం జిల్లా కోఆర్డినేటర్ నార్పల సత్యనారాయణ రెడ్డి, వైసిపి జిల్లా నేతలు మహాలక్ష్మి శ్రీనివాస్, రమేష్ గౌడ్, సోమశేఖర్ రెడ్డి, నదీమ్, వెన్నపూస రవీంద్రారెడ్డి, కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి, శ్రీదేవి తదితర నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. వైసిపి నేతలు పాదయాత్రగా వెళ్లి కాలువ లైనింగ్ పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా వైసిపి నేతలు మీడియాతో మాట్లాడారు. వైయస్ జగన్ సీఎం ఉన్నప్పుడు కూడా హంద్రీ నీవా ప్రధాన కాలువను 6500 క్యూసెక్కుల సామర్థ్యంతో వెడల్పు చేయాలని టెండర్లు కూడా ఇచ్చారన్నారు. రెండేళ్లలో మూడు వేల కోట్ల రూపాయలు ఖర్చు చేశామని సిఎం చంద్రబాబు చెబుతున్నారు. నిజంగా పనులు సక్రమంగా జరిగుంటే అనంతపురం జిల్లాకు 80 టీఎంసీల నీరు వచ్చేది. ఆ మేరకు నీళ్లు ఎందుకు రాలేదో సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక హంద్రీనీవాను 11500 క్యూసెక్కుల సామర్థ్యంతో విస్తరిస్తాం అని చెప్పారు.

రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనులను వైఎస్ జగన్ 80శాతం పూర్తి చేశారు అని, రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనులను ఎన్జీటీకి వెళ్లి అడ్డుపడిన నాయకుడు చంద్రబాబు అని విమర్శించారు. తెలంగాణ అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి చెప్పిన మాటలను ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పటిదాకా ఎందుకు ఖండించలేదు? ప్రశ్నించారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు కోసం పోరాటం ఉధృతం చేస్తాం అని ఆయన చెప్పారు. చంద్రబాబు రాయలసీమకు తీవ్ర అన్యాయం చేశారు అని, తెలంగాణ అక్రమ ప్రాజెక్టులపై చంద్రబాబు నోరు మెదపడం లేదు అని విమర్శించారు. హంద్రీనీవా ప్రాజెక్టు పనులను నాసిరకం చేసి వందల కోట్ల అవినీతికి పాల్పడ్డారు అని, దోచుకోవడం.. దాచుకోవడమే చంద్రబాబు సిద్ధాంతమా? అని ఆయన ప్రశ్నించారు. హంద్రీనీవా ప్రాజెక్టు లైనింగ్ పనుల్లో వందల కోట్ల రూపాయల దోపిడీ జరిగింది అని, ఈ అవినీతి పై సమగ్ర విచారణ జరపాలి అని డిమాండ్ చేశారు. హంద్రీనీవా నిర్వీర్యం చేసేందుకు కూటమి ప్రభుత్వం కుట్రలు చేస్తోంది అని ఘాటుగా విమర్శించారు. హంద్రీనీవా అడ్డుపెట్టుకుని టిడిపి కూటమి నేతలు భారీ దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. రానున్న రోజుల్లో రాయలసీమ వ్యాప్తంగా సాగునీటి ప్రాజెక్టుల కోసం ఉద్యమిస్తామన్నారు.



# హంద్రీ నీవా కాలవ పరిశీలన పేరుతో వైసిపి నేతల రాజకీయ డ్రామా

**● జగన్ హయాంలో హంద్రీ నీవాకు చేసింది ఏమీ లేదు**

**● మంత్రి పయ్యావుల కేశవ్, కాలవ శ్రీనివాసులు ధ్వజం**

**అనంతపురం, జులై 19 ప్రభాతవార్త బ్యూరో:** ప్రజాభిమానం కోల్పోయిన వైసిపి నాయకులు రాజకీయ ఉనికి కోసం తాపత్రయ పడుతున్నారని మంత్రి పయ్యావుల కేశవ్, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు విమర్శించారు. ఐదేళ్లపాటు హంద్రీనీవా ప్రాజెక్టును పూర్తిగా నిర్లక్ష్యం చేసిన వైసిపి వారు ఇప్పుడు హంద్రీనీవా కాలువ పరిశీలన పేరుతో రాజకీయ డ్రామాలకు తెరలేపడం ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నమేనని ఆరోపించారు. ఉరవకొండ సమీపంలో ఇటీవల విస్తరించిన హంద్రీనీవా కాలువ పనులను ఆదివారం పరిశీలించిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ, 2014-19 మధ్య ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక చొరవతో హంద్రీనీవా కాలువ విస్తరణ పనులు వేగంగా సాగాయన్నారు. 2019 నాటికే దాదాపు 35 శాతం పనులు పూర్తయ్యాయని గుర్తు చేశారు. అయితే అనంతరం జగన్ రెడ్డి ప్రభుత్వం వాటిని అర్ధాంతరంగా నిలిపివేసి, ప్రాజెక్టు పురోగతిని పూర్తిగా దెబ్బతీసిందని ఆరోపించారు. జగన్మోహన్ రెడ్డి తన పాలనలో హంద్రీనీవాకు రూ.500 కోట్లు కూడా ఖర్చు చేయలేదని వారు విమర్శించారు. కాలువను 6,000 క్యూసెక్కులకు విస్తరిస్తామని, సమాంతరంగా మరో కాలువ నిర్మిస్తామని నమ్మబలికి, అధికారంలో ఉన్నన్ని రోజులు విస్తరణ ఊసెత్తకుండా జిల్లా ప్రజానీకాన్ని నిలువునా మోసగించిన జగన్ రెడ్డిని వైసిపి ప్రజాప్రతినిధులు ఎందుకు ప్రశ్నించలేదని నిలదీశారు. విస్తరణ పనులను నిలిపివేసి తట్టెడు మట్టి కూడా ఎత్తని వైసిపి నాయకులకు హంద్రీనీవా గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని వ్యాఖ్యానించారు. చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెండేళ్లలోనే హంద్రీనీవా కాలువ విస్తరణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయగలిగామని తెలిపారు. అనంతపురం జిల్లా రైతులు, ప్రజల పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబుకి ఉన్న చిత్తశుద్ధికి హంద్రీనీవా పనులే నిదర్శనమని పేర్కొన్నారు. భవిష్యత్తులో వైసిపి అధికారంలోకి వచ్చే పరిస్థితే లేదన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి పాల్గొన్నారు.

## పైప్‌లైన్‌లో చిక్కుకుని చిన్నారి మృతి



**డెహ్రాడూన్, జులై 19:** ఉత్తరాఖండ్‌లో కురుస్తున్న ఎడతెరిపి లేని భారీ వర్షాలు మరో విషాదానికి కారణమయ్యాయి. వికాస్‌నగర్‌లో జరిగిన ఘటన ప్రతి ఒక్కరినీ కలిచివేసింది. ఆడుకుంటూ ఉన్న ఆరేళ్ల చిన్నారి క్షణాల్లోనే వరద ప్రవాహంలో కొట్టుకుపోయి ప్రాణాలు కోల్పోవడం స్థానికులను తీవ్ర విషాదంలో ముంచెత్తింది. వికాస్ నగర్‌లో భారీ వర్షం కురుస్తున్న సమయంలో ఆరేళ్ల అర్మాన్ రోడ్డు పక్కన ఇతర పిల్లలతో కలిసి ఆడుకుంటున్నాడు. అదే సమయంలో ఒక్క సారిగా ఉధృతంగా ప్రవహించిన వర్షపు నీరు అతడిని సమీపంలోని మురుగు కాలువ వైపు లాక్కెళ్లింది. బలమైన ప్రవాహాన్ని తట్టుకోలేక బాలుడు నేరుగా సుమారు 10 అంగుళాల వెడల్పు ఉన్న డ్రైనేజీ పైపులోకి కొట్టుకుపోయాడు. క్షణాల్లో జరిగిన ఈ ఘటనను చూసిన స్థానికులు వెంటనే సహాయక చర్యలు ప్రారంభించారు. బాలుడు పైపులో చిక్కుకున్నాడని గుర్తించిన గ్రామస్తులు వెంటనే జేసీబీ యంత్రాన్ని తీసుకొచ్చి పైపును పగలగొట్టే ప్రయత్నం చేశారు. సమయం గడుస్తున్న కొద్దీ ఆందోళన మరింత పెరిగింది. అందరూ ప్రాణాలతో బయటపడతాడని ఆశించినప్పటికీ, పైపును తొలగించి బాలుడిని బయటకు తీసే సమయానికి అతడు అప్పటికే స్పృహ కోల్పోయాడు. వెంటనే కుటుంబ సభ్యులు అతడిని సమీప ఉపజిల్లా ఆసుపత్రికి తరలించినా, పరీక్షించిన వైద్యులు అప్పటికే అతడు మరణించినట్లు ప్రకటించారు. ఈ దృశ్యం అక్కడున్న వారందరినీ కన్నీటిపర్యంతం చేసింది.

# వికె ఆదినారాయణ రెడ్డి స్ఫూర్తితో పనిచేద్దాం

**కమ్యూనిస్టు యోధుడు వికె వర్ధంతి సభలో ఎఐఎస్‌ఎఫ్ నేతల నిర్ణయం**

**అనంతపురం, జులై 19 ప్రభాతవార్త బ్యూరో:** ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడు, మాజీ ఎమ్మెల్యే, కమ్యూనిస్టు పార్టీ రూపకర్తల్లో ఒకరైన వికె ఆదినారాయణ రెడ్డి స్ఫూర్తితో, ఆయన ఆశయాల సాధన కోసం కృషి చేయాలని ఎఐఎస్‌ఎఫ్ మాజీ నాయకులు నిర్ణయం తీసుకున్నారు. అనంతపురంలో వికె ఆదినారాయణరెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివారం పెద్ద ఎత్తున నిర్వహించారు. వికె భవన్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న మాజీ ఏఐఎస్‌ఎఫ్ నాయకులు హాజరయ్యారు. వికె రంగారెడ్డి, తిరుపతయ్య ఇతర నాయకుల అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎఐఎస్‌ఎఫ్ మాజీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. వీకే ఆదినారాయణ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. వీకేతో వారికున్న సాన్నిహిత్యాన్ని, పార్టీ కోసం, ప్రజల కోసం నీతి నిజాయితీతో చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎఐఎస్‌ఎఫ్ మాజీ నాయకులు వికె రంగారెడ్డి, వై.మధుసూదనరెడ్డి, తిరుపతయ్య, మల్లికార్జున మాట్లాడుతూ నీతి, నిజాయితీ, నిబద్ధత, విలువలు అన్న పదాలు వికె ఆది



మాట్లాడుతున్న వికె రంగారెడ్డి

నారాయణ రెడ్డి నుంచి వచ్చాయా అన్న విధంగా ఆయన ఉండేవారన్నారు. కమ్యూనిస్టు పార్టీ రూపకర్తల్లో ఒకరిగా ఉంటూ జీవితం మొత్తం అదే సిద్ధాంతాలతో ఆయన జీవించారన్నారు. స్వాతంత్ర సంగ్రామంలో కూడా తన వంతు పాత్ర పోషించారన్నారు. శాసనసభ్యునిగా కూడా పనిచేసి ప్రజలకు సేవలు అందించారని గుర్తు చేసుకున్నారు. ఫ్యాక్షనిజానికి వ్యతిరేకంగా ఆయన చేసిన పోరాటాలు ఎప్పటికీ నిలిచే ఉంటాయన్నారు. కొన్ని సందర్భాల్లో ముఠాకక్ష నేతల వ్యవహార శైలి వల్ల భయానక వాతావరణం ఏర్పడినప్పుడు వికె గట్టిగా స్పందించిన తీరు ఎప్పుడూ గుర్తు ఉంటుందన్నారు. కరవు నివారణ కోసం రైతుల పక్షాన ఆయన నిలబడిన తీరు మరే నాయకుడికి సాటి రావన్నారు. ఎఐఎస్‌ఎఫ్ మాజీ నాయకులంతా వికె ఆదినారాయణ రెడ్డి స్ఫూర్తితో ఒక్కటవ్వాలని నిర్ణయించుకున్నారు. ఇప్పటికే వివిధ రంగాల్లో వివిధ పార్టీల్లో స్థిరపడిన వారంతా రాజకీయాల కతీతంగా ఒక్కటై ముందుకు నడవాలని నిర్ణయించుకున్నారు. వికె ఆదినారాయణ రెడ్డి జిల్లాకు చేసిన సేవలకు గుర్తింపుగా అనంతపురంలో వికె విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని, ఇందుకు అవసరమైన సన్నాహాలు చేయాలని సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు దస్తగిరి, లీలాధర్, రామచంద్రారెడ్డి, రాయదుర్గం రామాంజనేయులు, సూర్యనారాయణ, శంకర్ రెడ్డి, నిర్మల, వికె రాధా, శంకర్ రెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, శేషాద్రి, గోవిందరెడ్డి, విశ్వనాథరెడ్డి, రాము, తదితర నాయకులు పాల్గొన్నారు.

# నరసాపురంలో రూ.58 లక్షలతో అభివృద్ధి: ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి

**ఇందుకూరుపేట (నెల్లూరు), జులై 19 ప్రభాతవార్త:** కూటమి ప్రభుత్వం సంక్షేమంతో పాటు అభివృద్ధికి సమ ప్రాధాన్యం ఇస్తోందని కోవూరు శాసనసభ్యులు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నరసాపురం పంచాయతీలో రూ.58 లక్షల విలువైన పలు అభివృద్ధి పనులకు ఆమె ప్రారంభోత్సవం చేశారు. అనంతరం గ్రామ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడమే తన లక్ష్యమని, కనీసం 50 శాతం హామీలు నెరవేర్చిన తర్వాతే ఆయా గ్రామాల్లో పర్యటిస్తానని ముందుగానే స్థానిక నాయకులకు చెప్పినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే అనేక ప్రాంతాల్లో ఆ లక్ష్యాన్ని చేరుకున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మైపాడు కాలువ, మైపాడు బ్రాంచి కాలువపై రూ.14.50 లక్షలతో నరసాపురం గ్రామ సమీపంలో నిర్మించిన రెండు కల్వర్టులను ప్రారంభించారు. రాబోయే రోజుల్లో గ్రామ ప్రజలు కోరిన సీసీ రోడ్లు, డ్రెయిన్లు, గృహాలు తదితర పనులను కూడా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం అంగన్వాడీ కేంద్రాలకు తల్లికి వందనం పథకాన్ని వర్తింపజేసినందుకు ఆనందం వ్యక్తం చేస్తూ అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు నిర్వహించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కళ్యాణ్ రెడ్డి, తెదేపా మండల అధ్యక్షులు పవన్ కుమార్ రెడ్డి, రాష్ట్ర ఎంఎస్‌ఎంఈ డైరెక్టర్ వీరేంద్ర నాయుడు, మండల బిజెపి అధ్యక్షులు కైలాసం శ్రీనివాసులు రెడ్డి సురేష్ నాయుడు, దాసరి విజయ్, దేవస్థాన ఛైర్మన్ గుండాల కృష్ణారెడ్డి, అవ్వారు ఏడుకొండలు, బిసి సెల్ అధ్యక్షుడు మారుబోయిన జనార్దన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ చలనచిత్ర పురస్కారాల విజేతలకు సిఎం చంద్రబాబు అభినందనలు

**విజయవాడ, జులై 19 ప్రభాతవార్త ప్రతినిధి:** జాతీయ చలనచిత్ర పురస్కారాల విజేతలకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం సోషల్ మీడియా వేదికగా ఒక ప్రకటన విడుదల చేశారు. విజేతలందరికీ శుభాకాంక్షలు తెలుపుతూ, తెలుగు చిత్ర పరిశ్రమ సాధించిన విజయాలపై ప్రత్యేకంగా ప్రశంసలు కురిపించారు. తెలుగు సినీ పరిశ్రమకు చెందిన నటీనటులు, దర్శకులు, నిర్మాతలు, సాంకేతిక నిపుణుల అసాధారణ ప్రతిభ మన సినిమాకు గొప్ప గర్వకారణంగా నిలిచిందని చంద్రబాబు కొనియాడారు. "కళ, సంస్కృతి, సినిమా మన అస్తిత్వానికి, వారసత్వానికి బలమైన మూలస్తంభాలు. తెలుగు సినిమా భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి, తరతరాలకు స్ఫూర్తినివ్వాలి" అని ఆయన తన పోస్టులో ఆకాంక్షించారు. ఈ సందర్భంగా అవార్డులు గెలుచుకున్న వారందరూ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు. తన పోస్టులో ప్రముఖ నటులు మమ్ముట్టి, యామీ గౌతమ్, కార్తీక్ ఆర్యన్, నిహారిక కొణిదెల, దర్శకుడు సుకుమార్‌లను ట్యాగ్ చేయడం విశేషం. దీంతో పాటు 'పుష్ప 2', 'కల్కి 2898 ఏడీ', 'లక్కీ భాస్కర్' వంటి ప్రతిష్ఠాత్మక చిత్రాల హ్యాష్‌ట్యాగ్‌లను కూడా జతచేశారు.

### సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ అభినందనలు

72వ జాతీయ చలనచిత్ర పురస్కారాలలో టాలీవుడ్ ఏకంగా 9 జాతీయ అవార్డులను కైవసం చేసుకుని దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించడంపై రాష్ట్ర సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ హర్షం వ్యక్తం చేస్తూ విజేతలకు తన హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. "భారతీయ చలనచిత్ర రంగంలో తెలుగు సినిమా మరోసారి తన జైత్రయాత్రను చాటిచెప్పడం ఆనందంగా ఉంది. నేషనల్ ఫిల్మ్ అవార్డ్స్ వేదికపై 9 పురస్కారాలతో టాలీవుడ్ తన విశ్వరూపాన్ని ప్రదర్శించడం ప్రతి ఒక్క తెలుగువారికీ గర్వకారణం. ముఖ్యంగా నిహారిక కొణిదెల సమర్పణలో, పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ మరియు శ్రీ రాధా దామోదర్ స్టూడియోస్ బ్యానర్లపై యువ ప్రతిభతో తెరకెక్కిన ఖికమిటీ కుర్రోళ్లుఖి చిత్రం జాతీయ స్థాయిలో ఉత్తమ చిత్రంగా ఎంపిక కావడం అభినందనీయం. పల్లెటూరి నేపథ్యంలో స్నేహం, కుటుంబ బంధాలు, సామాజిక విలువలు, భావోద్వేగాలను వెండితెరపై ఆవిష్కరించి జాతీయ అవార్డును అందుకోవడం ఈ చిత్ర బృందం సాధించిన ఘన విజయం" అని కొనియాడారు. తెలుగు సినిమా కేవలం కమర్షియల్ హంగులకే పరిమితం కాకుండా కథ, కథనం, నటన, సాంకేతిక నైపుణ్యం, కాస్ట్యూమ్ డిజైనింగ్, మేకప్ మరియు అద్భుతమైన నిర్మాణ విలువలు.. ఇలా 24 క్రాఫ్టుల్లోనూ తన తిరుగులేని ప్రతిభను చాటుకుందని మంత్రి దుర్గేష్ ప్రశంసించారు. వెండితెరపై తెలుగు వారి సృజనాత్మకతకు, కష్టానికి దక్కిన గౌరవం ఈ జాతీయ పురస్కారాలని ఆయన పేర్కొన్నారు.

## హస్తకళా మహోత్సవానికి విశేష ఆదరణ

**● లేపాక్షి విసి, ఎండి విశ్వ మనోహర్ వెల్లడి**

**విజయవాడ, జులై 19 ప్రభాతవార్త ప్రతినిధి:** విజయవాడలోని పటమట సెంటర్ సమీపంలోని మేరీస్ ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న ఆంధ్రప్రదేశ్ హస్తకళా మహోత్సవం- 2026 కు నగర ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని లేపాక్షి వీసీ, ఎండీ విశ్వ మనోహర్ తెలిపారు. లేపాక్షి, విసీ, ఎండీ విశ్వ మనోహర్ ఆదివారం మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ఎన్నో రకాల, విభిన్న సంప్రదాయ కళాఖండాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయని చెప్పారు. ప్రజలు ఆసక్తిగా స్టాళ్లను సందర్శించి చేనేత చీరలు, హస్తకళా ఉత్పత్తులను కొనుగోలు చేయడం ద్వారా కళాకారులకు ఆర్థికంగా ప్రోత్సాహం లభిస్తోందని పేర్కొన్నారు. ప్రదర్శన ప్రారంభమైనప్పటి నుంచి విక్రయాలు ఆశాజనకంగా పెరిగాయని తెలిపారు. ఒక్కో చేనేత వస్త్రం వెనుక ఉన్న కళాకారుల శ్రమ, నైపుణ్యాన్ని సందర్శకులు గుర్తించి ఆదరించడం సంతోషకరమన్నారు. ఈ ఆదరణ భారతీయ చేనేత, హస్తకళల పరిరక్షణకు మరింత బలాన్నిస్తుందని అన్నారు.

## ఆగస్టు 12న జాతీయ రిమోట్ సెన్సింగ్ దినోత్సవం

**విజయవాడ, జులై 19 ప్రభాతవార్త ప్రతినిధి:** భారత అంతరిక్ష పరిశోధన పితామహుడు డాక్టర్ విక్రమ్ సారాభాయ్ జయంతిని పురస్కరించుకుని ఇండియా స్పేస్ ల్యాబ్ ప్రతి సంవత్సరం ఆగస్టు 12న జాతీయ రిమోట్ సెన్సింగ్ దినోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. దేశ అభివృద్ధి, సహజ వనరుల నిర్వహణ, పర్యావరణ పర్యవేక్షణ, విపత్తు నివారణ వంటి రంగాల్లో అంతరిక్ష సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసి సమర్థవంతంగా వినియోగించడంలో డాక్టర్ విక్రమ్ సారాభాయ్ చేసిన దూరదృష్టితో కూడిన విశిష్ట సేవలను స్మరించుకుంటూ ఆయన జన్మదినాన ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విపత్తు సంసిద్ధత, పర్యవేక్షణ, అంచనా, ప్రతిస్పందన. సుస్థిర అభివృద్ధిలో భౌగోళిక సాంకేతికతల పాత్రపై అవగాహన పెంపొందించడంతో పాటు జ్ఞానాన్ని విస్తరించే లక్ష్యంతో "విపత్తు నిర్వహణ కోసం రిమోట్ సెన్సింగ్, జీఐఎస్‌అంశంపై ఆన్‌లైన్ వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, పరిశోధకులు, ప్రభుత్వ అధికారులు, విపత్తు నిర్వహణ నిపుణులు మరియు ఇతర ఆసక్తి గల భాగస్వాములను దృష్టిలో ఉంచుకుని ఈ వర్క్‌షాప్‌ను ప్రత్యేకంగా రూపొందించినట్లు తెలిపారు. ఇందులో రిమోట్ సెన్సింగ్, జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ పర్యావరణ పరిశీలన సాంకేతికతలు, జియో ఏఐ, డ్రోన్ మ్యాపింగ్, మెషిన్ లెర్నింగ్ అనువర్తనాలు, అలాగే వాస్తవ ప్రపంచ విపత్తు నిర్వహణకు సంబంధించిన కేస్ స్టడీస్ వంటి పలు కీలక అంశాలపై నిపుణులు అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. ఈ ఆన్‌లైన్ వర్క్‌షాప్‌ను 2026 ఆగస్టు 12న నిర్వహించనున్నట్లు తెలిపారు. పాల్గొనదలచిన వారు రూ. 270 నమోదు రుసుము చెల్లించి తమ పేరును నమోదు చేసుకోవాలని సూచించారు. నమోదు ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైంది. జూలై 30 వరకు కొనసాగుతుందని, ఆసక్తి గల వారు సంబంధిత వెబ్‌సైట్ ద్వారా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. వర్క్‌షాప్‌లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ఇసర్టిఫికేట్ అందజేయనున్నట్లు ఇండియా స్పేస్ ల్యాబ్ డైరెక్టర్ వెల్లడించారు.

## విద్యార్థుల సంక్షేమానికి ప్రాధాన్యత

**- సోషల్ మీడియాకు విద్యార్థులు దూరంగా ఉండాలి**



**కోవూరు (నెల్లూరు), జులై 19 ప్రభాతవార్త:** కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేకంగా చొరవ తీసుకుని వసతి గృహంలో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన వస్తువులను పంపిణీ చేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. కోవూరులోని బాలికల వసతి గృహ సముదామయంలో ఆదివారం విద్యార్థినులకు ప్రభుత్వం ద్వారా వచ్చిన వివిధ రకాల మెటీరియల్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసమే ప్రభుత్వం ఇటువంటి కార్యక్రమాలను చేపడుతుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రతి విద్యార్థి సమాజంలో ఉన్నత స్థాయికి వెళ్లాలనే ఆకాంక్షతో కష్టపడి చదువుకోవాలని సూచించారు. యువత భవిష్యత్తును పాడు చేస్తున్న సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని సూచించారు. జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారత అధికారిణి శోభారాణి, ఏఎస్‌డబ్ల్యూ తిరుపతయ్య, ఎంపీపీ పార్వతి, పెన్నా డెల్టా ఆయకట్టు చైర్మన్ జెట్టి రాజగోపాల్‌రెడ్డి, జొన్నవాడ దేవస్థాన చైర్మన్ అశోక్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ శ్యామ్‌సుందర్‌రెడ్డి, ఎంఈవో-2 వై. చెంచులక్ష్మమ్మ, మండల పార్టీ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షుడు మల్లారెడ్డి, మల్లికార్జునరెడ్డి బాల రవి, వెంకట్, శ్రీనివాసులురెడ్డి, వెంకటేశ్వర్లు, జహంగీర్, సాధిక్, మురళి, సంక్షేమాధికారులు పద్మ, సుప్రజ, శోభారాణి, సుమలత, సునీత, దయాకర్, కూటమి నేతలు ఉన్నారు.

20-07pg10_20-07pg10.qxd 20/Jul/26 12:09 AM Page 1



# జపాన్‌లో మెరిసిన మన బంగారం



* ఫైనల్లో యమగుచిపై విజయం
* తొలి భారత్ షట్లర్‌గా రికార్డు
* ఆనమ్మకమే గెలిపించింది-సింధు

ఒలింపిక్స్ డబుల్ మెడలిస్ట్ పీవీ సింధు ఖాతాలో ఈ రెండేళ్లలో ఒక్క టైటిల్ లేదు. ఆ మాటకొస్తే 2019 వరల్డ్ ఛాంపియన్‌షిప్ గోల్డ్, 2020 టోక్యో ఒలింపిక్స్ బ్రాంజ్‌మెడల్ తప్పిస్తే ఆ తర్వాత పెద్ద విజయాలు లేవు. 2024లో సొంతగడ్డపై సయ్యద్ మోదీ ఇంటర్నేషనల్ టైటిలే చివరిది. దీంతో సింధు ఖేల్ ఖతమ్, ఇక రిటైర్మెంట్ చెప్పడమే ఆలస్యం అన్న సన్నాయి నొక్కులు బలంగానే వినబడ్డాయి. పదే పదే గాయాలు, ఆధునిక ఆటలో వస్తున్న కఠినమైన మార్పులు, అనామాక ప్లేయర్ల చేతుల్లోనూ ఓటములు, రెండేళ్లుగా కొనసాగుతున్న టైటిల్ కరువు వంటి కారణాల వల్ల తన అత్యుత్తమ ఫామ్ తిరిగి పొందుతుందా? టైటిళ్లను గెలుచుకునే సత్తా ఆమెకు ఉందా? అన్న సందేహాలకు ఒక్క జపాన్ ఓపెన్ టైటిల్‌తో సింధు చెక్ పెట్టింది.

**టోక్యో, జూలై 19:** భారత స్టార్ షట్లర్ పీవీ సింధు ఆట తిరిగి గాడిలో పడింది. రెండేళ్లుగా టైటిల్‌కు ముఖం వాచిన సింధూ ఎట్టకేలకు ఆ కొరతను తీర్చుకుంది. జపాన్ ఓపెన్ ఫైనల్లోకి ప్రవేశించిన తొలి సారే టైటిల్ అందుకుని అరుదైన రికార్డు అందుకుంది. మహిళల సింగిల్స్ ఫైనల్లో జపాన్‌కు చెందిన ప్రపంచ నంబర్-3 అకానె యమగుచిపై 21-17, 21-17 తేడాతో వరుస సెట్లలో ఓడించింది. జపాన్ ఓపెన్ సూపర్ 750 టోర్నీ నెగ్గిన తొలి భారత షట్లర్‌గా నిలిచింది. 2019 ప్రపంచ ఛాంపియన్ షిప్ తర్వాత సింధుకు ఇదే అతిపెద్ద టైటిల్.

**కచ్చితమైన స్మాష్‌లతో...**

ఆదివారం టోక్యో మెట్రోపాలిటన్ జిమ్నాసియంలో జరిగిన ఫైనల్లో 31 ఏళ్ల పీవీ సింధు అద్భుత ప్రదర్శన కొనసాగించింది. సొంత మైదానం, సొంత అభిమానుల మధ్య ఆడుతున్న యమగుచిపై ఆరంభం నుంచే సింధూ ఆధిక్యం ప్రదర్శించింది. వేగవంతమైన క్రాస్‌కోర్ట్ డ్రాప్‌లు, కచ్చితమైన స్మాష్‌లతో విరుచుకుపడింది. యమగుచి లయను నిరంతరం దెబ్బతీసింది. కీలకసమయంలో ఒత్తిడిని జయిస్తూ సింధు మొదటి గేమ్‌ను 21-17 తేడాతో కైవసం చేసుకుంది. తొలి గేమ్ నెగ్గిన ఊపులో రెండవ గేమ్‌లో సింధు తన దూకుడును మరింత పెంచింది. దీంతో ఒత్తిడికి లోనైన యమగుచి అనవసర తప్పిదాలు చేసింది. టోక్యో ప్రేక్షకుల మద్దతుతో యమగుచి గేమ్ చివరిలో ఉత్సాహంగా పుంజుకున్నప్పటికీ, సింధు చలించకుండా నిలిచింది. తన ఐకానిక్ 2019 ప్రపంచ ఛాంపియన్‌షిప్ ప్రదర్శనను ప్రతిబింబించే వ్యూహాత్మక క్రమశిక్షణతో సింధు రెండో గేమ్‌ను 21-17 తేడాతో ముగించి చారిత్రాత్మక విజయాన్ని సొంతం చేసుకుంది. క్వార్టర్ ఫైనల్లో ఒకుహర వాకోవర్ ఇవ్వడం, సెమీస్‌లో యుఫేయ్ మధ్యలోనే నిష్క్రమించడంతో తాను ఫైనల్‌కు తేలికగా రాలేదని ఈ తుదిపోరుతో నిరూపించింది. సింధు తన చివరి టైటిల్‌ను 2024లో సయ్యద్ మోడీ ఇంటర్నేషనల్‌లో గెలుచుకుంది. రెండేళ్ల టైటిల్ విరామానికి జపాన్ టోర్నీతో ఫుల్‌స్టాప్ పెట్టింది. వచ్చే నెలలో జరిగే ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో సత్తా చాటడంపై దృష్టి సారించింది.

**కష్టకాలంలోనూ నమ్మకం కోల్పోలేదు-సింధు**

టైటిల్ అందుకున్న పీవీ సింధు భావోద్వేగానికి గురైంది. కష్టకాలంలో కూడా తనపై నమ్మకం కోల్పోలేదని.. తాను టైటిల్ సాధించగలన్న ఎపుడూ విశ్వసించానని, ఆ నమ్మకమే తన విజయానికి కారణమైందని వెల్లడించింది. అటాకింగ్ గేమ్ నా బలం. ఇప్పుడు కోర్టులో స్వేచ్ఛగా కదులుతూ దూకుడుగా ఆడగలుగుతున్నాను. అనవసర తప్పిదాలను తగ్గించగలిగితే మ్యాచ్‌పై పూర్తి నియంత్రణ సాధించవచ్చు. అదే ఈ టోర్నీలో నాకు కలిసొచ్చింది అని సింధు వివరించింది.

వచ్చే నెలలో జరగనున్న ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో ఇదే జోరును కొనసాగించి రికార్డు స్థాయిలో ఆరో పతకాన్ని సాధించడమే తన లక్ష్యమని సింధు స్పష్టం చేసింది. జపాన్ ఓపెన్ గెలుపు ఎంతో ప్రత్యేక మైందని, చాలా కాలంగా దీని కోసమే కష్టపడుతున్నానని, గెలిచిన వెంటనే తన కళ్లలో ఆనందభాష్పాలు వచ్చాయని వెల్లడించింది. ఈ ప్రయాణంలో తనకు తోడున్న కోచ్‌లకు, వెన్నంటే ఉన్న తల్లిదండ్రులు, భర్త, అత్తమామలకు సింధు కృతజ్ఞతలు తెలిపింది.

# ఫ్రాన్స్ చిత్తు: మూడో స్థానంలో ఇంగ్లాండ్




**న్యూయార్క్, జులై 19:** ఫిఫా ప్రపంచకప్ ఫైనల్ చేరడంలో విఫలమైన ఇంగ్లాండ్ మూడోస్థానం పోరులో అదరగొట్టింది. గోల్స్ వర్షం కురిసిన మ్యాచ్‌లో ఫ్రాన్స్‌ను 6-4 తేడాతో ఓడించి మూడో స్థానం పొందింది. ఈ మ్యాచ్‌లో మొత్తం10గోల్స్ నమోదయ్యాయి. ప్రపంచ కప్ నాకౌట్ మ్యాచ్‌లో ఇన్ని గోల్స్ నమోదుకావడం కూడా ఇదే మొదటిసారి. 1966లో విజేతగా నిలిచిన ఇంగ్లాండ్‌కు... ఈసారి బ్రాంజ్ మెడల్ దక్కింది.

ఫుట్‌బాల్ దిగ్గజాలు ఫ్రాన్స్, ఇంగ్లాండ్ మ్యాచ్ ఉత్కంఠ రేపుతోందని ఆశించినా చివరకు ఏకపక్షంగా ముగిసింది. మ్యాచ్ ఆరంభం నుంచే ఇంగ్లాండ్ ఆధిక్యం ప్రదర్శించింది. తొలి అర్ధభాగంలోనే ఏకంగా నాలుగు గోల్స్ నమోదుచేసింది. మూడో నిమిషంలోనే డెక్లాన్ రైస్ గోల్ కొట్టి ఇంగ్లాండ్ గోల్స్ బోణీ చేశాడు. ఆ తర్వాత 18వ నిమిషంలో ఎజ్రి కొన్సా గోల్ చేసి 2-0 ఆధిక్యం అందించాడు. ఇక 37వ నిమిషంలో, ఇంజ్యూరీ టైమ్ 45+1 నిమిషంలో బుకాయో సకా డబుల్ ధమాకా చేశాడు. దీంతో తొలి అర్ధభాగం ముగిసేసరికి ఇంగ్లాండ్ 4-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది.

రెండో అర్ధభాగంలో ఫ్రాన్స్ పుంజుకుంది. స్టార్ ఆటగాడు క్లియాన్ ఎంబాపె 48వ నిమిషం, 66వ నిమిషాల్లో గోల్స్ కొట్టి ఫ్రాన్స్‌ను రేసులోకి తెచ్చాడు. బ్రాడ్లే బార్కోలా 54వ నిమిషంలో చేసిన గోల్‌తో ఇంగ్లాండ్ ఆధిక్యాన్ని 3-4కు ఫ్రాన్స్ తగ్గించింది. కానీ, 87వ నిమిషంలో లభించిన పెనాల్టీకిక్‌ను గోల్‌గా మలిచిన బుకాయో హ్యాట్రిక్‌తో ఇంగ్లాండ్‌కు 5-3 ఆధిక్యం ఇచ్చాడు. ఆట అదనపు సమయంలో ఫ్రాన్స్ ఆటగాడు ఔస్మానె డెంబెలె (90+6వ నిమిషం) గోల్ కొట్టాడు. మరికాసేపటికే జుడె బెల్లింగ్‌హామ్ (90+8వ నిమిషం) గోల్‌తో ఇంగ్లాండ్ 6-4తో విజయాన్ని అందుకుంది.

**గోల్డెన్ బూట్ రేసులో ఎంబాపె**

ఫ్రాన్స్ స్టార్ ఆటగాడు ఎంబాపె మాత్రం రికార్డులు సృష్టించాడు. వరల్డ్ కప్‌లో అత్యధిక గోల్స్ చేసిన ప్లేయర్‌గా ఘనత సాధించాడు. అతడి ఖాతాలో ప్రస్తుతం 22 గోల్స్ ఉన్నాయి. ఎంబాపె తర్వాత మెస్సీ (21) ఉన్నాడు. ఫైనల్‌లో మెస్సీ రెండు గోల్స్ చేస్తే మళ్లీ ఈ రికార్డు సొంతమవుతుంది. ఈ ప్రపంచ కప్‌లో గోల్డెన్ బూట్ రేసులోనూ ఎంబాపె ముందున్నాడు. ఎంబాపె 10 గోల్స్ చేయడంతోపాటు 4 అసిస్ట్లు ఇచ్చాడు. మరోవైపు మెస్సీ 8 గోల్స్ చేసి 4 అసిస్ట్లు ఇచ్చాడు.

## లార్డ్స్‌లో హిట్‌మ్యాన్



# పరుగుల వేటలో భారత్ బోల్తా

## వన్డే సిరీస్ ఇంగ్లాండ్ కైవసం

**లార్డ్స్, జులై 19:** లార్డ్స్‌లో జరిగిన మూడో వన్డేలో టీమిండియా లక్ష్య ఛేదనలో బోల్తా పడింది. 388 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో విఫలమైన టీమిండియా.. 50 ఓవర్లలో 7 వికెట్లకు 360రన్స్‌కే పరిమితమైంది. దీంతో ఇంగ్లాండ్ 27 పరుగుల తేడాతో గెలుపొంది మూడు వన్డేల సిరీస్‌ను 2-1తో చేజిక్కించుకుంది.

భారీ లక్ష్య ఛేదనలో ఓపెనర్లు రోహిత్ శర్మ (110 బంతుల్లో 138; 17 ఫోర్లు, 5 ఫోర్లు), శుభ్‌మన్ గిల్(84 బంతుల్లో 77; 10 ఫోర్లు, 1 సిక్స్) ఫ్లయింగ్ స్టార్ట్ ఇచ్చారు. ఇద్దరూ దంచికొడుతూ తొలి వికెట్‌కు 25 ఓవర్లలో 147 రన్స్ అందించారు. 84 బంతుల్లో సెంచరీ చేశాడు. లార్డ్స్‌లో వన్డేల్లో సెంచరీ చేసిన తొలి భారత బ్యాటర్‌గా రోహిత్ రికార్డు సృష్టించాడు. వన్డే చరిత్రలోనే ఎక్కువ వయసులో (39 యేళ్ల 80 రోజులు) సెంచరీ సాధించిన భారత ఆటగాడిగానూ రోహిత్ నిలిచాడు. ఇంగ్లాండ్ గడ్డపై వన్డేల్లో అత్యధిక సెంచరీలు (8) చేసిన పర్యాటక ప్లేయర్‌గానూ హిట్‌మ్యాన్ రికార్డు నెలకొల్పాడు. ఇక కోహ్లీతో కలిసి రెండో వికెట్‌కు 113 పరుగులు జోడించాడు. రోహిత్ అవుటైనా కోహ్లీ(60 బంతుల్లో 74; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. చివర్లో భారత్ వేగంగా వికెట్లు కోల్పోయి పరాజయం పొందింది.

టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఇంగ్లాండ్ నిర్ణీత 50 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 387 పరుగులు చేసింది. వన్డేల్లో భారత్‌పై ఇంగ్లాండ్‌కు ఇదే అత్యధిక స్కోరు. లార్డ్స్ మైదానంలోనూ వన్డేల్లో ఇది అత్యధిక స్కోరు. ఓపెనర్ బెన్ డకెట్ (135 బంతుల్లో 141; 18 ఫోర్లు, 1 సిక్స్) శతకంతో విరుచుకుపడగా.. మరో ఓపెనర్ జాకబ్ బెతెల్ (93 బంతుల్లో 91;11 ఫోర్లు, 2 సిక్స్‌లు) కొద్దిలో సెంచరీ మిస్ చేసుకున్నాడు. తొలి వికెట్‌కు 192రన్స్ జోడించారు. సెంచరీ చేసేలా కనిపించిన బెతెల్‌ను ప్రసిద్ధ్ కృష్ణ అవుట్ చేశాడు. వన్డేల్లో ఇంగ్లాండ్‌కు ఏ వికెట్‌కైనా ఇదే అత్యధిక భాగస్వామ్యం. ఫస్ట్ డౌన్‌లో వచ్చిన జో రూట్ (48 బంతుల్లో 74నాటౌట్; 9 ఫోర్లు) మరోసారి రాణించాడు. డకెట్, రూట్ 80 బంతుల్లో 101 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. డకెట్‌ను రిటర్న్ క్యాచ్‌తో ప్రిన్స్ యాదవ్ పెవిలియన్ చేరాడు. చివర్లో జోస్ బట్లర్ (13 బంతుల్లో 41నాటౌట్; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) మెరుపులు మెరిపించాడు. ఇంగ్లాండ్ చివరి 3 ఓవర్లలో ఏకంగా 62 పరుగులు చేసింది.

# ఈవారం మార్కెట్లకు ఐదు కొత్త ఫండ్స్



**ముంబయి, జులై 19:** మ్యూచువల్ ఫండ్ లలో పెట్టుబడులకు ఈ వారం 5 కొత్త పథకాలు మార్కెట్‌లోకి వస్తున్నాయి. సాధారణంగా న్యూఫండ్ ఆఫర్‌వేళ ప్రతి యూనిట్ ధర రూ.10గా ఉంటుంది. కొత్తగా ఇన్వెస్ట్ చేయాలనుకునేవారు లేదా తమ పోర్ట్ ఫోలియోను డైవర్సిఫై చేయాలనుకునే వారికి ఇది మంచి అవకాశంగా చెప్పవచ్చు. లాంచ్ అవుతున్న మొత్తం 5 కొత్త ఫండ్లలో రెండు ఈక్విటీ ట్రేడెడ్ ఫండ్స్ ఉండగా రెండు ఫండ్ ఆఫ్ ఫండ్స్ ఉన్నాయి. ఒకటి ఫ్లెక్సీ క్యాప్ ఫండ్ కేటగిరీలో వస్తోంది. హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ, ఎస్‌బీఐ వంటి ప్రముఖ అసెట్ మేనేజ్మెంట్ కంపెనీలు ఈ జాబితాలో ఉన్నాయి. హెచ్‌డీఎఫ్‌సీ మ్యూచువల్ ఫండ్ నుంచి రెండు కొత్త స్కీమ్స్ వస్తున్నాయి. హెచ్‌డీఎఫ్‌సీ నిఫ్టీ మెటల్ ఈటీఎఫ్, హెచ్‌డీఎఫ్‌సీ నిఫ్టీ మెటల్ ఈటీఎఫ్ ఫండ్ ఆఫ్ ఫండ్ సోమవారం మొదలవుతోంది. ఈటీఎఫ్ చందా ఆఫర్ ఈనెల 24వ తేదీన ముగియనుండగా ఫండ్ ఆఫ్ ఫండ్ స్కీమ్ సబ్‌స్క్రిప్షన్ ఆగస్టు 3వ తేదీ వరకు కొనసాగనుంది.

ఐసీఐసీఐ ప్రూడెన్షియల్ బీఎస్ఈ ఇన్సూరెన్స్ ఈటీఎఫ్ ఫండ్ సబ్‌స్క్రిప్షన్ 20నుంచి 28వరకూ కొనసాగుతుంది. ఇందులో కనీస పెట్టుబడి రూ.1000గా ఉంది. ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్ నుంచి ఒక ఫండ్ ఆఫ్ ఫండ్ లాంచ్ అయింది. ఎస్‌బీఐ నిఫ్టీ మిడ్ క్యాప్ 150 మూమెంటమ్ 50 ఈటీఎఫ్ ఫండ్ ఆఫ్ ఫండ్ 22వ తేదీన ప్రారంభమయి ఆగస్టు 4వ తేదీ వరకు అందుబాటులో ఉంటుంది. ఇందులో కనీస పెట్టుబడి రూ.5000గా నిర్ణయించారు. యాక్సిస్ మ్యూచువల్ ఫండ్ నుంచి ఆల్ఫాగ్రెప్ ఫ్లెక్సీ క్యాప్ ఫండ్ సబ్‌స్క్రిప్షన్ 22వ తేదీ మొదలై ఆగస్టు 4వ తేదీ వరకు కొనసాగనుంది. ఇందులో కనీస పెట్టుబడి రూ.500గా నిర్ణయించారు.

## ఇరాన్ వార్, కార్పొరేట్ ఫలితాలపైనే..

# ఈవారం ఇన్వెస్టర్ల ఫోకస్



**ముంబయి, జులై 19:** అమెరికా-ఇరాన్ మధ్య కొనసాగుతున్న యుద్ధ ఉద్రిక్తతలు20 నుంచి కొనసాగే వారంలో ప్రపంచ మార్కెట్లను ఒడిదుడుకులకు దారితీసే అవకాశం ఉండగా, మరోవైపు తొలి త్రైమాసికం ఫలితాలపైనా ఇన్వెస్టర్ల ఫోకస్ పెరుగుతుంది. ఈ వారంలో భారత ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్, అల్ట్రాటెక్ సిమెంట్, బజాజ్ ఆటో, అదానీ పవర్, అదానీ ఎనర్జీ సొల్యూషన్స్, బీపీసీఎల్, నెస్లే ఇండియా, సిప్లా, ఎన్‌టీపీసీ, బ్యాంక్ ఆఫ్ బరోడా వంటి ప్రముఖ కంపెనీలు ఆర్థిక ఫలితాలను ప్రకటించనున్నాయి. డిమాండ్ పరిస్థితులు, లాభదాయకత (మార్జిన్లు), మూలధన వ్యయం, బ్యాంకుల ఆస్తుల నాణ్యత, రుణాల వృద్ధి, ముడిసరుకు వ్యయాలు, కొత్త ఆర్థిక సంవత్సరంలో వ్యాపార అంచనాలపై కంపెనీల యాజమాన్యాల వ్యాఖ్యలను పెట్టుబడిదారులు నిశితంగా పరిశీలించనున్నారు. గల్ఫ్‌వార్ యుద్ధ పరిణామాలు అంతర్జాతీయ చమురు ధరలు, ఈక్విటీ మార్కెట్లపై ప్రభావం చూపే అవకాశముందని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. ఈ వారంలో భారత్‌తో పాటు అమెరికా, యూరోపియన్ యూనియన్‌కు సంబంధించిన పలు కీలక ఆర్థిక గణాంకాలు విడుదల కానున్నాయి. జూలై నెల తయారీ, సేవల కొనుగోలు నిర్వాహకుల సూచీ గణాంకాలు శుక్రవారం విడుదల కానున్నాయి.


దేశ విదేశీ మారక నిల్వల తాజా వివరాలు కూడా వెలువడనున్నాయి. యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్ వడ్డీ రేట్లపై నిర్ణయాన్ని ప్రకటించనుంది. గురువారం ప్రారంభ నిరుద్యోగ భృతి దరఖాస్తుల గణాంకాలు, శుక్రవారం తయారీ మరియు సేవల పిఎంఐ గణాంకాలు విడుదల కానున్నాయి. పెట్టుబడిదారుల దృష్టికంపెనీల త్రైమాసిక ఫలితాలు, అమెరికా-ఇరాన్ యుద్ధ పరిణామాలు, భారత్, అమెరికా, యూరప్ నుంచి వచ్చే కీలక ఆర్థిక గణాంకాల నేపథ్యంలో ఈ వారం స్టాక్ మార్కెట్లలో అధిక హెచ్చుతగ్గులు కనిపించే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా.



## తుదిదశలో హెచ్‌డిఎఫ్‌సి ఎండి సిఇఒ నియామకం

**ముంబయి, జులై 19:** దేశంలో అతిపెద్ద ప్రైవేట్ రంగ బ్యాంక్ అయిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఎండిసిఇఒ నియామక ప్రక్రియ తుది దశకు చేరుకున్నట్లు డిప్యూటీ ఎండీ కైజాద్ భరుచా వెల్లడించారు. ఈ అంశాన్ని బ్యాంకు గవర్నెన్స్, నామినేషన్ అండ్ రెమ్యునరేషన్ కమిటీతో పాటు డైరెక్టర్ల బోర్డు పరిశీలిస్తోందని, త్వరలోనే ప్రక్రియ పూర్తవుతుందని చెప్పారు. ప్రస్తుతంబ్యాంక్ ఎండీ, సీఈఓగా ఉన్న శశిధర్ జగదీశన్ పదవీకాలం ఈ ఏడాది అక్టోబర్‌లో ముగియనుంది. ఆయన 2020లో మూడేళ్ల కాలానికి నియమితులై, 2023లో మరో మూడేళ్ల పొడిగింపు పొందారు. తాజా పదవీకాలం అక్టోబర్‌లో ముగియనున్న నేపథ్యంలో, పునర్నియామక ప్రక్రియపై ఆర్బీఐకి ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తున్నామని, నియంత్రణ పరమైన ఎలాంటిఇబ్బందులు ఉండబోవని అన్నారు. ప్రస్తుతం 3 సభ్యులతో కూడిన జీఎన్‌ఆర్‌సీకి నాబార్డ్ మాజీచైర్మన్ హర్ష్ కుమార్ భన్వాలా అధ్యక్షత వహిస్తున్నారు. కమిటీలో సందీప్ పరేఖ్, రంగనాథ్ సభ్యులుగా ఉన్నారు. ఈ కమిటీ అభ్యర్థి లేదా అభ్యర్థుల పేర్లను సిఫారసు చేసిన అనంతరం, కొత్త పార్ట్‌టైమ్ ఛైర్మన్ రాజీవ్ కుమార్ అధ్యక్షతన ఉన్న డైరెక్టర్ల బోర్డు వాటిని పరిశీలించి ఆమోదిస్తుంది.

# టాప్ ఐదు కంపెనీల్లో 1.54 లక్షల కోట్ల పెరుగుదల



**ముంబయి, జులై 19:** దేశీయ ఈక్విటీ మార్కెట్లలో సానుకూల ధోరణి కొనసాగడంతో గత వారం దేశంలోని అత్యంత విలువైన టాప్10 కంపెనీల్లో ఐదు సంస్థల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ. 1.54 లక్షల కోట్లు పెరిగింది. ఈ వృద్ధిలో ఐటీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ అగ్రస్థానంలో నిలిచింది. లాభపడిన సంస్థలు గత వారం రిలయన్స్ ఇండస్ట్రీస్, ఐసీఐసీఐ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టీసీఎస్, బజాజ్ ఫైనాన్స్ మార్కెట్‌విలువలో గణనీయమైన పెరుగుదలను నమోదు చేశాయి. టీసీఎస్ మార్కెట్ విలువ 72,072.30కోట్లు పెరిగి 8లక్షల 20 వేల 672.70 కోట్లకు చేరింది. కంపెనీ జూన్ త్రైమాసికంలో నికర లాభం 4.61 శాతం పెరిగి రూ.13,349 కోట్లకు చేరింది.

పశ్చిమాసియా సంక్షోభం ప్రభావం తగ్గడంతో ప్రస్తుత త్రైమాసికంలో డిమాండ్ మెరుగుపడుతుందని కంపెనీ తెలిపింది. ఐసీఐసీఐ బ్యాంక్ మార్కెట్ విలువ రూ.29,062.06 కోట్లు పెరిగి రూ.10,34,441.77 కోట్లకు చేరగా రిలయన్స్ ఇండస్ట్రీస్ విలువ రూ.23,884.93కోట్లు పెరిగి రూ.17,95,091.26కోట్లకు చేరుకుంది. బజాజ్ ఫైనాన్స్ మార్కెట్ క్యాప్ రూ.21,946.50కోట్లు పెరిగి రూ.6,57,274.28 కోట్లకు చేరితే స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) విలువ 7వేల 338.34 కోట్లు పెరిగి రూ.9,63,768.78 కోట్లకు చేరింది. నష్టపోయిన సంస్థల్లో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, భారతి ఎయిర్‌టెల్, ఎల్‌ఐసీ, లార్సెన్ అండ్ టుబ్రో, హిందుస్థాన్ యూనిలీవర్ లున్నాయి. ఎల్‌అండ్‌టీ మార్కెట్ విలువ రూ. 18,097.72 కోట్లు తగ్గి రూ.5,24,840.68 కోట్లకు పడిపోయింది.


ఎల్‌ఐసీ విలువ రూ.12080.75 కోట్లు తగ్గి రూ.5,48,124.30కోట్లకు చేరింది. భారతిఎయిర్‌టెల్ మార్కెట్ క్యాప్ రూ.7,706.45 కోట్లు క్షీణించి 11,91,067.77కోట్లకు పరిమితమైంది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ విలువ రూ.7,084.61 కోట్లు తగ్గి రూ.12,62,369.81కోట్లకు చేరింది. హిందుస్థాన్ యూనిలీవర్ మార్కెట్ విలువ రూ.1,221.79 కోట్లు తగ్గి రూ.5,03,775.86 కోట్లకు నిలిచింది. మార్కెట్ విలువల్లో టాప్10 కంపెనీలుమార్కెట్ క్యాపిటలైజేషన్ పరంగా రిలయన్స్ ఇండస్ట్రీస్ అగ్రస్థానాన్ని కొనసాగించింది. ఆ తరువాత వరుసగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, భారతి ఎయిర్‌టెల్, ఐసీఐసీఐ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ఇండియా, టీసీఎస్, బజాజ్ ఫైనాన్స్, ఎల్‌ఐసీ, లార్సెన్ అండ్ టుబ్రో, హిందుస్థాన్ యూనిలీవర్ స్థానాలు దక్కించుకున్నాయి.

# ధరల పెరుగుదలతో తగ్గిన స్మార్ట్ టివి సేల్స్



**బెంగళూరు, జులై 19:** దేశీయ స్మార్ట్ టీవీ మార్కెట్ వరుసగా రెండో త్రైమాసికంలోనూ మందగమనాన్ని నమోదు చేసింది. తొలి త్రైమాసికంలో స్మార్ట్ టీవీల అమ్మకాల పరిమాణం గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 5.7 శాతం తగ్గినట్లు పరిశ్రమ అంచనావేస్తోంది. అంతకుముందు జనవరిమార్చి త్రైమాసికంలో కూడా అమ్మకాలు 3 శాతం తగ్గాయి. ఈ వివరాలను కౌంటర్ పాయింట్ రీసెర్చ్ సంస్థలు, మార్కెట్ ఛానల్ విశ్లేషణలు వెల్లడించాయి. ధరలు గణనీయంగా పెరగడంతో ముఖ్యంగా ఎంట్రీలెవల్ స్మార్ట్ టీవీల కొనుగోళ్లను వినియోగదారులు వాయిదా వేయడం వల్ల ఈ విభాగంలో అమ్మకాలు మరింతగా పడిపోయాయి. ఐడిసి గణాంకాల ప్రకారం, 43 అంగుళాలు లేదా అంతకంటే చిన్న స్మార్ట్ టీవీల అమ్మకాలు 6.8 శాతం తగ్గాయి. మరోవైపు, 43 అంగుళాలకు పైబడిన టీవీల అమ్మకాలు 3.5 శాతం మాత్రమే తగ్గాయి. దీంతో ప్రీమియం టీవీల విభాగం తక్కువ ప్రభావాన్ని ఎదుర్కొన్నట్లు తెలుస్తోంది. ఐడిసి రీసెర్చ్ అనలిస్ట్ దేవాశిష్ జనా మాట్లాడుతూ, పెరిగిన ధరలు వినియోగదారుల కొనుగోలు సామర్థ్యంపై ప్రభావం చూపుతున్నాయని, ముఖ్యంగా సామాన్య వినియోగదారుల కోసం ఉద్దేశించిన మాస్‌మార్కెట్ విభాగంలో డిమాండ్ బలహీనంగా కొనసాగుతోందని తెలిపారు. పరిశ్రమ అంచనాల ప్రకారం, రెండోత్రైమాసికంలో 32అంగుళాల నుంచి 43అంగుళాల వరకు ఉన్న స్మార్ట్ టీవీల ధరలు దాదాపు 17 శాతం పెరిగాయి. అదే సమయంలో 43 అంగుళాలకు పైబడిన టీవీల ధరలు కేవలం 67 శాతం మాత్రమే పెరిగాయి.

తయారీ వ్యయాలు, ఎలక్ట్రానిక్ భాగాల ధరల పెరుగుదల, రూపాయి బలహీనత వంటి కారణాలతో మూడోత్రైమాసింలో మరో 10 శాతం వరకు ధరలు పెరిగే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. కౌంటర్‌పాయింట్ రీసెర్చ్ ప్రిన్సిపల్ అనలిస్ట్ అన్షికా జైన్ మాట్లాడుతూ, చిన్న సైజు టీవీల అమ్మకాలలో ఎక్కువ తగ్గుదల కనిపించడం వెనుక ప్రధాన కారణం ఎంట్రీలెవల్ వినియోగదారులపై ధరల భారం పెరగడమేనని చెప్పారు. ముఖ్యంగా మెమరీ చిప్‌ల ధరలు భారీగా పెరగడంతో తక్కువ ధర టీవీల తయారీ ఖర్చు గణనీయంగా పెరిగిందని, అదే సమయంలో ద్రవ్యోల్బణం కూడా సామాన్య వినియోగదారుల కొనుగోలు సామర్థ్యాన్ని దెబ్బతీసిందని వివరించారు.




## ఫోరెన్సిక్ ఆడిట్లకు మరో18 సంస్థల ఎంపిక

**ముంబయి, జులై 19:** మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ లిస్టెడ్ కంపెనీల ఆర్థిక నివేదికలపై ఫోరెన్సిక్ ఆడిట్లు నిర్వహించేందుకు మరో 18 ఆడిట్, కన్సల్టింగ్ సంస్థలను తన అధికారిక ప్యానెల్‌లో చేర్చింది. వీటిలో ప్రముఖ అంతర్జాతీయ సంస్థలు ఎర్నెస్ట్ యంగ్‌ఎల్‌ఎల్‌పి, కేపీఎంజీ అష్యూరెన్స్ అండ్ కన్సల్టింగ్ సర్వీసెస్, జెడ్‌ఎక్స్ గ్రాంట్ థార్న్‌న్ భారత్, నాంగియా అండ్ కో ఎల్‌ఎల్‌పిలున్నాయి. ఈ ఎంపిక ప్రక్రియను సెబీ 2025 నవంబర్‌లో విడుదల చేసిన పబ్లిక్ ప్రొక్యూర్‌మెంట్ నోటీసు ఆధారంగా నిర్వహించింది. తాజాగా ఎంపికైన సంస్థలను 2025 ఏప్రిల్‌లో ప్రకటించిన ఫోరెన్సిక్ ఆడిటర్ల జాబితాకు అదనంగా చేర్చినట్లు సెబీ నోటిఫికేషన్‌లో వెల్లడించింది. సెబీ తాజా జాబితాలో చోటు దక్కిన సంస్థలకు మూడు సంవత్సరాల పాటు ఈ ఎంపానెల్‌మెంట్ చెల్లుబాటు అవుతుంది. నాంగియా కో ఎల్‌ఎల్‌పి ఫోరెన్సిక్ అడ్వైజరీ సీనియర్ పార్ట్‌నర్ శ్రీనివాస రావు మాట్లాడుతూ, సెబీ ఎంపానెల్‌లో చోటు దక్కడం తమ ఫోరెన్సిక్ సేవల నైపుణ్యానికి నిదర్శనమన్నారు.

ఫోరెన్సిక్ ఆడిట్ ప్యానెల్ ఉద్దేశం లిస్టెడ్ కంపెనీ లలో ఆర్థిక అక్రమాలు లేదా లెక్కల అవకతవకలు ఉన్నాయనే అనుమానాలు తలెత్తినప్పుడు, వాటిపై లోతైన విచారణ నిర్వహించేందుకు సెబీ ఈ ఫోరెన్సిక్ ఆడిటర్ల ప్యానెల్‌ను ఉపయోగిస్తుంది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at Plot Nos. 56&58, 9th line, Ramnagar, Ongole - 523001, ph: 2312451, Fax: 08592-236879, RNI No, 64847/96, Editor.Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act, Regd. No.H/SD/337/12-14 Air Surcharge:Delhi:40 Ps